www.manatelangana.news

Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 7 | సంచిక: 205 | సోమవారం | 14 జనవరి, 2019

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 16 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00





అత్యాచారం చేసి

వీడియో తీసి

స్నేహితులకు పంపి

మైనర్ బాలిక గ్యాంగ్ రేప్

హైదరాబాద్ పాతబస్తీ కామాటిపురాలో దారుణం

మూడు సంవత్సరాలుగా నరకం అనుభవించిన బాలిక, ఫిర్యాదుతో నిందితుల అరెస్టు

మన తెలంగాణ/చార్మినార్

పాతబస్తి కామాటిపురా పోలీసుస్టేషన్ పరిధిలో దారుణం జరిగింది. పహాడీషరీఫ్ పరిధిలో జరిగిన గ్యాంగ్ రేప్ సంచలనమైంది. బాలికపై ఆమె బంధువే అత్యాచారం చేస్తూ విడియో తీశాడు. ఆ చిత్రాలను స్నేహితులకు చేరవేశాడు. దీనిని ఆసరాగా చేసుకున్న వారు ఆ బాలికను బ్లాక్‌మెయిల్ చేస్తూ వరుసగా ఒకరి తర్వాత ఒకరు అత్యాచారం చేశారు. ఆలస్యంగా వెలుగు చూసిన సంఘటనతో బాధితురాలి బంధువులు పోలీసుస్టేషన్ వద్ద నిరసనకు దిగారు. నిందితులను పట్టుకొని కఠినంగా శిక్షించాలని తరువాయి 6లో

అందుబాటులోకి ధరణి 6

ఏకగ్రీవ హవా



ఆదివారం నాడు నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్)లో రంగుండ్ల గ్రామపంచాయతీ ఒకటో వార్డు పోటీలో నామినేషన్ వేసిన 90ఏళ్ల కిష్టమ్మ

మొదటి విడత ఎన్నికలు జరిగే 4,468 పంచాయతీల్లో 600కి పైగా సర్పంచ్ పదవులు ఏకగ్రీవం

ఏకగ్రీవాల్లో 90% టిఆర్‌ఎస్ మద్దతు కలిగిన వారే

మన తెలంగాణ/హైదరాబాద్

రాష్ట్రంలో మొదటి విడతలో జరిగే 4468 పంచాయతీల్లో 600కు పైగా సర్పంచ్ పదవులు ఏకగ్రీవం అయ్యాయి. ఇందులో దాదాపు 90శాతం టిఆర్‌ఎస్ మద్దతు కలిగిన అభ్యర్థులే. ఈ నెల 7న ప్రారంభమైన తొలి విడత నామినేషన్ల ప్రక్రియలో ఉపసంహరణ గడువు ఆదివారం మధ్యాహ్నం మూడు గంటలకు పూర్తి కావడంతో ఏకగ్రీవాలపై ఒక మేరకు స్పష్టత వచ్చింది. అయితే అధికారికంగా రాష్ట్ర ఎన్నికల సంఘం ఇంకా ప్రకటించలేదు. పోటీ ఉన్న పంచాయతీలలో నామినేషన్లను ఉపసంహరణ చేయించేందుకు స్థానిక రాజకీయ నాయకులు తమ వంతు ప్రయత్నాలు చేసి కొన్నింటిని ఏకగ్రీవం చేయడంలో సఫలీకృతులయ్యారు. దీంతో దాదా పు అన్ని జిల్లాల్లో డబుల్ డిజిట్‌లోనే సర్పంచ్‌లు ఏకగ్రీవమయ్యారు. మొదటి విడతలో మొత్తం 4479 పంచాయతీలకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ఇవ్వగా, అందులో 4468 పంచాయతీల్లోనే సర్పంచ్ పదవికి అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. పదకొండు పంచాయతీల్లో నామినేషన్లు వేయకపోవడం, వేసినా అవి నిబంధనలకు అనుగుణంగా లేకపోవడంతో తిరస్కరణకు గురయ్యాయి. అందువల్ల ఈ 11 చోట్ల ఎన్నికలు జరగడం లేదు. ఆదివారం సాయంత్రం నాటికి ఆదిలాబాద్ జిల్లాలో 50, నిర్మల్‌లో 31, మంచిర్యాలలో 8 పంచాయతీలకు సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవమైంది. సిరిసిల్లలో 13, ఖమ్మంలో 22, కొత్తగూడెంలో 19, వనపర్తిలో 15, గద్వాల జోగులాంబ జిల్లాలో 28, మెదక్‌లో 29, నల్లగొండలో 52, సూర్యాపేటలో 10, యదాద్రి భువనగిరి తరువాయి 6లో

సిఎం కెసిఆర్ సంక్రాంతి శుభాకాంక్షలు 3 | మరి 2రోజులు పొగమంచు | 50మంది సైనికులకు పాక్ హనీట్రాప్! 16

యువత శక్తివంతం కావాలి

ఎఐఎస్ అధికారిణి విజయేందిర



మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలోని యువతను శక్తి వంతం చేయడం కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఎఐఎస్, మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ అధికారిణి విజయేందిర పేర్కొన్నారు. నగరంలోని ప్లాజా హోటల్‌లో ఆదివారం ఉదయం నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాఠశాలలో, కళశాలల్లో విద్యనభ్యసిస్తున్న బాలబాలికల సాధికారతకు సంబంధించి నీలోఫర్ హాస్పిటల్ తయారు చేసిన మాన్యువల్స్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవిత నైపుణ్యాలను కలిగి ఉన్న యువత ప్రమాదకర పరిస్థితులను అధికమించగలుగుతుందన్నారు. యువత శక్తివంత అయిప్పుడే వారి జీవితంలో ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొగలుగుతారన్నారు. విషయ పరిజ్ఞానం, సంపూర్ణ ఆరోగ్యం యువత జీవితంలో ఎదురయ్యే సవాళ్లను అధికమించగలుగుతుందన్నారు. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, రాష్ట్ర పిడియాట్రిక్ అకాడమీ సహకారంతో నవంబర్ 2018లో కౌమార సాధికారత కార్యాక్రమం ప్రారంభించారన్నారు. రాష్ట్ర మహిళా అభివృద్ధి శిశుసంక్షేమ శాఖ, రాష్ట్ర పిడియాట్రిక్ అకాడమి సమన్వయంతో ఈ కార్యక్రమం ప్రతి పాఠశాలలో, కళాశాలలో కౌమార దశలో ఎదురయ్యే సమస్యలపై అవగాహన కల్పింస్తోందన్నారు. ఈక్రమంలో ప్రతి నెల ఒక పాఠశాల, కళాశాలలో జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్, డిస్ట్రిక్ ఎడ్యుకేషన్ అధికారుల సహకారంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారని తెలిపారు. కార్యక్రమంలో ఐఎఎస్ అధికారి ఎం.జగదీశ్వర్, ముఖ్యకార్యదర్శి డబ్ల్యుసిడి, ఎస్‌సి, డాక్టర్ హిమబిందు, తెలంగాణ రాష్ట్ర పిడియాట్రిక్ అకాడమి. నోడల్ ఆఫీసర్ డిస్ట్రిక్ చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గుండె జబ్బులకు 'అపోలో'లో అత్యాధునిక వైద్యం



మన తెలంగాణ / హైదరాబాద్ : కార్డియాలజీ, కార్డియోథోరాసిక్ సర్జరీలలో నూతనంగా వచ్చిన పురోగతులపై ఎఫ్‌సిసిసి (కార్డియోవాస్క్యులర్ రిసెర్చ్ ఫౌండేషన్ కార్డియోలజీ క్లినిక్, ఫ్యాక్ట్స్ ఫౌండేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నగరంలో ప్రత్యేక సదస్సును నిర్వహించింది. ''కార్డియాక్ ఇన్‌సైట్స్'' పేరుతో నిర్వహించిన సదస్సులో తాజాగా వచ్చిన పురోగతులపై సదస్సులో చర్చించారు. అపోలో, కొలంబియ, యూఎస్ ఆసుపత్రులకు చెందిన ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన డాక్టర్ల బృందం సహకారంతో ప్రతి ష్టాత్మక హార్ట్ వాల్వ్ థెరపీ సింపోజి యంను నిర్వహించారు. సదస్సుకు 300 మంది కార్డియోలజిస్టులు, కార్డియాక్ సర్జన్లతో పాటు పాటు విదేశాల నుంచి మరో ఐదు మంది ప్రముఖులు కలిపి మొత్తం 50 మంది వరకు వైద్య బోధకులు సదస్సులో పాల్గొన్నారు. వార్ట్ వాల్వ్ సంరక్షణకు ఈ సదస్సు ప్రధాన వేదికగా మారింది. హార్ట్ వాల్వ్ థేరపిని ఇప్పుడు హైదరాబాద్‌లోని అపోలో హెల్త్ సిటి అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ సందర్భంగా ఫ్యాక్ట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, అపోలో ఆసుపత్రి కార్డియాలజీ క్లినికల్ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ ఎ.శ్రీనివాసకుమార్, కొలంబియా హార్ట్ వాల్వ్ థేరపీ న్యూయార్క్ డైరెక్టర్ డాక్టర్ సుశీల్ కె.కొడాలి, కార్డియోవాస్క్యులర్ రీసెర్చ్ ఫౌండేషన్ సిఇఓ డాక్టర్ జువన్ గ్రెనెడా నూతన ఆవిష్కరణకు గురించి మీడియాకు వెల్లడించారు. ఇందులో ట్రాన్స్‌క్యాథటర్ అరోటిక్ వాల్వ్ రిప్లేస్‌మెంట్, ఫార్మకాలజీ ఫర్ ఇంటర్వెన్షనిస్టు, యాంటిప్లేట్ లెట్ థేరపీ మందులతో కరిగిపోయే స్టంటల్ అభివృద్ధి, ఎఫ్ఎఫ్ఆర్, ఐవియూఎస్, ఒసిటి రోగులకు మెరుగైన ఫలితాలు ఎలా అందుతాయో వివరించారు. ట్రాన్స్‌క్యాథటర్ అరోటిక్ వాల్వ్ రిప్లేస్‌మెంట్ అనేది వాల్వ్ కుచించుకపోవడం వల్ల దాని స్థానాన్ని భర్తీ చేయడానికి అతి తక్కువ కోతతో చర్మంపై ఎలాంటి కుంట్లు పడకుండా ఉపయోగించే పద్ధతిని వివరించారు. అరోటిక్ వాల్వ్ రిప్లేస్‌మెంట్ అనేది గుండె కింది భాగం లో రక్తాన్ని పంపింగ్ చేసే ఛాంబర్ పద్ధతిగా పేర్కొన్నారు. రక్తం వ్యతిరేక దిశలో పయణించి గుండె వైఫల్యానికి దారితీయడాన్ని నివారించవచ్చన్నారు. ఈ పద్ధతిని అపోలోలో అందుబాటులోకి తెచ్చామన్నారు.



ఉప రాష్ట్రపతిని కలిసిన నారాయణ

మన తెలంగాణ/హైదరాబాద్ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడిని సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ కలిశారు. ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు అత్త కౌసల్యమ్మ పరమపదించడంతో నారాయణ ఆదివారం వెంకయ్యనాయుడిని కలిసి సంతాపం వ్యక్తం చేశారు.

నిర్లక్ష్యానికి పరాకాష్ట..!

ఆసుపత్రిలో చేర్చుకునేందుకు సిబ్బంది నిరాకరణ, తిరుగుప్రయాణంలో ఎంజిబిఎస్ బస్టాండ్‌లో గర్భిణీ ప్రసవం

మనతెలంగాణ/గోషామహల్: ప్రసవం నిమిత్తం నగరానాకి వచ్చిన ఓ నిండు గర్భిణి ఓ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లగా, ప్రతినెలా చెకప్, స్కానింగ్ సంబంధిత రిపోర్టులు లేవన్న కారణంతో అక్కడి వైద్యులు ఆమెను ఆసుపత్రిలో చేర్చుకునేందుకు నిరాకరించారు. దీంతో తల్లితో కలిసి నిరాశగా ఇంటికి తిరుగుముఖం పట్టిన ఆ గర్భిణికి హఠాత్తుగా నొప్పులు రావడంతో బస్టాండ్‌లోనే శిశువును ప్రసవించింది. ఈ హృదయవిదారక ఘటన నగరంలోని అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మహాత్మాగాంధీ బస్‌స్టేషన్ (ఎంజీబీఎస్)లో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాల్లోకెళ్లితే... నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట్ తాలూకా అమ్రాబాద్ గ్రామానికి చెందిన చెంచు మణెమ్మ(33), ఈదయ్య దంపతులు. వీరికి ముగ్గురు పిల్లలు సంతానం, వీరు అమ్రాబాద్ గ్రామంలో రోజు వారీ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇటీవలే గర్భం దాల్చి నెలలు నిండిన మణెమ్మను ఆమె తల్లి ప్రసవం నిమిత్తం నగరానికి తీసుకువచ్చింది. అయితే గర్భం దాల్చిన మణెమ్మ ఆసుపత్రిలో ప్రతీ చెకప్‌కి సంబంధించిన కార్డు తీయకపోవడం, స్కానింగ్‌కు సంబంధించి ఎలాంటి రిపోర్టులు లేకపోవడంతో సదరు



శిశువుకు జన్మనిచ్చిన తల్లి

ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది ఆమెకు వైద్యం అందించేందుకు నిరాకరించారు. దీంతో వారు నిరాశగా ఇంటికి తిరుగు ప్రయాణమయ్యే క్రమంలో సాయంత్రం 5 గంటలకు గౌలిగూడలోని మహాత్మాగాంధీ బస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. బస్సు కోసం నిరీక్షిస్తున్న తరుణంలో 23వ



ప్లాట్ ఫారం వద్ద మణెమ్మకు హఠాత్తుగా నొప్పులు రావడం ప్రారంభం కావడంతో సహాయం కోసం ఆమె తల్లి వేసిన కేకలు విని స్పందించిన ఆర్టీసీ అధికారులు, సిబ్బంది బ్లాంకెట్లను తెప్పించి ఆమె చుట్టూ ఏర్పాట్లు చేయగా, తల్లితో పాటు మహిళా సిబ్బంది సహాయంతో మణెమ్మ పండంటి మగ శిశువుకు జన్మనిచ్చింది. అనంతరం ఆర్టీసీ అధికారులు, సిబ్బంది ఇచ్చిన సమాచారంతో అక క్కడికి చేరుకున్న 108 సిబ్బంది వైద్యం నిమిత్తం ఆమెను ప్రభుత్వ పేట్లబుర్జు ఆసుపత్రికి తరలించారు. అయితే వారి వద్ద డబ్బుల్లేక పోవడంతో కల్వకుర్తి ఎడిసి జి ఆర్ రెడ్డి, ఎంజీబీఎస్ కంట్రోలర్లు, సిబ్బంది కొంత నగదును వారికి అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. మహాత్మాగాంధీ బస్‌స్టేషన్‌లో జన్మించినందున సదరు శిశువుకు దేశానికి సేవలందించిన మహాత్మా గాంధీ పేరు పెట్టాలని ఆర్టీసీ అధికారులు, సిబ్బంది మణెమ్మకు సూచించారు. అయితే ఎలాంటి అపాయం లేకుండా మణెమ్మ ప్రసవం కావడంతో అక్కడు న్న ఆర్టీసీ అధికారులు. సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.కానీ ప్రసవ సమయంలో తల్లీ బిడ్డలకు ఏదైనా అపాయం సంభవిస్తే ఎంత అనర్థం జరిగి ఉండేదోనని ప లువురు ప్రయాణీకులు పేర్కొన్నారు. ప్రసవం గురించి వెళ్లిన గర్భిణిని అక్కడి వైద్యులు రిపోర్టులు లేవన్న కారణం తో ప్రసవం చేసేందు కు నిరాకరించి, తిప్పి పంపేయడం ఎంతవరకు సబబు అని పలువురు ప్రయాణీకులు ప్రశ్నిస్తున్నారు. అయితే వారు ఏ ఆసుపత్రికి వెళ్లారో కూడా కరెక్టుగా చెప్పలేకపోవడంతో వారికి వైద్యం అందించకుండా వెనక్కిపంపిన సదరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యసిబ్బంది ప్రస్తుతానికి గండం గట్టెక్కినట్లేనని చెప్పవ చ్చు.



బస్టాండ్‌లోనే గర్భిణీ ప్రసవానికి బ్లాంకెట్లతో చేసిన ఏర్పాట్లు

కోడి కత్తి నిందితుడు హైదరాబాద్‌కు తరలింపు

ఎన్ఐఎ కార్యాలయంలో కొనసాగుతున్న విచారణ

మన తెలంగాణ/హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్ ప్రతిపక్ష నేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌పై జరిగిన హత్యాయత్నం కేసులో నిందితుడు శ్రీనివాసరావును జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఎ) అధికారులు హైదరాబాద్‌కు తరలించారు. విచారణలో భాగంగా ఆదివారం విశాఖపట్నంకు తీసుకొచ్చిన ఎన్ఐఎ అధికారులు అనంతరం ఎయిర్ ఇండియా విమానంలో హైదరాబాద్‌కు తరలించారు. అంతకు ముందు విశాఖలోని సిఆర్‌పిఎఫ్ ట్రైనింగ్ సెంటర్‌లో నిందితుని తరపు న్యాయవాది సలీం సమక్షంలో విచారణ జరపాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. అయితే నిందితుడిని విచారించేందుకు ఈ ప్రదేశం అనువైంది కాదని ఎన్ఐఎ అధికారులు భావించారు. నిందితున్ని హైదరాబాద్ ఎన్ఐఏ కార్యాలయంలో విచారిస్తామని ఎన్ఐఎ అధికారులు ఉన్నతాధికారుల అనుమతి కోరారు. దీంతో ఎన్ఐఎ అధికారుల అభ్యర్థనను అంగీకరించడంతో శ్రీనివాసరావును హైదరాబాద్‌లోని ఎన్ఐఎ ప్రాంతీయ కార్యాలయానికి తరలించారు. కాగా విశాఖ విమానాశ్రయంలో టిడిపి నేత హర్షవర్ధన్ చౌదరికి చెందిన ఫ్యూజన్ ఫుడ్స్ రెస్టారెంట్‌తో పాటు వివిఐపి లాంజ్‌లోకి నిందితున్ని తీసుకెళ్లి ఘటన జరిగిన తీరుతెన్నులపై ఎన్ఐఎ అధికారులు ప్రశ్నించారు. ముఖ్యంగా నిందితుడు శ్రీనివాసరావు కోడికత్తి దాచిపెట్టిన ప్రదేశాన్ని పరిశీలించారు. దాడికి ముందు నిందితుడు తిరిగిన ప్రదేశంలో విచారణ చేశారు. ఈక్రమంలో ఎయిర్‌పోర్టులోని అన్ని సిసి టివిల ఫుటేజీని ఎన్ఐఎ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా కోడికత్తి నిందితుడు శ్రీనివాస రావు నివాముంటున్న ప్రాంతంలోనూ అధికారులు వివరాలు సేకరించారు.

ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

- ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసినట్లు తెలిస్తే కేసులు
- ఎన్నికలు సజావుగా కొనసాగేందుకు శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం
- రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు కిషన్

మన తెలంగాణ/కొల్చారం : ఎన్నికల నియామావళిని ఉల్లంఘిస్తే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తప్పవని రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు కిషన్ అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన కొల్చారం లోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల నామినేషన్ల స్వీకరణలో అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామాలలో బలవంతపు ఏకగ్రీవాలు, వేలం పాటలు నిర్వహించరాదని, అలా చేసినట్లు తమ దృష్టికి వస్తే చట్టపరంగా వాటిని రద్దు చేస్తామన్నారు. అదే విధంగా ప్రచార కార్యక్రమాల్లో అభ్యర్థులు డబ్బు, మద్యంతో పాటూ ప్రజలను ప్రలోభాలకు గురిచేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల నిర్వాహణ కేంద్రాలపై పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు సజావుగా కొనసాగేందుకు అధికారులు పకడ్బందీగా పనిచేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట బందోబస్తు, ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. ఆయన వెంట జిల్లా జాయింట్ కలెక్టర్ నగేష్ నర్సాపూర్ ఆర్డీఓ వెంకటేశ్వర్లు, తహశీల్దార్ రమేష్ ఎంపిడిఓ వామన రావు, ఎంఇఓ నీలంకంఠం, ఆర్ఐ రాము, సూపరింటెండెంట్ గణేష్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది ఉన్నారు.



తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి నేడు కావాలి : పవన్

మన తెలంగాణ/హైదరాబాద్ : పదవుల కోసం తాను రాజకీయాల్లోకి రాలేదని, దోపిడీకి వ్యతిరేకంగా వచ్చానని, ఆ వ్యవస్థపై పోరాడాలంటే తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి కావాలని జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యానించారు. స్వరాష్ట్రం కోసం తెలంగాణ యువత రోడ్లపైకి వచ్చినట్లుగా ఇప్పుడు ఏపి ప్రజలు కూడా రావాలని పిలుపునిచ్చారు. దోపిడీని ఎదిరించాలంటే యువత వల్లే సాధ్యమవుతుందని, తాను సిద్ధమేనని, ఇక సిద్ధం కావాల్సింది ప్రజలేనని తెనాలి సమీపంలోని పెదరావూరులో జరిగిన సంక్రాంతి సందర్భంగా పవన్ తన పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి పేర్కొన్నారు. ఈ ఏడాది మన భావజాలానికి ఒక పరీక్ష అని, తాను ఒక్క అడుగు వేస్తే అందుకు పది అడుగులు తోడయ్యాయని, మరికొన్ని అడుగులు వేయాల్సి ఉందన్నారు. భోగిమంటల సాక్షిగా పిరికితనాన్ని కాల్చేద్దాం, అవినీతిని దహించేద్దాం, సరికొత్త వ్యవస్థ కోసం ప్రయత్నిద్దాం అంటూ ఆయన కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపారు.

సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న అలీ

జనసేన నిర్వహించిన సంక్రాంతి వేడుకల్లో నటుడు అలీ పాల్గొన్నారు. ఉత్తర నియోజకవర్గ పరిధిలో సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఇటీవల ఏపి సిఎం చంద్రబాబుతో పాటు జనసేన అధ్యక్షుడు పవన్‌కతో అలీ భేటీ అయిన విషయం తెలిసిందే. గతంలో ఆయన వైఎస్ఆర్ పార్టీలో చేరుతారని ప్రచారం కూడా జరిగింది.

కుటుంబ వ్యవస్థను పటిష్టం చేసుకుందాం

- పౌరుల్ని ఉన్నతంగా తీర్చిదిద్దే విద్యావ్యవస్థ రావాలి
- వ్యవసాయ అనుబంధ రంగాల్లో వ్యవస్థాగత మార్పులురావాలి
- స్వర్ణభారత్ ట్రస్ట్ సంక్రాంతి సంబురాల్లో ఉప రాష్ట్రపతి

మన తెలంగాణ / హైదరాబాద్ : ''మనం మన కర్తవ్యాలను చిత్తశుద్ధితో నిర్వర్తించి శక్తివంతమైన, ఆరోగ్యవంతమైన, సౌభాగ్యవంతమైన భారత్‌ను నిర్మించే సంకల్పాన్ని సంక్రాంతి పండుగ శుభ సందర్భంగా తీసుకుందాం. మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ మన కుటుంబ వ్యవస్థను మరింత పటిష్టం చేసుకుందాం. మనసుకు సంబంధించిన ఈర్ష్య, అసూయ, ద్వేషం లాంటివి పిల్లలకు అంటకుండా చూసుకోవాలి. పిల్లల ర్యాంకుల మీద దృష్టి పెట్టిన తల్లిదండ్రులు వారు మంచి మనసుతో ఎదుగుతున్నారా లేదా అనే విషయాన్ని పట్టించుకోవాలి. ఉన్నతమైన పౌరుల్ని తయారు చేసే దిశగా విద్యా వ్యవస్థలో మార్పులు రావాలి. రైతులకు పండుగ రావాలంటే వ్యవసాయం ఆర్థిక ఆలంబన అందించాలి. వ్యవసాయంలో నిర్మాణాత్మక మార్పులు తక్షణ అవసరం. నీతి ఆయోగ్ చొరవ తీసుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఈ మార్గంలో ముందుకు నడపాలి. వ్యవసాయ అనుబంధ రంగాల్లోనూ వ్యవస్థాగత మార్పులు రావలసిన అవసరం ఉంది'' అని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. శంషాబాద్ సమీపంలోని ముచ్చింతల్‌లో స్వర్ణభారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సంక్రాంతి సంబురాల్లో పాల్గొన్న సందర్భంగా ప్రజలకు పై విధంగా పిలుపునిచ్చారు. సంక్రాంతి అందరి జీవితాల్లోకి భవ్య కాంతులు తీసుకు రావాలని, అందరికీ మంచి భవిష్యత్ లభించాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ సమాజ సేవ కోసం తమ సమయాన్ని కేటాయించాలన్నారు. యువత వ్యవసాయం వైపు రావాలని, వ్యవసాయరంగంలో నిర్మాణాత్మక మార్పులు అవసరమని అన్నారు. ప్రకృతితో కలిసి జీవించడం అలవాటు చేసుకోవాలని, శారీరక వ్యాయామం ద్వారా భౌతిక ఆరోగ్యాన్ని, ఆధ్యాత్మికత ద్వారా మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకుని, మన కర్తవ్యాలను నిర్వర్తించాలని సూచించారు. శక్తివంతమైన, ఆరోగ్యవంతమైన, సౌభాగ్యవంతమైన భారత్‌ను నిర్మించే సంకల్పాన్ని సంక్రాంతి సందర్భంగా తీసుకోవాలని, మన ఆచార వ్యవహారాలను సంస్కృతితో పాటు భారతీయ కుటుంబ వ్యవస్థను మరింత పటిష్టం చేసుకోవాలన్నదే సంక్రాంతి సందేశమని తెలిపారు.



సేవతో పాటు సంస్కృతిని కాపాడుతున్న స్వర్ణభారత్ : జస్టిస్ రాధాకృష్ణన్

స్వర్ణభారత్ ట్రస్ట్ ఆలోచన చాలా గొప్పదని తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాధాకృష్ణన్ వ్యాఖ్యానించారు. మహాత్మాగాంధీ, సర్దార్ వల్లభభాయ్ పటేల్ లాంటి వారి స్ఫూర్తితో గ్రామీణ యువత, మహిళలు, రైతుల శ్రేయస్సే లక్ష్యంగా స్వర్ణభారత్ ముందుకు సాగుతోందని, దీని ద్వారా చాలా మంది లబ్ధి పొందాలని ఆకాంక్షించారు. గ్రామీణ భారతం నైపుణ్య భారత్‌గా మారాలని, నైపుణ్య శిక్షణ ద్వారా సేవ చేయడం మాత్రమే కాకుండా మన సంస్కృతి పరిరక్షణలో భాగంగా అనేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసి, కళాకారులుకు ప్రోత్సాహం అందించే ఈ ట్రస్ట్ ఆలోచన అభినందనీయమని అన్నారు.

సామాజిక మార్పులో స్వర్ణభారత్ : కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్

అశోకుని కాలంలో భారత దేశాన్ని స్వర్ణభారతం అని పిలిచే వారని, ఈ పేరు వెనుక ఆలోచన ఎవరిదో తెలియదు గానీ, స్వర్ణభారత్ ట్రస్ట్ ఈ కాలంలో అలాంటి సామాజిక మార్పు కోసం పని చేస్తోందని కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ వ్యాఖ్యానించారు.

'రంగ విలాస మండపం'లో గోదాదేవి కళ్యాణం



మనతెలంగాణ, సిటీబ్యూరో : శ్రీవిల్లిపుత్తూరులో ధనుర్మాస వ్రతంను జరుపుకున్నామని, ధనుర్మాస వ్రతం చాలా అందంగా గడిచిందని, ఆండాళ్ తల్లి 30 రోజులు 30 పాటలు పాడి భగవంతుడికి వటపత్రసాయి సన్నిధిలో తమ విన్నపాన్ని విన్నవించిందని, వాటిని స్వీకరించిన దేవుడు చాలా ప్రసన్నుడైన గోదాదేవి కోరిన కోర్కెలను తీర్చాలని నిర్ణయించుకున్నాడని ప్రముఖ ఆధ్యాత్మిక గురువు చినజీయర్ స్వామీజి చెప్పారు. నగరంలోని నందగిరిహిల్స్‌లో మైహోం గ్రూపుల అధినేత జూపల్లి రామేశ్వర్‌రావు నివాస ప్రాంగణంలో నిర్వహిస్తున్న ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా 30వ రోజు గోదాదేవి కళ్యాణంను ఆయన జరిపించారు. గోదాదేవి తిరుప్పావై పూర్తిచేసిన పిదప రంగనాధుడి పిలుపు రాలేదని, ఆర్తితోటి ఆమె 143 పాటలుండే ''నాచ్యా ర్ తిరుముడి'' మరొక ప్రబంధాన్ని పాడిందని ఆయన తెలిపారు. ఆ ప్రబంధాన్ని విన్న తరువాత అందులో తాను మ్రొక్కిన మొక్కు 'సుందర్ బాహు స్వామీ తిరుమాల్ ఇరుమ్ సోలైలో ఉండే ఆ దివ్యమైన 'సుందర్ తోళ్ ఉడయాన్' అనే పేరు అని, ఆమె తనను స్వీకరించాలని కోరిందని ఆయన తెలిపారు. శ్రీరంగం నుంచి స్వామివారి వాహనం, అర్పించి ఛత్రము, చారము వంటి పరికరాలను తీసుకుని శ్రీరంగ అర్చకులు శ్రీవల్లి పుత్తూరు క్షేత్రానికి చేరుకున్నారని, విష్ణు చిత్తులవారితోటి ఇలా విన్నవించారని, మీ అమ్మాయిని తీసుకుని రమ్మన్నారని, ఆయన ప్రాణిగ్రహణ స్వీకరించడానికి సంసిద్ధుడై ఉన్నాడని అర్చకులు విన్నవించారని జీయర్ స్వామీజి తెలిపారు. విష్ణుచిత్తులవారి శిష్యుడైన మధురై పరిపాలకుడైన పాండ్య రాజు వల్లభ దేవరాయలు తన గురువుకు ధైర్యం చెప్పి కార్యక్రమాన్ని నడిపిద్దామని గోదాదేవిని తీసుకుని శ్రీరంగ క్షేత్రానికి చేరుకున్నారని ఆయన వెల్లడించారు. శ్రీరంగ క్షేత్రంలోని 'రంగ విలాస మండపం'లో రంగనాధుడు తన బంధు సపరివారంతో వేచి ఉన్నాడని, గోదాదేవిని మండపానికి చేర్చారని, ఆమె వస్తుండగా స్థానికులందరూ చిత్రంగా చూస్తున్నారని, అందుకే దానిని చిత్రవీధి అనిపేరు వచ్చిందని, చిత్రవీధి దాటిన తర్వాత స్వామివారు ఉంటారని, అందుకే దానిని ఉత్తర వీధి అని పేరున్నట్టు ఆయన వివరించారు. కళ్యాణ కార్యక్రమాలను నిర్వహించే వారిని పరాశర భట్టర్ అంటారని, ఈ రోజు రా. 7.30 గం.లకు ముహూర్తం నిర్ణయించి కార్యక్రమాన్ని ఆరంభించారని తెలిపారు. గోదా కళ్యాణం ను ఆసాంతం సేవించాలని, ఈ కార్యక్రమంలో చోటుచేసుకునే విశేషాలను వివరించడం జరుగుతుందని జీయర్ స్వామీజి సూచించారు. గోదాదేవి కళ్యాణం సీతారామచంద్రులనే పెద్ద సమక్షంలో జరిగిందని, రామచంద్రుడికి ఆరాధ్యమూర్తి రంగనాథుడేనని , రంగనాథుడు ఒక్కడే ఉంటారని, ఆయన కాళ్ళవద్ద ఎవరూ ఉండరని, రంగనాథుడు కేవలం గోదాదేవిని వివాహం చేసుకోవడానికే వచ్చాడని, ఇక్ష్వాకుల వంశంకు చేరి, విభూషణుడికి వచ్చి, కావేరి మధ్యకు చేరి అక్కడ ఉన్నది గోదాదేవి కోసం వచ్చారని జీయర్ స్వామీజి విశదీకరించారు. రామచంద్రుడికి ఇలవేల్పు రంగనాథుడేనని, రంగనాథుడు గోదాదేవిని వివాహం చేసుకున్న తర్వాత రామచంద్రుడు సీతాదేవితో కలిసి రంగనాథుడి, గోదాదేవి పాదాలను తాకి నమస్కరించాలని, గోదాదేవి వైభవం సీతమ్మవారి కంటే గొప్పదని, గోదాదేవికుండే వైభవం కంటే వేరెవరికీ లేదని జీయర్ స్వామీజి తెలిపారు. అత్యంత వైభవంగా రంగనాథుడి, గోదాదేవి కళ్యాణ మహోత్సవంలో యజ్ఞోపవిత ధారణ అనంతరం కళ్యాణ మహోత్సవంను ధనుర్మాస ఉత్సవాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తన్నీరు హరీష్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



సిఎం కెసిఆర్ సంక్రాంతి శుభాకాంక్షలు



మన తెలంగాణ / హైదరాబాద్ : సంక్రాంతి పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి కెసిఆర్ శుభాకాంక్షలు తెలిపారు. మకర సంక్రాంతి పండుగను ప్రజలు సంతోషంతో, ఉత్సాహంతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో పంటలు సమృద్ధిగా పండాలని, రైతులు సంపదతో విలసిల్లాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రకృతితో ముడిపడిన సంక్రాంతి పండుగ సందర్భంగా ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సైతం ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. మన సంస్కృతి, సంప్రదాయాల్లో పండుగలు ముఖ్య భూమిక పోషిస్తాయని, పంటలు చేతికొస్తున్న తరుణంలో ప్రకృతిని పూజిస్తూ, మన జీవికకు పునాదిగా ఉన్న పశువులను గౌరవించడం మన దేశ సంస్కృతి గొప్పదనమని కొనియాడారు.

విజయవాడలో తలసాని సంబురాలు

మన తెలంగాణ/హైదరాబాద్: టిఆర్‌ఎస్ నాయకుడు, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ విజయవాడలో జరగనున్న సంక్రాంతి సంబురాల్లో పాల్గొననున్నారు. ఈ మేరకు విజయవాడలో యాదవ సంఘాలు భారీ ఏర్పాట్లు చేస్తున్నాయి. ఇబ్రహీంపట్నం నుంచి ఇంద్రకీలాద్రి వరకు యాదవ సంఘాల భారీ ర్యాలీతో వెళ్లి తలసాని కనకదుర్గమ్మ దర్శనం చేసుకోనున్నారు. ఏపిలోని యాదవ సంఘాల ఆహ్వానం మేరకు తలసాని టిఆర్‌ఎస్ అధిష్టానం అనుమతితో విజయవాడకు వెళ్లనున్నారు. ఆదివారం ఉదయం 7 గంటలకు రోడ్ మార్గంలో బయలుదేరి 10 గంటలకు విజయవాడలోని ఇబ్రహీంపట్నం చేరుకుంటారు. ఆతర్వాత యాదవ సంఘాల భారీ ర్యాలీతో బయలు దేరి కనకదుర్గమ్మ దర్శనం చేసుకుంటారు. అనంతరం యాదవ సంఘాల సంక్రాంతి సంబురాల్లో పాల్గొని రోడ్డు మార్గం ద్వారా భీమవరం లోని మావురాలమ్మను దర్శనం చేసుకుంటారు.ఆతర్వాత భీమవరంలో రాత్రి బస చేస్తారు. తిరిగి సోమవారం రోడ్డు మార్గం ద్వారా హైదరాబాద్‌కు చేరుకోనున్నారు.

మరో రెండురోజులు పొగమంచు

అడవులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో చలిగాలుల తీవ్రత



మన తెలంగాణ/హైదరాబాద్ : రానున్న రెండు రోజుల్లో ఉదయం, రాత్రి సమయాల్లో పొగమంచు ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. గత మూడురోజులగా ఉదయం సమయంలో పొగమంచుతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉదయంతో పాటు సాయంత్రం వేళల్లోనూ పొగమంచు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. కోస్తా కర్ణాటక నుంచి నైరుతి మధ్యప్రదేశ్ వరకు, ఉత్తర ఇంటీరియర్ కర్ణాటక, మరత్వాడ మరియు విదర్భ మీదుగా 0.9 కి.మీల ఎత్తు వరకు ఉపరితల ద్రోణి ఏర్పడడం వలన చలిగాలులతో పాటు పొగమంచు ఎక్కువయ్యిందని అధికారులు తెలిపారు. దీనివలన రాగల మూడు రోజులు రాష్ట్రంలో పొడి వాతావరణం నెలకొంటుందని అధికారులు పేర్కొన్నారు. కోస్తా, ఆంధ్రా, రాయలసీమల్లో మూడు రోజులు పొడి వాతావరణం నెలకొంటుందని ఆ శాఖ పేర్కొంది. అడవులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో చలిగాలులు తీవ్రత ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

ఏరో ఇండియా షోలో అపోలో మైక్రో సిస్టమ్

మన తెలంగాణ / హైదరాబాద్ : రక్షణ మంత్రిత్వశాఖ, పౌర విమానయానశాఖ ఆధ్వర్యంలో బెంగుళూరులోని ఎలహంకలో జరగనున్న ఏరో ఇండియా షో 2019లో అపోలో మెక్రో సిస్టమ్స్ పాల్గొంటుందని ఎండి కరుణాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం నగరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇందులో మొత్తం 549 కంపెనీలు పాల్గొంటుండగా 279 విదేశీ, 270 భారతీయ కంపెనీలున్నాయన్నారు. దేశంలో మొదటిసారిగా జరుగుతున్న ఏరోస్పేస్, ఢిఫెన్స్ మ్యానిఫ్యాక్చరింగ్, ఔట్‌సోర్సింగ్, సప్లయ్ చైన్‌కు సంబంధించిన ఈ షోలో అపోలో మెక్రో సిస్టమ్ పాల్గొంటుందని తెలిపారు. ప్రస్తుతం తమకున్న క్లయింట్లతో కలిపి కొత్త క్లయింట్లకు వారి ఏరోస్పేస్, డిఫెన్స్ ఉత్పత్తి అవసరాలను తీర్చడంలో తయ శక్తిసామర్థ్యాలతో అందిస్తున్న ఉత్పత్తులను ప్రదర్శించడానికి నగరంలోని వివిధ రక్షణ పరిశోధనాలయాలలో భాగస్వామిగా ఉండడంతో పాటు సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలకు ఇదో వేదికగా ఉంటుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

పల్లె కళకళ... పట్నం వెలవెల...

- సంక్రాంతికి సొంతూరుకు వెళుతున్న వలస జీవులు
- నిర్మానుష్యంగా నగర రహదారులు

నడిరాత్రిని తలపిస్తున్న నగరం



పండగకు జనం ఊరెళ్లిపోయిన పిటీ

మన తెలంగాణ/హైదరాబాద్ సిటీబ్యూరో: నగరానికి వలస వచ్చిన ప్రజలంతా సంక్రాంతి పండుగ కోసం సొంతూరు బాట పట్టడంతో నగర రహదారులన్నీ చిన్నబోయాయి. నిత్యం రద్దీతో రోడ్డుపై జానెడు జాగా లేకుండా కళకళలాడే రాజధాని రోడ్లన్నీ ఖాళీగా దర్శనమిస్తున్నాయి. వరుస సెలవు రావడంతో ఉద్యోగులు, కళాశాల విద్యార్థులు ఇళ్ళకు ప్రయాణం అయ్యారు. వాహనాల రద్దీతో కనిపించే ఖైరతాబాద్ జంక్షన్, పంజాగుట్ట,అమీర్‌పేట, ఆబిడ్స్, నారాయణగూడ, ఆర్టీసీ ఎక్స్‌రోడ్స్, బేగంపేట, మల్కాజిగిరి, దిల్‌షుక్‌నగర్, మలక్‌పేట, చాదర్‌ఘాట్, కాచిగూడ, ముషీరాబాద్, అశోక్‌నగర్, కూకట్‌పల్లి, బాలానగర్, హైటెక్ సిటీ, మెహదీపట్నం. లంగర్‌హౌజ్, చాంద్రాయణగుట్ట, ఐఎస్‌సదన్, కర్మన్‌ఘాట్, సాగర్ రింగ్‌రోడ్డు, వంటి పలు ప్రాంతాలు విశ్రాంతి తీసుకుంటున్నాయి. ఎల్‌బినగర్, నుంచి సూర్యాపేట, నల్గొండ, ఖమ్మం, విజయవాడ, గుంటూరు వంటి ప్రాంతాల ప్రజలు పెద్ద ఎత్తున తరలి వెళ్ళారు. వారంతా సొంతూరు వెళ్ళేందుకు ప్రైవేట్ సుమోలు, ఇన్నోవాలు, టెంపో ట్రాక్స్ వంటి వాహనాలను ఆశ్రయిస్తున్నారు. వాహన దారులు గతంలో కంటే మూడింతలు పెంచి ప్రయాణికులను ముక్కు పిండి చార్జీలు జేబులో వేసుకుంటున్నారని మండి పడుతున్నారు. ఎక్కే ముందు ఒక మాట, దిగిన తర్వాత మాట మార్చి పండగ సీజన్ కావడంతో రేట్లు పెరిగాయని పేర్కొంటూ ఖచ్చితంగా అడిగినంత ఇవ్వాల్సిదే అని నిలదీస్తున్నట్లు వెల్ల డిస్తున్నారు. ఆర్టీసీ బస్సులను సమయానికి నడిపిస్తే ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు ఉండవని అదే విధంగా సంస్థ కూడా లాభాల బాటలో పరుగులు పెడుతుందని ప్రయాణికులు వ్యాఖ్యానిస్తున్నారు. జనం అంతా ఊళ్ళ కు చేరుకున్నాక ప్రత్యేక బస్సుల నడిపిస్తామని ఆగమేఘా ల మీద బస్సులను బయటకు తీసి 20 నుంచి 30 మంది ప్రయాణికులకు నింపుకుని అదరాబాదరగా నడుపుతూ, జనం ఉన్న చోట బస్సులు ఆపకుండా పోతూ పండగ పేరుతో బస్సులు నడిపిస్తే ప్రజలు ఆదరించడం లేదని ప్రకటలను చేసిన చేతులు దులుపుకుంటున్నారని విమర్శిస్తున్నారు. నియమి నిబంధనలు లేకుండా ఇష్టాను సారంగా బస్సులు నడుపుతూ ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడంలో ఆర్టీసీ విఫలమైందని పలువురు ఆరోపిస్తున్నారు.

అన్ని జిల్లాల్లో టిఆర్‌ఎస్ భవన్‌లు

- సంక్రాంతి తర్వాత శంకుస్థాపనలు
- పార్టీ కార్యాలయాల్లో ప్రజా ఫిర్యాదుల విభాగాలు
- సమస్యల పరిష్కారానికి అందుబాటులో ప్రజాప్రతినిధులు



మన తెలంగాణ/హైదరాబాద్: టిఆర్‌ఎస్ పార్టీ కేంద్ర కార్యాలయానికి అనుసంధానంచేస్తూ, తెలంగాణ వాస్తు రీతులకు దర్పణం పడుతూ రాష్ట్రంలోని ప్రతీ జిల్లాలో పార్టీ కార్యాలయాలను నిర్మించేందుకు టిఆర్‌ఎస్ ప్రణాళిక సిద్ధం చేసింది. ఏ జిల్లా పార్టీ కార్యాలయాలకు వెళ్లినా రాష్ట్ర కార్యాలయానికి వచ్చిన అనుభూతి కల్పించడంతో పాటు ప్రజల సమస్యల పరిష్కారానికి అవసరమైన సౌకర్యాలను మెరుగు పరుస్తూ ఈ కార్యాలయాలను నిర్మించనున్నారు. ఈ మేరకు ఇప్పటికే స్థలాల సేకరణ జరిగినట్లు సమాచారం. ఒక ఎకరానికి తక్కువ కాకుండా అన్ని పార్టీ కార్యాలయాలు ఒకే విధంగా ఉండేటట్లు నిర్మాణాలు ప్రారంభం కానున్నాయి. సంక్రాంతి అనంతరం రాష్ట్రంలోని ప్రతి జిల్లా కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర సమితి (టిఆర్‌ఎస్) కార్యాలయాల నిర్మాణానికి శంకు స్థాపన చేసేందుకు పార్టీ నిర్ణయించింది. ఈమేరకు రాష్ట్రంలో కొత్తగా ప్రకటించిన జిల్లాలతో కలిపి 33 జిల్లాలో పార్టీ భవనాలు నిర్మించేందుకు స్థాలాలను ఎంపిక చేశారు. అయితే ఇప్పటికే జిల్లాలో ఉన్న పార్టీ కార్యాలయాలను ఆధునీకరించి మిగతా జిల్లాల్లో కొత్త భవనాలు నిర్మించాలని టిఆర్ఎస్ నిర్ణయించింది. వనపర్తి, మహబూబ్ నగర్, వికారాబాద్, మెదక్, సంగారెడ్డి, నిజామాబాద్, ఖమ్మం, వరంగల్, సూర్యాపేట, అదిలాబాద్ తదిర జిల్లాల్లో ఇప్పటికే ఉన్న పార్టీ జిల్లా కార్యాలయాలను ఆధునీకరించడంతో పాటు సౌకర్యాలను మెరుగు పరిచేందుకు పార్టీ నిర్ణయించింది. మిగతా 22 జిల్లాల్లో టిఆర్‌ఎస్ పార్టీ భవనాలు నిర్మించనుంది. అయితే జిల్లా పార్టీ భవనాలన్నీ ఒకే విధంగా నిర్మించేందుకు అవసరమైన బిల్డింగ్ ప్లాన్స్‌ను టిఆర్‌ఎస్ పార్టీ నాయకులు పరిశీలిస్తున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, తరతరాల చరిత్ర ప్రతిబింబించే విధంగా పార్టీ భవనాలన్నీ ఒకే వాస్తు రీతుల్లో నిర్మించాలని టిఆర్‌ఎస్ నిర్ణయించింది. ప్రధానంగా పర్షన్ వాస్తు రీతులతో పాటు కాకతీయ నిర్మాణ శైలి భవనాల్లో ఉట్టిపడే విధంగా నిర్మించాలని టిఆర్‌ఎస్ యోచిస్తుంది. పార్టీ కార్యాలయాలకు వెళ్లితే ప్రజల సమస్యలు పరిష్కారం అయ్యేవిధంగా ఉండాలని టిఆర్‌ఎస్ భావిస్తుంది. దూర ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు వచ్చి సమస్యలను పరిష్కరించుకునే బదులు ఎక్కడికక్కడ సమస్యలకు పరిష్కారం లభించే విధంగా పార్టీ కార్యాలయాల్లో ప్రజాప్రతినిధులు నిత్యం అందుబాటులో ఉండే విధంగా సౌకర్యాలను మెరుగుపర్చాలని టిఆర్‌ఎస్ యోచిస్తుంది. పార్టీ, ప్రభుత్వం మధ్య సమన్వయం పెంపొందిస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి పార్టీ కార్యాలయాలు వేదికలు కావాలని టిఆర్‌ఎస్ భావిస్తుంది. టిఆర్‌ఎస్ కేంద్ర కార్యాలయంతో పాటు జిల్లా పార్టీ కార్యాలయాల్లో ప్రజాఫిర్యాదుల విభాగం(పబ్లిక్‌గ్రీవెన్సీసెల్) ఏర్పాటు చేయాలని టిఆర్‌ఎస్ రాష్ట్ర నాయకత్వం నిర్ణయించింది. అధికార టిఆర్‌ఎస్ పార్టీ ప్రజా సంక్షేమంతో పాటు ఎక్కడికక్కడ ప్రజాప్రతినిధుల పరిధిలోని సమస్యలను పరిష్కరిస్తూ పార్టీ ప్రజలకు మరింత చేరువయ్యే విధంగా చర్యలు చేపట్టింది. సంక్రాంతి అనంతరం టిఆర్‌ఎస్ పార్టీ కార్యకలాపాలు శరవేగం పుంజుకోనున్నాయి. అలాగే పార్టీ కార్యాలయాల నిర్మాణాలతో పాటు రాష్ట్ర కార్యాలయంలో కార్యకర్తల శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నారు. స్థానిక నాయకత్వాన్ని పెంపొందించేందుకు గారమస్థాయినుంచి పార్టీని బలోపేతం చేయడంతో పాటు ప్రతి వంద కుటుంబాలకు ఒక టిఆర్‌ఎస్ నాయకుడు ఉండే విధంగా పార్టీ నిర్మాణం చేయాలని యోచిస్తున్నారు. కేంద్ర రాజకీయాలకు కేంద్ర బిందువై, సంక్షేమ పథకాల అమల్లో దేశానికి ఆదర్శమైన టిఆర్‌ఎస్ పార్టీ నిర్మాణంలో కూడా దేశానికి దిక్సూచిగా నిలిచేందుకు నాయకత్వం పటిష్టమైన పథకాలను రూపొందిస్తుంది.




టిఆర్‌ఎస్‌లోకి ఆరుగురు ఏకగ్రీవ సర్పంచ్‌లు

మన తెలంగాణ/ బషీరాబాద్: వికారాబాద్ జిల్లా, బషీరాబాద్ మండల కేంద్రంలోని మాజీ శాసన సభ్యులు నారాయణరావు నివాసంలో ఆదివారం మాజీ మంత్రి మహేందర్ రెడ్డి సమక్షంలో మండల పరిధిలోని హాంక్యా నాయక్ తండా దేవి సింగ్, బాబు నాయక్ తండా సుర్యా నాయక్ ఇద్దరు ఏకగ్రీవమైన సర్పంచ్‌లు టిఆర్‌ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి మాజీ మంత్రి మహేందర్ రెడ్డి, మాజీ శాసనసభ్యులు నారాయణరావు కండువాలను కప్పి ఆహ్వానం పలికారు. అదే విధంగా మండల పరిధిలోని మంతన్‌గౌడ్ తండా గాయత్రి చౌహన్, మంతన్‌గౌడ్ గ్రామం సత్యమ్మ టిఆర్‌ఎస్ పార్టీ బలపరిచిన ఇద్దరు సర్పంచ్‌లు ఏకగ్రీవమైనారు. ఇంతకముందు మండల పరిధిలోని కుప్పన్‌కోట్ తండా పద్మ, బాద్లాపూర్ తండా సుభాష్ ఇద్దరు సర్పంచ్‌లు ఏకగ్రీవమై రెండు రోజుల క్రితం మాజీ మంత్రి మహేందర్ సమక్షంలో టిఆర్‌ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. దీంతో టిఆర్‌ఎస్ పార్టీ ఖాతాలోకి 6 మంది ఏకగ్రీవ సర్పంచ్‌లు చేరారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ అత్యధిక సర్పంచ్ స్థానాలు టిఆర్‌ఎస్ పార్టీ గెలుచుకుంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షులు వెంకట్‌రాం రెడ్డి, జిల్లా రైతు సమన్వయ సమితి సభ్యులు అజయ్ ప్రసాద్, టిఆర్‌ఎస్ సీనియర్ నాయకులు రోహిత్ మహరాజ్, రజాక్,రాజన్న, శ్రవణ్‌కుమార్, యహయా ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

సర్కార్ జోక్యంతో 'టోల్' బాదుడుకు పరిష్కారం

- ఊపిరి పీల్చుకున్న ప్రయాణీకులు

మన తెలంగాణ / హైదరాబాద్ : సంక్రాంతి పండుగ సందర్భంగా నగరం నుంచి పల్లెలకు వెళ్ళే ప్రయాణీకులపై టోల్ టాక్స్ విధించవద్దని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినా చాలా రహదారులపై అది అమలులోకి రాకపోవడంపై ప్రధాన కార్యదర్శి సీరియస్ అయ్యారు. ఆయా జిల్లాల రెవిన్యూ, పోలీసు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసి టోల్ ప్లాజాల సిబ్బందికి, ప్రయాణీకులకు మధ్య జరుగుతున్న ఘర్షణలను నివారించాలని, టోల్ టాక్స్‌ను విధించకుండా ఉచితంగానే వెళ్ళే వీలు కల్పించాలని స్పష్టం చేశారు. దీంతో ప్రయాణీకులు ఊపిరి పీల్చుకున్నారు. పండుగ సందర్భంగా నగరం నుంచి వేలాది వాహనాలు పల్లెబాట పట్టడంతో టోల్ గేట్ల దగ్గర ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతుందని వారం రోజుల క్రితమే అంచనా వేసిన రాష్ట్ర ప్రభుత్వం వాహనాల రాకపోకలను నియంత్రించేందుకు పోలీసుల్ని నియమించింది. ప్లాజాల కౌంటర్‌లలో డబ్బులు కట్టి రసీదులు తీసుకోవడంలో జరిగే జాప్యాన్ని దృష్టిలో పెట్టుకుని వాహనం దగ్గరికే సిబ్బంది వచ్చి రసీదు ఇచ్చే ఏర్పాట్లు చేసింది. అయితే పండుగ కోసం వెళ్ళే ప్రజలకు టోల్ ఫీజు నుంచి ఉపశమనం కలిగించే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 13, 16 తేదీల్లో టోల్ టాక్సును వసూలు చేయకుండా స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషి శనివారం సాయంత్రమే ఈ ఉత్తర్వులు జారీ చేసి టోల్ ప్లాజాల నిర్వాహకులకు కూడా చేరవేశారు. అయినా డబ్బుల ఆశతో టోల్ ప్లాజా నిర్వాహకులు యధావిధిగా డబ్బులు వసూలు చేయడం మొదలుపెట్టారు. దీంతో ప్రయాణీకులకు, సిబ్బందికి మధ్య వాదనలు, ఆ తర్వాత ఘర్షణల స్థాయికి చేరుకుంది. టోల్ పన్ను విధానం కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అంశమని, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ఆదేశాలను



తాము అమలుచేయబోమని, రాష్ట్ర రాహదారులకు అది వర్తిస్తుంది తప్ప తమకు వర్తిందని ప్రయాణీకులకు టోల్ సిబ్బంది వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. కానీ ప్రయాణీకులు వారివారి మొబైల్ ఫోన్లలో ఉన్న ప్రభుత్వ ఆదేశాలను సిబ్బందికి చూపించినా ఫలితం లేకపోయింది. వాదనల క్రమంలో భారీ సంఖ్యలో వాహనాలు ట్రాఫిక్ జామ్‌లో ఇరుక్కుపోయాయి. ఈ సమాచారం తెలుసుకున్న ప్రధాన కార్యదర్శి వెంటనే స్పందించి టోల్ ప్లాజా నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా అమలుచేయకపోవడంపై సీరియస్ అయ్యారు. ఆయా జిల్లాల కలెక్టర్లు, ఎస్‌పిలతో మాట్లాడిన ప్రధాన కార్యదర్శి వెంటనే పోలీసుల్ని, ప్రభుత్వ సిబ్బందిని అక్కడికి పంపి పరిస్థితిని చక్కదిద్దాలని ఆదేశించారు. వెంటనే పోలీసులు రంగంలోకి దిగి టోల్ ప్లాజా సిబ్బందికి అర్థం చేయించి ప్రయాణీకుల నుంచి ఎలాంటి పన్ను వసూలు చేయవద్దంటూ స్పష్టం చేశారు. కొన్ని గంటల తర్వాత పరిస్థితి అదుపులోకి వచ్చింది. అప్పటికే వేల సంఖ్యలో రహదారులపై వాహనాలు నిలిచిపోవడంతో ఇక ట్రాఫిక్ పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితిని చక్కదిద్దారు. ఈ నెల 16వ తేదీన సైతం టోల్ టాక్సు చెల్లించాల్సిన అవసరం లేదు.

Fusion శాయరీ !

diary అను దినచర్య మానిని!

1. లోకాలోక అలౌకిక కేకల కాకల మధ్య లోకులు పలు కాకులై బాకులతో పొడిచి మేకులతో కొట్టి షోకులను, కరెంట్ షాకులను cake లుగా పెట్టి అబల దుర్బల దర్భలతో వధ్య శిల శకలాల కొనలపై సకల కలలను వికలం చేసి, రేఖలుగా అకల్ లేని నకలుగా తర్జుమా చేసే రోజువారీ summary... ఆనంద విషాదాల కలంకారీ... డైరీ!

Yes, మేరా జీవన్ కోరా కాగజ్...! తేరా దామన్ ప్యారా collage...!!

2. ఇండ్లు కూలి, బండ్లు పేలి, కండ్లు రాలి, విరిగిపడ్డ కొడవలిగా, తెగిపడ్డ పిడికిలిగా, విడివడ్డ లోగిలిగా, ముడిపడ్డ తిరగలిగా, వేరుపడ్డ చెలిగా, అంబలికి బలియై కంబళికి వెలియై ,ఆఖరికి ఆకలి రహిత రుడాలిగా, మకిలి లేని రుమాలుగా, ఇసీ లోగ్ కా కమాల్ గా రోజునంతా replay చేసుకొని, reply ఇచ్చుకొని, గుజ్ రే గయే వక్త్ ని యాద్ చేసుకున్నంక...

జీహా, డైరీ రోజంతటి ఇచ్ఛంత్రాల ముచ్చట! వయ్యిల ముద్రించిన రాత కోతల ముళ్ళబాట!!

3. అక్షరమ్ముక్క లేని రోజుల్లో brain is the register of events, record of incidents! ఎన్ని భయాలెన్ని యుద్ధాలెన్ని పోరాటాలెన్ని ధిక్కారాలెన్ని తిరుగుబాట్లెన్ని త్యాగాలెన్ని బలిదానాలెన్ని హత్యలెన్ని వధలెన్ని వంచనలెన్ని కుట్రలెన్ని కాటులెన్ని కోటలెన్ని వేటలెన్ని భయాలు... భయ సమయాలు...

Indeed, డైరీ రేపటి పై భయానికి పుట్టిన జల ! మరుపును మరిపించటానికి కాసిన వెన్నెల!!

4. సభీ feelings and emotionsనీ, గతాలనీజ్ఞాపకాలనీ, దుఃఖాలనీ దైన్యాలనీ ఇటుక పేర్చినట్టు, పిట్ట గూడు కట్టినట్టు, విత్తనం నాటినట్టు, ఇసుక మేట పెట్టినట్టు అన్నిటినీ తనలో దాచుకుని, కాచుకుని, కాపాడుకున్నది సిర్ఫ్ ఇన్సాన్ కా భేజా ఒక్కటే!

షాయద్, బుక్ వచ్చిందిభేజాకి పని తగ్గింది! డైరీ వచ్చిందియాద్ గారీ కమ్ అయింది!!

5. రోజుకో పేజీ, గంటకో లైన్ గా సంవత్సర మంతా 365 సంఖ్యలోకి కుదించబడి, మధించబడి, శోధించబడి, నిషేధించబడగా మిగిలిన సంస్కారపు జ్ఞాపకాల చిట్టా, అనుబంధాల గుట్ట! Socially accepted, personally approved, consciously expressed భావనల, కామనల, లాలనలను, వలవేసి పట్టుకుని కలంతో బలంగా రాసిన పదాల శాల డైరీ!

Perhaps, రాశి పోసిన ముసుగుల మేళా ఇది! Hypocrisyల కబేళా ఇది!!

–మామిడి హరికృష్ణ 8008005231

భాషణ భూషణాలు



ఒక సందర్భంలో విశాలాంధ్ర పత్రికాఫీసులో శ్రీశ్రీ ఉన్నారు. నేనో పని మీద అక్కడికెళ్లా. శ్రీశ్రీని చూసి పలకరించా. ఇతర్లతో నాపని చూసుకుంటూ ఉన్నా. శ్రీశ్రీ అలాగే పెదవి విప్పకుండా ఉన్నారు. ఏం అలా ఉన్నారు? అన్నా. అందుకాయన ''ఏం మాట్లాట్టం లేదనా! అంటే పనీ లేదు, పాటా లేదు... మనీ లేదు మాటా లేదు'' అన్నారు శ్రీశ్రీ. అట్లా వచనంలో కవిత్వం చెప్పగల శక్తి శ్రీశ్రీ కుంది. అందుకే అతని నాటికలు చదివినా కవిత్వాన్ని చదివిన అనుభూతి కలుగుతుంది.

పంపిన వారు : ఏటూకూరి ప్రసాద్, హిమాయత్ నగర్, హైదరాబాద్.

mail id : editor@manatelangana.org

సాహితీ విమర్శ గ్రంథాల పోటీ

డా॥ నాగభైరవ కోటేశ్వర రావు ప్రతిభా పురస్కారాల నిమిత్తం సాహితీ విమర్శ గ్రంథాలను పోటీకై కోరుతున్నారు. 2014 నుండి 2018 వరకు ప్రచురితాలైన 4 ప్రతులు సాహితీ విమర్శ గ్రంథాలను ఈ నెల చివరి వరకు – చిన్న నారాయణ రావు, ప్రధాన కార్యదర్శి, నాగభైరవ అవార్డు కమిటీ, # 27–1–171, శ్రీకేతనమ్, ఆదిత్య నగర్, నెల్లూరు – 524002 చిరునామాకు అందేటట్లు పంపాలి. అవార్డు గ్రహీతకు రూ. 5000/– నగదు ప్రదానం చేస్తారు. వివరాలకు: 9440202942

నవలల పోటీకి ఆహ్వానం

జాగృతి వార పత్రిక ఎం.డి. వై. రామమూర్తి స్మారక నవలల పోటీ నిర్వహిస్తుంది. భారతీయ జీవన విధానం, విలువలు ఇతివృత్తంగా కలిగినవి 150 ఎ4 పుటలు మించకుండా డిటిపి చేయించి మార్చి 30లోగా jagriticompetition@gmail.comకు మెయిల్ చేయాలి. గెలుపొందిన ఇద్దరికి ప్రథమ, ద్వితీయ బహుమతులుగా 25 వేల రూ.లు, 20 వేల రూ.లు ఇస్తారు. వివరాలకు 9959997204

కవితల పోటీ – 2019

జైనీ ఫౌండేషన్ – కవిసంధ్యలు సంయుక్తంగా కవితల పోటీ నిర్వహిస్తున్నారు. కవులు తమ కవితలను ఫిబ్రవరి 15లోగా దాట్ల దేవదానం రాజు, # 8–1–048, జక్రియనగర్, యానాం – 533464, తూర్పు గోదావరి జిల్లా ఆం.ప్ర.కు పంపాలి. ఎంపికైన వారికి రూ. 3 వేలు, రూ. 2 వేలు, రూ. 1వేయి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా మరో పది మంచి కవితలకు రూ. 500/– చొప్పున బహుమతులనిస్తారు. వివరాలకు : 9440105987

వేంపల్లి షరీఫ్‌కు చాసో పురస్కారం

ప్రముఖ రచయిత చాసో పేరిట ఇచ్చే పురస్కారం – 24, ఈ యేటికి ప్రసిద్ధ రచయిత వేంపల్లె షరీఫ్‌కు ఇస్తున్నట్లు చాసో స్ఫూర్తి సాహిత్య ట్రస్టు ప్రకటించింది. ఈ నెల 17న సా. గం॥ 6లకు గురజాడ స్మారక జిల్లా కేంద్ర గ్రంథాలయం విజయనగరంలో అందజేస్తామని చాగంటి తులసి తెలిపారు.

దోరవేటిపై రచనలు పంపండి

'దోరవేటి'గా సుప్రసిద్ధులైన వి.చెన్నయ్య గారు బహుముఖ ప్రజ్ఞాశాలి. కథా రచయితగా, నవలా రచయితగా, కవిగా, చిత్రకారుడిగా, పాఠ్య పుస్తక రచయితగా, నాటికా రచయితగా ఎంతో కృషి చేశారు. నటన, నాట్యం, వాద్య సంగీతం తదితర కళల్లోనూ ప్రవీణుడు దోరవేటి గారు. ఆయన ఉద్యోగ విరమణ సందర్భంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక ప్రత్యేక అభినందన సంచికను వెలువరించేందుకు సంకల్పించింది. ఈ సంచిక కోసం దోరవేటి కృషిపై వేర్వేరు పార్శ్వాల్లో వ్యాసాలు, కవితలు, పద్యాలను ఆహ్వానిస్తున్నాం. రచనలు suryaprakashrao2014@gmail.com అనే మెయిల్ కు గానీ, డా.రాయారావు సూర్యప్రకాశ్ రావు, ఎఫ్2, ఓం రెసిడెన్సీ, ఉమా నగర్, మేడ్చల్501401 అనే చిరునామాకు ఈ నెల 24 వ తేదీలోగా అందేటట్టు పంపవలసిందిగా కోరుతున్నారు.

జాన్ సాహిత్య పురస్కారం

ప్రముఖ పద్య కవి, సాహితీ వేత్త మల్లవరపు జాన్ సాహితీ పురస్కారం –2018ని ప్రముఖ కవి, ఆచార్య చల్లా శ్రీరామచంద్రమూర్తికి ప్రదానం చేయనున్నామని మల్లవరపు ప్రభాకర్ తెలిపారు.

దళిత మహిళావాద కథానికతత్త్వము

దళిత మహిళలు కుల సమాజంలో అంటబడని వారై అనేక ప్రతికూల పరిస్థితుల్లో, ప్రతికూల సామాజిక సాంస్కృతిక అణచివేతల్లో అక్షరాల్ని అభ్యసించడం ఒక యుద్ధమైతే, వారిలో అతికొద్ది మంది రచయితలై సాహిత్య ప్రపంచంలోకి ప్రవేశించడం చిన్న విషయం గాదు. తమ రచనలను ప్రపంచానికి పరిచయం చేయడానికి మహా యుద్ధమే చేయాలి. ఆ భాష అర్థం కావడం లేదనీ అప్పకవి సూత్రీకరించిన కుక్క ముట్టిన కుండనే చేసింది, ఆధునిక తెలుగు సాహిత్యం కూడా. దళిత మహిళల జీవితాలు కుల, మత, శ్రమ, బాంచరిక సంబంధ జీవితాలు.

వీరిపై మత కుల పెత్తనం, మగపెత్తనం, కులహింసలు, శ్రమదోపిడీ, పేదరికం, అల్పదోపిడీ, నిరక్షరాస్యత, అంటరానితనం, అత్యాచారాలు, వెట్టిచాకిరి, అనారోగ్యాలు, బాల కార్మిక వ్యవస్థ, జోగినీ దురాచారం, దొర పెత్తనాలు, దొర్సాని పెత్తనాలు, నిరుద్యోగం వంటి అనేక పీడనల్ని ఎదుర్కొంటూ ఉత్పత్తి శక్తులుగా యీ సమాజానికి సేవలందిస్తూ వారు మానవ హక్కులు లేని మనిషి గౌరవాల్లేని వారుగా చూడబడుతున్నారు. ఈ కుల సమాజంలో అంటరాని మగవాళ్లు, బానిసలైతే... ఆ బానిసలకు బానిస దళిత మహిళ.

ప్రపంచవ్యాప్తంగా అనేక శ్రామిక మహిళా పోరాటాల ఫలితంగా ఐక్యరాజ్య సమితి 1975ను అంతర్జాతీయ మహిళా సంవత్సరంగా ప్రకటించడంతో భారత ప్రభుత్వాలు మహిళల గురించిన జెండర్ అవగాహన పద్ధతులు, పరిశోధనలు, చర్చలు విస్తృతంగా చేయడం మొదలైంది. కానీ ఇవన్నీ చదువుకున్న సవర్ణ స్త్రీల వరకే పరిమితమైంది. పరిశోధనలు, అవగాహనలు, సాహిత్యాలు వారి జీవన సమస్యల చుట్టే తిరగడం జరిగింది. అవి కింది శ్రామిక కులాల మహిళల వరకు చేరలేదు. సమస్త సామాజికాంశాలు, రాజకీయ సిద్ధాంతాలు, ఉద్యమాలు, చరిత్రలు, సాహిత్య నిర్మాణాలు, అస్తిత్వాలు, అధ్యయన పద్ధతులు, చరిత్ర వ్యాఖ్యానాల కోణాలు, అభిప్రాయాలు అన్నీ సవర్ణ మహిళల అనుభవజ్ఞాన ప్రాతిపదికన్నే అభివృద్ధి చేసి, అవే సార్వజనీన జెండర్ దృక్పథంగా చెలామణి అవుతున్నాయి. 1980 దశకంలోనే జెండర్ రాజకీయ అవగాహన తెలుగు సాహిత్య విమర్శలోకి వచ్చింది. కానీ తెలుగు సాహిత్య విమర్శలోకి కులజెండర్ రాజకీయ అవగాహన ఇంకా మొదలు కాలేదు.

మగవాడు మహిళని వ్యవస్థీకృతంగా లోబర్చుకున్న పదము 'పితృస్వామ్యం'. అయితే, స్త్రీవాదం పేరుతో సవర్ణ స్త్రీలు, దళిత మహిళల అనేక అణచివేతలను మాట్లాడనివ్వకుండా కేవల పితృస్వామ్యంను జనరలైజ్ చేసి సృష్టించిన పదమే 'దళిత స్త్రీ వాదము.'



జాజుల గౌరి

దళిత మహిళల రచనలు సాహిత్యానికి అంటరానిదిగా పరిగణింపబడుతున్న అప్రజాస్వామిక విధానాలపై తెలుగు సాహిత్యంలో విస్తృత చర్చ జరగాల్సి వుంది. దళిత మహిళల రచనల గురించి మాట్లాడాలంటే... కుల వ్యవస్థ యొక్క సాంఘిక, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక కోణాల్ని జెండర్ దృక్పథంతో అధ్యయనం చేయాల్సి వుంది. సంప్రదాయ ఆధునిక సిద్ధాంతాలుగానీ, అంతర్జాతీయ సిద్ధాంతాలు గానీ దళిత (మగ) సిద్ధాంతాలు గానీ దళిత మహిళల సాహిత్యాన్ని అధ్యయనం చేయడానికి అంచనా కట్టడానికి ఉపయోగపడకపోవచ్చు. చరిత్రలో ఏ సాహిత్యమైనా, ఏ సమూహమైనా తన ప్రయోజన సిద్ధాంతాన్ని తానే నిర్మించుకున్నది. సాహిత్య చరిత్రల్లో మచ్చుకైనా దళిత మహిళల రచనలు కనిపించవు. కులం, జెండర్ వంటి అనేక రకాల వివక్షలతో, సెన్సార్‌షిప్‌ల ఉక్కు మేఘాల కింద అనేక నల్లపొద్దులు నలిచేయబడినయి. అవి ఇప్పుడిప్పుడే వెలుగుల్ని రేఖామాత్రంగా చూస్తున్నాయి.

కథలు చెప్పడంలో దళిత మహిళలు ప్రత్యేకులు. తెలుగులో మొదటితరం చదువుకున్న దళిత మహిళ తాడి నాగమ్మ 'ముద్దు కత'. జాతీయోద్యమకాలంలో ఒక మహిళ వలసవాదానికి వ్యతిరేకంగా విదేశీ బహిష్కరణ చేయాలని ఒక నాగరికున్ని కోరగా, అతడు ప్రతిఫలంగా ముద్దియ్యమని కోర్తాడు. విదేశీ హాలాహల మునకు ఆహుతి అగుతున్న నీబోటి సోదరున్ని రక్షింపనొకము ద్దీయలేనా' అనడంతో అతనికి మూర్ఛ వస్తుంది. ముద్దు అనేది ఒక మానవీయమైన స్పర్శ. దానికున్న మగ విలువల్ని అవలీలగా తీసి పారేస్తుంది రచయిత్రి. నల్లపొద్దు– దళిత స్త్రీల సాహిత్యం వచ్చేదాకా ఇలాంటి అద్భుతమైన కథ సాహిత్య ప్రపంచానికి అంటరానిదే అయింది. జాతీయోద్యమ కాలం నాటికే ఇలాంటి మానవీయమైన విలువల్ని జీవిత మహిళలు తెలుగు కథాసాహిత్యంలో వెలువరించారు. అయితే, ఈ కథలో ఆ మహిళ దళిత మహిళలు తెలుగు కథాసాహిత్యంలో వెలువరించారు. అయితే ఈ కథలో ఆ మహిళ దళిత మహిళ అయివున్నందునే ఆ నాగరికుడు (ఆధిపత్యకులం) ముద్దడిగి తన పెద్ద కులాధిపత్యాన్ని ప్రదర్శించుకున్నాడు. ఆధిపత్య కులం మహిళల్ని అట్లా అడిగే సాహసాలు చేసి వుండరు. ఈ కథలో కులజెండర్ చర్చ, ఉద్యమాల్లో కూడా ఎలాంటి ఆధిపత్య మగస్వామ్యాల వికృత చేష్టలుంటాయనేది రచయిత్రి వెల్లడించి తన సమాధానంతో ఒక గొప్ప మానవీయ విలువని చాటి చెప్పింది. నంబూరి పరిపూర్ణ 'ఉంటాయి మాకు ఉషస్సులు' కథా సంపుటిలో కుల వివక్షల మీద, సమాజంలోని అన్ని రకాల ఆధిపత్యాల మీద కథలను వెలువరించింది. లలితా పీటర్ జరిగిన స్వప్నం' కథలో జెండర్ సమానత్వం నోటిమాటే కానీ ఆచరణలో లేవనీ రాసింది అంటరాని అవమానాల్ని ఆవిష్కరించింది.



గోగు శ్యామల

మామిడి సత్యవతి – 'తెర తొలిగింది' సెంటినా సరోజిని 'వింత పశువు' కథలో దళిత మగవాళ్లు కూలి చేసి ఇంటికి పైసా ఇవ్వకుండా తాగుడుకి బానిసలై కుటుంబాల్ని పోషించే బాధ్య తల్ని పట్టించుకోని నిర్లక్ష్యాన్ని నిలదీసే కథలివి.

గెద్దాడ కస్తూరి– ' రక్తమా నీదేకులం' కథలో కింది కులాలు నీచం అని, శీలం లేని వాళ్లు, శుభ్రం లేని వాళ్లు అనే గర్వంతో అవమానించే ఒక ఆధిపత్య స్త్రీ కూతురు చావు బతుకుల్లో కొట్టుమిట్టాడుతుంటే ... 'ఒక రిక్షావాడి రక్తం ఉంది ఎక్కించమంటారా?' అని అడుగుతుంది ఒక డాక్టర్. ఆ డాక్టర్ ఆ ఆధిపత్య కుల స్త్రీ ఇంట్ల పని చేసి అనేక చీత్కారాలకు గురై చదువుకున్న దళిత మహిళ సమీర.

గుజ్జర్లమూడి నిర్మలారాణి –' కాటేసిన కరువు' కథలో రాయలసీమ పల్లెల్లో కరువు, దళిత కులాల్ని కబలించడాన్ని, ఏ కూలీనాలీ దొరక్క పేదరికంతో దళిత మహిళలు పట్టణాలకు వలస వెళ్లడాన్ని, కుటుంబాల్ని, పిల్లల కడుపు నింపడానికి తమ శరీరాల్ని అమ్ముకున్నే దురవస్థను కళ్లకు కట్టింది.

దాసరి శిరీష –కులాంతర వివాహాల్లో మంచి చెడ్డలు, దానివల్ల జరిగే నష్టాలకు దళిత మహిళలు ఎట్లా బలవుతున్నారనే కథ 'వ్యత్యాసం'. అట్లనే చంద్రశ్రీ 'అంటరాని పాట' లో కులాంతర వివాహం ఉద్యమంలో జరిగిన ఇంట్లకొచ్చేటప్పటికీ వంట గిన్నెలు ముట్టుకోనివ్వని కుల వివక్షలు, పాట పాడనివ్వని నిషేధాల మీద ఎక్కుపెట్టిన కథ. జాజుల గౌరి కథా సంపుటి 'మన్ను బువ్వ'లో కూలికి పోయి వచ్చిన తల్లి కట్టెలు, నీళ్లు, బియ్యం సమకూర్చి వండే పనిలో ఉంటే బిడ్డ ఆకలికి బువ్వ అందక మన్ను బుక్కి, నీళ్లు తాగి పడుకునే బాల్యాలు, దళితుల్లో, దళిత కులాలకున్న దాష్టీకాల్ని చెప్పే కథ. అత్యాచారానికి గురైన బిడ్డ భయాన్ని, బాధని దళిత 'తల్లి పానం ఉన్నదంటే మీద పడ్డ బురదను కడుక్కొని మంచిగ బతకొచ్చు. జిందగీని ఇడుసుకోకు' అని ప్రాణం పోయినా పర్వాలేదు. మానం పోవద్దు అని ఆధిపత్య పితృస్వామ్య విలువల్ని తృణీకరించే నీతిని బోధించి అంటరాని కులాల మానవ విలువల తత్వాన్ని ' కంచె' కథలో చెప్పింది జాజుల గౌరి.

గోగు శ్యామల –' ఏనుగంత తండ్రికన్నా ఏకుల బుట్టంత తల్లి నయం' కథా సంపుటిలో దళిత తల్లిదండ్రికన్నా మిన్నగా తన పిల్లలకు ప్రధాన పోషకురాలై ఉండే కథ. 'తాటకి' కథలో అత్యాచారం చేసే మగవాణ్ణి రెండు కాళ్ల మధ్యలో తన్ని పారిపోయి వచ్చే దళిత అమ్మాయి సాహస తత్వాన్ని చెప్పింది. 'రడం' కథలో మాదిగ ఆడపిల్లల్ని జోగిని చేసే కులం మతం ఆధిపత్యం అల్లికల ఉచ్చు ఊరిలో ఎట్లా ఏర్పాటు చేస్తారు అనీ అది మానని గాయంగా ఉంచే దుర్మార్గాన్ని వివరించింది. ఈ దళిత మహిళల మీద జరిగే బలవంతపు దాష్టీకం ఈ 'రడం'.

పుట్ల హేమలత –బాల కార్మికులుగా దళిత పిల్లలే ఎందుకు అవుతున్నారు. అనే ప్రశ్నతో బాల కార్మికుడి విషాద గాధని 'నూతిలో కప్ప' కథలో వివరించింది. ఎమ్ఎమ్.వినోదిని 'బ్లాక్ ఇంక్' కథా సంపుటిలో కులం, ఆచరణను ఆధిపత్య కులాలు, తమ పిల్లలకు ఇచ్చే సంస్కృతి వల్ల వారి పిల్లలు కూడా ఇతర పిల్లల భిన్న సంస్కృతి సంఘటనల్ని బ్లాక్ ఇంక్‌తో రాసుకుంటుంది. 'ఒక విలన్ ఆత్మహత్య' కథలో రైతులు, దళిత స్త్రీలను లైంగికంగా వేధిస్తూ కూలిని పెంచకుండా అమానవీయంగా ఉండే రైతులు చస్తే దళిత మహిళకు సంతోషమే, రైతులు దళిత మహిళలకు విలన్'లే అంటుంది.

జూపాక సుభద్ర –' రాయక్క మాన్యెం' కథా సంపుటిలో ఉద్యోగం చేసే దళిత మహిళలకు ఇండ్లు కిరాయికి దొరకని కుల నీతిని 'ఎన్నో పోరాటాలు చేసి మేము పగుల గొట్టిన ముంత, మల్లా మా మూతికి కడుతున్నట్లే ఉన్నది, అంటరాని తనాల బాధను 'శుద్ధి చేయాలి' కథలో చెప్పింది. కులాంతర వివాహాలు చేసుకునే దళిత మహిళలు గురవుతున్న విధ్వంసాన్ని చెప్పే కథ 'ఆదర్శ విధ్వంసం'. మాదిగల ఆశ్రిత కులమైన డక్కలి మహిళ తన హక్కుల్ని పంచాయతీ పెట్టి ఎట్లా సాధించుకుందో చెప్పే కథ ' రాయక్క మాన్యెం'.

వి. నాగమణి – 'మనువుగాడి పెండ్లి కథ'లో ఆసామి ఇంటిముందు నడుములిరిగే చాకిరీ చేసినా పిడికెడు మెతుకులు విదిల్చని అమానుషాన్ని, కళ్లు తిరిగి పడిపోయిన ఆకలి బాధను విముక్తి చేయాలంటే చదువుకోవడమే పరిష్కారం అని సూచించే కథ. చల్లపల్లి స్వరూపారాణి – 'వలస పిట్టలు' కథా సంపుటిలో దళిత మహిళల దయనీయ పరిస్థితిని, సామాజికంగా వారిపై జరిగే దాడుల్ని, అత్యాచారాల్ని, అన్యాయాల్ని విప్పి చెప్పిన కథ. భద్రం తల్లి కథలో దళిత బాలికల మీద జరిగే హింసలు, లైంగిక వేధింపుల మీద రాయడం జరిగింది.



ఎండ్లూరిమానస

ఎండ్లూరి మానస – 'మిళింద' కథా సంపుటిలో కొత్త నెత్తురుగా వచ్చిన భావజాలం కథలు. దళిత క్రిష్టియన్స్‌కి బొట్టు లేకుంటే... ఎట్లా చూస్తుంది హిందూ కుల సమాజం అనే వాస్తవాన్ని ఎండగట్టింది బొట్టు, దొంగబొట్టు అనే కథల్లో. ఇంకా 'మెర్సీ పరిశుద్ధ పరిణయం' కథలో ప్రియురాలు అత్యాచారానికి గురైన ప్రేమతో ఆ ప్రియురాలినే పెళ్లాడిన అద్భుత ప్రేమగా మలిచిన దళిత పరిశుద్ధ ఆత్మలో చెప్పింది.

యెండపల్లి భారతి 'ఎదర బతుకులు' కథా సంపుటిలో దళిత మహిళల సాంఘిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతికంగా గ్రామాల్లో శ్రమలో ఎట్లాంటి పరిస్థితుల్ని ఎదుర్కొంటున్నారనేది పూసలుగా, యీనెలు యీనెలుగా కథలు అల్లింది. కుటుంబాల్లో భర్త తాగుడు కోసం వున్నొక్క యిత్తడి బిందెలు, తలె ముంతలు అమ్ముకున్న 'ఇత్తలి బింది' గ్రామాల్లో ఆసామి కన్నుబడి అత్యాచారం చేసినా... నేను ఏమి చెప్పేది. చెపుకుంటే బగిసాట్లు కదా' అని కన్నేసిన ఆసాముల నుంచి తప్పించుకొని తిరిగే దళిత మహిళల అగచాట్లు 'అవ్వతలపులు' కథ. ' మా యిండ్లల్లో దుడ్డుకి కొదవేగానీ, ఆడదాని ఉసురుదీసే దానికి ఏమి కొదవలేదు. మొగోల్లకి మేము చేసి వేసిందాక నోటి కాడికి చెయ్యిపోదు' యింటి భారమంతా దళిత శ్రామిక కులాలే మొయ్యాలె. 'సచ్చిసాధించడం' కథ చదివితే.... దళిత ఆడోల్లకు జోగినీ, బసివి, బాల్య వివాహాల దురాచారాలే కాకుండా తొలుత మొగడికే తాళి తెంచాలనే దురాచారం బైటి ప్రపంచానికి తెలువది 'ఎవరు తొలీత బొట్టు కడితే వాడు కట్టిన తాళి వాడికే తెంపల్ల లేదంటే మీ కుటుంబానికి మంచిది కాదు. మారుమనువులు, యిడుపు కాయితాలు సర్వసాధారణం దళిత కులాల్లో, తెలంగాణలో మొదటి మొగనికే తాళి తెంచే ఆచారం లేదు. యిది రాయలసీమ అంతటా వుందా అనేది తెలియాల్సింది.



జూపాక సుభద్ర
9849905687

'దప్పి' కత మాదిగోల్లు ఆధిపత్య కులాల చేదబాయిని కూడా అంటకూడని నిషేధాలున్నాయని చెప్తది. కొడుకు బాయికాడికి బొయి నీల్లు తాగొస్తా అంటే... తల్లి 'వద్దు కొడుకా వాల్లు కాపోల్లు మనం వాల్ల బాయిని తాకితే మనల్ని దండిస్తార'ని వారిస్తుంది. అంటరాని దుర్మార్గాలు, దండనలు యింకా సజీవంగా వుండి సమసిపోనందుకు బాధైతది. టీవీలొచ్చి మానవ సంబంధాల్ని గూడెం ప్రేమల్ని కూడా ఎంత దెబ్బ తీసినయో ఎదారిన బతుకులుగా 'ఎడారి బతుకులు' కథలో విశ్లేషించింది రచయిత్రి యెండపల్లి భారతి. పల్లె మాదిగ మహిళల చుట్టూత ఆవరించిన ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక అంశాలను పల్లెమట్టి భాషలో, యాసలో ప్రధాన స్రవంతిలో కనబడని వినబడని కథలు 'ఎదారి బతుకులు' కథల సంపుటిలో యెలుగెత్తి చాటింది ఎండపల్లి భారతి.

కన్నారం ఝాన్సి 'గోటి దెబ్బ' కతలు, మేం మాదిగ 'మాప్టిపోష్వకతలు యీకుల సమాజాన్ని ఎదిరించి దెబ్బగొట్టే కతలు. అయితే దళిత మహిళల గురించి దళిత రచయితలు కూడా తమ రచనల్లో వెల్లడించారు. కొలకలూరి ఇనాక్ దళిత మహిళల గొప్పతనాల్ని, బలాల్ని, శక్తుల్ని, ఆత్మవిశ్వాసాల్ని మానవీయ విలువల్ని ' దట్టెం', 'కొలుపులు' వంటి అనేక కథల్లో ఆవిష్కరించాడు. యింకా బోయ జంగయ్య, నాగప్పగారి సుందర్రాజు, గుండెడప్పు కనకయ్య, మద్దూరి నగేష్ బాబు మొదలగు దళిత రచయితలు దళిత మహిళల జీవన చిత్రాల్ని ఆవిష్కరించారు. దళితేతరులైన ఆధిపత్య కుల రచయితలు, రచయిత్రులు కూడా దళిత మహిళల జీవితాన్ని చూసి రాసిన చలం 'మాదిగమ్మాయి', కరుణకుమార్ 'పాకామె', యిల్లందల సరస్వతీదేవి 'మెహర్తాని', 'గీతాంజలి' 'పహెచాన్' కథల సంపుటి వంటి కొద్దిమంది దళిత మహిళల మీద తమ అనుభవాల్ని, అన్ని రకాల అవమానాల్ని, అంటరాని తనాల్ని, వూరి ఆసామి, యింటి మగాధిపత్యాల్ని, శ్రమ దోపిడిని, అనేక సామాజిక హింసల్ని ఎదిరిస్తూ ... ప్రశ్నిస్తూ... తెలుగు కథా సాహిత్యానికి తన మహిళావాద తాత్వికతతో కొత్త వెలుగులు నింపుతుంది. రేపటి సాహిత్యాలు అట్టడుగు మహిళల సాహిత్యాలతో ప్రజాస్వామీకరించబడ్తాయి.

బాల సాహిత్య వికసనం

''మొగ్గలాంటి విద్యార్థులను వారి స్వీయ రచనలు, సేకరించిన రచనలు, విద్యావికాస కార్యక్రమాలకు సంబంధించి ఉపాధ్యాయ మార్గదర్శకత్వంలో విరబూసిన పువ్వులవలె వికసింపజేయాలి.'' ప్రస్తుత పరిస్థితులలో బాల సాహిత్య సృజనకారులు, బాలలు, ఉపాధ్యాయులు, సమాజం, ప్రభుత్వాలు, వివిధ స్వచ్ఛంధ సంస్థలపై మాటలను ఆచరించి బాలల అభ్యున్నతికి కృషి చేయాల్సిన అవసరం ఎంతో వుంది.

బాల సాహిత్యం – నిర్వచణం – పరిధి

''బాలల కోసం, వారి స్థాయికి అనుగుణమైన, వారి నిత్య జీవిత అంశాలతో పాటు ప్రతిభను పెంచి, అభ్యసనమును సైతం తోడ్పడే అంశాలు బాలల రచనలు బాల సాహిత్యాన్ని సృష్టించే పెద్దల రచనలంతా కలిసి బాల సాహిత్యమే అవుతుంది. అంటే దీనికి కేంద్రం బాలల జీవితం... బాల్య జీవితం.'' దీని పరిధిని ఆలోచించినప్పుడు విద్యార్థి తన పరిసరాలు, స్వీయ అనుభవాలు, అనుభూతులు చిన్ని చిన్ని మాటలలో రాయడంతో పాటు పాఠశాలలో ఉపాధ్యాయులు తమ పాఠ్య బోధనకు అనుబంధంగా సందర్భోచితంగా ఉన్ముఖీకరణ కోసం కొంత సాహిత్యాన్ని సృష్టించవలసి వుంటుంది. ప్రభుత్వ పరంగా పాఠ్య పుస్తకాల నిర్మాణంలో బాల సాహిత్య రచయితల సలహా ప్రకారం పాఠాలు, గేయాలు, కథలు, సంభాషణలు రూపొందించవలసి వుంటుంది. మరో అడుగు ముందుకు వేసి ప్రభుత్వం వివిధ స్థాయిలలో బాల సాహిత్యం గూర్చిన కార్యకలాపాలు నిర్వహించవలసిన అవసరం ఎంతైనా వుంది. బాల సాహిత్య రచయితలు ''బాలల జీవితం – సమాజం – సవాళ్ళను'' ప్రాతిపదికగా చేసుకొని రచనలు చేసినప్పుడే దీని లక్ష్యం నెరవేరుతుంది. బాల సాహిత్యం పాత్ర కేవలం పాఠశాలలోనే గాక వివిధ అనియత కేంద్రాలు, అనాథాశ్రమాలు, శిక్షణా సంస్థలు ఇండ్లల్లో అంతటా కొనసాగాల్సిన సామాజిక బాధ్యత గలది. దీనికి నిర్దేశిత లక్ష్యాలు. ఆ లక్ష్యాలను ప్రస్ఫుటించే లక్షణాలు, లక్ష్యాలు, లక్షణాలను బాలల్లో వివిధ దశలలో నిబిడీకృతం చేయడానికి తీసుకోవలిసిన చర్యలు అర్థవంతంగా ఉన్నప్పుడే బాలల మూర్తిమత్వ వికాసానికి బాలసాహిత్యం దోహదపడుతుంది. అవి స్వీయ అనుభూతి చెందేలా వుండాలి. అంటే స్వీయ అనుభవాలు రచనకు ఉపయోగపడుతాయి. గేయాలు, సంభాషణలు, కథలు, చిత్రకథలు, చిన్ని చిన్ని మాటలతో కూడిన వాక్యాలు, పెద్దలు, పిల్లల గూర్చి రాసిన పద్యాలు వేమన, సుమతి శతకంలోని పద్యాలు, నైతిక అంశాలు, కుటుంబబంధాలు, ధర్మాలు, మానవ సంబంధాలు, సాహసగాథలు, విజయగాథలు, పరిసరాలు, పర్యావరణము వంటి అంశాలు మెండుగా వుండాలి. అవన్నీ బాలల స్థాయికి, వారి ఆలోచనా సరళికి దగ్గరగా అనుగుణంగా వుండాలి. స్వీయ రచనలు, సేకరించినవి. ఉపాధ్యాయుల పర్యవేక్షణలో రూపుదిద్దుకున్నవి. బాల సాహిత్యం కవులు పిల్లల స్థాయికి దిగి అవగాహన అయ్యేవిధంగా రాసినదంతా బాలసాహిత్యమే అవుతాయి. స్ఫూర్తి కలిగించే అంశాలు, జ్ఞాన పరిధిని విస్తృతంచేసి అంశాలు వ్యక్తిత్వ వికాసాన్ని పెంచి దేశభక్తిని అలవరిచేవి ప్రధానంగా చెప్పాలి. ఈ లక్షణాలతో కూడిన సాహిత్యం ద్వారా బాలలకు సంబంధించి ఏయే లక్ష్యాలు సాధించవచ్చో ఒకసారి పరిశీలిస్తే. విద్యార్థులలో దాగి వున్న సృజనాత్మకతను బయటికి తీస్తుంది. నిత్య పాఠ్యాంశాల అభ్యసనం.

అభ్యాసములతో ప్రేరణ కలిగించి సులభ అవగాహనకు తోడ్పడుతుంది. పఠనాభిలాషను పెంపొందించి తెలుసుకోవాలనే జిజ్ఞాసను పెంచుతుంది. అభ్యసనం తగ్గిపోకుండా చూస్తూ, ఆత్మవిశ్వాసం పెంచుతుంది. భాషా పటిమను పెంపొందించి విస్తృత పఠనానికి తోడ్పడుతుంది. వైఖరులు, దృక్పథాలు, అలవాట్లు, భిన్న ధోరణులతో బాలలు పరిపక్వమవుతారు. సామాజిక స్పృహను పెంచి వివక్షతలు లేని సమభావాన్ని బాలలు అలవరచుకుంటారు. శాస్త్రీయ దృక్పథం, ప్రేమలు, బంధాలు బలపడతాయి. జనాభాలోమెజార్టీ భాగమైన బాలలు సాధించదగు ప్రయోజానాన్ని వివిధ లక్ష్యాల రూపంలో చెప్పుకున్నాము. ఈ లక్ష్య సాధనకు వివిధ దశల్లో కృషి జరిగినప్పుడే బాలలు నిజమైన రేపటి పౌరులవుతారు. ''బాలల కోసం – బాలల భవిత కోసం పెద్దలు '' అనే నినాదాన్ని నిత్యం మనసులో వుంచుకొని మనమంతా కొన్ని చర్యలు చేపట్టవలసిన అవసరం వుంది. అప్పుడే బాల సాహిత్యం సుసంపన్నమై తద్వారా బాలల లోకానికి సమాజానికి చేకూరే మేలు ఎనలేనిది. అందుకై వీలైన మేరకు పాఠశాలలు వారి పిల్లలు, ఉపాధ్యాయుల రచనలతో ''సంచిక'' తేవాలి. ఉపాధ్యాయులు పాఠ్యబోధకులుగానే గాక రచయితలుగా ఎదిగి ఎదిగించాలి.



వడ్డెపల్లి మల్లేశము
9014206412

ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రవర్తన, ఆలోచనా ధోరణులను పరిశీలించాలి. పాఠశాలల్లో ప్రత్యేక తెగల వారుంటే వారి భాషలో రచనలు ప్రోత్సహించాలి. వివిధ అంశాలిచ్చి విద్యార్థులకు సూచనల ద్వారా రచనలు చేయించాలి. రచనకు సంబంధించి ఆలోచన గల వారిని ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి ప్రోత్సహించాలి. పాఠశాల స్థాయిలో బాల కవి సమ్మేళనాలు ఏర్పాటు చేయాలి. వివిధ బాలల సంచికలు, పాత చందమామ, బొమ్మరిల్లు, కథలు, గేయాలను విద్యార్థులతో చర్చించాలి. ప్రోత్సాహానికి వల్లె వేయించాలి.

ప్రభుత్వస్థాయిలో జరగాల్సిన కృషి కూడా ఇక్కడ ప్రస్తావనార్హం. అందుకోసం మండలాలు వారి విద్యార్థుల రచనల సమీకకరణ, ప్రచురణకు ''సంపాదక– మండలు'లను ఏర్పాటు చేయాలి.

మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి చర్చాగోష్ఠులు, శిక్షణ, కవి సమ్మేళనాలు ఏర్పాటు చేయాలి. కవులు, రచయితలు, ఉపాధ్యాయవర్గంలోని పండితులు, ఆసక్తిగల ఉపాధ్యాయులకు, తరచుగా వివిధ స్థాయిల్లో శిక్షణలు, చర్చలు నిర్వహించాలి. జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో బాలల రచనలచే మాస, వార 'సంచికలు' తేవాలి. బాల సాహిత్య పరిపుష్టికి పాఠశాలలు, విద్యా సంస్థలకు నిధులివ్వాలి. వివిధ పాఠ్యాంశాలలో ప్రశ్నల ద్వారా ప్రోత్సహించి ఉత్సుకత రేకెత్తించే అంశాలుండాలి. హాస్యం, ప్రేమ వంటి రసాలుండాలి. జంతువులు, పక్షులు పాత్రలుంటే మంచిది. తెలుగు వాచకాలలో లయబద్ధ గేయాలు, సరళ భాషలో సంభాషణా రూపాలు హాస్యంగా వుంటే మంచిది. గత 60 ఏళ్ల క్రితం బొమ్మరిల్లు, చందమామ పత్రికలు పిల్లలు పెద్దలను చదివించి ఉత్తేజపరిచేవి. అవి నేడు లేవు. సరళమైన భాషలో అలాంటి పత్రికలు రావాలి. బాల సాహిత్య ప్రయోజనం బాలలకు, సమాజానికి దక్కాలంటే అందరం మెరుగైన కృషి చేయాల్సి వుంది.

నైష్పత్తిక సంక్షోభం

చిన్నోడా! దిగులెందుకు ?
నువ్వొక్కడివే కాదు
విశ్వమూ సగముంది నీలో.
ఆక్రోశంలోంచి పుట్టిన
యారోగెన్స్
ఒక అనారోగ్య దీపిక.
ఒత్తిడిని పెంచుకొని
నిష్పత్తి తెలియని అలమటింపు
నిత్యమూ సలిపే ఒక చారిక.
కష్టమే కావచ్చునది, కాదనను
కాని,మనమేసంక్లిష్టం
చేసుకున్న
వైచిత్రీ గీతమాలిక.
రెండుకళ్లు సరిగ్గా వుంటే
మూడో కన్ను ప్రసక్తి దేనికి ?
పాటఅంతానరాలమీదే
సాగదు,
ఎక్కడో ఒక రహస్య కుహరం
తెరుచుకుంటుంది.
దానిలోంచి
ఉదయమే బయటికొస్తుంది.
నిరాశకున్నంత ఆకర్షణ
నిఖిలజగత్తులోమరిదేనికీ లేదు.
ఘర్షణలోంచి
వజ్రాలుపుడతాయని
మరిచిపోతాం.
చిన్నోడా!
రంధి అక్కర్లేదు
సంధిప్రేలాపనలుఏదరికీ
చేర్చవు
నువ్వొక్కడివే కాదు
విశ్వం సగం నీలోనే వుంది.
నైష్పత్తిక సంక్షోభానికి
తెరదించకపోతే
బాష్పనదులు
మళ్లీ వెనక్కి ప్రవహిస్తాయి.
కలతలెందుకు
కలవరింతలెందుకు
అలవిగానిచలిలో
జగజలెందుకు
కాస్త ఎండపొడలోకి రా!
నడిచి పోతున్న
జనాన్నిమించినఅందమైన
దృశ్యం
మరోటి లేదు.
కాదనను
వ్యక్తి కేంద్రబిందువే
దాని చుట్టూ ప్రపంచం లేకపోతే
అది వొట్టి చుక్క,
కొన్నాళ్లకు అదీ మాసిపోతుంది.
నువ్వొక్కడివే కాదు
విశ్వమూ సగముందినీలో

–డా॥ ఎన్. గోపి

సకుటుంబం





ఇలలో వైకుంఠం శ్రీవిల్లిపుత్తూరు

ఇలలో శ్రీవైకుంఠంగా విరాజిల్లుతూ శ్రీమన్నారాయణుడు ''వటపత్రశాయిగా కొలువు తీరి ఉన్న పుణ్యధామం ''శ్రీవిల్లిపుత్తూరు. శ్రీగోదాదేవిచేత పూజలందుకున్న ప్రాచీన దివ్య క్షేత్రం ఇదే! గోదా మాత ఒకవైపు, వటపత్రశాయి మరోవైపు కొలువుదీరిన ఈ అపురూప మహిమాన్విత క్షేత్రం ఆద్యంతమూ ఆధ్యాత్మిక వాతావరణంలో అలరారుతోంది.

భగవంతుడు ఎప్పుడూ భక్తుల పాలిట పక్షపాతే. వజ్ర వైఢూర్యాలు, సిరి సంపదలు, హంగూ ఆర్భాటాలు ఇవేమీ భగవంతునికి అక్కర్లేదు. ఆ జగత్ పాలకుడికి కావల్సింది నిశ్చలమైన భక్తి, పరిపూర్ణమైన విశ్వాసం, అప్పుడే శ్రీవైకుంఠం నుంచి కూడా తరలి వచ్చి అనుగ్రహిస్తాడు. అక్కున చేర్చుకుని సేద తీరుస్తాడు. అలా తన నిశ్చలమైన భక్తితో సాక్షాత్తు శ్రీరంగనాథుడ్నే మెప్పించిన మహాభక్తురాలు గోదాదేవి. ఆండాళ్ గా పూజలందుకుంటున్న ఆ తల్లి ఆవిర్భవించిన పుణ్యధామమే 'శ్రీవిల్లిపుత్తూరు'. ఇలలో శ్రీవైకుంఠంగా విరాజిల్లుతూ శ్రీమన్నా రాయణుడు ''వటపత్రశాయిగా కొలువు తీరి ఉన్న పుణ్యధామం కూడా ఇదే.

తమిళనాడు రాష్ట్రం మదురై నగరానికి 74 కి.మీ దూరంలో ఉన్న ఈ దివ్య క్షేత్రం గోదాదేవి పాద స్పర్శతో, ఆమె శ్రీహరి భక్తితో పునీత మైంది. ఓ అపురూపమైన ఆధ్యాత్మికానందాన్ని సొంతం చేసే ఈ క్షేత్రానికి శ్రీవిల్లిపుత్తూరు అనే పేరు రావడానికి పురాణ గాథ ఒకటి ప్రచారంలో ఉంది.

పూర్వం ఈ ప్రాంతంలో విల్లిమరియ, పుట్టన అనే ఇరువురు వేటగాళ్ళు ఈ గ్రామాన్ని నిర్మించుకొని జీవించారు, వారి పేరుతోనే ఈ క్షేత్రానికి విల్లిపుత్తూరు అనే పేరువచ్చినట్లు, శ్రీమహావిష్ణువు ఇక్కడ కొలువుతీరడం వల్ల శ్రీవిల్లిపుత్తూరుగా పిలువ బడుతున్నట్లు స్థలపురాణం చెబుతోంది. శ్రీవిల్లిపుత్తూరులో ప్రసిద్ధమైన ఆలయాల్లో గోదాదేవి ఆలయం ఒకటి. అపురూప ఈ దివ్యాలయాన్ని 7వ శతాబ్దంలో వల్లభదేవ పాండ్యన్ అనే రాజు నిర్మించినట్లు చారిత్రక ఆధారాల ద్వారా తెలుస్తోంది. అనంతరకాలంలో ఈ ఆలయాన్ని తిరుమల నాయకర్, చొక్కప్పనాయకర్ అనే రాజులు అభివృద్ధి చేశారు. కాలాంతరంలో ఈ ఆలయంలో అనేక మార్పులు చేర్పులు జరిగినప్పటికీ, పురాతనత్వాన్ని చెక్కుచెదరకుండా మిగుల్చుకున్న ఆలయమిది. నిత్యం వేలాది మంది దర్శించుకునే ఈ ఆలయ ప్రాంగణం గోదాదేవి భక్తికి ప్రతీక నిదర్శనంగా దర్శనమిస్తుంది.

శ్రీవిల్లిపుత్తూరులో క్రీ.శ.725 లో శ్రీముకుందా చార్యులు పద్మావతి దంపతులు నివసించేవారు. వారికి భట్టనాధుడను అనే పుత్రుడు కలిగాడు. అతడు నిరంతరం విష్ణుమూర్తినే మనసులో ధ్యానిస్తూ ఉండడం వల్ల విష్ణుచిత్తుడు అనేపేరు వచ్చింది. విష్ణుచిత్తుడు స్వయంగా పూలమాలలను అల్లి, వటపత్రశాయికి అలంకరించి, ఆనందించేవాడు! ఒకనాడు గరుడవాహనమెక్కి, లక్ష్మీ నాథుడు ఆయనకు దర్శనమివ్వగా,ఆ సౌందర్యానికి ముగ్ధుడై, స్వామికి దృష్టి దోషం లేకుండా ఉండాలని, సహస్ర వర్షములు అలాగే వర్ధిల్లాలని, కోరుకుంటూ తిరుపల్లాండు పాడాడట! అప్పటినుంచీ ఆయనకు పెరియాళ్వారు అంటే పెద్ద ఆళ్వారు అనే పేరు వచ్చింది. అలాగే, శ్రీవిష్ణుచిత్తుడు ఒక రోజున తోటలో పూలు కోస్తూండగా, తులసీవనంలో దివ్యతేజస్సుతో ప్రకాశిస్తున్న ఒక ఆడపిల్ల దొరికింది. ఆయన ఎంతో సంతోషించి,సీతాదేవియే తన ఇంటికి వచ్చినట్లుగా భావించి, ఆ పాపకి కోదై అనే పేరు పెట్టి, అల్లారు ముద్దుగా పెంచాడు. ఆ కోదై పేరు క్రమంగా గోదాగా స్థిరపడింది. తమిళంలో కోదై అంటే పూలమాలని అర్థం చెబుతారు.

ఆ శిశువు పెరిగి పెద్దదవుతూ శ్రీరంగనాథుడ్ని అమితంగా ప్రేమించేది. శ్రీరంగనాథుడే తన ప్రత్యక్ష దైవమని, ఎప్పటికైనా ఆ స్వామిని చేరాలని ఆకాంక్షించేది. రోజూ పుష్ప హారాలను చేసి ముందుగా తన మెడలో ధరించి,ఆ తర్వాత స్వామివారి కైంకర్యానికి పంపించేది. స్వామిని ఎప్పటికైనా వివాహమాడాలని తలచేది. ఎప్పుడూ స్వామి సేవలో తరిస్తూ గడిపేది. ఆమె వయస్సు పెరుగుతున్నకొద్దీ స్వామిపై భక్తి విశ్వాసాలు పెరిగాయి. భక్తిని మాలగా అల్లి సువాసన భరిత పుష్పాలతో ఆ శ్రీహరిని సేవించి ముక్తి పొందవచ్చని తలచి తిరుప్పావై ప్రబంధాన్ని రచించి ఆండాళ్ గా ప్రసిద్ధిచెందింది. ఇందులో 30 పాశురాలున్నాయి. ఆ పాశురాలను భక్తితో గానామృతం చేసి, తన భక్తిప్రపత్తులను చాటుకుని, స్వామిని వివాహమాడి చివరికి శ్రీరంగనాథునిలోనే ఐక్యమైంది.



గోదాదేవి ఆవిర్భవించిన స్థలంగా చెప్పబడుతున్న ఈ ప్రాంగణంలో నిర్మించిన దివ్యాలయమే శ్రీవిల్లిపుత్తూరు శ్రీ గోదాదేవి ఆలయం. మహిమాన్వితమైన ఈ దివ్యాలయ ప్రాంగణంలో గోదాదేవి దొరికిన తులసీవనం ఇప్పటికీ భక్తులకు దర్శనమిస్తుంది. ఈ తులసీవనంలోనే అమ్మవారి గుర్తుగా ఓ చిన్న మందిరాన్ని నిర్మించి పూజిస్తున్నారు.ఆకట్టుకునే పరిసరాల మధ్య శోభాయమానంగా ఉన్న ఈ ప్రాంగణంలో తులసీ వనం ఉంది. ఈ వనంలోనే అమ్మవారు ఓ శిశువుగా విష్ణుచిత్తునికి దొరికిందని ఇక్కడి స్థల పురాణాలు చెబుతున్నాయి. దీనికి సమీపంలోనే ఓ మండపాన్ని నిర్మించారు. ఈ మండపానికి ఆనుకుని ఉన్న మందిరంలో గోదాదేవి కొలువుదీరారు. ఆలయ బయట ప్రాకారంలో గజలక్ష్మి , ఆంజనేయ మందిరాలున్నాయి.

ప్రధానాలయ ప్రాంగణం అద్భుత శిల్ప రాజాలతో అలరారుతోంది. అఘోర వీరభద్ర, సరస్వతి, శ్రీరాముడు, లక్ష్మణుడు, వేణుగోపాల స్వామి, విశ్వకర్మ, రంభ, ఊర్వశి, జలంధర్, మోహినీ అవతారం, మన్మధుడు, రతి, ఊర్ధ్వవీర భద్ర తదితర అద్భుత శిల్పరాజాలు చూపరుల దృష్టిని మరలనీయవు. అలనాటి శిల్పుల పనితనానికి నిదర్శనంగా ఇవి దర్శనమిస్తాయి.

గోదాదేవి అమ్మవారి ప్రధానాలయ ప్రాంగణం విశాలమైనది. ఈ ప్రాంగణం లోపలి ప్రాకారంలో ఎడమవైపు లక్ష్మీనారాయణ పెరుమాళ్ మందిరం ఉంది. దీనికి సమీపంలో ఆండాళ్ పూజా మంటపం ఉంది. ప్రధానాలయ లోపల ప్రాకారం కేరళ సంప్రదాయ రీతిలో ఉంది. అమ్మవారి ఆలయానికి ముందు మణిగన్, సుముఖన్, సేనై ఇముదల్వార్‌ల చిన్ని మందిరాలున్నాయి.

అమ్మవారి గర్భాలయం బయట ప్రాకారంలో తిరుప్పావై పాశురాలకు చెందిన మనోహరమైన చిత్రాలున్నాయి. ఇవన్నీ భక్తులలో భక్తి భావా న్ని ప్రోదిచేస్తాయి. గర్భాలయం వెలుపల ఓ పురాతన బావి ఉంది. అమ్మవారు రోజూ ఈ బావిలోనే తన ముఖారవిందాన్ని చూసుకొనేదంటారు. బావిలోని నీరు ఎప్పటికీ తరగదు. బావి నీటిని 'దర్పణ తీర్థం'గా భావిస్తారు.
ఇదే ప్రాంగణంలో ఊంజల్ మంటపం కూడా దర్శనమిస్తుంది.

గర్భాలయంలో రంగమన్నార్ దర్శనమిస్తారు. స్వామికి దక్షిణ భాగంలో ఆండాళ్ అమ్మవారు, ఉత్తర భాగంలో గరుత్మంతుడు కొలువుదీరి ఉన్నారు. శ్రీవిల్లిపుత్తూరు గోదాదేవి అమ్మవారిని దర్శించుకునే కన్యలకు వివాహ యోగం, అలాగే సాక్షాత్తు ఆ శ్రీమన్నారాయణుడి సాక్షాత్కారం కలుగుతుందంటారు. ఇక్కడ అమ్మవారిని, స్వామివార్లను తులసీదళాలతో, పుష్పహారాలతోనూ సేవిస్తే ఐశ్వర్యవృద్ధి కలిగి, కోర్కెలు సిద్ధిస్తాయంటారు.

అలాగే వివాహం కాని కన్యలు ఇక్కడ ధనుర్మాస వ్రతాన్ని ఆచరిస్తే, వెంటనే వివాహం జరిగి, సౌభాగ్యసిద్ధి కలుగుతుందంటారు.

గోదాదేవి అమ్మవారి ఆలయానికి సమీపంలో వటపత్రశాయి మందిరం ఉంది. విశాలమైన ఆలయ ప్రాంగణం అత్యంత ఎత్తయిన రాజగోపురంతో ఈ ఆలయం అలరారుతోంది. ఈ గోపురం 11 అంతస్థులతో కూడి 192 అడుగుల ఎత్తులో ఉంటుంది. తమిళనాడులో ఉన్నఆలయాల గోపురాలకెల్లా వటపత్రశాయి ఆలయ రాజగోపురం పెద్దది. అలాగే తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వచిహ్నంగా ఈ ఆలయరాజ గోపురం విరాజిల్లుతోంది.

వటపత్ర శాయి ఆలయానికి సంబంధించి పురాణ గాథ ఒకటి ప్రచారంలో ఉంది. పూర్వం భూమండలం అంతా జలరాశిలో మునిగిపోయి ఉండగా, దాన్ని ఉద్ధరించడానికై శ్రీహరి వటపత్రశాయియై నీటిపైన తేలియాడిన ప్రాంతం ఇదేనని ఇక్కడ స్థల పురాణాలు చెబుతున్నాయి. అలాగే భూమి జలరాశి నుంచి బయటపడిన తరువాత, స్వామి ఆ రూపంలోనే స్వయంభువుగా వెలిశాడని ఈ క్షేత్రం స్థలపురాణం చెబుతోంది.

వటపత్రశాయి ఆలయంలో పెరియాళ్వార్, నమ్మాళ్వారుల విగ్రహాలతో పాటు లక్ష్మీనరసింహ, గరుత్మంతుడు తదితర మూర్తులున్నాయి. గర్భాలయంలో వటపత్ర శాయి దర్శనం పూర్వ జన్మల పుణ్యఫలం.

ఉత్సవాలు, పండుగలు ఈ ఆలయంలో ఏటా ధనుర్మాస ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహిస్తారు. ధనుర్మాసం చివరి రోజున గోదాదేవి కళ్యాణం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. లక్షలాది మంది భక్తులు తరలివస్తారు. ఆయా రోజుల్లో అమ్మవారిని వివిధ వాహనాల్లో ఊరేగిస్తారు.

రవాణ సదుపాయం: శ్రీవిల్లిపుత్తూరు మదురై నగరానికి 74 కి.మీ దూరంలో ఉంది. మదురై, తిరునల్వేలి, విరూద్ నగర్ తదితర ప్రాంతాల నుంచి, ప్రభుత్వ, ప్రయివేటు బస్సులు శ్రీవిల్లిపుత్తూరుకు అందుబాటులో ఉన్నాయి. అలాగే శ్రీవిల్లిపుత్తూరుకు రైల్వే స్టేషన్ కూడా ఉంది. విమానం ద్వారా వచ్చేవారు మదురై వరకు వచ్చి అక్కడ నుంచి ఏదైనా వాహనంలో రావచ్చు.

భోజన, వసతి సదుపాయాలు: శ్రీవిల్లిపుత్తూరులో భోజన వసతి సదుపాయాలకు కొదువ లేదు. అయితే రద్దీ ఎక్కువగా ఉండే రోజుల్లో ఎవరికి వారు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకోవాల్సిన అవసరం ఉంది.



భాగ్యాల భోగి

భోగి పండుగ అనేది ఇటు తెలంగాణలోనూ, అటు ఆంధ్రులు జరుపుకునే ఒక ముఖ్యమైన పండుగ. ఆంధ్రులు పెద్ద పండుగగా జరుపుకునే మూడు రోజుల సంక్రాంతి పండుగలో మొదటిరోజును భోగి అంటారు. దక్షిణాయనంలో సూర్యుడు రోజు రోజుకి భూమికి దక్షిణం వైపుగా కొద్ది కొద్దిగా దూరమవుతూ దక్షిణ అర్ధగోళంలో భూమికి దూరం కావటం వల్ల భూమిపై బాగా చలి పెరుగుతుంది. ఈ చలి వాతావరణాన్ని తట్టుకునేందుకు ప్రజలు వేడి కోసం చలి మంటలు వేసుకునేవారు, ఉత్తరాయణం ముందురోజుకి చలి విపరీతంగా పెరగడం ఈ చలిని తట్టుకునేందుకు మంటలు అందరు వేయటం వల్ల ఈ రోజుకు భోగి అనే పేరు వచ్చింది.

సంక్రమణ మహాపర్వానికి ముందు రోజుకి ఒక ప్రాధాన్యం ఉంది. దీనికి భోగిపర్వం అని పేరు. అయితే భోగము అనే మాటకు అర్థం ఏమిటంటే అనుభవము అని. ఆనందంగా దేనిని పొందుతామో దానిని భోగము అనాలి. అలాంటి భోగములు అనుభవించవలసిన రోజుని భోగి అంటారు. కానీ ఏది లభిస్తే మరి ఇంకేదీ కావాలని అనిపించదో, ఏది పరిపూర్ణమైన ఆనందమో అదే నిజమైన భోగం. అలాంటి భోగం యోగం వల్లనే లభిస్తుంది. అందుకే యోగులే భోగులు కాగలరు. అలాంటి దివ్య భోగం ఈరోజున గోదాదేవి ఆండాళ్ళమ్మ పొందింది. రంగనాథుని అనుగ్రహాన్ని పొందింది. రంగనాథుని సాంగత్యం అనబడే ఆ కైవల్యానందం అనే భోగాన్ని అమ్మ పొందింది కనుక ఈరోజు భోగి అనే పేరు భక్తి సంప్రదాయం పరంగా నిర్వచించేవారు చెబుతారు. సరిగ్గా ఈ రోజుతో ధనుర్మాసం పూర్తి అవుతోంది. ఈ ధనుర్మాస వ్రతమంతా ఈరోజు పూర్తయి దాని ఫలితంగా అమ్మవారు స్వామి అనుగ్రహాన్ని పొందినట్లు పెద్దలు చెబుతారు.







హరిహరసుత అయ్యప్ప

శరణాగతి ఆధ్యాత్మిక భక్తి మార్గమే అయ్యప్ప తత్వం. శబరిమలై యాత్ర చేసి, అయ్యప్పను సేవించి , మకర జ్యోతి సందర్శనంతో మాలాధారణ చేసి దీక్ష వహించిన అయ్యప్ప భక్తులు జీవితం ధన్యమయ్యిందని సంభావిస్తే, మాల ధరించని భక్తులు జీవితంలో ఒక్కసారైన ఈ మహిమాన్విత క్షేత్రాన్ని సందర్శించాలని ఆశిస్తారు. భక్తుల కష్టాలను, కలతలను దూరం చేసి, వారిని సన్మార్గం వైపు మళ్ళించే యాత్రే శబరిమల లేదా శబరిమలై యాత్ర. ఇది కేరళ రాష్ట్రం పశ్చిమ కనుమల్లో నెలకొని ఉంది. సహ్యాద్రి పర్వత శ్రేణులలో నెలకొని ఉన్న ఈ దివ్య క్షేత్రం సముద్ర మట్టం నుంచి సుమారు 3000 అడుగుల ఎత్తులో దట్టమైన అడవులు 18 కొండల మధ్య అలరారుతోంది. దేశ వ్యాప్తంగా భక్తులున్న ఈ క్షేత్రానికి దీక్ష వహించిన కోట్లాది మంది అయ్యప్ప భక్తులు ఏటా నవంబరు నుంచి జనవరి వరకు ఇక్కడికి వచ్చి తమ దీక్షను విరమిస్తుంటారు.

అయ్య అంటే విష్ణువు,అప్ప అంటే శివుడని అర్థం చెబుతారు. స్వామి హరిహర సంగమ స్వరూపం కావడం వల్ల అయ్యప్ప అని పిలుచుకుంటున్నారు. మహిషి అనే రాక్షసిని అంతమొందించడానికి స్వామి శబరిమలలో వెలసినట్లు స్థల పురాణాలు చెబుతున్నాయి.

ఈ దేవాలయం 1935 వరకు తిరువాంకూరు మహారాజా సంస్థానంవారి ఆధీనంలో ఉండేది. 1935లో దీనిని తిరువాంకూరూ దేవస్థానం బోర్డువారికి అప్పగించారు. ఆ తరువాత భక్తుల సంఖ్య గణనీయంగా పెరగడంతో జ్యోతి దర్శనానికే కాకుండా మండల పూజ కూడా శబరిమలలో దేవాలయం తెరిచే సౌలభ్యాన్ని కల్పించారు. అయితే 1980వ దశకం నుంచి శబరిమలకు వచ్చే భక్తులు పెరగడంతో పంబపై వంతెనతో పాటు పంబ నుంచి విద్యుద్దీపాలు, మంచి నీటి కుళాయిలు, స్వాముల విశ్రాంతి కోసం షెడ్లు నిర్మించారు.



భక్తులు పంబానదిలో స్నానం చేసి 'ఇరుముడి'ని తలపై పెట్టుకొని అయ్యప్ప శరణు ఘోషతో 'నీలిమలై' అనే కొండ మార్గం ద్వారా ప్రయాణిస్తారు. తొలిసారి దీక్ష వహించిన కన్నెస్వాములు తమతో తెచ్చిన ఒక బాణాన్ని దారిలో 'శరమ్ గుత్తి' అనే చోట ఉంచుతారు. ఇక్కడినుండి అయ్యప్ప సన్నిధానానికి ఒక కిలోమీటరు దూరం ఉంటుంది. సన్నిధానం వద్ద ఉన్న 18 మెట్లను 'పదునెట్టాంబడి' అంటారు. 40 రోజులు దీక్ష తీసుకొని ఇరుముడి ధరించినవారు మాత్రమే ఈ మెట్లు ఎక్కేందుకు అర్హత కలిగి ఉంటారని కథనం. ఒక్కో మెట్టుకు ఒక్కో అధిష్టాన దేవత ఉంటుంది. సన్నిధానానికి, 18 మెట్లకు నమస్కరిస్తూ స్తోత్రాలు పఠిస్తూ మెట్లను ఎక్కుతారు. సన్నిధానంలో 'పానవట్టం' పైన అయ్యప్ప కూర్చుని ఉన్న భంగిమలో దర్శనమిస్తాడు. అయ్యప్ప స్వామి కూర్చున్న తీరు శివలింగాన్ని తలపిస్తుంది. ఒంపు తిరిగిన ఎడమచేయి మోహిని అవతారాన్ని తెలియజేస్తుందని చెబుతారు.

మకర సంక్రాంతి రోజు స్వామి వారికి ఆభరణాలు ధరింపచేశాకనే మకర జ్యోతిని దర్శించుకునే భాగ్యం కలుగుతుంది. శబరికొండ నుంచి నీలకల్ ప్రాంతం వరకు లక్షలాది భక్తులు కిటకిటలాడుతూ ఉంటారు. పందళ మహారాజు చెక్కపెట్టెల్లో ఉన్న ఆభరణాలను కోవెలకు తెస్తారు. ఆ మూడు పెట్టెల్లో ఒకటి ధర్మశాస్త్ర సన్నిధికి, మిగతా రెండు మాలికపురత్తమ్మ సన్నిధికి తీసుకువెళతారు. సాయంకాలం ఆరున్నర ప్రాంతంలో సాధారణంగా సన్నిధానానికి తూర్పు దిక్కున మకర జ్యోతి కనిపిస్తుంది. ఆ తరువాత కొద్ది క్షణాల్లోనే పొన్నంబలం మేడు నుంచి మకర జ్యోతి తేజోవంతంగా కనిపిస్తుంది. కలువ పువ్వులా కనిపించే ఈ జ్యోతి మూడు సార్లు దర్శనమిస్తుంది. భక్తులు జ్యోతి దర్శనంతో భవ బంధ విమోచనం జరిగి, జన్మ ధన్యమైనట్లుగా ఆనంద పరవశులై భక్తి తాదాత్మ్యం చెందుతారు.

ఇది ధర్మశాస్త్ర అవతారమని, బ్రహ్మ చర్య దీక్ష ఆజన్మాంతం వహిస్తానని అయ్యప్ప అనిన మాలికపురుత్తమ వినదు. మాలికపురుత్తమ్మ దేవతగా, నాతోపాటు పూజలందుకుంటూ ఉంటూ ప్రతి యేటా మొదటిసారి దీక్ష వహించి నా కోసం కన్నె స్వాములు భక్తిగా వస్తారు. ఏ ఒక్క కన్నె స్వామిరాని సంవత్సరం నిన్ను పెళ్లాడతానంటాడు అయ్యప్ప. కన్నె స్వాములు అయ్యప్ప దర్శనం కోసం వచ్చిన గుర్తుగా మాలికాపురుత్తమ్మ గుడిచుట్టు కొబ్బరికాయలు దొర్లించే ఆచారం నేటికి ఉంది. ఆ తరువాత అయ్యప్ప భక్తులు వల్లి పెరియార్ మార్గం ద్వారా తిరుగు ప్రయాణం చేస్తారు. మకర సంక్రాంతి మరుసటిరోజు మాలికపురుత్తమ్మ తనను వివాహం చేసుకొమ్మని అయ్యప్పను అడగడానికి ఏనుగు మీద వస్తుంది. భక్తజనం ఈ దృశ్యాన్ని చూస్తారు. శరంగుత్తిలో కన్నె స్వాములు గుచ్చిన శరాలను చూచి కళ్యాణ యోగం ఈ ఏడాది కూడాలేదని పదునెట్టాంబడి మీదుగా తిరిగి వెళ్తుంది. మాలికాపురుత్తమ్మ ను ఆలయానికి తీసుకువెళుతూ ఏనుగు కన్నీరు కారుస్తుందట. దీనిని ఓ పెద్ద ఉత్సవంగా పాటిస్తారు. శబరిమలలో మకర జ్యోతి తరువాత ప్రతి మలయాళ నెలలో ఐదు రోజుల పాటు ఆలయాన్ని తెరచి ఉంచుతారు. మిగతా అన్ని రోజుల్లోనూ గుడిని మూసే ఉంచుతారు.

దాసరి దుర్గా ప్రసాద్

ఓటర్ స్లిప్‌ల కోసం 'టిఇ పోల్' మొబైల్ యాప్



మన తెలంగాణ / హైదరాబాద్ : త్వరలో జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో ఓటర్లు వారి ఓటుహక్కును వినియోగించుకోడానికి ఆన్‌లైన్ ద్వారానే ఓటర్ స్లిప్‌ను పొందే సౌకర్యాన్ని రాష్ట్ర ఎన్నికల సంఘం తీసుకొచ్చింది. 'టిఇ పోల్' పేరుతో మొబైల్ యాప్‌ను రూపొందించిన ఎన్నికల సంఘం ఓటర్లు వారి ఫోటో గుర్తింపు కార్డు నెంబర్‌ను ఇచ్చిన తర్వాత ఏ పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకోవాలో తెలియజేయడంతో పాటు దాన్ని ప్రింట్ తీసుకునే సౌకర్యం కల్పించింది. ప్రస్తుతానికి ఆండ్రాయిడ్ ఆధారిత మొబైల్ ఫోన్లకు మాత్రమే ఈ సౌకర్యాన్ని కల్పించినా త్వరలో ఐ ఫోన్‌లకు ఉపయోగపడే యాప్‌ను కూడా విడుదల చేయనున్నట్లు ఎన్నికల సంఘం కార్యదర్శి అశోక్‌కుమార్ తెలిపారు. ఎన్నికల సంఘం ఇచ్చే ఓటరు స్లిప్ లాగానే ఈ యాప్ ద్వారా డౌన్‌లోడ్ చేసి ప్రింట్ తీసుకునే స్లిప్ ఉంటుందని వివరించారు. రాష్ట్రంలోని మొత్తం ముప్పై జిల్లాల సమాచారాన్ని, ఓటర్ల జాబితా వివరాలను ఈ యాప్‌లో పొందుపర్చినందున నిర్దిష్టంగా పోలింగ్ కేంద్రం వివరంతో సహా అన్నీ తెలుస్తాయని పేర్కొన్నారు. ఈ సౌకర్యం కేవలం పంచాయతీ ఎన్నికలకు మాత్రమేనని తెలిపారు.

ఎన్నికల్లో కేజ్రీవాల్ పోటీ చేయబోరు : ఆప్

లక్నో : ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ రానున్న లోక్‌సభ ఎన్నికల్లో వారణాశి నుంచి పోటీ చేయబోరని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) తెలిపింది. ఇతర స్థానాల నుంచి కూడా ఎన్నికల బరిలో ఆయన నిలవరని స్పష్టం చేసింది. అయితే, వారణాశి స్థానంలో తమ పార్టీ నుంచి ఓ బలమైన అభ్యర్థిని నిలబెడతామని చెప్పింది. ప్రస్తుతం ఆ నియోజకవర్గానికి ప్రధాని నరేంద్ర మోదీ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో ఈ స్థానం ఆయనపై పోటీ చేసిన కేజ్రీవాల్ ఓడిపోయిన విషయం తెలిసిందే. ఆదివారం ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ మీడియాతో మాట్లాడుతూ... 'రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కేజ్రీవాల్ పోటీ చేయరు. ఆయన పూర్తిగా ఢిల్లీ అభివృద్ధిపైనే దృష్టి పెట్టనున్నారు. మా పార్టీ ఢిల్లీ, పంజాబ్, హరియాణా, గోవా రాష్ట్రాల్లో అన్ని లోక్‌సభ స్థానాల్లోనూ పోటీ చేస్తుంది. ఉత్తర్‌ప్రదేశ్‌లో కొన్ని స్థానాల్లో బరిలోకి దిగుతుంది. వారణాశితో పాటు యూపీ ఉత్తర, తూర్పు స్థానాల్లో మా పార్టీ బలంగా ఉంది. మా పార్టీ లోక్‌సభ ప్రణాళికలపై అన్ని విషయాలు ఫిబ్రవరీలో తెలుస్తాయి' అని తెలిపారు.

మైనర్ బాలిక గ్యాంగ్ రేప్

(మొదటిపేజీ తరువాయి)







డిమాండ్ చేశారు. వివరాలలోకి వెళితే... దూద్‌బౌలి, గొల్లకిడికీ ప్రాంతానికి చెందిన 16 ఏళ్ల మైనర్ బాలికకు బావ (అత్తమ కుమారుడు) అయిన అబిడ్స్‌లోని జగదీష్ మార్కెట్లో సెల్‌ఫోన్ల వ్యాపారం చేసే రాజేష్ మహేశ్వరి (36) మాయమాటలు చెప్పి లోబరుచుకున్నాడు. ఇంట్లో ఎవ్వరు లేని సమయంలో బాలికకు కూల్ డ్రింక్‌లో మత్తుమందు ఇచ్చి ఆమెపై అత్యాచారం చేశాడు. ఆ సమయంలో వీడియోను చిత్రీకరించాడు. ఈ విధంగా బాలికపై తరచు అత్యాచారం చేస్తూ వస్తున్నాడు. ఈ క్రమంలో ఇతడు తీసిన నీలి చిత్రాన్ని స్థానికంగా ఉండే జిలేబి వ్యాపారం చేసే మిత్రులు శుభం వ్యాస్ (25), అభిజిత్ కౌశిక్ (23)లకు పంపించాడు. ఈ వీడియోను చూసిన వారు మరికొంత మంది మిత్రులతో కలిసి మైనర్ బాలికను బెదిరిస్తూ మూడు సంవత్సరాలుగా ఆమెపై అఘాయిత్యానికి పాల్పడుతున్నారు. అంతేకాకుండా తమ కమవాంఛ తీర్చకపోతే బాలిక తండ్రి, సోదరుడిని రోడ్డు ప్రమాదంలో చంపేస్తామని బెదిరించారు. వీరి వేధింపులతో విసిగిన బాలిక విషయాన్ని గత నెల 23న కుటుంబ సభ్యులకు వివరించింది. దీంతో వారు గత నెల 24న కామాటిపురా పోలీసుస్టేషన్‌కు చేరుకొని రాజేష్ మహేశ్వరి, శుభం వ్యాస్, అభిజిత్ కౌశిక్‌లపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ముగ్గురిపై కేసు నమోదు చేసి గత 31న రిమాండ్‌కు తరలించారు. తీవ్ర మానసిక వత్తిడికి లోనైన బాలిక క్రమేణ కోలుకుంటూ పాత విషయాలను గుర్తు చేసుకొని మరి కొందరు నిందితుల పేర్లు తెలిపింది. కాగా నిందితుడైన విజయ కుమార్‌ను ఈ కేసులో పోలీసులు సాక్షిగా చేర్చారు. విచారణలో సాక్షిగా ఉన్న విజయ కుమార్ కూడా ఒక నిందితుడని తదుపరి విచారణలో తేలింది. విషయం తెలుసుకున్న బాధితురాలి బంధువులు మురళీనగర్‌లో ఆందోళనకు దిగారు. మహిళలు ప్లకార్డుతో ఆందోళనకు దిగారు. నాల్గోవ నిందితుడు విజయ కుమార్‌ను అదుపులోకి తీసుకోవాలని, ఈ కేసుతో సంబంధం ఉన్న మరికొంత మందిని కూడా అదుపులోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమాచారం అందుకున్న అదనపు డీసీపీ సయ్యద్ రఫీక్, ఇంచార్జ్ ఏసీపీ ఆనంద్, ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌లు అక్కడికి చేరుకొని ఆందోళన చేస్తున్న వారితో చర్చించారు. విచారణ జరిపి నిందితులపై కేసు నమోదు చేస్తామని హామి ఇచ్చారు. అంతేకాకుండా భరోసా కేంద్రం నుంచి మహిళా ఇన్‌స్పెక్టర్ రుక్మిణి, సైకాలజిస్టు కృష్ణవేణిని రప్పించి బాధితురాలిని మరోసారి విచారించారు. ఆమె నుంచి వాంగ్మూలం తీసుకొని రికార్డు చేశారు. కేసుతో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరిపై కేసు నమోదు చేస్తామన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

నిందితులను కఠినంగా శిక్షిస్తాం

మైనర్ బాలికపై అత్యాచారం జరిపిన వ్యక్తులను ఎట్టి పరిస్థితుల్లోను విడిచి పెట్టేది లేదని, వారిని కఠినంగా శిక్షిస్తామని చార్మినార్ ఏసీపీ అంజయ్య స్పష్టం చేశారు. గత నెల 24న బాలిక స్టేషన్‌కు వచ్చినపుడు ముగ్గురు నిందితుల పేర్లు మాత్రమే తన ఫిర్యాదులో పేర్కొందని, ఆ తరువాత ఆమెను భరోసా సెంటర్‌కు తరలించి విచారించినా ఆ ముగ్గురు పేర్లు మాత్రమే వెల్లడించినట్లు వివరించారు. నాల్గవ నిందితుడుగా చెబుతున్న విజయ కుమార్‌ను సాక్షిగా బాధితురాలి కుటుంబ సభ్యులే తీసుకువచ్చినట్లు స్పష్టం చేశారు. స్టేషన్ ఎస్సై విచారణలో సాక్షి కూడా నిందితుడని తేలిందన్నారు. ఈ విషయం బాధితురాలి కుటుంబ సభ్యులకు తెలపటంతో వారు అతనిని కూడా అరెస్టు చేయాలని ఆందోళన చేశారని, సమగ్ర విచారణలో మరికొంత మంది నింధుతులు తేలే అవకాశం ఉందన్నారు.

ఏకగ్రీవాల హవా

(మొదటిపేజీ తరువాయి)

జిల్లాలో 21, రంగారెడ్డిలో 16, వికారాబాద్‌లో 32, మేడ్చల్‌లో 04, వరంగల్‌లో అర్బన్‌లో 10, రూరల్‌లో 51, మహబూబాబాద్ జిల్లాలో 34, భూపాలపల్లిలో 25, జనగాం జిల్లాలో 18 చొప్పున పంచాయతీలకు సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవమైంది. అయితే నామినేషన్ల ఉపసంహరణ తరువాత ఒకే నామినేషన్ వచ్చిన పంచాయతీల జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం ఇంకా ప్రకటించలేదు. నర్సంపేట నియోజకవర్గంలో ఏకగ్రీవమైన సర్పంచ్‌లను స్థానిక ఎంఎల్‌ఎ పెద్ది సుదర్శన్ రెడ్డి అభినందించారు. గ్రామ ప్రజల ద్వారా ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డ సర్పంచ్‌లు ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ, గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఇదిలా ఉండగా రెండో విడతలో 4135 పంచాయతీలకు సర్పంచ్ పదవికి, 36,602 వార్డులకు ఆదివారంతూ నామినేషన్ దాఖలుకు గడువు ముగిసింది. ఈ నెల 14వ తేదీన నామినేషన్ల పరిశీలన జరగనుంది. ఈ నెల 17వ తేదీ వరకు రెండో విడతకు నామినేషన్ ఉపసంహరణకు గడువు ఉంది.

ధరణి వచ్చేసింది

- అందుబాటులోకి భూముల తాజా సమాచారం
- త్వరలో పూర్తి స్థాయిలో రిజిస్ట్రేషన్లు కూడా
- పైలట్ ప్రాజెక్టుగా పరిగి, వికారాబాద్, నకిరేకల్‌లో అమలు
- తహసీల్దార్లు, రిజిస్ట్రార్లకు శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం

మన తెలంగాణ/హైదరాబాద్ : ఎంతో కాలంగా సాంకేతిక ఇబ్బంది పెట్టిన 'ధరణి' వెబ్‌సైట్ ఎట్టకేలకు సిద్ధమైంది. భూములకు సంబంధించిన తాజా సమాచారం చూసుకునేందుకు ఆదివారం నుంచి ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్ తదితర అవసరాలకు ప్రస్తుతానికి వెబ్‌సైట్ సిద్ధంకాకపోయినా ప్రజలు వారి భూములకు సంబంధించిన సమస్త సమాచారాన్ని తెలుసుకోడానికి మాత్రం వీలు కలిగింది. రాష్ట్రంలోని మొత్తం 31 జిల్లాల వారీగా డివిజన్, మండలం, గ్రామాల్లోని భూములకు సంబంధించిన వివరాలు ఈ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం వికారాబాద్, పరిగి, నకిరేకల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లకు సంబంధించిన ప్రక్రియ పైలట్ ప్రాతిపదికన జరుగుతున్నందున త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అమలులోకి తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. దశలవారీగా పూర్తిస్థాయిలో ఈ వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెచ్చే పనులు ఊపందుకున్నాయి. సాంకేతిక ఇబ్బందులన్నీ తొలిగిపోయాయి. 2017 సెప్టెంబరు నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమైన భూరికార్డుల ప్రక్షాళనలో భాగంగా మొత్తం 2.38 కోట్ల ఎకరాలకు సంబంధించిన దస్త్రాలను పరిశీలించిన రెవెన్యూ అధికారులు 2.25 కోట్ల ఎకరాల రికార్డులను సరిచేశారు. వివాదాస్పద భూములు, అటవీ, దేవాదాయ, కోర్టు కేసులు, అన్నదమ్ముల పంచాయతీలు, సరిహద్దు వివాదాలు, సివిల్ తగాదాలు, నిషేధిత జాబితా (22 ఏ)లో ఉన్న 12.71 లక్షల ఎకరా భూములను పార్ట్ బిలో చేర్చింది. ఎప్పటికప్పుడు భూములకు సంబంధించిన సమాచారం తెలుసుకునేలా ఈ వెబ్‌సైట్‌ను ప్రభుత్వం తయారు చేయించింది. దీనికోసం తెలంగాణ రాష్ట్రంలోని 11,200 రెవెన్యూ గ్రామాల్లోని 10,250 రికార్డులను ఇప్పటికే డిజిటలైజ్ చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సేత్వారి, డిజిటలైజేషన్ విలేజ్ మ్యాపులను సర్వే సెటిల్‌మెంట్, భూ రికార్డుల శాఖ సిద్ధం చేసి ప్రభుత్వానికి అందజేసింది.

'ధరణి' వెబ్‌సైట్ పనితీరుపై సంతృప్తి

గత శుక్రవారం వికారాబాద్ జిల్లా పరిగి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి భూముల రిజిస్ట్రేషన్లు, మార్పులు చేర్పులు, మ్యుటేషన్ తదితర అంశాలను స్వయంగా రెవిన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారి, సిసిఎల్‌ఏ (భూ పరిపాలనాశాఖ చీఫ్ కమిషనర్) వాకాటి కరుణలు పరిశీలించారు. 'ధరణి' వెబ్‌సైట్ పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. పైలట్ ప్రాజెక్టుగా నకిరేకల్, పరిగి, వికారాబాద్ జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టుగా ధరణి వెబ్‌సైట్ ప్రవేశపెట్టారు. ఇక్కడ వచ్చే ఫలితాల ఆధారంగా రాష్ట్ర వ్యాప్తంగా ధరణి వెబ్‌సైట్ ఆధారంగా రిజిస్ట్రేషన్‌లు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. భూ రికార్డుల ప్రక్షాళన తరువాత దాదాపు 93 శాతం రికార్డుల వివరాలను సక్రమంగా ఉన్నట్టు రెవెన్యూ శాఖ నిర్ధారించడంతో ఇక ఎప్పటికీ ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉండే విధంగా మార్పులు, చేర్పులు జరిగినా వెంటనే పట్టాదారు పాస్‌బుక్‌లో కూడా మారే విధంగా ధరణి వెబ్‌సైట్ ఉపయోగపడుతుంది. దీని తయారీని ఐఎల్‌ఎఫ్ఎస్ అనే ప్రైవేటు సంస్థకు సాఫ్ట్‌వేర్ తయారీ బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. ఆ విధంగా తయారైన వెబ్‌సైట్ ప్రకారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మాత్రమే కాకుండా తహసీల్దార్ కార్యాలయంలోనూ రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు, బదిలీలు తదితర ప్రక్రియలపై అధ్యయనం చేయగా క్షేత్రస్థాయిలో బ్యాండ్‌విడ్త్ సమస్యలు, ఇంటర్నెట్ స్పీడ్‌తో మరికొన్ని సమస్యలు, పాస్‌వర్డ్‌ను యాక్సెస్ చేయడంలో ఇబ్బందులు, సర్వర్‌లో నిక్షిప్తం కాకపోవడం, మార్పులు చేర్పులు జరిగినప్పుడు ఎక్కువ సమయం తీసుకోవడం, చిన్న మార్పు కోసం పదేపదే ఆప్షన్లను అడగడం, ఇలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తడంతో వాటిని పరిష్కరించడానికి దాదాపు ఏడాది కాలం పట్టింది.

భూ రికార్డుల ప్రక్షాళన జరిగినందున

గతంలో మాభూమి వెబ్‌సైట్‌లో హైదరాబాద్ పరిసర జిల్లాలకు సంబంధించిన సేత్వార్, నక్షా (మ్యాప్) వివరాలు అందుబాటులో ఉండేవి. ప్రస్తుతం కేవలం భూముల ప్రాథమిక సమాచారం మాత్రమే ఉండేది. భూ రికార్డుల ప్రక్షాళన జరిగినందున కొత్తగా భూములు కొనేవారికి సిసిఎల్‌ఏ సమాచారంతో నిజమైన పట్టాదారులు ఎవరూ? హక్కుల విషయంలో న్యాయపరమైన చిక్కులు ఏమైనా ఉన్నాయా ? తెలుసుకునే వీలుంది. వివాదాలుంటే ఆ భూముల వివరాలు అందుబాటులో ఉండవని సిసిఎల్‌ఏ అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుత సమాచారం చూసుకొని అందులో ఏమైనా తప్పులుంటే రైతులు, యజమానులు సరిచేసుకునేందుకు రెవెన్యూ అధికారులను సంప్రదించేందుకు వీలు కలుగుతుంది. తద్వారా భూముల రికార్డులను ఎప్పటికప్పుడు వివాదారహితంగా తప్పులు లేకుండా చూసుకునేందుకు వీలుకలుగుతుందని రెవెన్యూ అధికారులు పేర్కొంటున్నారు.

మూడుచోట్ల పైలట్ ప్రాజెక్టుగా

స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్ చిరంజీవులు



ధరణి వెబ్‌సైట్‌లో ప్రస్తుతం భూముల సమాచారాన్ని తెలుసుకోవచ్చు. సర్వే నెంబర్ ఎంటర్ చేయగానే భూములకు సంబంధించిన వివరాలు అందులో కనబడతాయి. రిజిస్ట్రేషన్, రెవెన్యూ అనుసంధానం మాడ్యుల్ ఇంకా అందుబాటులోకి రావాల్సి ఉంది. ఇప్పటికే మూడుచోట్ల పైలట్ ప్రాజెక్టుగా ధరణిని అమలు చేస్తున్నాం. అక్కడ విజయవంతం అయిన తరువాత రాష్ట్ర వ్యాప్తంగా రిజిస్ట్రేషన్లను ప్రారంభిస్తాం. దీనికోసం రిజిస్ట్రార్లకు, తహసీల్దార్లకు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది.

అదనంగా 56 కొత్త రైళ్ళు

- ప్రత్యేక సర్వీసులు 147 నుంచి 203కు పెంపు
- చివరి నిమిషంలోనూ ప్రయాణానికి తగిన ఏర్పాట్లు

మన తెలంగాణ / హైదరాబాద్ : సంక్రాంతి పండుగను దృష్టిలో ఉంచుకొని దక్షిణ మధ్య రైల్వే ఇప్పటివరకు కొత్తగా ప్రవేశపెట్టిన 147 ప్రత్యేక రైలు సర్వీసులకు అదనంగా మరో 56 రైళ్ళను కూడా ప్రకటించింది. రద్దీ ఎక్కువగా ఉండడంతో సర్వీసుల సంఖ్యను పెంచాల్సి వచ్చినట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు వివరించారు. అయినా రద్దీ ఎక్కువగానే ఉండొచ్చని అంచనా వేసి చివరి ప్రయాణికులకు సైతం ప్రయాణ సౌకర్యంకలిగే విధంగా తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 25వ తేదీ వరకు ప్రత్యేక రైలు సర్వీసులు నడుస్తాయని అధికారులు తెలిపారు. తెలుగు రాష్ట్రాల ప్రజలు సంక్రాంతి కోసం తమ సొంత గ్రామాలకు వెళ్తుంటారని, విద్యా సంస్థలకు సెలవులు మంజూరు కావడంతో కూడా చాలా మంది ప్రయాణిస్తుంటారని, రద్దీ విపరీతంగా పెరుగుతుందని భావించే ప్రత్యేక రైలు సర్వీసులను నడుపుతున్నట్లు వివరించారు. రానున్న పది రోజుల్లో ఈ సంఖ్య మరింత పెరిగి పెరుగుతుందని, అందులో భాగంగానే అదనంగా 56 ప్రత్యేక రైలు సర్వీసులను వేయాల్సి వచ్చిందని, మొత్తం ఈ సంక్రాంతి సెలవులకు మొత్తం 203 సర్వీసులు నడుస్తాయని వివరించారు. హైదరాబాద్, సికింద్రాబాద్‌ల నుంచి విజయవాడ, రాజమండ్రి, కాకినాడ, విశాఖపట్నం, విజయనగరం, తిరుపతి తదితర పట్టణాలకు ఈ ప్రత్యేక సర్వీసులను నడుపుతున్నట్లు తెలిపారు. చివరి నిమిషంలో ప్రయాణం చేయాలనుకునే వారి కోసం 'జన్ సాధారణ్' రైళ్లను కూడా నడుపుతున్నట్లు తెలిపారు.



ప్రత్యేక రైళ్లకు సంబంధించిన ముఖ్యాంశాలు

- రిజర్వేషన్ అవసరం లేకుండా 60 జన సాధారణ్ రైళ్లను ఏర్పాటు చేశారు. ఈ రైళ్లల్లో బస్ టికెట్ కంటే చౌక ధరలకు ప్రయాణం సాగించేలా ఏర్పాట్లు చేశారు. చివరి నిమి షంలో ప్రయాణం చేయాలనుకునే వారికి అనుకూలంగా ఉండేందుకు జన సాధారణ్ రైళ్లల్లో మాములుగా నడిచే ఎక్స్‌ప్రెస్ రైళ్ల ఛార్జీలు వర్తించేలా చర్యలు తీసుకున్నారు.
- సువిధ ప్రత్యేక రైళ్లతో సహా అన్ని ప్రత్యేక రైళ్లకు రెండవ తరగతి సాధారణ బోగీలను ఏర్పాటు చేసి మాముళు ఎక్స్‌ప్రెస్ రైళ్ల ఛార్జీలతో నడుపుతున్నారు.
- పండుగ సమయంలో సాధారణ టికెట్లు కొనే ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని అన్ని ప్రధాన రైల్ స్టేషన్లలో అదనపు బుకింగ్ కౌంటర్లను ఏర్పాటు చేశారు.
- ప్రయాణికులు అన్ రిజర్వుడ్ టికెట్లు కొనడానికి ఆటోమెటిక్ టికెట్ వెండింగ్ మిషన్లను (ఎటివిఎంలు), కరెన్సీ అపరేటెడ్ వెండింగ్ మిషన్లను (కోటివిఎంలు)తో పాటు జన సాధారణ్ టికెట్ బుకింగ్ సేవక్ (జెటిబిఎస్) కౌంటర్లను కూడా ఉపయోగించుకునే అవకాశాన్ని కల్పించారు.
- ప్రధానమైన రైల్వే స్టేషన్ల వద్ద ప్రత్యేక రైళ్లు, వాటి గమ్యస్థానాలతో పాటు బయలుదేరే సమయాలను సమగ్రంగా తెలిసేలా సమాచార బోర్డులను ఏర్పాటు చేశారు.
- ప్రత్యేక రైళ్ల గురించి తెలిపే ఎలక్ట్రానిక్ డిస్‌ప్లే బోర్డులను స్టేషన్ల వద్ద ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.
- అనధికారికంగా స్టేషన్లలోకి ప్రవేశించే అసాంఘిక శక్తులపై ప్రత్యేకమైన నిఘాను ఏర్పాటు చేసి భద్రతను కట్టుదిట్టం చేశారు.
- స్టేషన్ల వద్ద రైలు వినియోగదారులను నియంత్రించడం, కోచ్‌లలో ప్రయాణికులు ప్రవేశించేటప్పుడు క్రమ పద్ధతిని పాటించేలా రైల్వే రక్షక దళ సిబ్బందిని నియమించినట్లు అధికారులు తెలిపారు. దీంతో పాటు నడిచే రైళ్లల్లో కూడా భద్రత సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రయాణికులకు ఇబ్బంది కలగ కుండా ఉండేందుకు నిత్యం ఎప్పటికప్పుడూ ఉన్నతాధికారులు కూడా పర్యవేక్షించనున్నారు. దీంతో పాటు కేటరింగ్ ఏర్పాట్లను కూడా పటిష్టం చేసినట్లు చెప్పారు.
- సమయానుకూలంగా రైలు నడిచేలా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఇందుకోసం ప్రయాణికులంతా ముందుగానే స్టేషన్లకు చేరుకోవడం వల్ల ప్రయాణాన్ని మరింత సౌకర్య వంతం చేసుకోవచ్చని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకొని తక్కువ లగేజీతో వెళ్లాలని కూడా సూచించారు.
- టికెట్ల కొనుగోలుకు సంబంధించి ప్రయాణికులు అనధికార ఏజెంట్లు, దళారులు, మధ్యవర్తులను సంప్రదించవచ్చని కోరారు.


రెండు దశల్లో రీజినల్ రింగ్ రోడ్డు

- జాతీయ రహదారులుగా గుర్తించిన ఎన్‌హెచ్ఏఐ
- సంగారెడ్డి నుంచి చౌటుప్పల్ రహదారికి 168 ఏఏ నెంబర్ కేటాయింపు
- మరో రహదారికి త్వరలో నంబర్
- ఆర్ఆర్ఆర్ నిర్మాణానికి గ్రీన్‌ఫీల్డ్ భూముల సేకరణకు అధికారుల నిర్ణయం

మన తెలంగాణ/హైదరాబాద్ : రీజనల్ రింగ్ రోడ్డు మార్గాన్ని రెండు దశల్లో నిర్మించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ రెండు రహదారులను ఇప్పటికే జాతీయ రహదారులుగా ఎన్‌హెచ్ఏఐ గుర్తించింది. ఈ రోడ్డు నిర్మాణానికి గ్రీన్‌ఫీల్డ్ భూములను సేకరించాలని ఎన్‌హెచ్ఏఐ అధికారులకు సూచించింది. ఇప్పటికే రీజనల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డిపిఆర్) పనుల విషయమై సిఎం కెసిఆర్ కూడా ఆరాతీశారు. వారంరోజుల్లో డిపిఆర్ పనులు కూడా పూర్తికానున్నట్టు సమాచారం. ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఉమ్మడి జిల్లాలైన మెదక్, రంగారెడ్డి, నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాలకు వెళ్లే ప్రయాణికులు ట్రాఫిక్‌లో చిక్కుకోకుండా మార్గం సుగమం చేయాలన్న కృతనిశ్చయంతో ప్రభుత్వం ఆలోచిస్తోంది. అంతర్జాతీయ ప్రమాణాలతో దీనిని నిర్మించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రణాళికలు రూపొందించాయి. రీజనల్ రింగ్‌రోడ్డు (ఆర్ఆర్ఆర్) భూ సేకరణలో ప్రాజెక్టుకు అవసరమయ్యే వ్యయాన్ని తెలంగాణ ప్రభుత్వం భరించనున్నట్టు కేంద్రానికి ఓ లేఖ రాసినట్టు అధికారులు పేర్కొంటున్నారు. అందులో భాగంగా 12వేల ఎకరాల భూసేకరణకు రూ.3వేల కోట్లు ఖర్చు కానుండగా అందులో రూ.1,500 కోట్లు భరిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కేంద్రానికి తెలిపింది. ప్రాజెక్టు వ్యయం రూ.12 వేల కోట్లు కాగా, అందులో కేంద్రం వాటా కింద రూ.10,500 కోట్లు చెల్లించనున్నట్టు అధికారులు పేర్కొంటున్నారు.

భూ సేకరణకు రూ.2,500 నుంచి రూ.3,000 కోట్ల వ్యయం

రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణంలో భూసేకరణ అత్యంత కీలకమైన ప్రక్రియగా ప్రభుత్వం పేర్కొంటుంది. మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.12 వేల కోట్లు కాగా అందులో భూ సేకరణకు దాదాపు రూ.2,500 నుంచి రూ.3,000 కోట్లు వ్యయం కానుంది. ఈ ప్రాజెక్టు కోసం నిర్మించేది అత్యంత అధునాతనమైన ఎక్స్‌ప్రెస్ హైవే కాబట్టి రహదారికి ఎక్కడా మలుపులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనికోసం ఇప్పటికే అందుబాటులో ఉన్న రోడ్డును కాకుండా మొత్తం గ్రీన్ ఫీల్డ్ భూములను తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. చౌటుప్పల్ నుంచి షాద్‌నగర్ వరకు గ్రీన్‌ఫీల్డ్ భూములను అధికారులు గుర్తించినట్టు తెలిసింది. ఎన్‌హెచ్ఏఐ సూచన మేరకు అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. హైదరాబాద్‌కు 50 కి.మీల దూరంలో, ఔటర్ రింగ్‌రోడ్డుకు 30 కి.మీల దూరంలో నిర్మించనున్న ఈ రహదారి అందుబాటులోకి వస్తే భవిష్యత్తులో ఎదురయ్యే ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి. ఆరు వరుసల్లో నిర్మించే రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి 11 నుంచి 12 వేల ఎకరాల భూమి అవసరమవుతుందని అధికారులు గుర్తించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఇప్పటికే డిపిఆర్ పనులు వేగంగా జరుగుతున్నాయి. భూసేకరణలో న్యాయ, సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ప్రాజెక్టు సాఫీగా సాగిపోయేలా అధికారులు ప్రణాళికలు రూపొందించారు.



వీలైనంత త్వరగా భూమిని సేకరించి..

ఇప్పటికే సంగారెడ్డి నుంచి చౌటుప్పల్ వరకు ఉన్న రహదారి (154 కి.మీ) ఎన్‌హెచ్ఏఐ నోటిఫై చేసి 168 ఏఏ నంబర్‌ను కేటాయించింది. ఇక చౌటుప్పల్ కంది (180 కి.మీ) రహదారిని జాతీయ రహదారిగా గుర్తించినప్పటికి దీనికి నంబర్‌ను కేటాయించలేదని అధికారులు పేర్కొంటు న్నారు. ఇటీవల జగిత్యాల ఖమ్మం వరకు ఉన్న రోడ్డును విస్తరించి జాతీయ రహదారిగా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనకు ఎన్‌హెచ్ఏఐ కూడా ఆమోదించి నోటిఫై చేసి 563 నంబర్‌ను కేటాయించింది. దీనికోసం పలుచోట్ల మిషన్ భగీరథ పైపులు అడ్డు తగలడంతో పాటు మరికొన్ని చోట్ల ఒకవైపే భూమిని సేకరిస్తున్నారంటూ బాధితులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై కోర్టులో కేసు వేశారు. మొత్తానికి భూ సేకరణ నిలిచిపోవడంతో పలు అవాంతరాల మధ్య ఈ ప్రాజెక్టు నిలిచిపోయింది. ఎన్‌హెచ్ 563 ప్రాజెక్టు అర్థంతరంగా నిలిచిపోయిన నేపథ్యంలో అధికారులు రీజనల్ రింగ్ రోడ్డు విషయంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా డిపిఆర్ (సమగ్ర ప్రాజెక్టు నివేదిక) దశలోనే అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. తూప్రాన్, గజ్వేల్, జగదేవ్‌పూర్, తుర్కపల్లి, భువనగిరి, పోచంపల్లి, చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపూర్, యాచారం, కడ్తాల్, షాద్‌నగర్, పరిగి, పూడూరు, చేవెళ్ల, శంకర్‌పల్లి మండలాల మీదుగా ఆర్ఆర్ఆర్ (రీజనల్ రింగ్‌రోడ్డు) ప్రాజెక్టును తీసుకెళ్లనున్నారు. వీలైనంత త్వరగా భూమిని సేకరించి ఎన్‌హెచ్ఏఐకి అప్పగిస్తే వారు రోడ్డు నిర్మాణం మొదలు పెడతారు.



ఘనంగా మర్రి చెన్నారెడ్డి శతజయంతి

హాజరైన పలువురు రాజకీయ ప్రముఖులు

మన తెలంగాణ/హైదరాబాద్ : మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత మర్రి చెన్నారెడ్డి శత జయంతి వేడుకలు ఆదివారం నగరంలో ఘనంగా జరిగాయి. ఇందిరాపార్కులోని మర్రి చెన్నారెడ్డి మెమోరియల్ రాక్ గార్డెన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య, శాసనమండలి మాజీ చైర్మన్ చక్రపాణి, జస్టిస్ సుభాష్‌రెడ్డి, టిపిసిసి చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, బిజెపి నాయకుడు, ఎంపి దత్తాత్రేయ, మాజీ కేంద్ర మంత్రి జైపాల్‌రెడ్డి, మాజీ మంత్రి గీతారెడ్డి, తెలంగాణ జన సమితి అధ్యక్షుడు కోదండరామ్, మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్‌రావు, ఎంఎల్‌ఎ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఎంఎల్‌సిలు షబ్బీర్‌అలీ, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, ఎంపిలు నంది ఎల్లయ్య, కొండా విశ్వేశర్‌రెడ్డి, మాజీ మంత్రి డికె. సమరసింహారెడ్డి, మర్రి శశిధర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో పాటు టి. సుబ్బిరామిరెడ్డి, మాజీ స్పీకర్ సురేష్‌రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్ రెడ్డి, మాజీ హోంశాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి తదితరులు హాజరయ్యారు. మర్రి చెన్నారెడ్డి సేవలను వారు కొనియాడారు. ఆయన అతిపెద్ద ప్రజా స్వామ్యవాది అని ప్రశంసించారు. చెన్నారెడ్డి ఒక స్టేట్‌మెన్, విజన్ ఉన్న నాయకుడుగా అభివర్ణించారు. ఆయన వ్యక్తిత్వాన్ని నేటి రాజకీయ నాయకులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఒక మాట ఇస్తే, దాని కోసం ఎంతకైనా తెగించే తత్వం మర్రి చెన్నారెడ్డిది అని అన్నారు. ఆయన సుదీర్ఘ కాలంలో రాజకీయాల్లో కొనసాగినప్పటికీ అందరి వాడుగా మిగిలిపోయాడని వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన పాత్ర మరవలేనిదన్నారు. ఆయన చేసిన పోరాటలను పుస్తకరూపంలో తీసుకరావాల్సిన అవసరముందని పలువురు నాయకులు వ్యాఖ్యానించారు.

గాంధీభవన్‌లో : గాంధీభవన్‌లో మర్రి చెన్నారెడ్డికి పలువురు కాంగ్రెస్ నాయకులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పిసిసి అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణలో పుట్టిన మహానేత చెన్నారెడ్డి అని అన్నారు. ప్రజాస్వామ్య, పారదర్శక రాజకీయాలకు చెన్నారెడ్డి ప్రతిరూపం అని కొనియాడారు. ఆయన లేని లోటు తెలంగాణలో తీర్చలేనిదని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు అంజన్‌కుమర్‌యాదవ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

అక్కారం మహిళకు అరుదైన ఆపరేషన్

గర్భసంచి నుంచి నాలుగున్నర కిలోల గడ్డ తొలగింపు



మన తెలంగాణ/గజ్వేల్ : సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలంలోని అక్కారం గ్రామానికి చెందిన భూలక్ష్మి అనే మహిళ గత ఏడాది కాలంగా తీవ్రమైన రక్త స్రావం, కడుపు నొప్పి బాధను అనుభవిస్తోంది. ఎప్పటికప్పుడు తాత్కాలిక ఉపశమనం కోసం మందులు తీసుకుంటు వస్తోంది కానీ శాశ్వతంగా ఆమె అనారోగ్యానికి అసలు కారణం తెలియకుండానే చికిత్సలు కొనసాగాయి. ఇటీవల ఆమె కడుపు నొప్పితో పాటు రక్త స్రావం అధికం కావటంతో ఆదివారం గజ్వేల్ పట్టణంలోని ఈశ్వర సాయి ఆసుపత్రిలో చేరింది. ఆసుపత్రి సర్జన్ డాక్టర్ ఎలిశాల లింగం భూలక్ష్మిని క్షుణ్ణంగా పరీక్షించి స్కానింగ్ చేశారు. దాంతో ఆమె గర్భ సంచిలో సుమారు నాలుగున్నర కిలోల గడ్డ ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. భూలక్ష్మి అనారోగ్యానికి అసలు కారణం గుర్తించిన వైద్యులు వెంటనే గర్భ సంచిని ఆపరేషన్ చేసి పెద్ద సైజులో ఉన్న గడ్డను తొలగించారు. సుమారు నాలుగున్నర కిలోల గడ్డ ఆమె గర్భ సంచి నుంచి తొలగించటానికి సుమారు గంటన్నర పాటు ఆపరేషన్ చేయాల్సి వచ్చిందని డా.లింగం తెలిపారు. ఈ గడ్డను తొలగించటంతో ఇకనుంచి ఆమె ఆరోగ్యంగా ఉంటుందని, ఇప్పటిదాకా ఉన్న ఆమె బాధ శాశ్వతంగా తొలగిపోయినట్లేనని డా. లింగం తెలిపారు.

భారత్ – చైనా సరిహద్దు వెంబడి 44 వ్యూహాత్మక రోడ్లు

న్యూఢిల్లీ : భారత్ – చైనా సరిహద్దుల వెంబడి 44 వ్యూహాత్మక రహదారులతో పాటు పాకిస్థాన్‌కు ఆనుకుని పంజాబ్, రాజస్థాన్ సరిహద్దుల్లో 2100 కి.మీ పైగా వ్యూహాత్మకమైన రోడ్లను ప్రభుత్వం నిర్మించనుంది. 2018–19 సంవత్సరానికి సెంట్రల్ పబ్లిక్ వర్క్ డిపార్ట్‌మెంట్ (సిపిడబ్ల్యుడి) తన నివేదికలో ఈ వివరాలు వెల్లడించింది. సంఘర్షణ సమయంలో భద్రతా బలగాలను వెంటనే సరిహద్దుల్లో మోహరించేందుకు ఈ రోడ్ల నిర్మాణం చేపట్టనుంది. భారత్–చైనా సరిహద్దుల వెంట జమ్మూకశ్మీర్ హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్‌లలో 4000 కి. మీ. పొడవైన రోడ్లను నిర్మించనున్నట్లు సిపిడబ్ల్యుడి నివేదిక తెలిపింది. ఇందుకు గానూ అంచనా వ్యయం రూ. 21040 కోట్లు వెచ్చించనుంది. పాకిస్తాన్ సరిహద్దుల వెంట రూ.5,400 కోట్ల అంచనా వ్యయంతో రోడ్లను నిర్మించనున్నట్లు ఆ నివేదిక వెల్లడించింది. ఈ రోడ్ల నిర్మాణంతో రాజస్థాన్, పంజాబ్ మారుమూల సరిహద్దులు సురక్షితమవుతాయని పేర్కొంది.

పండుగ పేరుతో ప్రైవేటు బస్సుల దోపిడీ


మన తెలంగాణ / హైదరాబాద్ : సంకాంత్రి పండుగ ప్రయాణం ప్రజలకు భారంగా మారింది. ప్రజా రవాణా వ్యవస్థే కాదు ప్రైవేటు వాహనాలు, ఏజన్సీలు, అద్దె కార్లు ఇలా ఎంత వీలైతే అంత ఎక్కువ ఛార్జీలు వసూలు చేస్తూ ప్రజలను నిలువునా దోచేస్తున్నాయి. ప్రజలకు అంతిమంగా ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. పండుగ సమయంలో సరదాగా, సంతోషంగా గడుపుదామన్న ఉద్దేశంతో ఊర్లకు ప్రయాణమైతే ఇంటి నుంచి బైటకు రావడంతోనే వారికి కష్టాలు మొదలయ్యాయి. నగరంలోని ఎంజిబిఎస్, దిల్‌సుఖ్‌నగర్, ఎల్‌బినగర్, కూకట్‌పల్లి, జూబ్లి బస్ స్టేషన్... ఇలా చాలా చోట్ల ప్రయాణీకులకు బస్సు ఛార్జీలు చుక్కలు చూపిస్తున్నాయి. ఇంటిల్లిపాదీ ప్రయాణానికి వేల రూపాయలు ఖర్చవుతున్నాయని మొత్తుకుంటున్నారు. ఆర్టీసీతో పాటు రైల్వే కూడా సాధారణంగా కంటే 50 శాతం అధికంగా వసూలు చేస్తున్నాయి. ప్రైవేటు బస్సులు చార్జీలను మూడింతలు పెంచేశాయి. నల్గొండకు రూ. 160, కోదాడకు రూ.250 విజయవాడకు రూ.300 నుంచి 400 రూపాయలుండగా ఇప్పుడు పండుగ రద్దీ పేరుతో నల్గొండకు రూ.300, కోదాడకు రూ.500 విజయవాడకు డిమాండ్‌ను బట్టి రూ.1000 వరకు వసూలు చేస్తున్నాయి. ప్రైవేటు బస్సులు, క్యాబ్ సర్వీసులు రూ. 300 ధరను రూ. 1500, రూ. 2000కు పెంచేశాయి. విశాఖపట్నం, విజయనగరం, కాకినాడలాంటి దూర ప్రాంతాలకు ప్రైవేటు బస్సుల్లో టికెట్ ధర మూడున్నర వేలకు పెరిగింది. ఇక ప్రైవేటు కార్లకు అద్దెకు తీసుకుంటే డ్రైవర్ బత్తా, పెట్రోల్, డిజీల్‌తో పాటు కార్ల అద్దెను కూడా కలుపుకుంటే భారం తడిసిమోపడవుతోంది.



తెలంగాణ రొయ్యనా.. మజాకా!

- కొత్త ఒరవడిని సృష్టించిన మత్స్యశాఖ
- 24 రిజర్వాయర్లలో 3.19 కోట్ల రొయ్యల పెంపకం
- పైలట్ ప్రాజెక్టులో రూ. 1 కోటితో లాభం రూ.8 కోట్లు పైనే





మన తెలంగాణ/హైదరాబాద్ : రొయ్యల పెంపకంలో రాష్ట్ర మత్స్యశాఖ కొత్త ఒరవడిని సృష్టించింది. తెలంగాణ రొయ్యలకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడంతో పాటు మత్స్యకారులకు లాభలు తెచ్చిపెడుతున్నాయి. ముఖ్యంగా నీలకంఠ రొయ్యలు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. అందులో భాగంగానే పైలట్ ప్రాజెక్టులో భాగంగా 2017 ఆఖరులో 11 రిజర్వాయర్లలో రూ. ఒక కోటి పెట్టుబడితో 1.08 కోట్ల రొయ్యల పెంపకం చేపట్టగా మత్స్యకారులకు ఏకంగా రూ.8 కోట్ల పైన లాభాలు వచ్చాయి. దాదాపు 350 టన్నుల వరకు ఉత్పత్తి వచ్చింది. 12 వేల మంది మత్స్యకారులకు ఏడింతల పైన లాభం సమకూరింది. అదే ఊపుతో మత్స్యశాఖ 2018 నవంబర్‌లో 24 రిజర్వాయర్లలో 3.19 కోట్ల రొయ్య పిల్లలను వదిలింది. ఇందులో శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో 1.25 కోట్ల రొయ్య పిల్లలను వదిలింది. ఆ తరువాత స్థానంలో కరీంనగర్‌లోని ఎల్‌ఎమ్‌డి రిజర్వాయర్‌లో 29.50 లక్షలు, సంగారెడ్డి సింగూరు ప్రాజెక్టులో 28.09 లక్షలు, శ్రీపాద ఎల్లంపల్లి రిజర్వాయర్‌లో 29.15 లక్షలు, రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మిడ్‌మానేరులో 17.64 లక్షల రొయ్య పిల్లలను వదిలారు. మరో మూడు నెలల్లో ఇవి పెద్దవి కానున్నాయి. గత పైలట్‌లో భాగంగా ఒక్క కరీంనగర్ జిల్లాలోని ఎల్‌ఎమ్‌డి రిజర్వాయర్‌లో రూ.33.92 లక్షల ఖర్చుతో 26.50 లక్షల రొయ్యలను వదలగా 150 టన్నుల పైన ఉత్పత్తి వచ్చినట్లు గణాంకాలు చెబుతున్నాయి. వీటి విలువ రూ. 3.70 కోట్లుగా ఉంది. ప్రభుత్వం నుంచి అందుతున్న సహకారం, సిబ్బంది మెరుగైన పనితీరుతోనే మంచి ఫలితాలు సాధిస్తున్నామని అధికారులు చెబుతున్నారు.

యూరోపియన్ దేశాలకు స్కాంపి

నీలకంఠ రొయ్య (స్కాంపి) నీలంరంగులో రెండు పొడవైన కాళ్లు కలిగి ఉంటుంది. 1.5 అంగుళాల సైజులో ఉండే ఈ నీలకంఠ రొయ్య పిల్లలు నాలుగు నుంచి ఆరు నెలల్లో దాదాపు 100 గ్రాముల వరకు బరువు పెరుగుతాయి. వీటికి మార్కెట్ ధర కిలోకు రూ.250 వరకు ఉంటుంది. ఈ రొయ్యలు ఎక్కువగా యురోపియన్ దేశాలకు ఎగుమతి అవుతాయి. రొయ్యల ఉత్పత్తి పరిమాణం తక్కువగా ఉన్నప్పటికీ ఆదాయం ఎక్కువగా వస్తుంది. ఇదిలా ఉండగా మత్స్యశాఖ మాత్రం తీవ్ర సిబ్బంది కొరతను ఎదుర్కొంటుంది. ప్రస్తుతం ఉన్న అరకొర సిబ్బంది పైనే పనిభారం ఎక్కువగా పడుతోంది.

రిజర్వాయర్ పేరు	వదిలిన రొయ్యపిల్లల సంఖ్య (లక్షల్లో)
సింగూర్	28.09
బోగులాంపల్లి	1.00
కడెం	9.15
శ్రీరాంసాగర్	1.25(కోట్లు)
ఎల్ఎమ్‌డి	29.50
ఎమ్ఎమ్‌డి	17.64
అప్పర్ మానేరు	2.05
పోచారం	6.31
సత్‌నాలా	2.49
మతడివాగు	1.46
శ్రీపాద ఎల్లంపల్లి	29.15
కొమురం భీం	10.80
మూసి ప్రాజెక్టు	9.40
దిండి	7.21
పాలేరు	6.44
వైరా	7.00
లంకసాగర్	3.00
పెద్దవాగు ప్రాజెక్టు	1.69
ఘన్‌పూర్ ములుగు	2.90
రామప్ప	8.55
లక్నవరం	8.04
శనిగరం	2.45
తపస్‌పల్లి ప్రాజెక్టు	0.40
మొత్తం	**319.73 లక్షలు**

ఈనెల చివరికల్లా

జాతీయ రహదారులకు భూసేకరణ పూర్తి

- ముఖ్యమంత్రి ఆదేశంతో ప్రక్రియను వేగవంతం చేసిన సిఎస్
- అన్ని జిల్లాలకు లక్ష్యాన్ని నిర్దేశించిన ఆర్ అండ్ బి ముఖ్య కార్యదర్శి



మన తెలంగాణ / హైదరాబాద్ : జాతీయ రహదారుల అవసరం నిమిత్తం భూసేకరణ ప్రక్రియను ఈ నెల చివరికల్లా దాదాపుగా పూర్తి చేసేలా ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది. రాష్ట్రంలో సుమారు 866 కి.మీ. మేర జాతీయ రహదారులకు కేంద్ర రవాణా మంత్రిత్వశాఖ ఆమోదం తెలిపిన రీత్యా ఈ నెల చివరికల్లా కనీసంగా 80% మేర భూ సేకరణ ప్రక్రియను పూర్తి చేసేలా ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని, మిగిలిన ఇరవై శాతం భూసేకరణ పనులను ఫిబ్రవరి చివరికల్లా పూర్తి చేయాలని స్పష్టం చేశారని రోడ్లు భవనాల శాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశం మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషి సైతం ఇటీవల రోడ్లు భవనాల ముఖ్య కార్యదర్శి సునీల్ శర్మతో సమీక్ష నిర్వహించారని, ఆ ప్రకారం అన్ని జిల్లాల అధికారులకు భూ సేకరణ ప్రక్రియను వీలైనంత త్వరగా ముగించి లక్ష్యంలో 80% పనులను ఈ నెల చివరికల్లా పూర్తి చేసేలా ఆదేశాలు వెళ్ళాయని ఆ అధికారి వివరించారు. ఒకటి రెండు చోట్ల మాత్రం మార్చి నెల చివరికల్లా పూర్తి చేయాల్సిందిగా స్పష్టత వచ్చిందని పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితుల్లో మార్చి నెల చివరికల్లా ఒక్క అంగుళం కూడా బాకీ లేకుండా మొత్తం భూ సేకరణ ప్రక్రియను పూర్తి చేసే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు వివరించారు. ముఖ్యమంత్రి కెసిఆర్ ఈ అంశంలో ఇటీవల వివరాలను తెప్పించుకుని స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడంతో పనుల్లో వేగం పెరుగుతుందని పేర్కొన్నారు.

19 జిల్లాల్లో ముమ్మరంగా పనులు

రాష్ట్రంలోని మొత్తం 31 జిల్లాల్లో జాతీయ రహదారుల పనుల నిమిత్తం భూ సేకరణ పనులు 19 జిల్లాల్లో ముమ్మరంగా జరుగుతున్నట్లు రోడ్లు భవనాల శాఖ ఉన్నతాధికారి పేర్కొన్నారు. ఖమ్మం, మహబూబ్‌నగర్, సూర్యాపేట, సంగారెడ్డి, రంగారెడ్డి, మెదక్, వికారాబాద్, కామారెడ్డి, జనగాం, నిజామాబాద్ తదితర జిల్లాల్లో జాతీయ రహదారుల విస్తరణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని తెలిపారు. రాష్ట్రం మొత్తం మీద 866 కి.మి. మేర జాతీయ రహదారులకు కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వశాఖ ఆమోదం తెలిపిందని, ఇందుకు సుమారు రూ. 5,972 కోట్లు ఖర్చు కానున్నట్లు ఆ అధికారి గుర్తుచేశారు. రెండేళ్ళ క్రితం ఈ రహదారులకు ఆమోదం లభించడంతో సుమారు 392 కి.మీ. జాతీయ రహదారులకు సంబంధించిన పన్నెండు ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం రూ. 4,675 కోట్లను గత ఆర్థిక సంవత్సరంలోనే మంజూరు చేసింది. రాష్ట్రం ఏర్పడే నాటికి జాతీయ రహదారుల విస్తీర్ణం చాలా తక్కువగా ఉండడంతో ప్రధాన రాష్ట్ర రహదారులను సైతం జాతీయ రహదారులుగా ప్రకటించాలని ముఖ్యమంత్రి కెసిఆర్ మొదలు రాష్ట్ర మంత్రి, ఎంపిల వరకు కేంద్ర మంత్రిని పలుమార్లు విజ్ఞప్తి చేశారు. ఆ విజ్ఞప్తికి సానుకూల స్పందన రావడంతో తెలంగాణ ఏర్పడే నాటికి రాష్ట్రంలో ఉన్న సుమారు 2500 కి.మీ. జాతీయ రహదారులు ఇప్పుడు రెట్టింపయ్యాయి. కొన్ని రహదారుల పనుల నిమిత్తం రూ. 1,350 కోట్ల మేరకు ఖర్చయినట్లు కేంద్ర రవాణా శాఖ సహాయ మంత్రి మన్‌సుఖ్‌సింగ్ మాండవీయ పార్లమెంటు సభ్యులు అడిగిన ప్రశ్నకు లిఖిత పూర్వకంగానే సమాధానం ఇచ్చారు. కేంద్రం ఆమోదించిన 24 నెలల వ్యవధిలో ఈ ప్రాజెక్టులు పూర్తికావాల్సిన ఉన్నందున స్వయంగా ముఖ్యమంత్రి కెసిఆర్ వీటి విషయంలో తాజా స్థితిగతులపై వివరాలను తెలుసుకుని ఎక్కడెక్కడ ఎలాంటి సమస్యలు ఉన్నాయో విశ్లేషించి ఈ నెల చివరికల్లా దాదాపు 80% మేర భూ సేకరణ ప్రక్రియను పూర్తి చేసే లక్ష్యాన్ని నిర్దేశించారు. మిగిలిన ఇరవై శాతం వచ్చే నెల చివరకు పూర్తికానున్నందున దాదాపు రెండు నెలల వ్యవధిలో మొత్తం భూ సేకరణ ప్రక్రియ కొలిక్కి రానుంది. ఆ ప్రక్రియ పూర్తయినట్లయితే కేంద్రం మంజూరు చేసిన నిధుల్లో గరిష్ట భాగాన్ని పొందే వీలు కలుగుతుంది. అందువల్ల ఆ పనులను అనుకున్న లక్ష్యం ప్రకారం పూర్తిచేయడంపై ఇప్పుడు రోడ్లు భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి దృష్టి సారించారు.



నేటి తరం రాజకీయాలు కలుషితమయ్యాయి

సిపిఐ జాతీయ కార్యదర్శి డా.కె.నారాయణ

మన తెలంగాణ/హైదరాబాద్ : నేటి తరం రాజకీయాలు కలుషితమయ్యాయని సిపిఐ జాతీయ కార్యదర్శి డా.కె.నారాయణ పేర్కొన్నారు. రాజకీయాల్లో మాజీ ఎమ్మెల్యే శివరామిరెడ్డి నైతిక విలువలు ఉన్న వ్యక్తి అని, ఒకరికి గౌరవం ఇచ్చి మాట్లాడడంలో ఆయనకు ఎవరూ సాటి లేరన్నారు. ఆదివారం హైదరాబాద్ కొండాపూర్‌లోని చండ్ర రాజేశ్వర్‌రావు ఫౌండేషన్‌లో స్వాతంత్ర సమరయోధులు, కమ్యూనిస్టు నాయకులు, మాజీ ఎమ్మెల్యే నర్రెడ్డి శివరామిరెడ్డి సంతాప సభకు హాజరైన నారాయణ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన తరువాత చట్టసభకు ఎన్నికైన తొలితరం ప్రజాప్రతినిధుల్లో ఒకరని, ఉమ్మడి రాష్ట్రంలో ఎంఎల్‌ఏగా ఎన్నికై ప్రజలకు నిస్వార్థంగా సేవలందించి ప్రజల్లో చెరగని ముద్రవేశారన్నారు. పార్టీని అభివృద్ధి చేయడానికి ఆయా గ్రామాల్లో సమస్యలపై స్పందించి పోరాటాల్లో ప్రధాన పాత్ర పోషించాడని, మరణించే వరకు చండ్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో ఉంటూ నిస్వార్థంగా సేవలు అందించి సలహాలు, సూచనలు ఇచ్చే వారని నారాయణ గుర్తుచేశారు. సిపిఐ ఏపి రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ శివరామిరెడ్డి రైతాంగ సమస్యలపై పోరాడి రైతాంగంలో గుర్తింపు పొందారని, నిజాయితీ గల కమ్యూనిస్టుగా జీవితాంతం కొనసాగించి అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. తెలంగాణ రాష్ట్ర సిపిఐ సహాయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ శివరామిరెడ్డి భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆయన ఆశయ సాధనకు ఉద్యమాలు నిర్మించాల్సిన లక్ష్యం మన ముందు ఉందన్నారు. ఈ సంతాప సభలో శివరామిరెడ్డి కుటుంబ సభ్యులు, సిఆర్ ఫౌండేషన్ వృద్ధాశ్రమం సహచరులు పాల్గొన్నారు.

'పంచాయతీ' ముగిసే వరకు చెక్‌పోస్ట్‌లు

చెక్‌పోస్ట్‌లు దాటేందుకు మావోయిస్టుల వెనుకంజ



మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలోని పంచాయతీ ఎన్నికలు ముగిసేంత వరకు మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను కొనసాగిస్తామని పోలీసు ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు. ఇటీవల రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల భద్రత దృష్ట్యా సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడంతో మావోయిస్టుల కదలికలు నిలిచిపోయాయని, అసెంబ్లీ ఎన్నికలలో పోలీసుల చెక్‌పోస్ట్ వ్యూహం ఫలించడంతో పంచాయతీ ఎన్నికలు ముగిసే వరకూ వాటిని కొనసాగించాలని రాష్ట్రంలోని అన్ని జిల్లాలో ఎస్‌పిలకు ఆదేశాలిచ్చిట్లు సమాచారం. మావోయిస్టులను కట్టడి చేసేందుకు పోలీసులు ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల కారణంగా మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలలో అసెంబ్లీ ఎన్నికలలో 6.5 శాతం ఓటింగ్ పెరిగింది. రాష్ట్ర సరిహద్దులైన మహారాష్ట్ర, చత్తీస్‌గడ్, దక్షిణ ప్రాంతంలోని ఆంధ్రప్రదేశ్, కర్నాటక సరిహద్దుల్లో మావోయిస్టులు దండకారణ్యంలోనే తలదాచుకుంటున్నట్లు పోలీసు వర్గాలు అనుమానిస్తున్నాయి.

రాష్ట్రంలోని 31 జిల్లాల మధ్య ప్రధాన రహదారుల్లో ఎన్నికల సమయంలో 96 చెక్‌పోస్టులు ఏర్పాటు చేయగా వాటిలో 43 చెక్‌పోస్టులు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలు నాటి నుంచి రాష్ట్ర సరిహద్దులైన మహారాష్ట్ర, చత్తీస్‌గడ్, దక్షిణ ప్రాంతంలోని ఆంధ్రప్రదేశ్, కర్నాటక సరిహద్దుల్లో మావోయిస్టుల ఏరివేతకు చెక్‌పోస్ట్‌లు ఉపయోగ కరంగా మారాయని పోలీసు అధికారులు వివరిస్తున్నారు. ఎన్నికల అనంతరం రాష్ట్ర సరిహద్దుల్లో కొన్ని చెక్ పోస్టులను కొనసాగించేలా నిర్ణయం తీసుకునే విషయంలో రాష్ట్ర డిజిపి జిల్లా ఎస్‌పిలకు ఆదేశాలిచ్చినట్లు సమాచారం. ప్రస్తుతం ఉన్న చెక్‌పోస్టులలో ముఖ్యమైన చెక్‌పోస్టులను గుర్తించి వాటిని నిరంతరాయంగా కొనసాగించేలా చర్యలు చేపట్టనున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన ఆసిఫాబాద్, భూపాల్‌పల్లి, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాలోని సమస్యాత్మక ప్రాంతాలలో ఏర్పాటు చేసిన 67 చెక్‌పోస్టులు ఏర్పాటు చేయగా ఇప్పటికీ 20 చెక్‌పోస్టులు కొనసాగుతున్నాయి. ఎన్నికల సమయంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టులలో దాదాపు 10 మంది మావోయిస్టులను, 8 మంది సానుభూతి పరులను అరెస్ట్ చేసినట్లు పోలీసు అధికారులు వివరిస్తున్నారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మావోయిస్టులు తమ ఉనికి చాటుకునేందుకు దాడులకు తెగబడే అవకాశం ఉందని ఇంటలిజెన్స్ అధికారులు రాష్ట్ర పోలీసు యంత్రాగానికి ముందస్తు హెచ్చరికలు చేసినట్లు తెలియవచ్చింది. దీంతో రాష్ట్ర డిజిపి మహేందర్‌రెడ్డి సమస్మాత్మక ప్రాంతాలలో చెక్‌పోస్టులను యథాతథంగా ఉంచాలని ఆదేశాలిచ్చినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలలోని జిల్లా ఎస్‌పిలను అప్రమత్తం చేస్తూ ఆదేశాలిచ్చారు. డిజిపి ఇచ్చిన ఆదేశాలలో మావోయిస్టు సానుభూతిపరులు, మాజీ మావోయిస్టులు, మావోయిస్టు పార్టీ అనుబంధ సంస్థలు, అనుమానిత పౌర హక్కుల నేతలపై నిఘా మరింత పెంచాలని సూచించారు. పంచాయతీ ఎన్నికలలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు, మావోయిస్టుల దాడులు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టనున్నట్లు పోలీసు ఉన్నతాధికారులు వివరిస్తున్నారు. వరుస ఎన్నికల కారణంగా రాష్ట్ర సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్ పోస్టులతో నాలుగు రాష్ట్రాలలోని మావోయిస్టుల కార్యకలాపాలకు చెక్ పడటంతో మావోయిస్టులు దండకారణ్యాన్ని దాటేందుకు వెనుకంజ వేస్తున్నట్లు తెలుస్తోంది.

'మావో'ల ఎత్తులకు పోలీసుల పై ఎత్తు

రాష్ట్ర సరిహద్దుల్లో చెక్ పోస్టుల కారణంగా దండకారణ్యంలోని మావోయిస్టులు కొత్త కుట్రలకు తెరతీస్తున్నారన్నది సమాచారం. దంతెవాడ, నారాయణపూర్ అటవీ ప్రాంతాలలో భద్రతా బలగాలు కూబింగ్ దళాలను మట్టుబెట్టేందుకు పెద్ద గుంతలు తవ్వి విష పూరిత ఈటెలు, మందు పాతరలను మావోయిస్టులు అమర్చి హతమార్చేందుకు కుట్ర చేశారు. మావోయిస్టులు ఏర్పాటు చేసిన మందుపాతరలను భద్రతా బలగాలు ముందుగానే పసిగట్టడంతో ప్రమాదం తప్పింది. శక్తి వంతమైన పేలుడు పదార్థాలు, అధునాతన తుపాకులు, ఎకె47 తదితర ఆయుధాలను ఉపయోగించే మావోయిస్టులు భద్రతా బలగాలను తుదముట్టించేందుకు విష పూరిత ఆయుధాలను వినియోగించేందుకు పథకం రచించారని పోలీసు ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు. గుంతలలో మావోయిస్టులు ల్యాండ్ మైన్ ఏర్పాటు చేయడంతో భద్రతా బలగాల శరీరాలు గుర్తిపట్టలేని స్థితికి చేరుకుంటాయని పోలీసు అధికారులు వివరిస్తున్నారు. దండకారణ్యం నుంచే మావోయిస్టులు కుట్రలు పన్నుతుండటంతో పోలీసులు తమదైన శైలిలో వ్యవహరిస్తున్నారు. దండకారణ్యంలో ఉన్న మావోయిస్టుల ఆచూకీ కనుగొనేందుకు యత్నాలు సాగిస్తున్నారు. ఇందులో భాగంగా కూబింగ్ దళాలు స్థానిక పోలీసుల సహాయంతో దండకారణ్యాన్ని చుట్టుముట్టేందుకు వ్యూహం రచిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

ప్రారంభమైన లక్ష్మీ చెన్నకేశవ జాతర



మన తెలంగాణ/చెన్నారావుపేట : మండలంలోని లింగగిరి గ్రామంలో వెలసిన ల చెన్నకేశవ స్వామి జాతర ఆదివారం ప్రారంభమైంది. దేవాలయంలో ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పెద్ది మాట్లాడుతూ కోరిన కోరికలు తీర్చే కొంగు బంగారం లక్ష్మి చెన్నకేశవస్వామి అని అన్నారు. ఎమ్మెల్యే హోదాలో పెద్ది సుదర్శన్‌రెడ్డి దంపతులు మొదటిసారి ఆలయానికి రావడంతో ఆలయ నిర్వాహకులు, ఆలయ కమిటీ చైర్మన్ దొడ్డ మోహన్‌రావు ఎమ్మెల్యే దంపతులకు ఘన స్వాగతం పలికారు. జాతర మొదటి రోజు కావడంతో భక్తులు అదిక సంఖ్యలో పాల్గొని మొక్కులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో టిఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కంది క్రిష్ణారెడ్డి, అధికార ప్రతినిధి బాల్నె వెంకన్నగౌడ్, ఆర్‌ఎస్‌ఎస్ మండల కన్వీనర్ బుర్రి తిరుపతి, జిల్లా డైరెక్టర్ తూటి శ్రీనివాస్, ఎఎంసి డైరెక్టర్ రఫి తదితరులు పాల్గొన్నారు.

నీటితొట్టిలో పడి చిన్నారి మృతి



మన తెలంగాణ/చెన్నారావుపేట : నీటి తొట్టిలో పడి చిన్నారి మృతి చెందిన సంఘటన మండలంలోని లింగాపురం గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం లింగాపురం గ్రామానికి చెందిన రాకేష్, శిరీష దంపతులకు ఇద్దరు పిల్లలు. కాగా పెద్ద కూతురు శ్రీజతోపాటు ఒక అబ్బాయి ఉన్నారు. పెద్ద పాప అయిన శ్రీజ రోజు ఇంటి ఆవరణంలో అల్లారుముద్దుగా తిరుగుతుండేది. ఆదివారం ఉదయం ఇంటి ఆవరణంలో ఆడుకుంటూ సమీపంలోని నీటి తొట్టిలో పడిపోగా కొద్దిసేపటికి గమనించిన కుటుంబ సభ్యులు వచ్చి చూసి నీటి తొట్టిలోనుండి బయటకు తీశారు. అప్పటికే శ్రీజ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శ్రీజ మృతి చెందడంతో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.

ఎన్నికల వేళ వల్లభ్‌రావ్‌పల్లిలో ఉద్రిక్తత

మన తెలంగాణ / మిడ్జిల్ : ఇటీవల కాంగ్రెస్ పార్టీ నుండి టిఆర్‌ఎస్‌లో చేరిన బండారి కృష్ణయ్య కుమారులు అతని బంధువర్గంపై కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు కొందరు కత్తులతో దాడికి పాల్పడిన సంఘటన ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండల పరిధిలోని వల్లభ్‌రావుపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. టిఆర్‌ఎస్ పార్టీ చేస్తున్న అభివృద్ధిని చూసి కాంగ్రెస్ పార్టీ నుంచి బండారి కృష్ణయ్య, బండారి భగవంతు తన బంధువర్గంతో ఎమ్మెల్యే డాక్టర్ లక్ష్మారెడ్డి సమక్షంలో ఇటీవల టిఆర్‌ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పంచాయతీ ఎన్నికలలో గ్రామంలోని 6వ వార్డు సభ్యునిగా కృష్ణయ్య తన కోడలు భాగ్యమ్మను బరిలో నిలిపేందుకు సన్నాహాలు చేసుకున్నారు. అది జీర్ణించుకోలేని కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు వ్యక్తులు ఆదివారం కత్తులతో దాడికి పాల్పడగా బండారి కృష్ణయ్య, బండారి భగవంతు, బండారి నర్సింహ్మా, బండారి నరేష్, బండారి ఆనంద్, కళ్యాపు శంకర్, బండారి యాదమ్మలకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న గ్రామస్థులు గాయపడిన వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో జిల్లా ఆసుపత్రికి తరలించారు. బండారి భగవంతుకు తీవ్ర గాయాలవ్వడంతో పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ప్రశాంతంగా ఉన్న గ్రామంలో ఒక్కసారిగా కత్తులతో దాడికి పాల్పడిన సంఘటన చోటు చేసుకోవడంతో గ్రామంలో భయాందోళనలు చెలరేగాయి.

విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పి రెమా రాజేశ్వరితోపాటు డిఎస్పి భాస్కర్, సిఐ రవీందర్‌రెడ్డిలు వల్లభ్‌రావుపల్లి గ్రామానికి చేరుకొని సంఘటన జరిగిన చోట విచారణ చేపట్టి, గ్రామస్థులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. గ్రామాలలోని ప్రజలు శాంతి, సామరస్యాలతో మసలుకోవాలని ఎస్పి గ్రామస్థులకు సూచించారు. క్రిమినల్ చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, కేసు నమోదు చేసి నిందితులపై చర్యలు చేపడతామని ఎస్పి తెలిపారు. బండారు కృష్ణయ్య, అతని బంధువులపై కత్తులతో దాడి చేసి గాయపరిచిన అదే గ్రామానికి చెందిన జంగం జంగిలి, జంగం రాములు, జంగం మహేష్, జంగం ఆంజనేయులు, జంగం రవికుమార్, జంగం శ్రీకాంత్‌లపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎఎస్పై ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

సిద్దిపేట పట్టణంలో పోలీసుల సోదాలు

మన తెలంగాణ/సిద్దిపేట ప్రతినిధి : జనశక్తి దళం పేరిట ముఠాగా ఏర్పడిన ఏడుగురు గ్రూపు సభ్యులు వసూళ్లకు పాల్పడుతూ అధికారులను బెదిరించిన వారిని సిద్దిపేట పోలీసులు ఈ నెల 5న అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. కాగా ఇందులో నిందితుడిగా ఉన్న సంతోష్‌ను కోర్టు అనుమతితో అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారణలో భాగంగా ఆదివారం సిద్దిపేట పట్టణం గణేష్ నగర్‌లోని అతని ఇంట్లో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో రెండు తుపాకులతోపాటు విప్లవ సాహిత్యం లభించినట్లు సమాచారం. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా సంతోష్ ఇంట్లో సోదాలు చేసింది వాస్తవమేనని, కాని ఎలాంటి అనుమానించదగ్గ వస్తువులు దొరకలేదని తెలిపారు.

ఆధిపత్యం కోసమే యువకుడి హత్య

మనతెలంగాణ/ చందుర్తి: గ్రామంలోని ఇరువర్గాల మధ్య జరిగిన ఆధిపత్య పోరులో ఓ యువకుడు అతి దారుణంగా హత్య చేయబడ్డాడు. జనాన్ని భయపెట్టాలంటే హత్య చేయాల్సిందేనని నిర్ణయించుకొని ఓ యువకున్ని టార్గెట్ చేసుకొని చివరకు పథకం ప్రకారం హతమార్చినట్లు పోలీసుల విచారణలో నిందితులు అంగీకరించారు. డిఎస్పి వెంకటరమణ కథనం ప్రకారం నర్సింగాపూర్‌కు చెందిన మెరుపుల హరీష్(23) అదే గ్రామానికి చెందిన నేరేళ్ల రమేష్‌కు గత కొంతకాలంగా పొలం హద్దు దగ్గర సమస్య కొనసాగుతుంది. ఈ క్రమంలో గత దసరా రోజున ఇరువురి మధ్య గొడవ జరిగింది. చీటికిమాటికి తనకు అడ్డు వస్తున్నాడన్న కోపంతో హరీష్‌పై రమేష్ కక్ష పెంచుకున్నాడు. ఎలాగైనా హరీష్‌ను అడ్డు తొలగించుకోవాలని సమయం కోసం వేచి చూస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన నేవూరి శంకర్ బాబు అనే వ్యక్తితో కలిసి హరీష్‌ను హత్య చేసేందుకు పథకం రచించాడు. కాగా ఈ నెల 8మధ్యాహ్నం 2గంటలకు గుర్రం బుచ్చయ్య అనే వ్యక్తితో కలిసి హరీష్ తన పొలం వద్దకు ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో పోచమ్మ గుట్ట మత్తడి వద్ద మాటు వేసిన రమేష్, శంకర్ బాబులు హరీష్‌ను అడ్డుకొని అతికిరాతకంగా హతమార్చారు. శంకర్‌బాబు చేతులు దొరకబట్టగా వెంట తెచ్చుకున్న కత్తితో రమేష్ విచక్షణ రహితంగా హరీష్ శరీరంపై నరికాడు. తల, శరీరంపై పలుమార్లు పొడవడంతో హరీష్ అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. చనిపోయినట్లు నిర్ధారించుకుని హరీష్ మృతదేహంతోపాటు స్కూటర్‌ను సమీపంలోని వ్యవసాయ బావిలో పడవేసి అక్కడినుండి పరారయ్యారు. 'మా గురించి చెబితే నిన్ను కూడా చంపుతామ'ని హెచ్చరించడంతో గుర్రం బుచ్చయ్య భయంతో పరుగులు పెట్టాడు. ఈ సంఘటన గ్రామంలో తీవ్ర సంచలనం రేకెత్తించగా పోలీసులు సవాలుగా స్వీకరించారు. ఓ దశలో గ్రామంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో ఐదు రోజులపాటు పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. అప్పటినుండి తప్పించుకుని తిరుగుతున్న నేరేళ్ల రమేష్, నేవూరి శంకర్‌బాబులను ఆదివారం ఉదయం కోరుట్ల బస్టాండ్‌లో చందుర్తి పోలీసులు పట్టుకొని పోలీసుస్టేషన్‌కు తరలించారు. మీడియా ముందు ప్రవేశపెట్టిన అనంతరం నిందితులిద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు డిఎస్పి తెలిపారు. కేసును త్వరగా చేధించడంలో కీలక పాత్ర పోషించిన సిఐ విజయ్‌కుమార్, ఎస్ఐలు నీలం రవి, నరేష్, దివ్యభారతి, వెంకటేష్‌ను డిఎస్పి అభినందించారు.

సంస్కృతి, భాషకు కెసిఆర్ పెద్దపీట

- పండుగలు మన జీవన విధానానికి ప్రతీకలు
- పతంగుల ఉత్సవాన్ని ప్రారంభించిన ఉపరాష్ట్రపతి





మన తెలంగాణ / హైదరాబాద్ : మనం జరుపుకునే పండుగలు మన జీవన విధానానికి ప్రతీకలని, తెలంగాణ ముఖ్యమంత్రి తెలుగు భాషకు, సంస్కృతి వ్యాప్తికి పెద్దపీట వేస్తున్నారని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రభుత్వం వరుసగా నాల్గవ ఏట నిర్వహిస్తున్న అంతర్జాతీయ కైట్ ఫెస్టివల్ (పతంగుల ఉత్సవం)ను పరేడ్ గ్రౌండ్స్‌లో ఆదివారం మధ్యాహ్నం ప్రారంభించిన సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ, కొన్ని ఉత్సవాలు మనలో ఐక్యతను, కలిసిమెలిసి ఉండే తత్వాన్ని తీసుకొస్తాయని, ఇప్పుడు జరుగుతున్న పతంగుల ఉత్సవం కూడా కుల, మత, భాష, వయసు తేడాలు లేకుండా సాగుతున్నదేనని అన్నారు. పతంగులను ఎగురవేయడం ఒక తీయని అనుభూతి అని, చిన్నతనంలో దాదాపు అందరూ పతంగులు ఎగురవేసినవారేనని, ఇప్పుడు ఆ ఉత్సవంలో పాల్గొనడంతో చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తుకొస్తున్నయన్నారు. ఈ అవకాశాన్ని ముఖ్యమంత్రి కెసిఆర్ చొరవతో రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందన్నారు. ప్రతీ పండుగకు ఒక విశిష్టత ఉంటుందని, సామాజిక బంధాలతో ముడిపడి ఉండే ఉత్సవాలను జరుపుకుంటూ ఉంటామన్నారు. సంక్రాంతి పండుగ కూడా ఇలాంటి విభిన్న వాతావరణాలను తీసుకొస్తుందని, ఒకవైపు పతంగులు ఎగురవేసే సంబురాలు ఉంటే మరోవైపు ప్రకృతితో ముడిపడిన వ్యవసాయం, దాంతో పాటే కృతజ్ఞతగా పశువులను గౌరవించడం, గంగిరెద్దుల విన్యాసం తదితరాలు అని ప్రస్తావించారు. సోదర భావం, సమానత్వం, మత సామరస్యం, సమిష్టితత్వం లాంటి అలవరిచే గొప్ప గుణం మన పండుగలు, ఉత్సవాల్లో ఉన్నాయని అన్నారు. గాలిపటాలను ఎగురవేయడం ఒక అనుభూతి అయితే వాటిని తయారుచేయడంలో ఉన్న ప్రావీణ్యం, సృజనాత్మకత, పట్టుదల చిన్నతనంలో ఒక రకమైన విజ్ఞానం, కళ అని అన్నారు. పతంగుల ఉత్సవంతో పాటు దాదాపు 1200 రకాల తీపి వంటకాలతో ఉత్సవాన్ని నిర్వహించడం కూడా మంచి నిర్ణయమని అన్నారు. మనం సందర్భానుసారం



ఇళ్ళలో చేసుకునే తీపి వంటకాలన్నింటినీ ఒకచోట చేర్చేలా ఉత్సవం రూపంలో నిర్వహించడం మన దేశంలోని భిన్నత్వంలో ఏకత్వానికి చిహ్నమని కొనియాడారు. దేశంలో వివిధ రాష్ట్రాల్లో ఒక్కో తరహా తీపి వంటకాలకు గుర్తింపు, విశిష్టత ఉంటుందని, ఇప్పుడు హైదరాబాద్ నగరంలో స్థిరపడినవారిని ఉత్సాహపర్చి ఫెస్టివల్ ద్వారా ఒకే చోటకి చేర్చడం హర్షించదగిన పరిణామమని అన్నారు. చిన్నతనంలో మనం చూసిన సంప్రదాయాలను నేటి తరానికి అందించడానికి ఇలాంటి ఉత్సవాలు దోహదపడతాయని, ముఖ్యమంత్రి ఆలోచనతో ఇప్పుడు వరుసగా నాలుగేళ్ళుగా పతంగుల ఉత్సవం నిర్వహిస్తూ ఉండడం ఎంతైనా ఆహ్వానించదగినదని అన్నారు. పతంగుల ఉత్సవానికి నలభై దేశాల నుంచి ఔత్సాహికులు, నిపుణులు, మన దేశం నుంచి సుమారు అరవై మంది హాజరుకావడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ప్రతినిధి వేణుగోపాలచారి, శాసనమండలి ఛైర్మన్ స్వామిగౌడ్ సహా పలువురు హాజరయ్యారు. వెంకయ్యనాయుడు సైతం కొద్దిసేపు గాలిపటాన్ని ఎగురవేసే ప్రయత్నం చేశారు. తన చిన్ననాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. అంతకు ముందు శంషాబాద్ సమీపంలోని ముచ్చింతల్‌లో స్వర్ణ భారత్ ట్రస్ట్‌లో జరిగిన సంక్రాంతి సంబురాల్లో పాల్గొన్న వెంకయ్యనాయుడు రైతులకు ప్రయోజనం కలిగేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషిచేయాలని కోరారు. కళలు, సాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత



అందరిపైనా ఉందని, సంస్కృతి, భాషకు పెద్దపీట వేస్తున్న ముఖ్యమంత్రి కెసిఆర్‌కు వెంకయ్యనాయుడు అభినందనలు తెలిపారు.

వనపర్తిని అన్ని రంగాల్లో ముందుంచుతా

రాష్ట్ర స్థాయి క్రికెట్ క్రీడలను

ప్రారంభించిన ఎమ్మెల్యే నిరంజన్‌రెడ్డి



మన తెలంగాణ/వనపర్తి ప్రతినిధి : తెలంగాణ రాష్ట్రంలో సిఎం కెసిఆర్ సారథ్యంలో వనపర్తి జిల్లాను అన్ని రంగాల్లో ముందుంచి తెలంగాణ రాష్ట్రంలో నెంబర్ వన్‌గా మారుస్తానని ఎమ్మెల్యే సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో ఆదివారం రాష్ట్రస్థాయి క్రికెట్ క్రీడలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈసంద ర్భంగా ఎమ్మెల్యే నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ యువత క్రీడలపై నైపుణ్యం సాధించి వనపర్తి జిల్లాకు కీర్తిప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. జిల్లాను క్రీడా హబ్‌గా మార్చేందుకు కృషి చేస్తామని తెలిపారు.

జిల్లాను అన్ని రంగాల్లో ముందుంచి విద్యతోపాటు క్రీడారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. అనంతరం నిరంజన్‌రెడ్డి క్రికెట్ క్రీడాకారులతో కలిసి క్రీడలను ప్రారంభించారు. పుట్టపాకుల రవి స్మారకార్థం ఈ క్రీడలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రమేష్‌గౌడ్, కౌన్సిలర్లు వాకిటి శ్రీధర్, గట్టుయాదవ్, లోక్‌నాథ్‌రెడ్డి, పుట్టపాకల పార్వతమ్మ, భువనేశ్వరి, తిరుమల్, పాకనాటి కృష్ణ, ఆవుల రమేష్, రమేష్‌నాయక్, ఇందిరమ్మ, ఖైరూన్, నాయకులు బండారు కృష్ణ, లక్ష్మీనారాయణ, నందిమల్ల శ్యాం కుమార్, గిరి, మోహన్ యాదవ్, ప్రవీణ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

దుప్పిమాంసం లభ్యం

ఐదుగురిపై కేసు నమోదు

మనతెలంగాణ/ బల్మూర్ : మండలంలోని బాణాల గ్రామంలో అటవీశాఖ డాగ్‌స్క్వాడ్ టీమ్ గ్రామంలో తనిఖీలు చేయగా ఆ గ్రామానికి చెందిన మూడావత్ పార్వతమ్మ ఇంట్లో దుప్పిమాంసం లభ్యమైనట్లు ఎఫ్‌డిఒ చంద్రయ్య ఆదివారం తెలిపారు. కొన్నిరోజుల నుంచి అడవి నుంచి వేటాడి మాంసాన్ని విక్రయిస్తున్నట్లు బాణాల గ్రామంనుంచి సమాచారం రావడంతో డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించగా దుప్పి మాంసం లభ్యమైనట్లు తెలిపారు. పార్వతమ్మతోపాటు జాను, శ్రీను, శివ, పరుషులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎఫ్‌డిఒ తెలిపారు. పార్వతమ్మ దుప్పిమాంసాన్ని కొనుగోలు చేసి ఫ్రిజ్‌లో దాచిఉంచగా డాగ్‌స్క్వాడ్ పసిగట్టడం వలన బయటపడింది.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

మన తెలంగాణ/సారంగాపూర్: మండలంలో వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు. వివరాల్లోకి వెళ్తే ... నిర్మల్ జిల్లాకేంద్రంలోని సోమవార్‌పేట్‌కు చెందిన సాదం రాఘవేందర్(28) ధని గ్రామ శివారులో డివైడర్‌ను ఢీకొని మృతి చెందాడు. ఈయన ఆదివారం సారంగాపూర్ మండలంలో పని ముగించుకొని తిరుగు ప్రయాణమయ్యారు. ప్రమాదవశ్యాత్తు రోడ్డు డివైడర్‌ను ఢీ కొని కాలువలో పడ్డాడు. గమణించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్ఐ పోస్ట్‌మార్ట్ నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. రాఘవేందర్ ఎస్పి కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయనకు భార్య, కూతురు ఉన్నారు. మండలంలోని జామ్ గ్రామంలో గడ్డం రుక్మారెడ్డి(55) పంట చేను రక్షణ కోసం విద్యుత్‌ను ఏర్పాటు చేయగా ఆదే తీగలకు తగిలి శనివారం సాయంత్రం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. పంట రక్షణ కోసం రుక్మారెడ్డి విద్యుత్ తీగలు అమర్చాడు. అయితే యథాధిగా శనివారం సాయంత్రం అమర్చుతుండగా వెనుకభాగంలో తీగలు తగిలి మృతి చెందాడు.

జాతీయ కబడ్డీ పోటీలకు ఎంపిక



మనతెలంగాణ/ జామాబాద్ స్పోర్ట్స్ : 35వ రాష్ట్రస్థాయి అండర్ 16 సబ్ జూనియర్ కబడ్డీ టోర్నమెంట్‌లో జిల్లా క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరిచారు. దీంతో బాలుర విభాగంలో నగేష్ బాలికల విభాగంలో అదితి, నందిని జాతీయ జట్టుకు ఎంపికయ్యారు. జాతీయ స్థాయి టోర్నీ ఈ నెల 21 నుండి 24వరకు పాట్నాలో జరుగుతుంది. ఈ నెల 11,12వ తేదిల్లో హైదరాబాద్‌లో లాల్‌బహదూర్ స్టేడియంలో జరిగిన 35వ రాష్ట్రస్థాయి అండర్ 16 సబ్ జూనియర్ కబడ్డీ టోర్నమెంట్‌లో జిల్లా బాలికల జట్టు ద్వితీయ స్థానం సాధించింది. జిల్లా బాలికల జట్టులో అదితి, నందిన అత్యంత ప్రతిభకనబర్చి జిల్లా జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. జిల్లా బాలికల జట్టు లీగ్‌లో రంగారెడ్డి, వరంగల్, ఖమ్మం జట్లపై విజయం సాధించి సెమిఫైనల్ చేరుకుంది. సెమిస్‌లో ఆదిలాబాద్ జట్టుపై భారీ స్కోర్‌తో ఘన విజయం సాధించింది. ఫైనల్‌లో నల్గొండ జిల్లా జట్టు విజయం సాధించి చాంపియన్ షిప్ కైవసం చేసుకుంది. నిజామాబాద్ జిల్లా జట్టు ద్వితీయ స్థానంతో సరిపెట్టుకుంది. ముగింపు కార్యక్రమంలో రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి జగదీష్‌యాదవ్, కొత్త కృష్ణవేణి జాతీయ జట్టు కోచ్ జగన్మోహన్ చేతుల మీదుగా ట్రోపిని అందుకున్నారు. ద్వితీయ స్థానం పొందిన జిల్లా బాలికల జట్టుకు కోచ్‌లుగా వినోద్, గాదరి శ్రీకాంత్‌రెడ్డి, మేనేజర్‌గా రమేష్ వ్యవహరించారు. ద్వితీయస్థానం పొందిన జిల్లా జట్టును జిల్లా అసోసియేషన్ కార్యదర్శి, ఒలింపిక్ సెక్రెటరి అంద్యాల లింగన్న, సుబ్బరావు, సురేందర్, చంద్రప్రకాష్, ఇంద్రకరణ్‌రెడ్డి, ప్రశాంత్‌కుమార్ అభినందించారు.

నేటి నుండి ఐనవోలు మల్లన్న జాతర

మనతెలంగాణ/వరంగల్ బ్యూరో: తెలంగాణలో అత్యంత వైభవంగా మూడు నెలలపాటు కొనసాగే ఐనవోలు మల్లన్న జాతర నేటి నుండి భక్తుల మొక్కులతో కిటకిటలాడనుంది. ఐనవోలు మల్లన్నను ఇంటి దైవంగా భావించే భక్తులు తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాలకు సంబంధించిన భక్తులు కూడా వేలాది సంఖ్యలో మల్లన్న దర్శనం కోసం తరలివస్తారు. మల్లన్నకు కోడె మొక్కులు, పట్నాలు వేయించడం ప్రత్యేక వంటలతో బోనం చేసి మొక్కులు సమర్పించేందుకు భారీ ఎత్తున తరలిరానున్నారు. ఒగ్గు కళాకారులతో డోలు వాయిద్యాలు, అక్కడి జాతర ప్రత్యేకత. యాదవ సంస్కృతి కలిగిన ఐనవోలు మల్లన్న జాతరలో శివున్ని కోరమీసాల మల్లన్నగా కొలుస్తూ ఇష్టదైవంగా పూజిస్తారు. ప్రతిఏటా మకర సంక్రాంతి రోజే జాతర ప్రారంభమవుతుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వర్ధన్నపేట నియోజకవర్గం ఐనవోలులో మల్లన్న దేవాలయం ఉంటుంది. మల్లన్నను దర్శనం చేసుకొని మొక్కులు సమర్పించడానికి ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నలుమూలల నుండి భక్తులు తరలివస్తారు. ఇష్టదైవంగా కొలిచే మల్లన్నకు ఉపవాసాలతో శాఖహారులుగా బోనాలను తయారు చేసి నైవేధ్యాన్ని సమర్పిస్తారు. కోడె మొక్కులవాడిగా మల్లన్నను వేడుకున్న కోరికలను తీర్చడానికి కోడెలను దేవునికి కట్టుతారు. జాతర దేవాలయ ప్రాంగణంలోనే ఒగ్గు కళాకారులతో ప్రత్యేకంగా పూజలు నిర్వహించి పట్నాలు వేయించుకుంటారు. సంక్రాంతిని మల్లన్న ఆలయంలోనే భక్తులు జరుపుకుంటారు. ఏ జాతరలో కూడా ఇంతటి విశిష్టత కనబడదు. ఐనవోలు, జాతర ఆలయ పరిసరాల్లో జంతుబలికి ఆస్కారం ఉండదు. రేణుక ఎల్లమ్మ గుడి కూడా అక్కడే ఉంటుంది. సంక్రాంతి, ఉగాది పండుగ సందర్భంగా రేణుక ఎల్లమ్మకు భక్తులు ప్రత్యేక బోనాన్ని సమర్పిస్తారు. ప్రతిఏడు మల్లన్నకు, రేణుక ఎల్లమ్మకు మొక్కులు బోనం రూపంలో సమర్పించకుంటే ఇంటిల్లిపాధికి మంచి జరగదనే ఉద్దేశంతో తప్పనిసరిగా ప్రతిఏడు సంతోషంగా మొక్కులను సమర్పిస్తారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు కోడె ఎద్దులతో ఎడ్లబండ్లను తీసుకొని ఉత్సాహంగా తరలివస్తారు. జాతరలో కొత్త పుంతలు తొక్కుతుండడం ట్రాక్టర్లు, బస్సులు, లారీల్లో భారీ ఎత్తున భక్తులు తరలివస్తారు. మకర సంక్రాంతి నుండి ఉగాది వరకు మూడు నెలల పాటు ఇసుకేస్తే రాలనంత జనం జాతరలో ఉంటుంది. జాతర నిర్వహణకు ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. మునుపెన్నడూ లేని విధంగా దేవాలయ పునర్నిర్మాణానికి ప్రభుత్వ నిధులతో స్థానిక ఎంఎల్‌ఎ ఆరూరి రమేష్ ఆధ్వర్యంలో నిధులను కూడా మంజూరి



చేసి శిథిలమైన ఏకశిల స్తంభాలను కూడా నిర్మించారు. ఐనవోలు మల్లికార్జున స్వామిని వరంగల్ పోలీస్ కమిషనర్ డాక్టర్ విశ్వనాథ్ రవీందర్ దర్శనం చేసుకున్నారు. నేటి నుండి మల్లికార్జునస్వామి జాతర ఐనవోలులో జరుగుతున్నందున జాతరకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా లా అండ్ ఆర్డర్ నిర్వహణ కోసం పోలీస్‌శాఖను సిపి సంసిద్ధం చేశారు. ఈ మేరకు ఐనవోలులోనే పోలీస్ ఔట్‌పోస్టును ఏర్పాటు చేశారు. వచ్చే భక్తులకు తగిన భద్రత కల్పించడానికి సిబ్బందిని నియమించారు.

డిసిపి ఆధ్వర్యంలో ఎసిపి, సిఐలు, ఎస్సైలు, సిబ్బందితో భారీ బందోబస్తు చర్యలను చేపట్టారు. జాతరలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీస్ సిబ్బందికి సూచనలు చేశారు.

క్రికెట్ బెట్టింగ్ ముఠా గుట్టురట్టు



మన తెలంగాణ/శంషాబాద్ : క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న మూఠా గుట్టును శనివారం ఆర్‌జిఐఎ ఎస్‌ఓటి పోలీసులు చేధించారు. ఆర్‌జిఐఎ డిసిపి ఎన్.ప్రకాశ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సులువుగా డబ్బులు సంపాదించాలనే ఆశతో హైదరాబాద్ నగరానికి చెందిన నాలుగురు వ్యక్తులు అంకిత్ అగర్వల్(28), మొహిత్ అగర్వల్(25),రోహిత్ అగర్వల్(27) యాస్మిన్ మహేష్(44)లు గత కొంత కాలంగా క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్నారు. మరోవైపు నిరంతరంగా బిగ్ బాస్ లీగ్ క్రికెట్ మ్యాచ్‌లు కొనసాగుతున్నందున్న పోలీసులు సైబరాబాద్ పోలీసు కమిషనరేట్‌లో క్రికెట్ బెట్టింగ్‌పై ప్రత్యేక నిఘా పెట్టారు. ఈ ఆపరేషన్ బృందం క్రికెట్ బెట్టింగ్ కార్యకలాపాల్లో పాల్గొంటున్న వ్యక్తులపైన, లావదేవీలపైన నిఘా ఉంచింది. ప్రొఫెషనల్ క్రికెట్ బెట్టింగ్ గ్యాంగ్ రాజేంద్రనగర్ పోలీసుస్టేషన్ పరిధిలోని ఆరంఘర్‌లోని ఒక అద్దె గదిలో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు శనివారం శంషాబాద్ ఆర్‌జిఐఎ పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో దాడి చేయగా బెట్టింగ్ నిర్వహిస్తున్న అంకిత్ అగర్వాల్, మొహిత్ అగర్వాల్, డబ్బులు సేకరిస్తున్న రోహిత్ అగర్వాత్‌తోపాటు వీరికి సహకరిస్తున్న యాస్మిన్ మహేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి బెట్టింగ్‌కు సంబంధించిన గ్యాంబ్‌లర్స్, రూ.5లక్షల నగదు, ఎనిమిది సెల్ ఫోన్లు, ఒక క్యాలికులేటర్, రెండు స్కోరింగ్ బుక్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. అంకిత్ అగర్వాల్, మొహిత్ అగర్వాల్‌లు ఇద్దరు సోదరులు. వీరు 2016లో క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడగా మొహిత్ అగర్వాల్‌ను హైదరాబాద్‌లోని సుల్తాన్‌బజార్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిచారు. 2018 ఏప్రిల్ ఐపిఎల్ సీజన్‌లో బెట్టింగ్‌కు పాల్పడిన అంకిత్ అగర్వాల్‌ను నవంబర్ మాసంలో వెస్ట్ మారేడ్‌పల్లి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా మొహిత్ అగర్వాల్ పారిపోయినట్లు తెలిపారు. బెట్టింగ్ పాల్పడుతున్న వ్యక్తులను ఎంతో చాకచక్యంగా అరెస్టు చేసిన శంషాబాద్ ఎస్‌ఓటి పోలీసులను, వారికి సహకరించిన రాజేంద్రనగర్ పోలీసులను డిసిపి అభినందించారు.

చెరువులో మునిగి ఇద్దరి మృతి

మన తెలంగాణ/మోతె : మండల పరిధిలోని నామవరం గ్రామంలో బంధువు దశదిన కర్మకు వచ్చిన ఇద్దరు వ్యక్తులు చెరువులో మునిగి మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలోని పులిజాల వీరభద్రం పది రోజుల క్రితం మృతి చెందారు. ఆయన కర్మకాండకు ఖమ్మం పట్టణానికి చెందిన పులిజాల నీరజ్‌కుమార్ (21), నర్సింహారావు (42) వచ్చారు. అనంతరం స్నానం చేయడానికి చెరువు వద్దకు వెళ్లారు. ఈత రాకపోవడం, చెరువులోతుగా ఉండడంతో నీట మునిగి చనిపోయారు.

ఆ గట్టు ఆంధ్ర – ఈ గట్టు తెలంగాణ

- ఆంధ్రకు ప్రవేశ మార్గంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా
- ఆంధ్ర – తెలంగాణతో పెనవేసుకున్న సరిహద్దు గ్రామాలు
- ఉభయ గ్రామాల మధ్య చెరగని మైత్రి
- వంద గ్రామాలకు ఆంధ్రతో విడదీయరాని బంధం
- ఇక్కడ ఎన్నికలు–అక్కడ కోలాహలం





మన తెలంగాణ/ఖమ్మం ప్రతినిధి : తెలుగు రాష్ట్రాలు రెండుగా వీడిపోయినప్పటికి అన్నదమ్ముల్లా కలిసిమెలసి జీవిస్తున్నారనేదానికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నాయి ఉభయ రాష్ట్రాల సరిహద్దు గ్రామాలు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రవేశమార్గంగా ఉన్న తెలంగాణలోని ఖమ్మం జిల్లా సరిహద్దులో ఆంధ్రప్రదేశ్ సరిహద్దు గ్రామాలు గత ఐదేళ్లనుంచి కలివిడిగా ఉంటున్నాయి. ఒకే వీధికి రెండు రాష్ట్రాల సరిహద్దులు ఉండటం, ఒకే రోడ్డు కాని రెండు రాష్ట్రాలకు రాచమార్గంగా ఉండటం,రోడ్డుకు ఇవతల వైపు తెలంగాణ, అవతలి వైపు ఆంధ్రప్రదేశ్ పరిధి విస్తరించి ఉండటం,ఉభయ రాష్ట్రాలకు చెందిన ఒకే గ్రామ ప్రజలు ఒకే రోడ్డుపై నడుస్తుండటం రెండు రాష్ట్రాల మైత్రికి నిదర్శనంగా నిలుస్తుంది. రాష్ట్రాలుగా వీడిపోయినప్పటికి ఇప్పటికి తెలంగాణలోని ఉమ్మడి ఖమ్మం జిల్లాతో ఆంధ్రప్రదేశ్‌లోని పలు గ్రామాల మధ్య చెరగని అనుబంధం కొనసాగుతూనే ఉంది. ప్రస్తుతం తెలంగాణలో పంచాయతీ ఎన్నికలు జరుగుతున్నప్పటికి ఆ రాష్ట్రంలో ఎన్నికలు లేవు. దీంతో అక్కడి ప్రజలు ఇక్కడ జరిగే ఎన్నికలపై అసక్తి చూపిస్తుండటంతో ఆయా గ్రామాల్లో కూడా కొలాహలం నెలకొంది. రాష్ట్రాలు ఏమైనా సరిహద్దు గ్రామ ప్రజలంతా మమకేం అయిపోతున్నారు.

తెలంగాణలోని 33 జిల్లాలో ఏ జిల్లాకు లేని విధంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పది నియోజకర్గాల్లో ఎనిమిది నియోజకవర్గాల్లో ఆంధ్రప్రదేశ్‌లోని పలు గ్రామాలకు సరిహద్దు బంధం కొనసాగుతోంది. ఖమ్మం, ఇల్లెందు నియోజకవర్గం మినహా మిగిలిన ఎనిమిది నియోజకవర్గాలు ఆంధ్రప్రదేశ్ సరిహద్దులతో సన్నిహిత సంబంధాలను కొనసాగిస్తున్నాయి. అత్యధికంగా భద్రాచలం, సత్తుపల్లి, అశ్వరావుపేట, మధిర నియోజకవర్గాలకు సుదీర్ఘంగా ఆంధ్ర సరిహద్దు ఉంది. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా, ఉభయగోదావరి జిల్లాలలోని దాదాపు వంద గ్రామాలు ఉమ్మడి ఖమ్మం జిల్లా సరిహద్దులోఉన్నాయి. భద్రాచలం పట్టణం మినహా మిగిలిన అన్ని గ్రామాలు పోలవరం ముంపు గ్రామాలుగా తెలంగాణ ఏర్పాటు సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో విలీనమయ్యాయి. ఇప్పుడు అవే ఆంధ్ర సరిహద్దు గ్రామాలుగా మిగిలాయి. ఇప్పుడు ఈ గ్రామాలన్నీ తూర్పుగోదావరి జిల్లా రంపచోడవరం నియోజకవర్గం పరిధిలో ఉన్నాయి. భద్రాచలం పట్టణంలో ఐదు కిలోమీటర్ల దూరంలోని ఏటపాకను ఎపి రాష్ట్రం మండలం కేంద్రంగా ఏర్పాటు చేసింది. గుండాల, పిచకులపాడు, పురుషోత్తంపట్నం గ్రామాలు ప్రస్తుతం ఆంధ్ర సరిహద్దుగ్రామాలుగా ఉన్నా యి. బూర్గంపహాడ్ మండలం నుంచి ఆంధ్రలో విలీనమైన శ్రీధర వేలేరు గ్రామం సహా విలీన ప్రాంతాలు సరిహద్దుగా మారాయి. ములకలపల్లి మండలం తిమ్మంపేట, రాజీవ్‌నగర్ గ్రామాలు పశ్చిమ గోదావరి జిల్లా వెంకటాపురం గ్రామాలు సరిహద్దులుగా కొనసాగుతున్నాయి.

ఆశ్వారావుపేటకు ఆంధ్రప్రదేశ్‌లోని జీలుగుమల్లి, కామాయపాలేం, రాచన్నగూడెం, లంకాపలపల్లి గ్రామాలు సరిహద్దులో ఉన్నాయి. దమ్మపేట మండలంలో వడ్లగూడెం, అల్లిపల్లి గ్రామాలు పశ్చిమగోదావరి జిల్లాతో కలిసిపోయాయి. ఈ గ్రామాలకు ఒకే రోడ్డు ఉంది. రోడ్డుకు ఒక వైపు తెలంగాణ, మరోవైపు ఆంధ్రప్రదేశ్ కావడం గమనార్హం. వడ్లగూడెంలోని ఆంధ్రబ్యాంక్ ఉన్న భవనం తెలంగాణ ప్రాంతంలో ఉండగా, రోడ్డుకు అవతలి ప్రాంతం ఆంధ్ర పరిధిలో ఉండటం విశేషం. సత్తపల్లి మండలంలో తుంబూరు, కిష్టాపురం, పాలకగూడెం, మేడిశెట్టివారిపాలేం గ్రామాలు ఆంధ్ర సరిహద్దుతో ఇప్పటికి స్నేహం చేస్తూన్నేఉన్నాయి.

ఎర్రుపాలేం మడలంలోని రామన్నపాలేం గ్రామం, కృష్ణా జిల్లా గంపగూడెం మండలంలోని గోసవీడు గ్రామాలు ఒకే రోడ్డుకు రెండు వైపులా ఉన్నాయి. రెండు గ్రామాల ప్రజలకు ఈ ఒక్క రోడ్డే రహదారి మార్గం. మధిర మండలంలో దేశినేని పాలేం, కృష్ణ జిల్లాలోని నందిగామ మండలం జొన్నలగడ్డ గ్రామాలు రెండు రాష్ట్రాల సరిహద్దులు కలిగి ఉన్నాయి. మడుపల్లి శివారు గ్రామం అన్నాయిపాలేం (మధిర మున్సిపాల్టీలో 11వ వార్డు) కృష్ణ జిల్లాలోని జొన్నలగడ్డ గ్రామాలు ఒకే వీధిలో ఉండటం గమనార్హం. ఇక బోనకల్ మండలంలోని ఆళ్లపాడు, గోవిందాపురం, చొప్పకట్లపాలేం ఆంధ్రప్రదేశ్‌లోకి చొచ్చుకుని ఉన్నట్లు కన్పిస్తాయి. నేలకొండపల్లి మండలంలోని చెర్వు మాధారం, ముదిగొండ మండలం వల్లబి ఆంధ్రప్రదేశ్ సరిహద్దును పంచుకుంటుంది. వైరా మండలం గన్నవరం, దాచాపురం గ్రామాలు కృష్ణ జిలా నెమిలితో సరిహద్దును కలిగి ఉంది. తల్లాడ మండడంలో కుర్నవల్లి, కల్లూరు మండలంలో దారూకబంజార, వెన్నవల్లి, పేరువంచ, ముగ్గు వెంకటాపురం, రఘునాథబంజార, చెన్నూరు, పెనుబల్లి మండలంలో ముత్తగూడెం, గణేశ్‌పాడు, వేంసూర్ మండలంలోని సత్యనారాయణపురం, కుంచపర్తి, జయలక్ష్మి పురం, కొండెగట్ల, భరణిపాడు, దుద్దెపుడి గ్రామాలు ఆంధ్ర సరిహద్దులోనే ఉన్నాయి. ఇదే మండలంలోని వెంకటాపురం, కృష్ణాజిల్లా చాట్రాయి మండలం క్రష్ణరావుపాలేం కలిసే ఉంటాయి. పాల్వంచ మండలం దంతెలబోరు గ్రామం పశ్చిమగోదావరి జిల్లా సితారామనగరం గ్రామాలు సరిహద్దులుగా ఉన్నాయి. రెండు గ్రామాల మధ్య ఐదు కి.మీ దూరం ఉన్నా వీటిని కలిపేది ఒకే రోడ్డు కావడం విశేషం. ఇక భద్రాచలం నియోజకవర్గ పరిధిలో ఉండే చర్ల, దుమ్ముగూడెం, జయశంకర్ భూపాల్ పల్లి జిల్లాలోని వాజేడు, వెంకటాపురం మండలాలు ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి సరిహద్దుగా ఉన్నాయి. భద్రాచలం నుంచి తూర్పుగోదావరికి 25 కి.మీ దూరం ఉండగా కొత్తగూడెం జిల్లా నుంచి పశ్చిమ గోదావరి జిల్లా కుక్కునూర్ మండలం నగరం వద్దకు కేవలం ఐదు కి.లో మీటర్ల దూరమే. పినపాక నుంచి పశ్చిమ గోదావరి జిల్లాకు పది కి.మీ, ఆశ్వారావుపేట నుంచి పశ్చిమ గోదావరి జిల్లాకు 90 కి.మీ, వైరా నుంచి కృష్ణా జిల్లాకు పది కి.మీ, చెర్వుమాధారం, వల్లబి నుంచి కృష్ణా జిల్లాకు పది కి.మీ, మధిర నుంచి కృష్ణా జిల్లా పది కి.మీ, సత్తుపల్లి నుంచి పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాలు 60 కి.మీ దూరంలో ఉన్నాయి. సంప్రదాయాలు, సాంస్కృతిపరంగా, వ్యాపర పరంగా, బంధుత్వాల పరంగా ఆంధ్ర, ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని సరిహద్దు ప్రాంతాలకు దగ్గరి సంబంధాలు ఉన్నాయి. పెళ్లి సంబంధాలు, సరిహద్దు గ్రామాలతోనే వియ్యం అందుకుంటారు, నిత్యావసర సరుకులను తెలంగాణ సరిహద్దు గ్రామాల వారు ఆంధ్రలో కొనుగోలు చేస్తుంటారు. రాజకీయంగా కూడా ఇరువురి మధ్య సన్నిహిత సంబంధాలు ఉంటాయి. ఆంధ్రప్రదేశ్ నుంచి గతంలోనే తెలంగాణకు వలస వచ్చి స్థిరపడిన వారు ఇప్పటికే ఉభయ ఖమ్మం జిల్లాలో సెటిలర్లు లక్షలాది సంఖ్యలో ఉన్నారు. ప్రధానంగా సత్తుపల్లి, ఆశ్వారావుపేట, భద్రాచలం ప్రాంతాల్లో రాజకీయంగా చక్రం తప్పేది తెలంగాణలో సెటిల్ అయిన ఆంధ్రవారే కావడం గమనార్హం. కృష్ణా జిల్లా రైతులకు ఖమ్మం జిల్లా నుంచే సాగర్ జలాలు పారుతుంటాయి. ఇలా మొత్తం మీద ఇరు రాష్ట్రాల సరిహద్దు గ్రామాల మధ్య మిత్రుత్వం ఇప్పటికి కొనసాగుతూనే ఉంది.

ఎన్నికల బహిష్కరణకు గ్రామస్థుల తీర్మానం

తండాను గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని డిమాండ్



మన తెలంగాణ/గాంధారి: గాంధారి మండల కేంద్రంలో షిస్కిల్‌గుట్ట తండావాసులు తమ తండాను గ్రామపంచాయతీగా ప్రకటించే వరకు తాము ఎన్నికలను బహిష్కరిస్తున్నామని ఏకగ్రీవంగా తీర్మానం చేసుకున్నారు. గతంలో గాంధారి గ్రామంలో ఉన్న తిమ్మాపురం, షిస్కిల్‌గుట్ట తండాను కలిపి తిమ్మాపూర్ పంచాయతీగా ఏర్పాటు చేశారు. తమ తండాలో 438 మంది జనాభా, 260 మంది ఓటర్లు ఉన్నారని, తమ తండాను, తొమ్మిది కిలోమీటర్ల దూరం గల తిమ్మాపూరంలో కలపడంతో తమకు అన్యాయం జరుగుతున్నదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ తండాను గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని, అంతవరకు తండాలో జరగబోయే ప్రతి ఎన్నికలను బహిష్కరిస్తామని తీర్మానించామని ఎంపిటిసి మోతిలాల్, రాజు, సక్రు నాయక్, తండా వాసులు తెలిపారు.

అప్పల బాధతో రైతు ఆత్మహత్య



మన తెలంగాణ/తిరుమలగిరి : వ్యవసాయం కలిసిరాక, బిడ్డ పెళ్లికి చేసిన అప్పు తీరక, కొత్తగా అప్పు దొరకక తీవ్ర మనస్తాపం చెందిన రైతు క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సంఘటన తిరుమలగిరి మండలం కోట్యానాయక్ తండా గ్రామ పంచాయతీ పరిధిలోని గుల్లబండ తండాలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ డేనియల్ కుమార్, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం తండాకు చెందిన రైతు ధరావత్ సోమని(50)కి వ్యవసాయం కలిసిరాలేదు. పెద్ద బిడ్డ పెళ్లి కోసం చేసిన అప్పులు తీరలేదు. మరో కూతురు పెళ్లి చేయడానికి సంబంధాలు చూస్తున్నారు.

మళ్లీ అప్పు దొరకదని భావించి మనస్తాపంతో క్రిమిసంహారక మందు తాగారు. గమనించిన బంధువులు వెంటనే తిరుమలగిరిలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమో దు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.


మేడారంలో భక్తుల సందడి

మన తెలంగాణ/ ములుగు : జయశంకర్ భూపాలపల్లి జిల్లా ములుగు నియోజకవర్గంలో తాడ్వాయి మండలం మేడారం గ్రామంలో రెండు సంవత్సరాలకోసారి జరిగే సమ్మక్క సారక్క జాతరకు దేశ నలుమూలల నుండి కోట్ల సంఖ్యలో భక్తులు హాజరై సమ్మక్క సారలక్కలను దర్శించుకుంటారు. సంక్రాంతి సెలవుల సందర్భంగా రాష్ట్ర నలుమూలల నుండి మేడారం జాతరకు అనేక సంఖ్యలో భక్తులు హాజరై జంపన్న వాగులో తలంటు స్నానం చేసి సమ్మక్క సారక్క గద్దెల వద్దకు చేరుకుని వారి మొక్కులను వన దేవతలకు అప్పచెబుతారు. అనంతరం రెండు సంవత్సరాలకోసారి జరిగే జాతరకు భక్తులు మొక్కిన మొక్కులు తీరుస్తున్న వన దేవతలకు మళ్లీ మొక్కులు తీర్చేందుకు సంవత్సరం మినీ జాతర ఫిబ్రవరి నెలలో జరుగుతుంది. ఈ జాతరకు కూడా లక్షల్లో భక్తులు హాజరవుతారు. ఇలా రెండు సంవత్సరాలే కాకుండా సంవత్సరానికి ఒక్కసారి మేడారం జాతర జరుగుతుంది. ప్రపంచ నలుమూలల నుండి బస్సులు, ప్రైవేట్ వాహనాల మీద మేడారం జాతరకు భక్తులు వస్తుంటారు. తెలంగాణ ప్రభుత్వం ములుగును సమ్మక్క సారలక్క జిల్లాగా ప్రకటించి మేడారానికి జాతీయ హోదా కల్పించి రాష్ట్ర ప్రభుత్వం అన్ని సౌకర్యాలు ఉండే విధంగా ఏర్పాట్లు చేసేందుకు సిద్ధం అవుతున్నట్లు తెలుస్తుంది. ములుగు జిల్లా అయిన తరువాత రూ.పదికోట్ల నిధులతో కార్యాలయాల కోసం భూ సేకరణ జరుగుతుంది. 30 సూపర్ న్యూమరీ పోస్టుల మంజూరుకు ప్రభుత్వం సన్నాహాలు జరుగుతున్నాయి. జిల్లా అయిన తరువాత ఇంకా సమ్మక్క సారలక్క జాతరకు మహార్దశ ఏర్పడి ప్రతి రోజు జాతరను తలపిస్తోంది. ములుగు జిల్లా అయిన తరువాత జిల్లాలో అన్ని సౌకర్యాలు ఉండే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. అందువల్ల మేడారం జాతరకు ఇంకా మంచి రోజులు వచ్చి జాతీయ హోదాలో త్వరలో జాతరను చూసే అవకాశాలు భక్తులకు వస్తుందని తెలుస్తుంది.



బంజారాల జీవనానికి సహజ రూపం

- ఆకట్టుకుంటున్న 'పోరిక' పెయింటింగ్స్
- బంజారా స్త్రీల వేషధారణ, అభరణాలకు ప్రత్యేకత





మన తెలంగాణ/ములుగు : ఒక జాతి సంస్కృతిని ఆ సంస్కృతిలో నిండుగా జీవించే వ్యక్తి మాత్రం సంపూర్ణంగా చిత్రించగలడు. అతనే ములు గు మండలంలోని మదనపల్లి గ్రామంలోని సామాన్య కుటుంబానికి చెందిన పోరిక రాజ్‌కుమార్, తల్లిదండ్రులైన సమ్మక్క వాచ్చు నాయక్ కుమారుడు రాజుకుమార్. తను ఏదైన సాధించాలనే తపనలో చిన్నప్పటి నుండే బొమ్మలను గీయడం ప్రారంభించారు. అదే బంజార సంస్కృతిలో పుట్టిపెరిగిన రాజ్‌కుమార్ భిన్నంగా తమ కులానికి చెందిన మహిళల సాంప్రదాయాలు, వ్యవహారశైలీని ప్రపంచానికి చాటి చెప్పాలనే తపనతోపాటు ప్రస్తుతం మారుతున్న హైటెక్ కాలంలోతమ కులస్థులు వేసుకున్న మహిళల వస్త్రాధరణతో కూడిన చిత్రాలను తన కుంచే ద్వారా చాటి చెప్పుతున్నారు. బంజారాలు, బంజార స్త్రీల వేషధారణ, అభరణాలు, దుస్తులు, సంస్కృతి సాంప్రదాయాలను రాజపుత్ర వంశానికి చెందిన వారమని, క్షత్రియులమని చెప్పుకునే తరుణంలో బంజారాల కులాలకు చెందిన వారు ఎలాంటి వస్త్రాలను, అభరణాలు, వేషధారణ తనదైన శైలీలో చిత్రాలను గీస్తూ తాను తమ సాంప్రదాయాలను చాటి చెప్పే ప్రయత్నం చేస్తున్నాడు. రాజుకుమార్ ఎంచుకున్న చిత్రకళలో బంజారా కట్టు బొట్టు, భాష, సాహిత్యాలపై అవగాహన పెంచుకుని అనేక చిత్ర రూపాలకు ప్రాణం పోస్తూ తన చిత్రంలో బంజార మహిళలు ముఖానికి ఇరుపక్కల నొసటి దగ్గర గడ్డానికి చిన్నచిన్న ముక్కలుగా పచ్చ పొడిపించుకుటారు. చేతులకు కాళ్లకు కూడా పచ్చపొడిపించుకుంటారు.




వీటిని తాను కళాత్మకంగా చిత్రించాడు. బంజారాలు తమ దుస్తులను తయారు చేసేటప్పుడు వాటిని రకరకాల అలంకరణలు చేస్తారు. అద్దాల ముక్కలను, గవ్వలను, సీసంతో చేసిన అభరణాలు, వెండి గజ్జెలు, వెండి బిళ్లలను వస్త్రాలపై అమర్చుతారు. రాజుకుమార్ తన కుంచెలో తన చిత్రంలో అంతే కళాత్మకంగా సహజ సిద్ధంగా గీశాడు.

రూ. 5 లక్షల కలప పట్టివేత



మన తెలంగాణ / ఇచ్చోడ : అక్రమంగా వ్యాన్‌లో స్మగ్లర్లు కలపను తరలిస్తుండగా అటవీ శాఖాధికారులు దాడి చేసి పట్టుకున్నారు. ఎఫ్ఆర్ఓ వాహబ్ అహ్మద్ కథనం ప్రకారం కలప స్మగ్లర్లు ఆదివారం రాత్రి వ్యాన్‌లో కలపను లోడ్ చేసి మండలంలోని గోవింద్‌పూర్ గ్రామవైపు తరలిస్తున్నారని అందిన సమాచారం మేరకు దాడి చేసి కలపను స్వాధీనం చేసుకున్నామని ఎఫ్ఆర్ఓ తెలిపారు. వాహనంలో సోదా చేయగా అందులో 70 దుంగలు లభ్యమయ్యాయి. వీటి విలువ రూ.5 లక్షల వరకు ఉంటుంది. పట్టుకున్న కలను టెంబర్‌డిపోకు తరలించారు. ఈ దాడిలో ఎఫ్ఆర్ఓ అమర్‌సింగ్, రాజేశ్వర్ రావు, ప్రేమ్‌సింగ్, ఎఫ్‌బిఓలు రాథోడ్ సందీప్, లచ్చన్న, బాపురావ్, బేస్‌క్యాంప్ సిబ్బంది, గణేష్, సమాదన్, శంకర్, హనుమంతు, బాపురావ్, ఇంద్ర, లచ్చు, విజయ్, హనుమంతు, ధర్మ పాల్గొన్నారు.



- గ్రామాలలో అటవీశాఖ ముమ్మర దాడులు
- వేటగాళ్లు, స్మగ్లర్లపై ఉక్కుపాదం
- పోలీస్ శాఖ సహకారంతో పిడి యాక్ట్ ప్రయోగానికి రంగం సిద్ధం

మనతెలంగాణ/ ఆదిలాబాద్ ప్రతినిధి : అడవుల జిల్లాగా పేరుగాంచిన ఆదిలాబాద్‌లో అటవీ విస్తీర్ణం రోజురోజుకు తగ్గిపోతుండడంతో స్మగ్లర్లపై కఠినంగా వ్యవహరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో అనునిత్యం వందలాది చెట్లు నేలకొరుగుతుండడం, ఇటీవల పెంబి అటవీ ప్రాంతంలో పులిని వేటగాళ్లు చంపివేయడంతో ప్రభుత్వం కఠినచర్యలకు ఉపక్రమించింది. అటవీప్రాంతానికి ఆనుకొని ఉన్న గ్రామాలలో ఇప్పటికే అటవీశాఖ అధికారులు, పోలీసుల సహకారంతో దాడులు నిర్వహిస్తూ ఇళ్లలో నిల్వ చేసుకున్న కలపను స్వాధీనం చేసుకోవడంతో పాటు మరోసారి అడవిలోకి వెళ్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరిస్తున్నారు. ఆదిలాబాద్ అటవీశాఖ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాలలో అనునిత్యం దాడులు నిర్వహిస్తూ అక్రమంగా నిల్వ చేసిన కలపను స్వాధీనం చేసుకుంటున్నారు. భారీగా కలప దొరికిన వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. అనునిత్యం బృందాలుగా ఏర్పడుతున్న అటవీశాఖ అధికారులు గ్రామాల్లో సోదాలు నిర్వహిస్తుండడంతో అడవులకు ఆనుకొని ఉన్న గ్రామాల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అటవీశాఖ అధికారులు దాడులు నిర్వహించి ఎవరిపై కేసులు నమోదు చేస్తారోననే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలాఉంటే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అడవులు సమృద్ధిగా ఉండడంతో కలపకు రాష్ట్రవ్యాప్తంగా మంచి డిమాండ్ ఉండడంతో పలువురు స్మగ్లర్లు రాజకీయ నాయకుల అండదండలు, అటవీశాఖలోని కొందరు ఉద్యోగుల సహకారంతో భారీ వృక్షాలను నేలకూల్చి అక్రమంగా కలపను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ వ్యవహారంలో ఉన్నతాధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. దీంతో కింది స్థాయి ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అడవుల సంరక్షణను గాలికొదిలేస్తున్నారనే విమర్శలున్నాయి. పులి వధ కేసును దర్యాప్తు చేస్తున్న పోలీసులు, అటవీశాఖ అధికారులు నివ్వెరపోయే నిజాలు తెలియడంతో ఖంగుతినాల్సి వచ్చింది. పులిని చంపిన ప్రధాన నిందితుడు వన్యప్రాణి మాంసం కలిగి ఉన్నా పెంబి అటవీశాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించారనే ఆరోపణలు వచ్చాయి. ఇలా సొంత శాఖకు చెందిన అధికారులు, సిబ్బంది స్మగ్లర్లు, వేటగాళ్లకు సహకరిస్తున్నారని తెలియడంతో పైఅధికారులు అంతర్మధనంలో పడ్డారు. దీనిపై ఇప్పటికే పోలీసులు అటవీశాఖ ఉద్యోగులపై కేసులు నమోదు చేసి అరెస్టు సైతం చేశారు. ఇదిలాఉంటే అటవీప్రాంతానికి ఆనుకొని ఉన్న గ్రామాల సమీపంలోని వచ్చే వణ్యప్రాణులను అనునిత్యం వేటాడుతున్నప్పటికీ పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. తమ పంట చేలల్లోకి వచ్చే వన్యప్రాణులను ఆయా గ్రామాల ప్రజలు చంపుతున్నారనే విమర్శలు వచ్చినా కేసుల



నమోదు, నిందితుల అరెస్ట్, సాక్ష్యాల సేకరణ తదితర అంశాలు ఇబ్బందికరంగా మారుతాయని భావిస్తున్న అటవీ శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని అంటున్నారు. ఈ తరుణంలో కలప స్మగ్లర్లు, వేటగాళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైన చోట పోలీసుల సహకారం తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో దాడులు ముమ్మరం చేస్తున్నారు. అలాగే గత ఏడాది కాలంగా కలప తరలిస్తూ పట్టుబడిన వారిపై పీడీ యాక్టు ప్రయోగించాలని నిర్ణయించారు. ఇప్పటికే జిల్లాల వారీగా జాబితాలను సిద్ధం చేసి స్మగ్లర్లపై కఠిన చర్యలు తీసుకొనేందుకు అధికారులు పూనుకున్నారు.

గత కొన్ని సంవత్సరాలుగా స్మగ్లర్లపై కఠినంగా వ్యవహరించక పోవడంతోనే జిల్లాలోని అటవీ సంపద కరిగిపోయిందనే అభిప్రాయంతో ఉన్న సంబంధిత శాఖ ఉన్నతాధికారులు ఇప్పటికైనా దిద్దుబాటు చర్యలు ప్రారంభించడం అభినందనీయమని జిల్లా ప్రజలు పేర్కొంటున్నారు.

కుంగుబాటుతో చిత్తవుతున్న యువ



నేటి కాలంలో మారుతున్న పరిస్థితులు, ఆహారపు అలవాట్లు, జీవన శైలి వీటి వల్ల యువతలో ఎక్కువగా పని ఒత్తిడితో కుంగుబాటుకి గురవుతున్నారు. దీంతో అనేక రకాల ఆరోగ్య సమస్యలు, పని వేళలు వీటన్నింటితో సతమతమవుతున్నారు. ఈ కుంగుబాటు కారణంగా ఏపనీ సరిగా పనిచేయకపోవడం, చిన్న సమస్యలకే పెద్దగా అరవడం, కేకలు వేయడం, అందరితో కలిసి మాట్లాడలేకపోవడం, ఒంటరిగా గడపాలనుకోవడం లాంటివి ఎదుర్కొంటున్నారు నేటి యువత.

ఇంట్లో ఉన్నప్పుడు సహజంగా మన ఫీలింగ్స్‌ని సంకోచం లేకుండా బయట పెడుతుంటాం. ఎలాంటి అసౌకర్యం కలిగినా, బాధ, విచారం ఉన్నా ఆ ఫీలింగ్స్‌ని దాచుకోం. కానీ ఇంటి నుంచి బయటకి అడుగు పెడుతూనే మనం చాలా మర్యాదగా, పద్ధతిగా, స్నేహపూర్వకంగా మెలగాల్సి ఉంటుంది. అంటే మర్యాద అనే ముసుగు వేసుకోవలసి ఉంటుంది. మామూలుగా ఇది అందరూ చేసేదే గానీ డిప్రెషన్ బాధితులు మాత్రం ఈ మర్యాద ముసుగులో ఎక్కువసేపు ఉండలేరు. ఉక్కిరిబిక్కిరి అవుతారు. లోపల ఒకలా, బయటికి మరోలా ఉండడం వాళ్లకి సాధ్యం కాదు. కొంతమంది కుంగుబాటు బాధితులు ఈ ఒత్తిడిని తట్టుకునేందుకు మందులు వాడుతుంటారు. థెరపీ తీసుకుంటారు. చాలామందికి వాళ్లు మానసిక అనారోగ్యంతో బాధపడుతున్నామనే విషయమే తెలియదు.

డిప్రెషన్ హై ఫంక్షనింగ్ డిప్రెషన్, లో ఫంక్షనింగ్ డిప్రెషన్ అని రెండు రకాలు. హై ఫంక్షనింగ్ డిప్రెషన్ ఉన్న వ్యక్తులు సమాజంలో గుర్తింపు పొంది పెద్ద స్థాయిలో ఉన్నవారై ఉంటారు. ఉదాహరణకు.. నాయకులు, కంపెనీ యాజమాన్యం. లో ఫంక్షనింగ్ డిప్రెషన్‌లో ఉండేవారికి సమాజంలో అంత పేరు ప్రఖ్యాతులేమీ ఉండవు, ఉదాహరణకు.. మన అమ్మ.

హై ఫంక్షనింగ్ డిప్రెషన్ లో ఉన్నవాళ్లు అన్ని విషయాలకీ తొందరగా చిరాకుపడతారనో, విచారంగా ఉంటారనో అర్థం కాదు. అంటే, జనాల మనసులో కుంగుబాటు అంటే అలాంటి ఆలోచనే ఉంటుంది. కానీ అలా పైకి కనిపించకపోవచ్చు. బయటి జనాలకి తెలియని రీతిలో మనసులో సంఘర్షణ జరుగుతూ ఉంటుంది.

చదువుకునే రోజుల్లో డిప్రెషన్‌లో ఉండేవాళ్లు సాధారణంగా ఏదో పోగొట్టుకున్న ఫీలింగ్... అంటే కోపం, చిరాకు చాలా విపరీతంగా చూపిస్తుంటారు. మనసులో డిప్రెషన్‌తో జరుగుతున్న సంఘర్షణ ఎంతగా ఉంటుందంటే ఆఖరికి ఇంట్లో ఎక్కువసేపు ఉండరు కూడా. వాళ్లలో ఏదో లోపం ఉందని ఇతరులు గుర్తిస్తారేమోననే భయంతో ఇంట్లో ఉండకుండా, బయట తిరుగుతూంటారు. ఫలితంగా చదువుల్లో వెనకబడుతుంటారు.

అలాంటి దశలో వారు థెరపీ తీసుకోవడం



అవసరం.

శీతాకాలంలో కుంగుబాటు ఉధృతంగా ఉంటుంది. అలాంటప్పుడు వైద్యం ముఖ్యం. క్రమంగా ఆందోళన తగ్గి కొంత ఉపశమనం కలుగుతుంది. కుంగుబాటు అంటే భావనాపరమైన ఆందోళన. హై ఫంక్షనింగ్ డిప్రెషన్ అంటే, అంతరాంతరాల్లో నిరంతరం ఎమోషనల్ డిస్ట్రెస్‌లో ఉన్నా సరే, మన ముఖంలో ఏమాత్రం ఆ భావాలు బయటపడకుండా ఉండడం. ఆ సామర్థ్యం ఉంటే, లోపల ఎంత జరుగుతున్నా, బయటికి మాత్రం మామూలుగానే ఉంటాం. ఇలాంటి వాళ్లు జీవితంలో ఎన్నో దృక్కోణాల్లో గొప్ప విజయాలు సాధిస్తారు.

డిప్రెషన్‌లో ఉన్నవాళ్లు కొంతమంది బయటికి విచారంగా ఉన్నట్టు కనిపించరు. ఏ విషయాల్నీ నిందించరు, ఖండిస్తూ మాట్లాడరు. నవ్వుతారు, తరచూ జోక్స్ వేస్తుంటారు. కానీ లోపల వేరేగా ఉంటుంది. ఒంటరిగా ఉన్నపుడు, అంతటా చీకటిగా ఉన్నట్లు భావిస్తారు. జీవితం అంటే విసుగుపడతారు.

పని ప్రదేశాల్లోనే కాక మిగతా చోట్ల కూడా చాలామంది చాలా రకాల పనులు చేయగలుగుతారు. ప్రతీదీ సరిగ్గా చేయాలనే భావనతో వ్యవహరిస్తారు, ఉద్యోగ బాధ్యతల్లో చాలా అలిసిపోతారు. మెడికేషన్, థెరపిస్ట్ సాయంతో మనం ఈ లక్షణాల నుంచీ, ఎమోషనల్ డిస్ట్రెస్ నుంచీ బయట పడవచ్చు. డిప్రెషన్ అనేది కేవలం విడిగా ఉండే ఒక ఫీలింగ్ కాదు. డిప్రెషన్‌కి లోనవుతున్నానని మొదటిసారిగా అర్థమైనపుడు, అన్ని ఫీలింగ్స్‌కీ నిరాశనీ, శూన్యతనీ జతకలిపి ఫీల్ అవుతున్నారని అర్థం. ఆ మందకొడితనం, నిరాశ నిరంతర స్రవంతిలా ప్రవహిస్తూ ఎంతో బాధపడుతుంటారు. కానీ ట్రీట్‌మెంట్‌కి వెళ్లినపుడు, డిప్రెషన్ లోతు తెలిసిందానికంటే చాలా లోతని అర్థం చేసుకుంటారు. అందువల్ల డిప్రెషన్‌లో ఉన్నారని ఏమాత్రం తెలిసినా, ఆలస్యం చేయకుండా చికిత్స తీసుకోవాలి. దీన్నుంచి బయటపడితే మిగతా జీవితమంతా సక్రమంగా సాగిపోతుంది.

హై ఫంక్షనింగ్ డిప్రెషన్‌లో చాలాసార్లు మంచి భోజనం ఎదురుగా ఉన్నా తినాలనిపించదు. ఒంటరిగా ఉండాలనిపిస్తుంది. ఎన్ని రోజులైనా తలస్నానం చేయాలనిపించదు. లాండ్రీ పని మొదలుపెట్టినా వారాలతరబడి ఆ కార్యక్రమం కొనసాగుతూనే ఉంటుంది. అలిసిపోయిన ఫీలింగ్ కలిగితే మాత్రం ఎంతసేపు నిద్రపోతారు.

ఇంట్లో అయితే ఎలా ఉన్నా ఫర్వాలేదు గానీ, సమాజంలో మాత్రం అలా ఉండకూడదు గదా. ప్రతి ఒక్కరూ శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పట్టించుకోవాలి. ఆరోగ్యంగా ఉంటేనే ఉద్యోగం, ఉద్యోగమిచ్చిన సంస్థ, ఇల్లు, పిల్లలూ అంతా బాగుంటారు.

అవే కారణాలు..

కార్పొరేట్ రంగంలో కుంగుబాటు, ఆందోళన వంటి సమస్యలతో 42.5శాతం మంది ఉద్యోగులు బాధపడడానికి వారి ఆహార పద్ధతులు, జీవనశైలే ప్రధాన కారణమని అంటున్నారు. వేళకు ఆహారం తీసుకోకపోవడం, తీసుకునే ఆహారంలో క్యాలరీలు ఎక్కువగా ఉండి, పోషకాలు తక్కు వుండేవి కావడం. వ్యాయామం చేయకపోవడం. నిద్రలేమి కూడా ప్రధాన కారణాలని వైద్యనిపుణుల అభిప్రాయం.

38.5 శాతం మంది రోజుకు 6గంటలకన్నా తక్కువ నిద్రపోతున్నారని వెల్లడించారు. దీంతో శరీర బరువు అదుపుతప్పడంతో మెటబాలిజం పనితీరు తగ్గడంవల్ల మానసిక సమస్యలకు దారితీ స్తున్నాయని వివరిస్తున్నారు. ఉద్యోగం పోతుందేమోననే భయం, ఉనికి చాటుకోవాలనే తాపత్రయం, ఆందోళన కూడా కుంగుబాటుకు ప్రధాన కారణాలుగా చెప్పబడుతున్నాయి.

కుంగుబాటుకు గురవుతున్న వారు..

వయసుల వారీగా చూస్తే 20 29 ఏళ్ల మధ్యవారిలో 55 శాతం మంది కుంగుబాటు(డిప్రెషన్)కు గురవుతున్నట్టు తేలింది. 30 39 ఏళ్ల మధ్యవారు 26శాతం, 40 49 ఏళ్ల మధ్యవారు, 16శాతం 50 నుంచి 59 ఏళ్ల మధ్యవారు 2శాతం

మంచి అలవాట్ల దిశగా అడుగులు

మానసిక, శారీరక ఆరోగ్యంపై ఉద్యోగులు కాస్త శ్రద్ధ తీసుకుంటున్నారు. ఈ మధ్యకాలంలో వ్యాయామం, ధ్యానం, ఆహారపు అలవాట్లపై దృష్టి సారిస్తున్నారు.

సామాజికసేవా కార్యక్రమాల్లో పాల్గొనడం, బంధు, మిత్రులను కలిసి అభిరుచులను పంచుకోవడం కనిపిస్తుంది. ఆఫీసుల్లో తోటి ఉద్యోగుల మధ్య పోటీతత్వం కాకుండా స్నేహభావాన్ని, మంచి వాతావరణాన్ని పెంపొందించుకోవాలి.

పొగడ్తలకు పడిపోతున్నారా..



ఈ రోజుల్లో యువత ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వీటితోనే వారి జీవితమంతా అనేలా గడిపేస్తున్నారు. అయితే వీటిల్లో పెట్టే పోస్టులకు లైకులు, కామెంట్లను టార్గెట్ పెట్టుకుంటారు. వాటికి వచ్చే స్పందనను బట్టి మురిసి పోతుంటారు. అయితే రోజూ చేసే పోస్టుల్లో వచ్చే కామెంట్లు ముఖ్యంగా పొగడ్తలు యువతను ఒకరకమైన ప్రభావానికి గురిచేస్తుంది. సోషల్ మీడియాలో పోస్టు చేసిన వాళ్ల ఫొటోకి వెటకారంగా స్పందిస్తే బాధపడుతారని పొగడటం చాలా మందికి అలవాటై ఉంటుంది. దగ్గరి స్నేహితుడో, బంధువో, ఆత్మీయుడో ఎవరి పోస్టుల్లో అయినా పొగడ్తలు సాధారణం. అమ్మాయిల పోస్టుల్లో అయితే అబ్బాయిల పొగడ్తలు చెప్పనక్కర్లేదు. అయితే ఇలాంటి పొగడ్తలు మానసికంగా ప్రమాదం కలిగిస్తాయని ఓ యూనివర్శిటీ సర్వేలో తేలిందట. సాధారణంగా పొగడ్తలు మనిషి మానసిక పరిస్థితిని మెరుగుపరుస్తాయి. చేస్తున్న పని మీద ఆసక్తిని, పట్టుదలను పెంచుతాయి. అయితే సోషల్ మీడియాలో పొగడ్తల గురించి ఆ యూనివర్శిటీ చేసిన సర్వే ప్రకారం.. అతి పొగడ్తల వల్ల తెలియకుండా అవతలి వ్యక్తి ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందట. ఒకరు ఫొటో పోస్టు చేస్తే అది ఎలా ఉన్నా మీరు అందంగా ఉన్నారు అని పొగిడితే అది మానసికంగా ప్రభావం చూపుతుందట. మీ పొగడ్తను గుర్తు చేసుకొని మరింత అందంగా తయారవడానికి అవతలి వ్యక్తి దానికి అనుగుణంగా తిరుగుతారంట. తర్వాత పోస్ట్ చేసే ఫొటో మరింత అందంగా వచ్చి, ఇంకా పొగడ్తలను ఆశిస్తారట. ఇలా సోషల్ మీడియాలో ఉత్సాహంగా ఉండే వారు మానసిక ప్రశాంతతకు దూరమయ్యే ప్రమాదం ఉందని సర్వేలో వెల్లడైంది. ఇకనుంచైనా కాస్త సోషల్ మీడియాలో పొగడ్తలకు కాస్త ఆలోచించండి

అతిగా వాడితే అనర్థాలు...



స్మార్ట్‌ఫోన్ ఇది ఈ రోజుల్లో అతిముఖ్యమైన వస్తువుల్లో ఒకటి. ఒక రోజు తిండిలేకపోయినా ఉంటారు..కానీ, చేతిలో ఫోన్‌లేకుండా ఉండలేని పరిస్థితి నేటితరం యువతది. ఇదిలా రానురాను ఓ ఫోబియోలాగా మారిపోయింది.

అతిగా చేతివేళ్లను వాడడం, స్క్రీన్ మీద వాటిని అటుఇటు అదేపనిగా కదపడం వల్ల చేతివేళ్ల కీళ్లు, కండరాలు, నరాలు దెబ్బతింటాయి. టెకట్స్ మెసేజ్‌లు విపరీతంగా టైప్ చేస్తున్నారనుకోండి బొటనవేలి కదలికలకు సాయపడే కండరాలకి ఇబ్బంది కలుగుతుంది. ఇవేనా స్మార్ట్‌ఫోన్ స్క్రీన్ మీద మీ వేళ్లు తకదిమితోం అని అదేపనిగా ఆడిస్తున్నారనుకోండి వేళ్లు కందిపోయి మంటపుడతాయి. ఎక్కువమందిలో ఈ సమస్య కనిపిస్తుంది. చేతిమీద, మణికట్టు వద్ద గాంగ్లియన్ సిస్ట్‌లు లేదా లంప్‌లు ఏర్పడతాయి. వీటివల్ల భరించలేని నొప్పి ఉంటుంది. దాంతో వైద్య చికిత్స అవసరం పడుతుంది. ఇవి చాలవన్నట్టు ఫోన్ నుంచి విడుదలయ్యే వేడి వల్ల అరచేతిలో వేడి పుట్టి అరిచేతుల్లో మంటలు వస్తాయి. అతిగా స్మార్ట్‌ఫోన్ వాడడం వల్ల చేతులు గట్టిగా అవ్వడమే కాకుండా ఎల్లప్పుడూ సన్నటి నొప్పి ఉంటుంది. ఈ నొప్పి వల్ల రోజూ వారీ పనులకు ఆటంకం ఏర్పడుతుంది. స్మార్ట్‌ఫోన్ వాడడం వల్ల తిప్పలు లేకుండా ఉండాలంటే స్మార్ట్‌ఫోన్ వాడకంలో 30 నిమిషాలకి ఒకసారి బ్రేక్ తీసుకోవాలి. అయినా నొప్పి తగ్గడం లేదంటే ఫోన్‌ని ఎంత తక్కువ వాడితే అంతమంచిది. ఈ జాగ్రత్తలతో పాటు చేతివేళ్లను కదిలించాలి. రక్త ప్రసరణ సరిగా జరిగేందుకు మణికట్టు వ్యాయామాల వంటివి చేయాలి. ఇలా చేస్తే చేతివేళ్లకు కూడా ఉపశమనం కలుగుతుంది.

ఇంట్లో చేయండిలా..

చేతుల్ని ఒకసారి వేడి నీళ్లలో ముంచి తర్వాత చల్లటి నీళ్లలో ముంచాలి. పెయిన్‌బామ్ రాసుకోవాలి (రుద్దకూడదు). చేతులకు సంబంధించి తేలికపాటి వ్యాయామాలు చేయాలి. మొబైల్ వాడకం మానేస్తే మంచిది. అదెలాగూ కుదరదు కాబట్టి వాడకం అయినా తగ్గించాలి. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా సమస్య తగ్గక, నొప్పి ఎక్కువగా ఉంటే వైద్యుల్ని సంప్రదించాలి. మౌస్ వంటి వాటిని వాడేవాళ్లు మణికట్టును మెత్తటి కుషన్ మీద ఉంచాలి. లాప్‌టాప్ వాడుతుంటే రిస్ట్ కంఫర్ట్ ప్యాడ్స్‌ను వాడాలి.

దేన్నయినా పట్టుకుని లాగే గ్రిప్ స్ట్రెంతనింగ్ వ్యాయామాలు చేయాలి. ఇలా చేయడం వల్ల చేతులు, కీళ్లు సాగి వాటికి వ్యాయామం అందుతుంది.

మొబిస్టార్ ఎక్స్1 నాచ్ స్మార్ట్ ఫోన్ విడుదల



మొబిస్టార్ తన నూతన స్మార్ట్‌ఫోన్ మొబిస్టార్ ఎక్స్1 నాచ్‌ను తాజాగా మార్కెట్‌లో విడుదల చేసింది. ఇందులో 5.7 ఇంచుల భారీ డిస్‌ప్లేను ఏర్పాటు చేశారు. డ్యుయల్ 4జీ వీవోఎల్‌టీఈ ఫీచర్‌ను ఈఫోన్‌లో అందిస్తున్నారు. ఈ ఫోన్‌లో ముందు, వెనుక భాగాల్లో 13 మెగాపిక్సల్ కెమెరాలను ఏర్పాటు చేశారు. ముందు భాగంలో ఉన్న కెమెరాకు ఫేస్ అన్‌లాక్ సదుపాయాన్ని అందిస్తున్నారు. వెనుక భాగంలో ఫింగర్ ప్రింట్ సెన్సార్ ఉండగా, ఈ ఫోన్‌లో డెడికేటెడ్ డ్యుయల్ సిమ్, మైక్రో ఎస్‌డీ కార్డు స్లాట్లను ఏర్పాటు చేశారు. ఇక ఈ ఫోన్‌కు చెందిన 2జీబీ ర్యామ్, 16 జీబీ స్టోరేజ్ వేరియెంట్ ధర రూ.8,499 ఉండగా, 3జీబీ ర్యామ్, 32 జీబీ స్టోరేజ్ వేరియెంట్ ధర రూ.9,499 గా ఉంది.

ముద్రా రుణాలతో జాగ్రత్త

- మొండి బకాయిలు రూ.11 వేల కోట్లకు పెరిగాయి
- కేంద్రానికి ఆర్‌బిఐ హెచ్చరికలు



న్యూఢిల్లీ: ముద్రా రుణాలపై ఆర్‌బిఐ హెచ్చరికలు చేసింది. కేంద్ర ప్రభుత్వం చిన్నతరహా పరిశ్రమల కోసం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన 'ప్రధానమంత్రి ముద్రా యోజన' పథకంలో ఎన్‌పిఎ లేదా మొండి బకాయిలు పెరుగుతున్నాయని ఆర్‌బిఐ(భారతీయ రిజర్వు బ్యాంక్) ప్రభుత్వాన్ని హెచ్చరించింది. ఈ పథకం మొండి బకాయిలకు మరో పెద్ద వనరుగా మారనుందని, దీని పట్ల కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ జాగ్రత్త వహించాలంటూ ఆర్‌బిఐ సూచించింది. పిఎంఎంవై (ప్రధానమంత్రి ముద్రా యోజన) కింద మొండి బకాయిలు రూ.11 వేల కోట్లకు పెరిగాయని రిజర్వు బ్యాంక్ వెల్లడించిందని ఈ మేరకు ఆర్థిక మంత్రిత్వశాఖ పేర్కొంది.

రూ.2.46 లక్షల కోట్లకు రుణాలు

పిఎంఎంవై వార్షిక నివేదిక ప్రకారం, 2017–18 ఆర్థిక సంవత్సరంలో ఈ పథకం కింద రుణాలు రూ.2.46 లక్షల కోట్లకు చేరాయి. దీనిలో 40 శాతం రుణాలు మహిళా వ్యాపారులకు, 33 శాతం సామాజిక విభాగాలకు కేటాయించారు. 2017–18 ఆర్థిక సంవత్సరంలో ముద్రా పథకం ద్వారా 4.81 మంది సూక్ష్మ రుణగ్రస్తులు లబ్ధిని పొందారు. ప్రధానమంత్రి ముద్రా యోజన' పథకంను 2015 ఏప్రిల్ 8న ప్రారంభించారు.

మూడు విభాగాల్లో ఈ రుణాలు

ఈ పథకం కింద బ్యాంకులు సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలకు రూ.10 లక్షల వరకు ఆర్థిక సహాయాన్ని అందిస్తాయి. మూడు విభాగాల్లో ఈ రుణాలను అందజేస్తారు. మొదట 'శిశు' కింద రూ.50 వేలు, 'కిశోర్' కింద రూ.50,001 నుంచి రూ.5 లక్షలు, 'తరుణ్' కింద రూ. 5 లక్షల నుంచి రూ.10 లక్షల మధ్య రుణాలను ఇస్తారు. ఐఎల్ అండ్ ఎఫ్ఎస్‌లో నగదు కొరత సమస్యల వల్ల దేశీయ ఆర్థిక వ్యవస్థ మందగమనానికి చేరుకుంటోంది. ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ సంక్షోభం ఉదంతంతో బ్యాంకులపై తీవ్ర ప్రభావం పడింది. ఇండస్ ఇండ్ బ్యాంక్ జనవరి 9న మూడో త్రైమాసిక ఫలితాలను వెల్లడించగా, ఐఎల్ అండ్ ఎఫ్ఎస్‌లో తన పెట్టుబడుల వల్ల లాభాలు తగ్గాయని పేర్కొంది. ప్రస్తుతం ఐఎల్ అండ్ ఎఫ్ఎస్‌లో ఇండస్ ఇండ్ బ్యాంకు పెట్టుబడులు రూ. 600 కోట్లుగా ఉన్నట్టు బ్యాంకు పేర్కొంది. అసెట్స్ క్వాలిటీ విషయంలో బ్యాంక్ కొంత తడబడిందని, మొండి బకాయిలు, నిరర్థక ఆస్తుల నిష్పత్తి గత సంవత్సరం కంటే పెరిగిందని బ్యాంకు తెలిపింది. పునరుద్ధరణ ప్రణాళిక పరిణామాలు, పర్యవసానాలను పర్యవేక్షిస్తున్నట్టు బ్యాంక్ వెల్లడించింది.



టాప్ 5 కంపెనీల విలువ రూ.43,689 కోట్లు పెరిగింది

ముంబై: గతవారం టాప్ 10 బ్లూచిప్ కంపెనీల్లో ఐదు సంస్థలు మార్కెట్ విలువ(ఎం–క్యాప్) రూ.43,689 కోట్లు పెంచుకున్నాయి. వీటిలో ఐటిసి, ఇన్ఫోసిస్ సంస్థలు అత్యధికంగా లాభపడ్డాయి. టాప్ 10 జాబితాలో ఐటిసి, హెచ్‌డిఎఫ్‌సి, ఇన్ఫోసిస్, ఎస్‌బిఐ, ఐసిఐసిఐ బ్యాంక్‌లు మార్కెట్ విలువను పెంచుకోగా, మిగతా సంస్థలైన రిలయన్స్ ఇండస్ట్రీస్, టిసిఎస్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, హెచ్‌యుఎల్, కొటక్ మహీంద్రా బ్యాంక్‌లు నష్టపోయాయి. ఇక మార్కెట్ విలువ భారీగా పెంచుకున్న ఎఫ్‌ఎంసిజి దిగ్గజ ఐటిసి రూ.17,941 కోట్ల లాభంతో రూ.3,61,773 కోట్లకు చేరింది. ఐటి దిగ్గజం ఇన్ఫోసిస్ విలువ రూ.10,026 కోట్లు పెరిగి రూ.2,98,684 కోట్లకు పెరిగింది. ఐసిఐసిఐ బ్యాంక్ మార్కెట్ విలువ రూ.8,378 కోట్లు పెరిగి రూ.2,43,822 కోట్లు కాగా, ఎస్‌బిఐ ఎం–క్యాప్ రూ.4,506 కోట్లు పెరిగి రూ.2,70,013 కోట్లకు చేరింది. హెచ్‌డిఎఫ్‌సి ఎం–క్యాప్ రూ.2,837 కోట్లు పెరిగి రూ.3,41,770 కోట్లు అయింది. వీటికి విరుద్ధంగా టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టిసిఎస్) విలువ రూ.12,007 కోట్లు కోల్పోయి రూ.6,91,170 కోట్లకు తగ్గింది. కోటక్ మహీంద్రా బ్యాంక్ మార్కెట్ విలువ రూ.4,829 కోట్లు పడిపోయి రూ.2,32,958 కోట్లకు చేరగా, హిందుస్తాన్ యునిలివర్ విలువ రూ.2,575 కోట్లు పతనమై రూ.3,82,785 కోట్లకు తగ్గింది. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ విలువ రూ.1,522 కోట్లు తగ్గి రూ.5,74,399 కోట్లకు పడిపోగా, ఇక రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎం–క్యాప్ రూ.728 కోట్లు నష్టపోయి రూ.6,95,910 కోట్లకు చేరింది. టాప్ 10 ర్యాంకింగ్‌ను చూస్తే రిలయన్స్ ఇండస్ట్రీస్ మరోసారి మొదటి స్థానంలో, ఇక రెండో స్థానంలో టిసిఎస్ ఉన్నాయి. ఆ తర్వాత వరుసగా హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, హెచ్‌యుఎల్, ఐటిసి, హెచ్‌డిఎఫ్‌సి, ఇన్ఫోసిస్, ఎస్‌బిఐ, ఐసిఐసిఐ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్‌లు ఉన్నాయి. గత వారాంతం శుక్రవారం దేశీ స్టాక్ మార్కెట్లు తొలి మూడు రోజులూ జోరందుకున్నాయి. ఆఖరి రెండు రోజుల్లోనూ ట్రేడర్లు లాభాల స్వీకరణకు ప్రాధాన్యం ఇవ్వడంతో వెనకడుగు వేశాయి. చివరికి మార్కెట్లు లాభాలతో నిలిచాయి. అయితే సెన్సెక్స్ 314.74 పాయింట్లు లాభంతో 36,009 పాయింట్ల వద్ద స్థిరపడింది. ప్రామాణిక ఇండెక్స్ సెన్సెక్స్ పలుమార్లు ఊగిసలాటకు లోనైనప్పటికీ 36,000 మార్క్ ఎగువనే ముగియడం విశేషం. సెన్సెక్స్ నికరంగా 315 పాయింట్లు(0.9 శాతం) ఎగసి 36,010 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 68 పాయింట్లు(0.65 శాతం) బలపడి 10,795 వద్ద నిలిచింది.

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	70.43
యూరో	81.13
బ్రిటిష్ పౌండ్	89.84
ఆస్ట్రేలియన్ డాలర్	50.68
కెనెడియన్ డాలర్	53.29
సింగపూర్ డాలర్	52.09
స్విస్ ఫ్రాంక్	71.59
చైనీస్ యువాన్	10.41
మలేషియన్ రింగిట్	17.19
న్యూజిలాండ్ డాలర్	47.86
హాంకాంగ్ డాలర్	8.98
జపనీస్ యెన్	0.65
కువైట్ దినార్	232.67
సౌతాఫ్రికన్ రాండ్	5.09

బులియన్



బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22 క్యారట్	24 క్యారట్	మార్పు(%)
చెన్నై	30690	32823.53	0.1%
ముంబై	31280	33454.55	0%
ఢిల్లీ	31400	33582.89	0%
కోల్‌కతా	31750	33957.22	0%
కేరళ	33957.22	36317.88	0%
బెంగళూరు	30160	32256.68	0.13%
హైదరాబాద్	30720	32855.61	0.1%
గల్ఫ్	137.68	147.25	0%

వెండి ధర (రూ./ కిలో)

చెన్నై	₹ 42049.00
ముంబై	₹ 42049.00
ఢిల్లీ	₹ 42049.00
కోల్‌కతా	₹ 42049.00
హైదరాబాద్	₹ 42049.00





బడ్జెట్‌లో కార్పొరేట్ పన్ను తగ్గించండి

ప్రభుత్వానికి ఫిక్కీ సిఫారసు

న్యూఢిల్లీ: ఆర్థిక వృద్ధిని పెంచడం, మొత్తం పన్ను వసూళ్లను పెంచేందుకు వచ్చే బడ్జెట్ సమావేశాల్లో కార్పొరేట్ పన్ను రేటులో 25 శాతం కోత విధించాలని ఆదివారం పరిశ్రమ చాంబర్ ఫిక్కీ ప్రభుత్వానికి సిఫారసు చేసింది. అలాగే వ్యక్తిగత పన్ను చెల్లింపుదారులకు పన్ను శ్లాబ్‌లో సవరణలు చేయాలని, రూ.20 లక్షల వార్షిక ఆదాయం దాటితే గరిష్ఠంగా విధించే 30 శాతం పన్ను రేటులో మార్పులు చేయాలని కూడా ఫిక్కీ కోరింది. వ్యాపారాల్లో అధిక పన్ను వ్యయం వల్ల ఉత్పత్తి వ్యయం పెరుగుదలకు దారితీస్తోందని, ఈ ఫలితంగా రిఇన్వెస్ట్‌మెంట్, వృద్ధి కోసం మిగుళ్లు తగ్గుతున్నాయని ఫిక్కీ పేర్కొంది. కార్పొరేట్ పన్ను రేటు 30 శాతంతో పాటు డివిడెండ్ పంపిణీ పన్ను రేటు 20 శాతం కలిపి కంపెనీ మొత్తం పన్ను వ్యయం భారీగా అవుతోందని వెల్లడించింది. 2019–20 ముందస్తు బడ్జెట్ సిఫారసుల్లో భాగంగా చాలా కీలక అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలు గణనీయమైన రేటు తగ్గింపునకు ప్రయత్నిస్తున్నాయని, భారత్ కూడా వ్యాపారాల్లో ఉన్న ఈ రేటును పరిశీలించాలని ఫిక్కీ తెలిపింది. కనీస ప్రత్యామ్నాయ పన్ను రేటులో తగ్గింపు అవసరమని, ఇది ప్రస్తుతం 18.5 శాతంతో ఎక్కువగా ఉందని వెల్లడించింది.

ద్రవ్యలోటు లక్ష్యం సవాలే

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సాధించడం కష్టమే : నిపుణులు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి జిడిపి(స్థూల దేశీయోత్పత్తి)లో ద్రవ్యలోటు లక్ష్యం 3.3 శాతాన్ని చేరకోవడం ప్రభుత్వానికి సవాలేనని నిపుణులు భావిస్తున్నారు. జిఎస్‌టి(వస్తు, సేవల పన్ను) వసూళ్ల తగ్గడం, వ్యయాలు పెరగడం, పారిశ్రామికోత్పత్తి మందగించడం వల్ల ద్రవ్యలోటు లక్ష్యం చేరుకోవడం కష్టతరమేనని వారంటున్నారు. అదే సమయంలో సాధారణ ఎన్నికలకు ముందు ఓటర్లను ఆకర్షించేందుకు ప్రభుత్వం ప్రజాకర్షక ప్రకటనలు చేసే అవకాశముందని, దీనివల్ల ద్రవ్యలోటు లక్ష్యం సాధించడం సాధ్యం కాకపోవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు. బడ్జెట్ అంచనా 3.3 శాతంతో పోలిస్తే జిడిపిలో ద్రవ్యలోటు 3.5 శాతానికి చేరనుందని కొందరు నిపుణులు ఇప్పటికే అంచనా వేశారు. నవంబర్ ముగింపునాటి ప్రభుత్వ ఆర్థిక లోటు పూర్తి ఏడాది అంచనాలో 114 శాతానికి చేరింది. 2018–19లో జిడిపిలో ప్రభుత్వ ద్రవ్య లోటు రూ.6.24 లక్షల కోట్లు లేదా 3.3 శాతం.. అయితే ఏప్రిల్–నవంబర్ నాటికి ద్రవ్యలోటు రూ.7.16 లక్షల కోట్లు లేదా 114.8 శాతానికి పెరిగింది. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో రికార్డు అయిన 112 శాతంతో పోలిస్తే స్వల్పంగా పెరిగింది.

క్యూ3, ద్రవ్యోల్బణం గణాంకాలు కీలకం

- ఈవారం మార్కెట్‌పై విశ్లేషకుల అంచనా

ముంబై: కీలక ద్రవ్యోల్బణం గణాంకాలు, మూడో త్రైమాసిక ఫలితాలు ఈవారం మార్కెట్లను శాసించనున్నాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఎఫ్‌పిఐ(విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల) పెట్టుబడులు, డాలరుతో రూపాయి మారకం విలువ కదలికలు, ముడిచమురు ధరలు వంటి పలు అంశాలు మార్కెట్లకు కీలకంగా నిలవనున్నట్టు విశ్లేషకులు తెలియజేశారు. గతవారం ఆఖరి రోజుల్లో ఐటి దిగ్గజం ఇన్ఫోసిస్ టెక్నాలజీస్ క్యూ3 ఫలితాలు విడుదల చేసింది. ఇప్పటికే టిసిఎస్, ఇన్ఫోసిస్, ఇండస్ ఇండ్ బ్యాంక్ తదితర కంపెనీలు క్యూ3(అక్టోబర్–డిసెంబర్) గణాంకాలను వెల్లడించగా, ఈవారం మరికొన్ని కార్పొరేట్ దిగ్గజాల ఫలితాలు వెల్లడించనున్నాయి. వాటిలో జి ఎంటర్‌టైన్‌మెంట్ మంగళవారం(15న) ఫలితాలు ప్రకటించనుంది. ఇంకా ఎఫ్‌ఎంసిజి దిగ్గజం హిందుస్తాన్ యూనిలీవర్, ఇంధన రంగ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ 17న అక్టోబర్‌డిసెంబర్ పనితీరు వెల్లడించనున్నాయి. ఇక ఐటి సేవల దిగ్గజం విప్రో 18న ఫలితాలు విడుదల చేయనుంది. ఇన్ఫోసిస్ ఈ ఆర్థిక సంవత్సరం ఆదాయంలో 8.59 శాతం వృద్ధిని సాధించనున్నట్లు ఫలితాల విడుదల సందర్భంగా అంచనా వేసింది. నిర్వహణ లాభ మార్జిన్లు 22–24 శాతం స్థాయిలో నమోదుకాగలవని పేర్కొనడం ఇన్వెస్టర్లలో ఉత్సహాన్ని పెంచవచ్చని నిపుణులు అంటున్నారు. నవంబర్ నెలకు పారిశ్రామికోత్పత్తి(ఐఐపి) 0.5 శాతమే వృద్ధి నమోదైంది. 2017 జూన్ తరువాత అత్యంత కనిష్టస్థాయి ఇదే కావడం గమనార్హం. ప్రధానంగా తయారీ రంగం తిరోగమించడంతో పారిశ్రామికోత్పత్తి గణాంకాలపై ప్రతికూల ప్రభావం పడినట్లు ఆర్థికవేత్తలు పేర్కొన్నారు. తయారీ రంగం 10 శాతం వృద్ధిని వీడి ప్రతికూల(0.4 శాతం) బాట పట్టడం ఐఐపిని దెబ్బతీసింది. అక్టోబర్‌లో ఐఐపి 8.1 శాతానికి పెరిగింది. నవంబర్‌లో 4.1 శాతం ఐఐపిని ఉంటుందని నిపుణులు అంచనా వేశారు. కాగా డిసెంబర్ నెలకు టోకు ధరల ఆధారిత ద్రవ్యోల్బణ వివరాలు 14న వెల్లడికానున్నాయి.



కాంపోజిషన్ డీలర్లపై కేంద్రం నిఘా

కొనుగోలుదారుల నుంచి జిఎస్‌టి వసూళ్లపై చర్యలు



న్యూఢిల్లీ: కొనుగోలుదారుల నుంచి జిఎస్‌టి వసూళ్ల నుంచి కాంపోజిషన్ డీలర్లను నిరోధించేందుకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ చర్యలు చేపడుతోంది. వినియోగదారులకు ప్రోత్సాహకర చర్యల్లో భాగంగా రెవెన్యూ విభాగం కాంపోజిషన్ డీలర్లు, సర్వీస్ ప్రొవైడర్లు ఇన్వాయిసుల్లో కచ్చితంగా తమ జిఎస్‌టి నమోదు వివరాలను వెల్లడించేలా మార్పులు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. అలాగే వారు కొనుగోలుదారుల నుంచి ఎటువంటి పన్నులను వసూలు చేయకుండా ఈ చర్యలు చేపడుతున్నారు. ఈ నిబంధన ఒక సారి అమల్లోకి వస్తే కొనుగోలుదారుల నుంచి జిఎస్‌టి వసూలు చేస్తున్న కాంపోజిషన్ డీలర్ల వివరాలు ప్రభుత్వానికి తెలుస్తాయి. కాంపోజిషన్ పథకం కింద నమోదు చేసుకొన్న డీలర్లు జిఎస్‌టి చెల్లించాల్సిన అవసరం లేదనే విషయాన్ని వినియోగదారుల్లో ప్రచారం చేయాలని కూడా ప్రభుత్వం నిర్ణయించింది. జీఎస్‌టీ కాంపోజిషన్ పథకం పరిధిలోకి వచ్చే డీలర్లు కేవలం ఒక శాతం జిఎస్‌టి చెల్లిస్తే సరిపోతుంది. ఇటువంటి డీలర్లు వినియోగదారుల వద్ద నుంచి జిఎస్‌టి వసూలు చేయడానికి ప్రభుత్వం అంగీకరించదు. ఇప్పటి వరకు దాదాపు 1.17కోట్ల మంది జిఎస్‌టి పరిధిలో నమోదు చేసుకోగా, దాదాపు 20 లక్షల మంది కాంపోజీషన్ స్కీం పరిధిలో ఉన్నారు



ఎలక్ట్రానిక్ వాహనాల మార్కెట్లోకి చైనా

న్యూఢిల్లీ: ఎలక్ట్రానిక్ వాహనాల(ఇవి)కు ప్రభుత్వం అత్యంతగా ప్రోత్సాహం ఇస్తోంది. అందుకే 2030 సంవత్సరం నాటికి ఎలక్ట్రానికి వాహనాల సంఖ్యను పెంచాలనే లక్ష్యంతో భారత్ ప్రణాళికను సిద్ధం చేస్తోంది. దీనిలో భాగంగా ఎలక్ట్రానిక్ వాహనాల మార్కెట్ వృద్ధి కోసం చైనా భాగస్వామ్యాన్ని కూడా ఆహ్వానించినట్టు నీతి ఆయోగ్ ప్రధాన సలహాదారు అనిల్ శ్రీవాత్సవ తెలిపారు. శ్రీవాత్సవ నేతృత్వంలోని భారత్ బృందం.. ఈనెల 11 నుంచి 13 తేదీల్లో నిర్వహించిన 'గ్లోబల్ జీరో ఎమిషన్ అండ్ ఆల్ ఎలక్ట్రిక్ వెహికిల్' కార్యక్రమానికి హాజరైంది. ఈ సందర్భంగా చైనా ఇవి100 ప్రెసిడెంట్ చెన్ కింగ్‌టైను భారత్ బృందం కలిసింది. భారత్‌లో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పూర్తిస్థాయి ఎలక్ట్రానిక్ వాహనాల ఉద్యమంలో చైనాను పాలుపంచుకోవాలని ఆహ్వానించింది.

'ఎఫ్2' సినిమాకు అద్భుతమైన స్పందన వస్తుండడంతో చాలా సంతోషంగా ఉంది. ఓ మంచి సినిమాను ఇవ్వాలి అనుకొని సంక్రాంతికి ఈ చిత్రాన్ని విడుదల చేశాం. ఎన్నో ఏళ్ల తర్వాత థియేటర్‌కు వెళ్లి ఈ సినిమా చూశాను. నిజంగా చాలా మంచి భావన కలిగింది. ప్రతి సన్నివేశాన్ని ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తున్నారు. ఇకపై నా నుంచి ఇంకా మంచి సినిమాలు వస్తాయి.

– స్టార్ హీరో వెంకటేష్

సినిమా



నేడే జ్యాక్ బాక్స్

అఖిల్ అక్కినేని హీరోగా శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర ఎల్‌ఎల్‌పి పతాకంపై 'తొలిప్రేమ' ఫేం వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'మిస్టర్ మజ్ను'. బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకొని ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ వర్క్ జరుపుకుంటోంది. అన్ని కార్యక్రమాలను పూర్తిచేసి జనవరి 25న ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇటీవల విడుదలైన పాటలు, టీజర్‌కు చాలా మంచి స్పందన వస్తోంది. ఏమైనదో... ఏమైనదో, హార్ట్ బ్రేక్... పాటలకు మంచి ఆదరణ లభిస్తోంది. సోమవారం ఉదయం 10 గంటలకు సంక్రాంతి సందర్భంగా ఈ చిత్రం జ్యాక్ బాక్స్‌ను విడుదల చేయబోతున్నారు. అఖిల్ అక్కినేని సరసన నిధి అగర్వాల్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో నాగబాబు, ప్రియదర్శి, జయప్రకాష్, హైపర్ ఆది ఇతర ముఖ్య పాత్రలు పోషించారు. ఈ చిత్రానికి సంగీతంః తమన్, పాటలుః శ్రీమణి, సినిమాటోగ్రఫీః జార్జ్ సి.విలియమ్స్, ఎడిటింగ్ః నవీన్ నూలి, ఆర్ట్ః అవినాష్ కొల్లా, కొరియోగ్రఫీః శేఖర్.

ఆ టైటిల్‌పైనే ఆసక్తి



బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్ హిట్ 'బాహుబలి' తర్వాత ప్రభాస్ చేస్తున్న చిత్రం 'సాహో'. అయితే 'సాహో' భారీ బడ్జెట్ చిత్రం కావడంతో పాటు భారీ యాక్షన్ మూవీ అవడం వల్ల ఈ సినిమా షూటింగ్‌కు చాలా సమయం పడుతోంది. ఈ సమయంలోనే 'జిల్' ఫేమ్ రాధాకృష్ణ దర్శకత్వంలో ప్రభాస్ మరో సినిమా కూడా చేస్తున్నారు. ఈ చిత్రం పీరియాడిక్ మూవీ అంటూ ప్రచారం జరుగుతోంది. ప్రేమ కథతో రూపొందుతున్న ఈ చిత్రాన్ని యువి క్రియేషన్స్‌లో వంశీ, ప్రమోద్‌లు నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమాకు 'జాను' అనే టైటిల్ దాదాపుగా ఖరారైందంటూ క్లారిటీ వచ్చేసింది. అధికారిక ప్రకటన రాకున్నా కూడా చిత్ర యూనిట్ సభ్యులు ఈ టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ టైటిల్‌పై ప్రభాస్ బాగా ఆసక్తి చూపించినట్లుగా తెలిసింది. 'జాను' అనేది రెండు అక్షరాల టైటిల్ కావడంతో పాటు హిందీలో డార్లింగ్ అనే అర్థం వస్తుంది. డార్లింగ్ అనేది ప్రభాస్ ముద్దు పేరనే విషయం ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. 'డార్లింగ్' ఇప్పటికే ప్రభాస్‌కు సక్సెస్‌ను తెచ్చిపెట్టింది. రెండు అక్షరాల టైటిల్ 'మిర్చి' మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. అందుకే 'జాను' టైటిల్‌ను ప్రభాస్ కోరుకున్నట్లుగా చెబుతున్నారు. ఈ చిత్రంలో ప్రభాస్‌కు జోడీగా పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తోంది. విభిన్నమైన ప్రేమ కథతో రూపొందుతున్న ఈ చిత్రాన్ని యువి క్రియేషన్స్ వారు వచ్చే ఏడాది సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు తీసుకు రావాలని ప్లాన్ చేశారు. ఇక 'సాహో' చిత్రాన్ని ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రేక్షకుల ముందుకు తీసుకు రాబోతున్నారు.

ఎఫ్2 సీక్వెల్ చేస్తా

వెంకటేష్, వరుణ్‌తేజ్, తమన్నా, మెహరీన్ కౌర్ హీరోహీరోయిన్లుగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఎఫ్2'. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్‌రాజు సమర్పణలో శిరీష్, లక్ష్మణ్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రం తాజాగా ప్రేక్షకుల ముందుకు వచ్చి హిట్ టాక్‌తో దూసుకుపోతోంది. ఈ సందర్భంగా దర్శకుడు అనిల్ రావిపూడితో ఇంటర్వ్యూ విశేషాలు...



పగలబడి నవ్వుతున్నారు...

ఈవివి సినిమాలు, కృష్ణారెడ్డి సినిమాలు, జంధ్యాల సినిమాలను చూస్తే అన్ని వర్గాల ప్రేక్షకులు నవ్వుతూనే ఉండేవారు. వారి సినిమాలను నేను బాగా చూసేవాడిని. అలా పూర్తిస్థాయి సినిమాను తీయాలనే కోరిక నాకు ఉండేది. అది ఈ సినిమాతో తీరింది. ఈ సినిమా చూస్తూ అందరూ పగలబడి నవ్వుతున్నారు. సోషల్ మీడియాలో ఈవివి, జంధ్యాలతో నన్ను పోలుస్తూ కొందరు కామెంట్స్ కూడా చేశారు. అయితే వారి స్థాయికి నేను ఇంకా చేరుకోలేదు. అయితే వాళ్ల ప్రభావం నాపై ఉందనే మాట మాత్రం వాస్తవం. వారి స్టయిల్‌ను నా స్టయిల్‌కు తగ్గట్టు మార్చుకొని సినిమాలు చేస్తున్నాను.

ఇది బాగా నచ్చింది...

సాధారణంగా మనం రకరకాల ఆసనాలు వేస్తుంటాం. అలాంటిది మనలోని ఒత్తిడిని దూరం చేసుకోవడానికి ఒక ఆసనం ఉంటే ఎలా ఉంటుంది.... అనే ఆలోచన నుండి ఈ వెంకీ ఆసనం పుట్టుకొచ్చింది. అలాగే వెంకటేష్‌కు ఓ మేనరిజం పెట్టి దాన్ని కథకు లింక్ చేస్తే బావుంటుందనిపించి ఈ వెంకీ ఆసనం కనిపెట్టాను. ప్రేక్షకులకు ఇది బాగా నచ్చింది.

చక్కగా నటించాడు....

వరుణ్‌తేజ్ ఇప్పటివరకు కామెడీ జోనర్‌లో సినిమా చేయలేదు. అతను వెంకటేష్‌తో ఎలా కామెడీ టైమింగ్‌లో చేస్తాడోనని కాస్త ఆలోచించాను. తెలంగాణ యాస మాట్లాడుతూ వరుణ్ యాదవ్ అనే కుర్రాడి పాత్రలో అతను కామెడీ జోనర్‌లో తొలి సారి చాలా చక్కగా నటించాడు. వెంకటేష్‌తో కలిసి అతను అద్భుతంగా నటించాడు.

ఫైట్ లేకుండా...

పటాస్ నుండి రాజా ది గ్రేట్ వరకు కమర్షియల్ సినిమాలు చేశాను. అయితే 'రాజా ది గ్రేట్' సినిమా చేసేటప్పుడు అసలు ఫైట్ లేకుండా ఓ కమర్షియల్ సినిమా చేద్దామనే ఆలోచన వచ్చింది. పెళ్లాం చెబితే వినాలి, క్షేమంగా వెళ్లి లాభంగా రండి జోనర్‌లో ఈమధ్య సినిమాలు రాలేదనిపించి ఈ కథను రాసుకున్నాను. సాధారణంగా ఓ సినిమాను పూర్తి చేయడానికి ఏడాది సమయం పడుతుంది. కాబట్టి నా టీం సభ్యులు సాయి, ప్రవీణ్, నారాయణలతో కలిసి ఈ కథపై నాలుగు, ఐదు నెలలు వర్క్ చేశాం.

అందుకే అలాంటి క్యారెక్టర్స్...

సూర్యకాంతం నటనలో, డైలాగ్స్ చెప్పడంలో ఓ స్టయిల్ ఉంటుంది. ఆమె డైలాగ్‌ను చాలా అందంగా విరుస్తారు. అలాంటి క్యారెక్టర్ మోడ్రన్‌గా ఉంటే ఎలా ఉంటుందో అని ఆలోచించి ప్రగతి క్యారెక్టర్‌ను పెట్టాం. మా అమ్మమ్మ, నాయనమ్మలు ఉండేవారు. ఏ ఫంక్షన్‌కు వచ్చినా మంచంపై కూర్చొని అదీ, ఇదీ అంటూ అందరినీ కామెంట్ చేసేవారు. ఆ క్యారెక్టర్స్ నాకు బాగా గుర్తుండిపోయాయి. అందుకే అలాంటి క్యారెక్టర్స్‌ను అన్నపూర్ణమ్మ, వై.విజయలుగా ఈ సినిమాలో చూపించాం.

వాళ్లు ఓకే చెప్పారు...

హిందీలో గోల్‌మాల్, హౌస్‌ఫుల్ సినిమాల సిరీస్‌లు ఉన్నాయి. మన తెలుగులో ఇలాంటి జోనర్‌లో సినిమాలు చేయాలని ఉంది. ఖచ్చితంగా 'ఎఫ్2'కు సీక్వెల్‌గా 'ఎఫ్3' చేస్తాను. ఈ విషయం వెంకటేష్, వరుణ్‌తేజ్‌కు చెప్పేశాను. వాళ్లు ఈ సీక్వెల్‌కు ఓకే చెప్పారు. ప్రస్తుతం ఈ సీక్వెల్ చర్చల్లో ఉంది.

నెక్స్ట్ మూవీస్...

'ఎఫ్2' చిత్ర విజయం నాకెంతో ఆనందాన్నిచ్చింది. సంక్రాంతికి ఊరెళ్లి ఎంజాయ్ చేస్తా. మూడు వారాలు రిలాక్స్ అయిన తర్వాత ఏ జోనర్‌లో సినిమా చేయాలని ఆలోచిస్తాను. అయితే ఈసారి ఫుల్ లెంగ్త్ కామెడీ చేయను.



నేను ఏదీ ప్లాన్ చేసుకోను

''పెళ్లి అనేది భారతీయ సంప్రదాయంలో ఒక భాగం. దానిని నేను గౌరవిస్తాను. నచ్చిన వ్యక్తి తారసపడితే మన సంప్రదాయం ప్రకారం పెళ్లి చేసుకుంటా. కానీ పెళ్లి ఎప్పుడనేది నా చేతుల్లో లేదు''అని కాజల్ చెబుతోంది. తాజాగా ఆమె పెళ్లి గురించి మాట్లాడుతూ ''ప్రతి ఒక్కరి జీవితానికి పెళ్లనేది చాలా అవసరం. సరైన సమయం వచ్చినప్పుడు నచ్చిన వ్యక్తి దొరికితే తప్పకుండా పెళ్లి చేసుకుంటా. జీవితం మొత్తం అతనికే అర్పిస్తా''అని పేర్కొంది. పెళ్లి తర్వాత సినిమాలు చేస్తారా? అన్న ప్రశ్నకు సమాధానమిస్తూ... ''నేను ఏదీ ప్లాన్ చేసుకోను. పెళ్లి తర్వాత కథానాయికగా కొనసాగడం అన్నది నన్ను కట్టుకోబోయేవాడి మీద ఆధారపడి ఉంటుంది. ఇక ప్రస్తుతానికైతే ఎవరితోనూ రిలేషన్‌షిప్‌లో లేను. ఒకరితో రిలేషన్‌లో ఉండేంత ఖాళీ నాకు లేదు. క్షణం తీరిక దొరికితే ఇంకేం చెయ్యాలి, కథానాయికగా ఎలా ముందుకెళ్లాలి అన్నదానిపైనే నా ధ్యాస ఉంటుంది''అని తెలిపింది కాజల్.

నాది చాలా స్వీట్ నేచర్



నయనతార సినిమా ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనదు... ఫ్రెండ్లీ టైప్ కాదనీ...ఆమెకు గర్వం, పొగరనీ చాలా మంది అనుకుంటారు. గత కొంతకాలంగా తనపై వస్తున్న ఇటువంటి ఆరోపణల గురించి నయనతార మాట్లాడుతూ ''అవును... నేను పొగరుబోతునే, అహంకారిని కూడా. అయితే నాతో వేళాకోళంగా ప్రవర్తించే వాళ్ల దగ్గరే అలా ఉంటాను. మిగతావాళ్ల దగ్గర అలా ఉండాల్సిన అవసరం నాకేంటి?''అని పేర్కొంది. ''నాతో సినిమాలు చేసినవాళ్లకూ, చేస్తున్నవాళ్లకూ నేనెంత ఫ్రెండ్లీగా ఉంటానో తెలుసు. నా గురించి నేను ఎక్కువ చెప్పుకుంటున్నానని అనుకోకపోతే ఒక్కమాట. నాది చాలా స్వీట్ నేచర్. షూటింగ్ లొకేషన్‌లో చాలా సరదాగా ఉంటాను. అందరితోనూ మాట్లాడుతుంటాను''అని నయనతార చెప్పింది. ''ఏదేమైనా... మర్యాద అనేది ఇచ్చి పుచ్చుకోవాలి. నాకు మర్యాద ఇస్తే... నేనూ వాళ్లకు మర్యాద ఇస్తా. ఒకవేళ నా దగ్గర మర్యాదగా నడుచుకోకూడదని ఎవరైనా నిశ్చయించుకుంటే... నా నుంచి కూడా ఇక మర్యాద ఆశించవద్దు''అని పేర్కొంది స్టార్ బ్యూటీ.

ఇంతకన్నా ఏం కావాలి



18 ఏళ్ల సినీ జీవితంలో భూమిక ప్రేక్షకులను మైమరపించే ఎన్నో సినిమాలు చేసింది. పలువురు స్టార్ హీరోలతో కలిసి బిగ్గెస్ట్ హిట్‌లను అందుకుంది. గత ఏడాది విడుదలైన నాగచైతన్య చిత్రం 'సవ్యసాచి'లో ఆమె ఓ ముఖ్యమైన పాత్రలో నటించింది. ఈ నేపథ్యంలో 18 ఏళ్ల మీ సినీ జీవితం ఎలా అనిపించింది అని భూమికను అడిగితే... ''చాలా సంతృప్తినిచ్చింది. మూస పాత్రలు కాకుండా విభిన్నమైన పాత్రలు చేశాను. ఎంతో బలమైన పాత్రలు పోషించాను. అభిమానుల ఆదరాభిమానాలను గుండెనిండా నింపుకున్నాను. ఒక్కమాటలో చెప్పాలంటే వృత్తిపరంగా ఇది నాకెంతో బ్యూటిఫుల్ జర్నీ. ఎంతోమంది గొప్పవాళ్లతో కలిసి పనిచేయగలిగాను. ఇండస్ట్రీలో నేను సక్సెస్‌ఫుల్‌గా నిలదొక్కుకోవడానికి క్రమ శిక్షణతో కూడిన నా జీవితం, హార్డ్‌వర్కే ప్రధాన కారణాలు. అందివచ్చిన అవకాశాలన్నింటినీ ఉపయోగించుకున్నాను. అశేష ప్రజల ప్రేమను, అభిమానాన్ని గెలుచుకున్నాను. నటిగా నన్నెంతగానో ఆదరించారు, ప్రోత్సహించారు... అభిమానించారు. నా నటనకు అభినందనలు కురిపించారు. అన్నింటికన్నా ఆనందం కలిగించే విషయమేమిటంటే ప్రజలు నన్ను తమ కూతురిలా భావించారు. నా పట్ల అంతులేని ప్రేమ, ఆప్యాయతలను కురిపించారు. ఇంతకన్నా ఎవరికైనా ఏం కావాలి''అని పేర్కొంది.



శ్రియ అద్భుతమైన నటనతో...

నైనా ఫిలిమ్స్ పతాకంపై యశ్, ప్రేమ్‌కుమార్, శ్రియ హీరోహీరోయిన్లుగా రూప అయ్యర్ దర్శకత్వంలో షాన్వాజ్ నిర్మించిన చిత్రం 'మహాచంద్ర'. ఈ చిత్రం డబ్బింగ్ పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత షాన్వాజ్ మాట్లాడుతూ ''కన్నడలో సూపర్ హిట్ అయిన 'చంద్ర' చిత్రాన్ని 'మహాచంద్ర' పేరుతో తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నాం. యశ్ ఈ చిత్రంలో ఒక ప్రముఖ పాత్రను పోషించారు. అలాగే శ్రియా తన అద్భుతమైన నటనతో ఆకట్టుకుంటుంది. డబ్బింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని ఫిబ్రవరి రెండో వారంలో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నాం''అని అన్నారు. దామోదర వనాచార్య సమర్పణలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి సంగీతంః గౌతమ్ శ్రీ వాస్తవ, కెమెరాః దాస్.

హారర్, థ్రిల్లర్, కామెడీ అంశాలతో...



వైష్ణవి ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రవిప్రకాష్ కృష్ణం శెట్టి స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'అదృశ్యం'. హార్రర్, థ్రిల్లర్, కామెడీ ప్రధానాంశాలుగా రూపొందిన ఈ చిత్రం సెన్సార్ పూర్తి చేసుకొని ఫిబ్రవరిలో విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని ఫిలిం ఛాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో సినిమా ట్రైలర్‌ను హీరో జాన్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా హీరో జాన్ మాట్లాడుతూ ''తెలుగులో ఇది నా మూడవ చిత్రం. లెజెండరీ డైరెక్టర్ కె.విశ్వనాథ్ చేతుల మీదుగా సినిమా ఆడియోను రిలీజ్ చేయించాం. ఆయన నన్ను చూసి ప్రభాస్‌లా ఉన్నావని అనడంతో ఎంతో ఆనందంగా ఉంది''అని అన్నారు. దర్శకుడు రవిప్రకాష్ మాట్లాడుతూ ''హీరో జాన్ నా పిల్లల చిత్రం చేశారు. అందుకే ఆయనను హీరోగా తీసుకున్నాను. ఇది ఒక థ్రిల్లర్ మూవీ. చాలా అద్భుతంగా ఉంటుంది. ఇందులో నలుగురు హీరోయిన్లు నటిస్తున్నారు. జయవాణి మాంత్రికురాలిగా ఓ ప్రత్యేక పాత్ర చేశారు''అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మ్యూజిక్ డైరెక్టర్ అల్‌ద్రిన్ పాల్గొన్నారు.

కొత్త సంవత్సరం ట్రీట్




ఒకప్పుడు సౌత్‌లో శృంగార తారగా ఓ వెలుగు వెలిగిన షకీలా జీవితం ఆధారంగా బాలీవుడ్‌లో ఓ చిత్రం తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. 'షకీలా' అనే టైటిల్‌తో బోల్డ్ బ్యూటీ రిచా చద్దా ప్రధాన పాత్రలో ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. ఇటీవల విడుదలైన సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్లకు అద్భుతమైన స్పందన వచ్చింది. త్వరలోనే ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్న సందర్భంగా సినిమా ప్రమోషన్స్‌లో వేగం పెంచారు. తాజాగా ఈ చిత్రం ప్రమోషన్ కార్యక్రమాల్లో పాల్గొన్న రిచా చద్దా పలు ఆసక్తికరమైన విషయాలను తెలియజేశారు. షకీలా అభిమానులకు కొత్త సంవత్సరం ట్రీట్ అదిరిపోయే రేంజులో ఉంటుందని ఆమె చెప్పింది. 90వ దశకంలో షకీలా రూపంతో నాడు వెండితెరపై బాగా పాపులరైన ఆమె క్యారెక్టర్లను '12 టంగ్ ఇన్ చీక్ అవతార్స్' పేరుతో ఓ క్యాలెండర్‌గా తీసుకురానున్నామని రిచా పేర్కొంది. క్యాలెండర్‌లో 12 నెలలకు సంబంధించిన ప్రతి పేజీపైనా షకీలా ఐకానిక్ సినిమాల లుక్‌తో పోస్టర్లను ముద్రిస్తారట. ఈ క్యాలెండర్‌ను షకీలాకు అంకితమిస్తున్నామని రిచా చద్దా చెప్పింది. అయితే ఈ క్యాలెండర్ తమ బయోపిక్ మూవీకి మంచి ప్రచారాన్ని తీసుకువస్తుందని ఫిల్మ్‌మేకర్స్ భావిస్తున్నారు. ఇక ప్రస్తుతం 'షకీలా' సినిమా పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది.

పోటీ

ఏ అంశాలపై 'వివేకవర్ధిని' ప్రచారం?







ఎస్ లక్ష్మీనారాయణ
డైరెక్టర్, రామయ్య
కాంపిటీటివ్ కోచింగ్ సెంటర్
దిల్‌సుఖ్ నగర్, హైదరాబాద్,
8885555202

రాయ్ చేపట్టిన చర్యలు

- శాశ్వత శిస్తు విధానం రైతులను పేదవారిగా చేస్తుందని భావించిన మొదటి భూస్వామి – రాయ్.
- ఉన్నత పదవులలో భారతీయులకు స్థానం కల్పించాలని డిమాండ్ చేశాడు.
- భారతీయులకు, యురోపియన్లకు స్థానం కల్పించాలని డిమాండ్ చేశాడు.
- భారతీయ పరిశ్రమల నైపుణ్యాన్ని పెంపోందించాలి, ఆధునిక సాంకేతిక పద్ధతులను అనుసరించాలన్నాడు.
- రాజారాయ్‌మోహన్‌రాయ్ తర్వాత విద్యావాఘీష్ కొంతకాలం బ్రహ్మసమాజంకు నేతృత్వం వహించారు.
- ఆ తర్వాత దేవేంద్రనాథ్ టాగూర్ గారు (రాజారామ్‌మోహన్‌రాయ్ ప్రియ శిష్యుడు) బ్రహ్మసమాజంనకు నేతృత్వం వహించారు.

దేవేంద్రనాథ్ ఠాగూర్

- బిరుదు –బ్రహ్మర్షి (దక్షిణ భారతదేశ బ్రహ్మర్షి – రఘుపతి వెంకటరత్నం నాయుడు)
- పత్రిక – తత్వబోధిని (మాసపత్రిక) పాఠశాల –తత్వబోధిని
- గ్రంథం – బ్రహ్మధర్మం
- సంస్థ – తత్వబోధిని సభ)1839
- తత్వబోధిని అనే మాసపత్రికలో మొదటిసారిగా 'జనగణమన' జాతీయ గీతం ప్రచురించబడింది.
- ఇతని శిష్యుడు – కేశవ చంద్రసేన్ (రాజనారాయణబోస్ రాసిన బ్రహ్మరక్షణ అనే గ్రంథం చదివాడు)

కేశవ చంద్రసేన్

- వార్తా పత్రికలు : ఇండియన్ మిర్రర్ (1861), న్యూ డిస్పెన్సన్.
- సంస్థలు : Indian Reform Association (1870) – కులాంతర వివాహాలను ప్రోత్సహించాడు.
- New Dispensation / నవవిధాన సభ
- Belivers Association సంఘత్ సభ
- 1866 బ్రహ్మసమాజంలోని దేవేంద్రనాథ్ ఠాగూర్, కేశవ చంద్రసేన్‌ల మధ్య వివాదాలు రావడంతో ఇది రెండుగా చీలిపోయింది.

ఎ) బ్రహ్మసమాజం – దేవేంద్రనాథ్ ఠాగూర్
బి) బ్రహ్మసమాజ్ ఆఫ్ ఇండియా – కేశ చంద్రసేన్

- కేశవచంద్ర సేన్ కృషి ఫలితంగా 1872లో 'స్వదేశస్థుల వివాహచట్టం' చేయబడింది.
- దీని ప్రకారం అమ్మాయిల కనీస వయస్సు 14సం॥ కాగా, అబ్బాయిల కనీస వయస్సు 16సం॥.
- వర్ణాంతర వివాహాలను ప్రోత్సహించడం.
- కేశవచంద్ర సేన్ వితంతు వివాహాలను ప్రోత్సహిస్తూ, బాల్యవివాహాలను, వేదాల బ్రహ్మణుల ఆధిపత్యాన్ని ఖండించాడు.
- కాని కె.సి సేన్ తన మైనర్ కూతురు (10 సం॥ వయస్సులోనే) బీహార్‌కు చెందిన కూచ్ బిహారీ రాజుకిచ్చి వివాహం చేశాడు. దీన్ని అతడి అనుచరులు ఖండించారు.
- బ్రహ్మసమాజం మళ్ళీ రెండుగా విడిపోయింది. 1) నవబ్రహ్మసమాజం, కె.సి సేన్, 2) సాధారణ బ్రహ్మసమాజం (శివనాథశాస్త్రి)
- దక్షిణ భారతదేశంలో బ్రహ్మసమాజంను వ్యాప్తి చేసినవారు – కేశవచంద్ర సేన్.
- కేశవచంద్రసేన్ బోధనల వలన రాజాజీ, సుబ్బరాయలుశెట్టిలు కలసి 1864లో మద్రాస్‌లో వేదసమాజాన్ని నెలకొల్పారు.

- శ్రీధరనాయుడు అనే వ్యక్తి దక్షిణ భారత బ్రహ్మసమాజాన్ని ఏర్పాటు చేశాడు. దీని ప్రభావం వల్లనే తెలుగువారు బ్రహ్మసమాజంలో చేరారు.
- ఆంధ్రదేశంలో బ్రహ్మసమాజంలో చేరిన మొదటి వ్యక్తి – మన్నవ బుచ్చయ్యపంతులు (1878 – రాజమండ్రి)
- బుచ్చయ్యపంతులు శిష్యుడు –రఘుపతి వెంకటరత్నం నాయుడు.
- రఘుపతి వెంకటరత్నం నాయుడు ఆంధ్రలో బ్రహ్మసమాజంను బాగా వ్యాప్తిచేసి బ్రహ్మప్రచారకనిధి, బ్రహ్మమందిరం, అనాధశరణాలయంలను ఏర్పాటు చేశాడు.
- 'సాంఘిక శుద్ధి సమాజం'ని ఏర్పాటు చేశాడు.
- ఇతని అనుచరుడు – కందుకూరి వీరేశలింగం పంతులుగారు.

కందుకూరి వీరేశలింగం పంతులు : 1848–1919

- బిరుదులు : ఆంధ్రసంఘంసంస్కరణోద్యమ పితామహుడు. ఆంధ్రపునర్వికాస పితామహుడు, ఆంధ్ర వైతాళికుడు, గద్యతిక్కన, గద్యవాఙ్మయ బ్రహ్మ, యుగకర్త, రావుబహదూర్, దక్షిణభారతదేశ విద్యాసాగరుడు, (ఎమ్.జి.రణడే).
- కందుకూరి సంఘ సంస్కరణకై బ్రహ్మసమాజంను ఉపయోగించాడు.
- దక్షిణ భారతదేశంలో వితంతు పునర్ వివాహాలను, స్త్రీ విద్యను తన వివేక వర్ధిని (1874) అనే మాసపత్రిక ద్వారా ప్రచారం చేశాడు.
- కందుకూరి హాస్య సంజీవిని (1876), సతీహితబోధిని (1883)
- సత్యసంవర్ధిని (1891), తెలుగుజనన(1904), సత్యవాదిని (1905) అను పత్రికలను స్థాపించాడు.
- 1881 డిసెంబర్ 11న రాజమండ్రిలో గోకులపాటి శ్రీరాముడు, సీతమ్మ (గౌరి)లకు, తొలిసారిగా వితంతు పునర్ వివాహాలను జరిపించాడు.
- 1881 డిసెంబర్ 15 రాచర్ల రామచంద్రయ్య, రత్నమ్మలకు 2వ వితంతు పునర్‌వివాహాలను జరిపించాడు.
- 1874లో ధవళేశ్వరం వద్ద బాలికల పాఠశాలను, 1881లో ఇన్నీస్ పేట (రాజమండ్రి)లో బాలికోన్నత పాఠశాలను స్థాపించాడు.
- 1883 సతీహిత భోధిని అనే మాస పత్రికలను స్త్రీల అభివృద్ధికై స్థాపించాడు.
- 1893 బ్రిటీష్ వారు రావ్‌బహదూర్ అనూ బిరుదునిచ్చారు.
- కందుకూరిని దక్షిణ భారతదేశ విద్యాసాగరుడు అని వర్ణించిన వారు – ఎం.జి. రణడే.

రచనలు

- రాజశేఖర చరిత్ర, సత్యవతి చరిత్ర, ఏసుక్రీస్తు చరిత్ర, విక్టోరియా మహారాణి చరిత్ర, స్వీయచరిత్ర – వీరేశలింగం, బ్రహ్మ వివాహం.
- కందుకూరి 1919లో మద్రాసులో కొమర్రాజు లక్ష్మణరావు నివాసమైన వేదనివాసంలో మరణించాడు.

- హెన్రీ వి.వి.ఎన్ డిరాజియో :
- బిరుదు – భారతదేశ మొట్టమొదటి జాతీయ కవి.
- పత్రికలు – ఈస్ట్ ఇండియన్, హెస్పెరస్‌లు.
- ఇతను భారతదేశంపై అనేక కవితలను రచించిన గొప్ప కవి.
- బెంగాల్‌లో యువ బెంగాల్ ఉద్యమాన్ని ప్రారంభించగా దీనికి ఎస్.ఎన్. బెనర్జీ మద్దతు పలికాడు.
- దీనిలో అనేక మంది సభ్యులై బెంగాల్ సంస్కృతిని వ్యాప్తి చేశారు.
- 1831లో హేతుబద్ధత కారణంగా బెంగాల్ హిందూ కాళాశాల నుండి ప్రిన్సిపాల్‌గా తొలగించబడి కలరా వ్యాధితో మరణించాడు.
- ఇతని ప్రియశిష్యుడు – ఖాసీ ప్రసాద్ ఘోష్.
- డిరాజియో ఫ్రెంచ్ విప్లవం, ఇంగ్లాండ్ రచయితలు అయిన జాన్ లాక్ మొదలగు రచనలతో ప్రభావితుడైనాడు.

ఈశ్వర చంద్ర విద్యాసాగర్ (1820 – 1891)

- బిరుదులు : పండిట్, విద్యాసాగర్.
- పత్రిక : సోమ్‌ప్రకాష్ (బెంగాలీ).
- పుస్తకం : బహువివాహ్.
- సంస్థ – బెథూన్ పాఠశాల (1849) కలకత్తాలో పిలిప్ డ్రింక్ వాటర్ సహకారంతో బాలికల విద్యకొరకు స్థాపించాడు.
- ఎక్కువగా వితంతు పునర్ వివాహం కోసం పోరాటం చేసి డల్హౌసి ద్వారా 1856లో వితంతు పునర్ వివాహ చట్టంను ప్రవేశపెట్టే విధంగా కృషి చేశాడు.
- ఈ చట్ట బిల్లును ప్రవేశపెట్టిన వారు జె.పి. గ్రాంట్.
- 1856 డిసెంబర్ 7న విద్యా సాగర్ దేశంలోనే తొలిసా రిగా అధికారికంగా వితంతు పునర్ వివాహంను కలకతాలో శ్రీచంద్ విద్యారత్న, శ్రీమతి కాళీమతిదేవిలకు జరిపించాడు.
- బాల్య వివాహాలను, బహుభార్యాత్వంను ఖండిస్తూ మహిళా విద్యాను ప్రోత్సాహించాడు.
- 35 పాఠశాలలకు ఇన్స్‌పెక్టర్‌గా పనిచేస్తూ 12 పాఠశాలలను తన సొంత ఖర్చుతో నడిపేవాడు.
- బెంగాల్ సంస్కృత కళాశాలకు ప్రిన్సిపాల్‌గా నియమించబడి వెనుకబడిన వారికి, మహిళలను ఈ కళాశాలకు అహ్వానించాడు.

దయానంద సరస్వతి (1824 – 1883)

- అసలు పేరు – మూలశంకర్ / మూల్జీ.
- జన్మించిన ప్రదేశ – టంకార (గుజరాత్).
- బిరుదు – స్వామి, గుజరాత్ పునరుజ్జీవన పితామహుడు, సింధిమరు.
- పుస్తకాలు – సత్యార్థప్రకాశ్ వేదాలపై దయానందుడు రాసిన భాష్యం, వేదభూమిక, వేద రహస్య, వేద భాష్యం.
- సంస్థ – ఆర్యసమాజం (బొంబాయి), గోరక్షణ సంఘం.
- గురువులు – స్వామి విరజానంద, పరమానంద సరస్వతి.
- దయానందుని నినాదం – గో బ్యాక్ టు ద వేదాస్.
- ఆర్యసమాజంను 1887లో బొంబాయిలో స్థాపించాడు.
- దాని శాఖలు లాహోర్, పంజాబ్‌లోని అనేక ప్రాంతాలలో వెలిసాయి.
- ఏ కారణంతోనైనా ఇతర మతాలలో చేరినవారు తిరిగి హిందూ మతంలో చేర్చడానికి – శుద్ధి / సంఘాలు ఉద్యమాలను ప్రారంభించాడు.
- శుద్ధి ఉద్యమాలను, మదన్ మోహన్ మాలవ్య యూపీలో, లాలాల జపతి రాయ్‌లు పంజాబ్, లాహోర్‌లలో వ్యాప్తిచేశారు.
- దయానందుడి మరణానంతరం – ఆర్యసమాజం దయానంద ఆంగ్లో వేదిక్ (DAV) పాఠశాలలను స్థాపించింది.
- ఇవి వివాదాలతో రెండుగా చీలిపోయాయి.

1) గురుకుల పాఠశాలలు – గురుదత్తా హరిద్వార్‌లో స్థాపించాడు. దీనిని అభివృద్ధి చేసినది లాలా మున్సిరామ్ (లేదా) స్వామి శ్రద్ధానంద.
2) ఆధునిక పాఠశాలలు – లాలాహన్స్‌రాజ్ లాహోర్‌లో స్థాపించాడు.

- దయానందుడు ఆర్యుల జన్మస్థలం టిబెట్ అని పేర్కొన్నాడు.
- హిందీని జాతీయ భాషగా ప్రకటించాలని పేర్కోన్న మొట్టమొదటి వ్యక్తి.
- పరిపాలనకు సంబంధించి స్వరాజ్య అనే పదాన్ని తొలిసారిగా ఉపయోగించాడు.
- ఆర్యసమాజం నాతల్లి, వైధిక ధర్మం నాతండ్రి అని లాలాలజపతిరాయ్ పేర్కొన్నాడు.
- ఆంగ్లేయుల మంచిపాలన కన్న, భారతీయుల స్వపరిపాలన మిన్న అని దయానందుడు వర్ణించాడు.

రామకృష్ణ పరమహంస (1836 – 86)

- అసలు పేరు – గదాధర్ చటోపాధ్యాయ.
- తండ్రి – ఓడీరామ్ చటోపాధ్యాయ.
- తల్లి – చంద్రాయనిదేవి.
- గురువు – ఈశ్వరపూరి.
- భార్య – శారదామణి.
- ప్రియశిష్యుడు – స్వామి వివేకానందుడు.

సంక్రాంతి పండగ సందర్భంగా

మార్కెట్లను ముంచెత్తుతున్న డిస్కౌంట్ ఆఫర్లు



అప్రమత్తంగా వ్యవహరించాలంటున్న అధికారులు

మన తెలంగాణ/హైదరాబాద్ సిటీబ్యూరో : పండగల సందర్భంగా మార్కెట్లో డిస్కౌంట్ ఆఫర్లు ముంచెత్తున్నాయి.ముఖ్యంగా సంక్రాంతి,దసరా,దీపావళి పండగల్లో నగరంలోని పలు వస్త్రదుకాణాలు, ఎలక్ట్రికల్ పరికరాలు ,మోబైల్ ఫోన్లపై పెద్ద ఎత్తున డిస్కౌంట్లు ఆఫర్లు ప్రకటిస్తూ తమ సంస్థల వినియోగ దారులకు ఆకర్షించేందుకు ఉదయం లేచింది మొదలు, పత్రికా ప్రకటనలు,కరపత్రాలను,టీవీల్లో వ్యాపార ప్రకటలను గుప్పిస్తున్నాయి. పండగ సందర్భంగా నూతన వస్త్రాలను మాత్రమే కాకుండా నూతనంగా ఏవైన వస్తువులను కొనడం ప్రజలకు ఆనవాయితీగా రావడమే కాకుండా కొత్త వస్తువులను కొంటే మంచిదనే అభిప్రాయం ఉండటంతో వినియోగ దారులు కూడా వాటి మీద మొగ్గు చూపుతున్నారు. కొన్ని ఫైనాన్స్ కంపెనీలుకూడా వినియోగదారులు వారి స్థాయికి తగ్గట్టుగా ఫైనాన్స్ అందిస్తుండటంతో ఆయా వస్తువుల కొనుగోళ్ళ మీద శ్రద్ద చూపుతున్నారు.అంతే కాకుండా కొన్ని ప్రభుత్వ,ప్రైవేట్ సంస్థలు ఉద్యోగులకు పండగ బోనస్‌లు ఇవ్వడంతో వారి చేతికి సమయానికి డబ్బులు అందడంతో వ్యాపారులకు బాగా కలిసి వస్తోంది. రాజస్థాన్‌కు చెందిన ఒక వజ్రాల వ్యాపారి ప్రతి దీపావళికి తమ సంస్థలో అత్యున్నత ప్రతిభను కనబర్చిన ఉద్యోగులకు పండగ కానుగా వారికి డబుల్ బెడ్ రూం ఇళ్ళను, కార్లను ఇస్తుండటం గమనార్హం.ఈ విధంగా ఆయా సంస్థలు కూడా తమ ఉద్యోగులను సంతృప్తి పరిచే చర్యలు తీసుకుంటూ ఉద్యోగులను ప్రోత్సహిస్తూ పెద్ద మొత్తంలో లాభాలను గడిస్తున్నాయి.

నగరంలో అనేక ప్రముఖ వస్త్ర వ్యాపారులు తమ వద్ద ఉన్న స్టాక్‌ను పూర్తిగా వదిలించుకునే కార్యక్రమంలో భాగంగా ఈ వీటి మీద ప్రత్యేక ఆఫర్లను ప్రకటిస్తున్నాయి.కొందరు వ్యాపారులు తమ వద్ద ఉన్న ఒకటి కొంటే .. మరొకటి ఉచితం అని ప్రకటిస్తుంటే మరి కొన్ని సంస్థలు మరో అడుగు ముందుకేసి కేజీల్లో వస్త్రాలను అమ్ముతామంటూ తమ వద్ద స్టాక్‌ను వదిలించుకునే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. ఈ విధంగా తమ వద్ద పైకి కనిపించని లోపాలు ఉన్న స్టాక్‌కు వదిలించుకుంటుంటే , మరి కొన్ని సంస్థలు తమ వద్ద బ్రాండెడ్ వస్త్రాలపై రేటును తగ్గించి అమ్మకాలు చేస్తూ లాభాలను గడిస్తున్నాయి. రానున్న ఆర్థిక సంవత్సరం (ఏప్రిల్ మాసం నాటికి) తమ వద్ద ఉన్న స్టాక్‌ను పూర్తి స్థాయిలో వదిలించుకునే కార్యక్రమంలో వినియోగదారులకు డిస్కౌంట్ల ఎర వేస్తున్నాయి. అంతే కాకుండా తమ షోరూంలో వస్త్రాలను కొనుగోలు చేసిన వారికి లక్కీ కూపన్లు ఇస్తూ డ్రాలో గెలుపొందిన వారికి విలువైన బహుమతులను అందించడమే కాకుండా నగరంలోని పలు ట్రావెల్స్ సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుని డ్రాలో గెలుపొందిన వారిని విదేశీ టూర్లకు కూడా పంపిస్తున్నాయి.అదే విధంగా నగరంలోని పలు ప్రముఖ ఎలక్ట్రిక్ షోరూం నిర్వాహకులు తమ వద్ద ఉన్న వస్తువులను వదిలించుకునే కార్యక్రమంలో భాగంగా టీవీ కొంటే సెల్ ఫోన్ ఫ్రీ అని.... మొబైల్ కొంటే మరో మొబైల్ ఉచితమని ప్రకటిస్తున్నాయి. అంతే కాకుండా విలువైన వస్తువుల మీద జీరో డౌన్ పేమెంట్ అని చెబుతూ ఇన్‌స్టాల్ మెంట్ పద్దతుల్లో వారి వద్ద ఉన్న స్టాక్‌ను వినియోగదారులకు అంటగట్టే కార్యక్రమాలు చేపడుతున్నాయి. వాహన షోరూం నిర్వాహకులు తమ వద్ద వాహనాలను కొనుగోలు చేసిన వారికి బీమా ఫ్రీ, పెట్రోల్ 10 లీటర్ల పెట్రోల్ ఫ్రీ,ఎక్సరీస్ ఫ్రీ ప్రకటిస్తున్నాయి.మరి కొందరు నిర్వాహకులు తమ వద్ద వాహనాలను కోనుగోలు చేసినట్లయితే ఆయా వాహనాల ఖరీదును బట్టి గోల్డ్,వెండి కాయన్ ఫ్రీ అంటూ చెప్పడమే కాకుండా ఫైనాన్స్ సంస్థల నుంచి ప్రత్యేక ఆఫర్లతో ప్రకటనలు చేయిస్తూ తమ వద్ద వాహనాలు అమ్ముకుంటున్నాయి.ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఎవరికి తగ్గట్లుగా వారు తమ అమ్మకాలను పెంచుకుంటూ లాభాలను గడిస్తున్నారు. కొన్ని సంస్థలు ఖరీదైన వస్తువులను లక్కీ డ్రా ద్వారా ఇచ్చే క్రమంలో వాటిని నిజాయితీగా కస్టమర్లకు అందచేస్తుంటే మరి కొన్ని సంస్థలు ఆయా వస్తువులను తమ బంధువుల, స్నేహితులు పేరు మీద వచ్చే విధంగా చేస్తూ వినియోగ దారులను మోసం చేస్తున్నారు. ఏది ఏమైనప్పటికి ఏ వ్యాపార సంస్థ లక్ష్యమైన తమ వద్ద ఉన్న వస్తువులను పండగ ఆఫర్ల పేరుతో వదిలించుకుని ఈ సంవత్సరం ఉన్న స్టాక్‌ను అంతా సాధ్యమైనంత వరకు' క్లియరెన్స్ సేల్ 'చేయడమే వాటి లక్ష్యం.....

పండగ సందర్భంగా వస్తువులు లేదా వస్త్రాలు కొనుగోలు చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా బ్రాండెడ్ దుస్తులను ఖచ్చితంగా ప్యాకింగ్ చేసే విక్రయించాలంటున్నారు. అనేక దుకాణాల్లో ఇష్టాను సారంగా వ్యవహరిస్తూ కనీస నిబంధనలు కూడా పాటించడం లేదని చెబుతున్నారు. వస్త్ర దుకాణాలపై ప్రత్యేక దుష్టి సారించామని ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెబుతున్నారు. వస్త్రాల కొనుగోలు సందర్భంగా ఏదైనా అనుమానం వస్తే తూనికలు, కొలతల శాఖ అధికారులు దృష్టికి తీసుకు రావాలని చెబుతున్నారు.





శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

మన తెలంగాణ తిరుమల ప్రతినిధి: ఆదివారం తిరుమల వెంకటేశ్వర స్వామి వారిని పలువురు ప్రముఖులు వీఐపీలు దర్శించుకున్నారు. నటుడు సూపర్ స్టార్ కృష్ణ తమ్ముడు వైఎస్‌ఆర్ సీపీ ఎమ్మెల్యే ఆదిశేషగిరిరావు, రిజర్వ్ బ్యాంకు డిప్యూటీ గవర్నర్ ఎంకే జైన్, టిటిడి ఆస్థాన గాయకురాలు శోభారాజు, సతీష్ కుమార్ రెడ్డి దొర ఆటో చైర్మన్, 2018 ట్రైనీ ఐఏఎస్ గ్రూప్ సభ్యులు తదితరులు శ్రీవారిని దర్శించుకున్నారు. టీటీడీ తిరుమల జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కేఎస్.శ్రీనివాసరాజు, ఆలయ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ హరినాథ్ తదితరులు వీఐపీలకు స్వాగతం పలికి స్వామివారి దర్శనం వసతి ఏర్పాట్లు చేపట్టారు.

స్థానికేతరులకు అక్రమంగా లైసెన్సులు ఇవ్వడం మానుకోవాలి

అఖిలపక్ష నాయకులు



మన తెలంగాణ/తిరుమల ప్రతినిధి: తిరుమల కొండపై స్థానిక సమస్యలు పరిష్కరించకుండా టిటిడి అధికారులు ఆక్రమణదారులకు రాజకీయ ఒత్తిళ్లతో హాకర్ లైసెన్సులు ఇవ్వడానికి చేస్తున్న ప్రతిపాదనలు మానుకోవాలని అఖిల పక్షం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. రౌండ్ టేండ్ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కేంద్ర మాజీ మంత్రి, పార్లమెంటు సభ్యుడు చింతా మోహన్, బిజెపి నాయకుడు టిటిడి పాలకమండలి మాజీ సభ్యుడు భాను ప్రకాష్ రెడ్డి, నవీన్ కుమార్ రెడ్డి ,పసుపులేటి హరిప్రసాద్, తిరుమల స్థానిక సంక్షేమ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో టిటిడి అధికారుల వైఖరిని నాయకులందరూ తప్పు పట్టారు. రాజకీయ ఒత్తిళ్లతో 450 మంది లైసెన్సులు ఇవ్వాలనే ప్రతిపాదన పాలకమండలి కమిటీకి అప్పగించడం అందులోనూ నిబంధనలకు విరుద్ధంగా మరో ఎనిమిది మందికి అడ్డదారిలో దుకాణాలను కేటాయించాలని ప్రతిపాదనలు చేయడం అన్యాయమని విమర్శించారు. ఈ ప్రయత్నాలను విరమించుకోకపోతే ఆందోళనకు పూనుకుంటామని నాయకులు హెచ్చరించారు. ఇప్పటికే అనేక దశాబ్దాలుగా తిరుమల స్థానికులు సమస్యలు పట్టించుకోని టీటీడీ అధికారులు అడ్డదారిలో మరో 450 మందికి లైసెన్సులు ఇస్తే వ్యాపారాలు కుంటుపడి స్థానికులు అందరూ ఇబ్బందులకు పడతారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

శివసేనను ఓడించేవాళ్లు పుట్టలేదు: ఉద్ధవ్



ముంబయి : శివసేనను ఓడించే వారు ఇంకా పుట్టలేదని ఆ పార్టీ అధ్యక్షుడు ఉద్ధవ్ థాకరే పేర్కొన్నారు. ఎన్నికలకు ముందస్తు పొత్తు కుదరకుంటే భాగస్వామ్య పక్షాలపై విజయం సాధిస్తామన్న బిజెపి అధ్యక్షుడు అమిత్‌షా వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా విమర్శించారు. ఆదివారం వోర్లీలో జరిగిన బహిరంగ సభలో ఉద్ధవ్ థాక్రే మాట్లాడుతూ రానున్న లోక్‌సభ ఎన్నికలను ఆయన మూడవ పానిపట్టు యుద్ధంతో సమానమన్నారు. ప్రజా విశ్వాసం కోల్పోయిన బిజెపిని అధికారం నుంచి దించి వేస్తారని ఉద్ధవ్ పేర్కొన్నారు. జెడియు, ఎల్‌జెపిలతో పొత్తు పెట్టుకున్నప్పుడు రామాలయం ఎలా నిర్మిస్తారని ఆయన ప్రశ్నించారు.

ఎన్‌కౌంటర్‌లో టాప్ టెర్రరిస్ట్ ఇస్లాం హతం

శ్రీనగర్: జమ్ము–కశ్మీర్‌లో కుల్గాం జిల్లాలో భద్రతా దళాలతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఉగ్రవాద సంస్థ అల్..బదర్ కీలక కమాండర్ జీనత్ ఉల్..ఇస్లాం తో సహా ఇద్దరు ఉగ్రవాదులు మరణించారని పోలీసులు తెలిపారు. కట్పోరా ఎన్‌కౌంటర్‌లో మరణించిన రెండో ఉగ్రవాది షకీల్ అహ్మద్ దార్. జీనత్, షకీల్‌కు అనేక ఉగ్రవాద నేరాలతో సంబంధం ఉందని పోలీస్ అధికారి ఒకరు చెప్పారు. ఎ ++ కేటగిరీకి చెందిన ఇస్లాం హిజ్‌బుల్ ముజాహిదీన్ నుంచి గత ఏడాది నవంబర్‌లో అల్..బదర్‌కు మారాడు. అల్ బదర్‌ను పటిష్టం చేయాలని రెండు ఉగ్రవాద సంస్థల మధ్య కుదిరిన ఏకాభిప్రాయం ప్రకారం టాప్ కమాండర్ ఇస్లాంను అల్ బదర్‌కు మార్చారు. మిలిటెంట్లు ఉన్నారని కచ్చితమైన సమాచారం అందడంతో శనివారం సాయంకాలం దక్షిణ కశ్మీర్ లోని కుల్గావ్ జిల్లా యారిపోరాలోని కట్‌పోరా ప్రాంతంలో భద్రతా దళాలు కార్డన్, సెర్చ్ ఆపరేషన్లు ప్రారంభించినట్టు ఆ అధికారి వివరించారు.

కాంగ్రెస్‌ను వదులుకోవడం సరికాదు



ముజఫర్‌పూర్: సమాజ్‌వాదీ (ఎస్‌పి), బహుజన్ సమాజ్ పార్టీ (బిఎస్‌పి) కూటమిలో కాంగ్రెస్‌ను చేర్చుకోకపోవడం సరికాదని రాష్ట్రీ య జనతాదళ్ (ఆర్‌జెడి) నాయకుడు రఘువంశ్ ప్రసాద్ సింగ్ అన్నారు. భవిష్యత్తులో జాతీయ స్థాయిలో ఏర్పడే కూటములకు ఇది మంచి సంకేతం కాదని ఆయన వ్యాఖ్యానించారు. సుదీర్ఘ చరిత్ర ఉన్న కాంగ్రెస్‌ను ఈ కూటమిలో చేర్చుకుని జరిగిన పొరపాటును దిద్దుకోవచ్చని ఆర్‌జెడి జాతీయ ఉపాధ్యక్షుడు అన్నారు. బీహార్‌లో ఏర్పడిన మహాకూటమిలో ఆర్‌జెడి కూడా ఒక భాగస్వామి. ఆ కూటమిలో కాంగ్రెస్, రాష్ట్రీయ లోక్ సమతా పార్టీ, హిందుస్థానీ అవం మోర్చా (ఎస్), ముకేష్ సాహ్నీ నాయకత్వంలోని వికాస్‌షీల్ ఇన్‌సాన్ పార్టీ (విఐపి) ఉన్నాయి. ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్ తో కూడిన మహాకూటమి ఏర్పడాలని ఆయన కోరారు.

'అయోధ్య' కోసం చట్టం : విహెచ్‌పి

ఇండోర్: అయోధ్యలో రామ మందిర నిర్మాణంకోసం కేంద్రం ఒక చట్టం చేయాలని విశ్వహిందూ పరిషత్ (విహెచ్‌పి) ఆదివారం పునరుద్ఘాటించింది. ప్రజల విశ్వాసాలకు సంబంధించిన విషయాలు న్యాయస్థానాల పరిధిలోకి రావని వ్యాఖ్యానించింది. విహెచ్‌పి అంతర్జాతీయ అధ్యక్షుడు విష్ణు సదాశివ్ కోక్జె మాట్లాడుతూ... ఇప్పుడున్న పరిస్థితిలో న్యాయస్థాన ప్రక్రియల ద్వారా అయోధ్య సమస్యకు పరిష్కారం సమంజసం కాదని, మత విశ్వాసాలకు సంబంధించిన విషయాలు చట్టాలకు లోబడి పనిచేసే కోర్టుల పరిధిలోకి రావని అన్నారు. 'ఇంతవరకు జరిగింది చూస్తే, సుప్రీం కోర్టులో అయోధ్య వివాదం ఇదివరకటిలాగే ఇకపై కూడా మరింత ఆలస్యం కావచ్చు. అయోధ్యలో రాముడు పుట్టాడా లేదా అన్నది ఏ కోర్టూ నిర్ణయించలేదు. ఈ వివాదం ఎప్పటికీ పరిష్కారం కాదు. అందుకే, రామాలయ నిర్మాణానికి ఒక చట్టం చేయమని మేము మొదటి నుంచీ కోరుతున్నాం. ' అని కోక్జె విజ్ఞప్తి చేశారు.


కేంద్రం ఆఫర్‌కు జస్టిస్ సిక్రీ నో

'కామన్వెల్త్' పదవికి తిరస్కారం



న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం ఇవ్వచూపిన కామన్వెల్తు ట్రిబ్యునల్ పదవిని సుప్రీంకోర్టు సీనియర్ న్యాయమూర్తి ఎకె సిక్రీ తిరస్కరించారు. ప్రభుత్వ ఆఫర్‌ను గత నెలలో అంగీకరించిన జస్టిస్ సిక్రీ ఆదివారం సాయంత్రం ఈ పదవిని నిరాకరిస్తున్నట్లు తెలియచేసుకున్నారు. జస్టిస్ సిక్రీ సానుకూలతతోనే ఇటీవల సిబిఐ డైరెక్టర్ పదవి నుంచి అలోక్ వర్మను తొలిగించడం సాధ్యం అయింది. వర్మ భవితవ్యం ఖరారు చేసే ఎంపిక కమిటీలో సిక్రీ అత్యున్నత న్యాయస్థానం తరఫున కీలక సభ్యుడిగా ప్రాతినిధ్యం వహించారు. అయితే మార్చి 6వ తేదీన సిక్రీ రిటైర్ కావాల్సి ఉంది. పదవీ విరమణ తరువాత కామన్‌వెల్తు సెక్రెటరియేట్ ఆర్బిట్రల్ ట్రిబ్యునల్ (సిసాట్) అధ్యక్ష లేదా సభ్యుడి హోదా కల్పిస్తామని కేంద్రం ప్రతిపాదించింది. అయితే తనకు ఈ పదవి వద్దని సిక్రీ తోసిపుచ్చారు. ఇటీవలి పరిణామాలు తనను బాధించాయని , దీనితో తాను మనస్థాపం చెందానని పేర్కొంటూ , కేంద్రం ఇవ్వచూపిన పదవిని తీసుకోరాదని నిర్ణయించినట్లు సిక్రీ తెలిపారు. ఈ మేరకు ఆయన లా సెక్రెటరీకి లేఖ పంపించారు. ఆయన మద్దతు వల్లనే సిబిఐ డైరెక్టర్ పదవి నుంచి అలోక్ వర్మను తొలిగించేందుకు మార్గం ఏర్పడిందని, ఈ విధంగా ప్రధాని మోడీకి ఆయన కొమ్ముకాశారని పలు స్థాయిలలో విమర్శలు వెలువడ్డాయి. సిబిఐ బాస్‌గా తిరిగి ఇటీవలే సుప్రీంకోర్టు తమ తీర్పు ద్వారా అలోక్ వర్మను నియమించింది. అయితే ఆయన భవితవ్యం, సిబిఐ కొత్త డైరెక్టర్‌ను నియామక అంశాల పరిశీలనలకు అత్యున్నత స్థాయి కమిటీ సమావేశం అయింది. ఈ కమిటీలో సభ్యులుగా సాధారణంగా దేశ ప్రధాని, సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి, ప్రతిపక్ష నాయకుడు ఉంటారు. అయితే అలోక్ వర్మకు సంబంధించిన కేసు విచారణను చేపట్టిన బెంచ్‌కు సుప్రీంకోర్టు ప్రదాన న్యాయమూర్తి సారధ్యం వహించారు. దీనితో డైరెక్టర్ భవితవ్యం ఖరారు కమిటీ నుంచి ప్రధానన్యాయమూర్తి రంజన్ గొగోయ్ వైదొలిగి, సుప్రీంకోర్టు తరఫున ఈ బాధ్యతను జస్టిస్ సిక్రీకి అప్పగించారు.అలోక్‌ను పదవి నుంచి తొలిగించాని ప్రధాని మోడీ, జస్టిస్ సిక్రీ తమ నిర్ణయం వెలువరించారు. దీనిని ప్రతిపక్ష నేత కాంగ్రెస్ నాయకులు మల్లిఖార్జున ఖర్గే వ్యతిరేకించారు. కామన్‌వెల్తు సెక్రెటరియేట్‌ను 1965లో ఏర్పాటు చేశారు. కామన్‌వెల్తులోని 53 సభ్య దేశాలకు చెందిన వివాదాల పరిష్కారానికి ఉన్న ట్రిబ్యునల్‌లో బాధ్యతలు కీలకమైనవే. ఇందులో భాగంగా ఈ పదవిని పొందేవారు. అప్పుడప్పుడు లండన్ కేంద్రంగా ఉన్న ట్రిబ్యునల్‌కు వెళ్లాల్సి ఉంటుంది. ప్రెసిడెంట్‌తో పాటు ఇందులో మొత్తం ఎనమండుగురు సభ్యులు ఉంటారు. ప్రాంతీయ స్థాయిలలో వచ్చే సిఫార్సుల మేరకు సిశాట్ సభ్యులను నాలుగు సంవత్సరాల కాలానికి తీసుకుంటారు. ట్రిబ్యునల్ బాధ్యతలు తీసుకున్నందుకు ఎటువంటి వేతనభత్యాలు చెల్లించడం జరగదు.

మైదానంలోనే కుప్పకూలిన క్రికెటర్



పనాజి: గోవా మాజీ రంజీ క్రికెటర్ రాజేష్ ఘోడ్గే ఆదివారం మధ్యాహ్నం క్రికెట్ మైదానంలోనే కుప్పకూలి చనిపోయాడు. 44 ఏళ్ల రాజేష్ మార్మగోవా పట్టణంలో స్థానిక క్రికెట్ టోర్నమెంటులో ఆడుతుండగా ఈ దుర్ఘటన సంభవించింది. రాజేశ్ కుప్పకూలినప్పుడు అతను నాన్ స్ట్రైకింగ్ ఎండ్‌లో ఉన్నాడని, వెంటనే అతడ్ని ఆస్పత్రికి తరలించామని ఈ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్న మార్‌గోవా క్రికెట్ క్లబ్ సీనియర్ సభ్యుడు ఒకరు చెప్పారు. అయితే ఆస్పత్రికి వచ్చే సరికే ఆయన చనిపోయినట్లు డాక్టర్లు చెప్పారు. ఆదివారం మధ్యాహ్నం రెండున్నర గంటల సమయంలో రాజేంద్ర ప్రసాద్ స్టేడియంలో ఈ సంఘటన జరిగింది.1999–2000 సీజన్‌లో గోవా రంజీ జట్టు సభ్యుడిగా ఉండిన రాజేశ్ క్రికెట్ వర్గాల్లో చిరపరిచితుడు.

ఆఫ్ఘన్‌ను ఆర్థికంగా ఆదుకుంటాం : సుష్మా



సమర్‌కండ్ (ఉజ్బెకిస్థాన్): ఏళ్ల తరబడి యుద్ధాలతో ఛిన్నాభిన్నమైన ఆఫ్ఘనిస్థాన్ ఆర్థిక పునర్నిర్మాణానికి భారతదేశం కట్టుబడి ఉందని విదేశీ వ్యవహారాల మంత్రి సుష్మాస్వరాజ్ స్పష్టం చేశారు. అదే విధంగా ఆఫ్ఘన్ సారథ్యంలో, ఆఫ్ఘన్ యాజమాన్యంలో, ఆఫ్ఘన్ నియంత్రణలో ఉండే శాంతి, సయోధ్య ప్రక్రియను కూడా భారతదేశం ప్రోత్సహిస్తుందని ఆమె తెలిపారు. ఇక్కడ జరిగిన చరిత్రాత్మకమైన.. ఇండియా – సెంట్రల్ ఆసియా దేశాల చర్చా సమావేశం సందర్భంగా సుష్మాస్వరాజ్ ఈ ప్రకటన చేశారు. ఉగ్రవాదంతో నాశనమైన ఆఫ్ఘనిస్థాన్‌తో అన్నివిధాలా సంబంధాలను ఏర్పరచుకోవడంతో సహా వివిధ ప్రాంతీయ సమస్యలపై ఈ సమావేశం దృష్టి సారించింది. 'ఉగ్రవాదం వల్ల ఎదురవుతున్న సవాళ్లను ఈ ప్రాంతం తీవ్రంగా ఎదుర్కొంటోందని నేను ప్రత్యేకించి చెప్పదలుచుకున్నాను. భారతదేశం, మధ్య ఆసియా, ఆఫ్ఘనిస్థాన్ సమాజాలు సహనానికి, బహుముఖీనతకు పేరుగన్నవి. ద్వేషాన్ని పెంచి పోషించాలనే ఉగ్రవాదుల సిద్ధాంతానికి మన సమాజాల్లో తావు లేదు' అని సుష్మా స్వరాజ్ చర్చల తొలి విడత సమావేశంలో ప్రసంగిస్తూ తెలిపారు. 'ఉగ్రవాదంతో తల్లడిల్లిపోతున్న దేశం అభివృద్ధి కి నోచుకోదు. పెట్టుబడులు రావు. కాబట్టి ముందు మనమంతా ఉగ్రవాదంపై సంఘటితంగా పోరాడాలి. అసలు టెర్రరిస్టులకు నిధులు ఎవరిస్తున్నారు, ఎక్కడి నుంచి వస్తున్నాయి, ఎవరు మద్దతిస్తున్నారు? అన్నది తెలుసుకోవాలి' అని ఆమె పిలుపునిచ్చారు.



కశ్మీర్‌లో మంచులో కూరుకుపోయిన వాహనాలు. రహదారులు పూర్తిగా మంచుమయం కావడంతో జాతీయ రహదారిని పూర్తిగా మూసివేసి రాకపోకలను నిలిపివేశారు.

మాది అభివృద్ధి వాళ్లది అధికార దాహం



మహాకూటమి ప్రయత్నాలపై ప్రధాని మోడీ ఎద్దేవా

చెన్నై: బిజెపికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు మహాకూటమిగా ఏర్పడేందుకు చేస్తున్న ప్రయత్నాలను ప్రధానమంత్రి నరేంద్రమోడీ అపహాస్యం చేశారు. అది వంశ పారంపర్య, అవకాశవాద కూటమి అని ఎద్దేవా చేశారు. తిరిగి బిజెపినే అధికారంలోకి వస్తుందని చెబుతూ మోడీ... 'వాళ్లు తమ సామ్రాజ్యాన్ని నిర్మించుకోడానికి ప్రయత్నిస్తున్నారు. ప్రజలకు సాధికారికత కల్పించాలన్నది మా ఆలోచన' అని మోడీ వ్యాఖ్యానించారు. తమిళనాడులో అయిదు పార్లమెంటరీ నియోజకవర్గాల్లో బూత్ స్థాయి బిజెపి కార్యకర్తలతో మోడీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఇతర పార్టీల మాదిరి మనం విభజించు...పాలించు రాజకీయాలు చేయం. ఓటు బ్యాంకులు నిర్మించుకోము. అన్నివిధాలా దేశ సేవకే మనం ఉన్నాం. ఒకవైపు చూస్తే మనకు అభివృద్ధి ఎజెండా ఉంది. మరోవైపు చూస్తే ప్రతిపక్షాల అవకాశవాద కూటమి, వంశపారంపర్య పార్టీలూ ఉన్నాయి. మన ఎజెండాతో అభివృద్ధి ప్రణాళికను ఉన్నత స్థాయిలో నిలిపే అవకాశాన్ని ఈ ఎన్నికలు మనకు కల్పిస్తున్నాయి. అందరితోపాటు అందరి వికాసం అనేది మన ఎజెండా' అని నరేంద్రమోడీ కార్యకర్తలకు తెలిపారు. కాషాయ పార్టీని దెబ్బతీసేందుకు రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీ, బహుజన్ సమాజ్‌పార్టీ తాము కలిసి పోటీ చేస్తామని ప్రకటించిన ఒక రోజు తర్వాత మోడీ ఈ వ్యాఖ్య చేశారు.

కాంగ్రెస్ అసమర్థత వల్లే...

దేశ విభజన సమయంలో కర్తార్‌పూర్ సాహిబ్‌ను మన దేశంలో భాగంగా చేయకపోవడం అదివరకటి కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఆరోపించారు. సిక్కుల 10వ గురువు గురు గోవింద్ సింగ్ 350 వ జయంత్యుత్సవాల సందర్భంగా ఆదివారం ఢిల్లీలో ఆయన ఒక స్మారక నాణేన్ని విడుదల చేశారు. 1984లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ హత్యానంతరం జరిగిన అల్లర్లకు కూడా కాంగ్రెసే కారణమని విమర్శించారు.

కర్తార్‌పూర్ సాహిబ్ కారిడార్ గురించి చెబుతూ ప్రధాని, ఇప్పుడు భక్తులు పాకిస్థాన్‌లోని ఈ పవిత్ర స్థలాన్ని బైనాక్యులర్‌ల ద్వారా చూడాల్సిన అవసరం తీరిపోయిందని, వారు వీసా లేకుండా కారిడార్ ద్వారా అక్కడికి వెళ్లవచ్చని ఆయన అన్నారు.

యుపిలో సొంతంగానే పోటీ

బిజెపి రాకుండా చేయడం ముఖ్యం: రాహుల్



దుబాయ్: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఉత్తరప్రదేశ్ నుంచి స్వశక్తితోనే పోటీ చేస్తుందని పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీని వదిలేసి తాము కలిసి పోటీచేస్తామని సమాజ్‌వాది పార్టీ, బహుజన్ సమాజ్ పార్టీ ప్రకటించిన కొన్ని గంటల తర్వాత రాహుల్‌గాంధీ ఈ ప్రకటన చేశారు. దుబాయ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాహుల్...రెండు పార్టీల నాయకుల పట్ల తనకు అపారమైన గౌరవం ఉందని, తాము అనుకున్నది చేసే హక్కు వారికుందని చెప్పారు. 'బిఎస్‌పికి, ఎస్‌పికి కూటమిగా ఏర్పడే హక్కు ఉంది. ఇప్పుడు మేము పూర్తిస్థాయి బలంతో, మా సిద్ధాంతాలపై ఉత్తరప్రదేశ్‌లో పోటీచేస్తామని ఆ రాష్ట్ర ప్రజలకు చెప్పే అవకాశం లభించింది. ఆ రెండు పార్టీలూ రాజకీయ నిర్ణయం తీసుకున్నాయి. ఇప్పుడు ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్‌ను పటిష్టం చేసుకోవలసిన బాధ్యత మామీద ఉంది' అన్నారాయన.

ఎస్‌పి...బిఎస్‌పి పొత్తు కాంగ్రెస్‌కు దెబ్బ అనే అభిప్రాయాన్ని రాహుల్‌గాంధీ తోసిపుచ్చారు. 'బిజెపి అధికారంలోకి రానంతవరకూ ఎస్‌పి, బిఎస్‌పి పొత్తు గురించి నేను విచారించను. వాళ్లు కాంగ్రెస్ గురించి కొన్ని ప్రతికూలమైనవి చెప్పారు. వాటిని ఒప్పుకోవాలి. వాటి ఆధారంగానే మేము పనిచేయాల్సి ఉంటుంది. మేము విడిగా పోటీ చేస్తున్నామా, లేక ఎస్‌పి, బిఎస్‌పితో కలిసి పోటీ చేస్తున్నామా? అన్నది ముఖ్యం కాదు. రాష్ట్రంలో బిజెపికి దాని సీట్లు రాకూడదన్నదే ముఖ్యం' అని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ సూటిగా చెప్పారు. ఒకప్పటి బద్ధ శత్రువులైన ఎస్‌పి, బిఎస్‌పి...ఈ ఏడాది జరిగే లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్ నుంచి ఉమ్మడిగా పోటీ చేసేందుకు నిర్ణయించుకున్నాయి. కాంగ్రెస్‌తో సంబంధం లేకుండా ఒక్కో పార్టీ 38 స్థానాల్లో పోటీ చేయాలని అనుకున్నాయి.

తిరుపతి రైల్వేస్టేషన్‌లో 5 స్టార్ హంగులు





న్యూఢిల్లీ: తిరుమలలో శ్రీవారి దర్శనంకోసం వచ్చే భక్తులు తిరుపతి రైల్వే స్టేషన్ లో ఇకపై 5 స్టార్ హోటల్‌లో ఉన్న అనుభూతిని పొందుతారు. ఇందుకోసం భారతీయ రైల్వేలు తిరుపతి స్టేషన్‌లో 'అతిథి' లాంజ్‌ను ఏర్పాటు చేయబోతున్నాయి. త్వరలోనే ఈ ప్రీమియం లాంజ్ ప్రారంభమవుతుందని రైల్వే మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. 5 స్టార్ హంగులతో రూపొందే ఈ లాంజ్ రూపు రేఖలు ఎలా ఉంటాయో అందరూ తెలుసుకునేందుకు గోయల్ కొన్ని ఫోటోలను ట్వీట్ చేశారు. ఈ లాంజ్‌లో మాసేజ్ కుర్చీలు, మేగజైన్ రాక్‌లు, గోడలకు నిలువెత్తు బాలాజీ చిత్రాలు, విలాసవంతమైన రెండు గదులు వంటి అన్ని హంగులూ ఉంటాయని ఈ ఫోటోలద్వారా తెలుస్తోంది. అలాగే తిరుపతిలో ఎక్కడెక్కడ ఏం ఉన్నాయి?, భద్రతా ఏర్పాట్లు, వసతులు వంటివి వివరించే వీడియోను కూడా స్టేషన్‌లో ప్రదర్శిస్తారని పీయూష్ మరో ప్రకటన చేశారు. దేశంలో ఇతర రైల్వే స్టేషన్‌లకు తిరుపతి రైల్వేస్టేషన్ ఒక రోల్ మాడల్ అవుతుందని రైల్వేమంత్రి తెలిపారు.

తలాక్‌పై కేంద్రం మరోసారి ఆర్డినెన్స్



న్యూఢిల్లీ : ముమ్మారు తలాక్ పద్ధతిని నిషేధించేందుకు కేంద్ర ప్రభుత్వం తిరిగి ఆర్డినెన్స్‌ను వెలువరించింది. ముస్లిం మహిళ (వివాహ హక్కుల పరిరక్షణ) ఆర్డినెన్స్ 2019ను శనివారం తిరిగి జారీ చేశారు. దీని మేరకు తక్షణ ట్రిపుల్ తలాక్‌కు దిగడం చట్టరీత్యా చెల్లదు. అంతేకాకుండా ఈ పద్ధతికి పాల్పడే భర్తలకు మూడేళ్ల జైలు శిక్షకు అవకాశం ఉంటుంది. 2018 సెప్టెంబర్‌లో వెలువరించిన ఆర్డినెన్స్‌ను మార్చేందుకు తీసుకువచ్చిన బిల్లుకు లోక్‌సభలో ఇటీవలే ఆమోదం దక్కింది. అయితే ప్రతిపక్షాల నిర్ధిష్ట అభ్యంతరాలతో రాజ్యసభలో ఇది నిలిచిపోయింది. దీనితో పార్లమెంట్ పూర్తి స్థాయి మద్దతు రాకపోవడంతో తాజాగా ఆర్డినెన్స్ అవసరం ఏర్పడింది. ఈ మేరకు ఇప్పుడు తాజాగా దీనిని వెలువరించారని అధికార వర్గాలు ఆదివారం తెలిపాయి. గత వారం ఈ తాజా ఆర్డినెన్స్‌కు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఆర్డినెన్స్ ప్రకారం ట్రిపుల్ తలాక్‌కు సంబంధించి గత ఏడాది ఆగస్టు 29వ తేదీననే కేంద్ర కేబినెట్ పలు సవరణలు ప్రతిపాదించింది. ఆర్డినెన్స్ మేరకు ట్రిపుల్ తలాక్ బెయిల్‌కు వీలు కాని నేరం అవుతుంది. అయితే నిందితుడు విచారణకు ముందు బెయిల్ కోసం సంబంధిత మెజిస్ట్రేట్‌ను సంప్రదించవచ్చు. నాన్ బెయిలబుల్ నేరం పరిధిలో గమనిస్తే ఈ కేసులలో బెయిల్‌ను పోలీసులు సంబంధిత ఠాణాల పరిధిలో నిర్ణయించడానికి వీల్లేదు. అయితే భార్య అభిప్రాయాలను తెలుసుకున్న తరువాత ఈ కేసులో నిందితుడికి బెయిల్ ఇచ్చే అవకాశాన్ని మెజిస్ట్రేట్ మంజూరు చేసేందుకు వీలుగా అనువైన మార్పులు చేశారు. బిల్లులో పేర్కొన్న విధంగా భార్యకు పరిహారం ఇచ్చేందుకు సదరు భర్త అంగీకరిస్తేనే బెయిల్‌కు వీలేర్పడుతుందనే నిబంధన ఆర్డినెన్స్‌లో ఉంది.

బిజెపి మేనిఫెస్టో కమిటీ సమావేశం



న్యూఢిల్లీ: రాబోయే లోక్‌సభ ఎన్నికలకు పార్టీ ఎన్నికల మేనిఫెస్టో తయారుచేసేందుకు నియమితమైన భారతీయ జనతా పార్టీ టీమ్ ఆదివారంనాడు ఇక్కడ పార్టీ ప్రధాన కార్యాలయంలో సమావేశమైంది. ఇరవై మంది సభ్యులున్న ఈ కమిటీ సమావేశానికి కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అధ్యక్షత వహించారు. మేనిఫెస్టో రూపురేఖల్ని నిర్ణయించేందుకు పదిహేను ఉప కమిటీలను ఏర్పాటు చేయాలని సమావేశం నిర్ణయించింది. 'ప్రజలతో ప్రత్యక్షంగా సంబంధాల్ని ఏర్పరచుకునేందుకు వివిధ రంగాలకు చెందిన వారు ఈ 15 కమిటీల్లో ఉంటారు' అని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. లోక్‌సభ ఎన్నికలకోసం బిజెపి రూపొందించే మేనిఫెస్టో కమిటీకి రాజ్‌నాథ్ సింగ్ సారథ్యం వహిస్తారని పార్టీ అధ్యక్షుడు అమిత్ షా గతవారం ప్రకటించారు. ఈ కమిటీలో అరుణ్‌జైట్లీ, నిర్మలాసీతారామన్, రవిశంకర్ ప్రసాద్, ముక్తార్ అబ్బాస్ నక్వీ, రామ్ మాధవ్ వంటి పార్టీ సీనియర్ నాయకులుంటారు. ఎనిమిది మంది సభ్యులుండే పబ్లిసిటీ కమిటీకి ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ నాయకత్వం వహిస్తారని కూడా అమిత్ షా ప్రకటించారు. ఎన్నికల్లో వివిధ అంశాల పర్యవేక్షణకు బిజెపి మొత్తానికి 17 కమిటీల్ని ప్రకటించింది.

మహిళా జడ్జిలు 73 మందే

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా వివిధ హైకోర్టులలో ఇప్పటివరకూ 73 మంది మహిళా న్యాయమూర్తులే ఉన్నారు. హైకోర్టులలో జడ్జిల మొత్తం 670 జడ్జిలు ఉన్నారు. వీరిలో మహిళా జడ్జిల సంఖ్య ఏ మేరకు ఉందనే విషయాన్ని ప్రభుత్వం పార్లమెంటరీ కమిటీకి తెలియచేసుకుంది. గత ఏడాది మార్చి 23 నాటికి నియామకానికి అనుమతి దక్కిన జడ్జిల సంఖ్య 1079. అయితే ఇప్పటికీ 24 హైకోర్టులలో కేవలం 670 మంది జడ్జిలు పనిచేస్తున్నారని వెల్లడించారు. మొత్తం జడ్జిల సంఖ్యలో చూస్తే మహిళా జడ్జిలు 10.89 శాతంగానమోదైంది. న్యాయ, ఉద్యోగుల సంబంధిత పార్లమెంటరీ కమిటీకి న్యాయ మంత్రిత్వశాఖకు చెందిన జస్టిస్ డిపార్ట్‌మెంట్ వారు తమ లెక్కల చిట్టా అందించారు. మహిళలకు, సమాజంలోని అణగారిన వర్గాలకు సరైన విధంగా జడ్జిల నియామకాలకు తీసుకోవడం లేదనే విమర్శలు వెలువడుతున్నాయి. దీనిపై పార్లమెంటరీ ప్యానెల్ కూడా స్పందించింది. ఈ దశలో సంబంధిత మంత్రిత్వశాఖ తమ వివరణ ఇచ్చుకుంది. వివిధ రాష్ట్రాలకు చెందిన హైకోర్టులలో సరైన విధంగా సముచిత ప్రాతినిధ్యం కల్పించేలా, అర్హులైన అభ్యర్థుల పేర్లను పంపించాలని రాష్ట్రాల హైకోర్టుల చీఫ్‌జస్టిస్‌లకు సూచిస్తున్నామని తెలిపింది. వారు పంపించిన జాబితాలకు అనుగుణంగా ఎస్‌సిలు, ఎస్‌టిలు, బిసిలు, మైనార్టీలు, మహిళా అభ్యర్థుల పేర్లను పరిశీలించి అందులో ఉన్న అత్యంత అర్హులైన వారిని జడ్జిలుగా తీసుకోవడం జరుగుతోందన్నారు. అత్యున్నత న్యాయస్థానంలో వివివిధ సామాజిక వర్గాలకు తగు విధమైన ప్రాతినిధ్యం దక్కేలా చేసేందుకు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వం ఈ ప్యానెల్‌కు వివరణ ఇచ్చుకుంది. అత్యున్నత న్యాయస్థానంలో రిజర్వేషన్ల అనుమతికి రాజ్యాంగంలోని 124, మరియు 127 అధికరణల సవరణ ప్రతిపాదన ఏదీ లేదని స్పష్టం చేశారు.

డ్రగ్స్ నిరోధానికి యాక్షన్ ప్లాన్

న్యూఢిల్లీ : జనతను ప్రత్యేకించి యువతను చిత్తు చేస్తున్న డ్రగ్స్ వాడకంపై కేంద్రం ఎట్టకేలకు కొరడా ఝుళిపించింది. మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల దుర్వినియోగం నివారణకు కేంద్ర ప్రభుత్వం కార్యాచరణ పథకాన్ని రూపొందించింది. ఈ అయిదేళ్ల కాలపరిమితి యాక్షన్ ప్లాన్‌ను సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వశాఖ వారు ముసాయిదా రూపంలో ఖరారు చేశారు. డ్రగ్స్ నిరోధకంపై చాలా కాలంగా ముసాయిదా సంవిధానం పెండింగ్ పడుతూ వస్తోంది. ప్రస్తుత కార్యాచరణ పథకంతో ఈ దిశలో ముందడుగుకు వీలేర్పడుతుంది. ఈ నథకాన్ని ది నేషనల్ యాక్షన్ ప్లాన్ ఫర్ డ్రగ్ డిమాండ్ రిడక్షన్‌గా తీసుకువస్తున్నారు. దీని కార్యాచరణలో పెట్టడం ద్వారా సమగ్ర రీతిలో మాదకద్రవ్యాల వాడకం తగ్గించేందుకు రంగం సిద్ధం అవుతుందని భావిస్తున్నారు. ఈ పథకంలో భాగంగా డ్రగ్స్ నివారణకు పలు చర్యలు చేపడుతారు. అలవాటును మాన్పించడం, వ్యసనపరులను గుర్తించి వారికి పునరావాసం కల్పించడం , వారి కుటుంబాలను ఆదుకోవడం, వంటి చర్యలతో సమస్య అసలు మూలాలను పరిష్కరించేందుకు సానుకూలత ఏర్పడుతుందని అధికార వర్గాలు తెలిపాయి. ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న నేషనల్ డ్రగ్ డిమాండ్ రిడక్షన్ పాలసీని మంత్రిత్వశాఖ వారు కేంద్ర మంత్రి మండలి పరిధి నుంచి వెనుకకు తీసుకున్నారు. ఈ మధ్యకాలంలో కొత్తగా తాజా ముసాయిదా పథకాన్ని ఊపొందించారు. ఇప్పటివరకూ దీనిని పాలసీగా తీసుకురావాలని అనుకున్నట్లు అయితే ఇప్పుడు డ్రగ్స్ వాడకంపై కళ్లెం విధించేందుకు సత్తర ఫలితాలు దక్కేందుకు కార్యాచరణ పథకంగా మలిచినట్లు అధికారులు తెలిపారు.

రాయుడు బౌలింగ్ అనుమానాస్పదం


ఐసిసికి ఫిర్యాదు



దుబాయి: టీమిండియా బ్యాట్స్‌మన్, పార్ట్ టైమ్ బౌలర్ అంబటి రాయుడు అనుమానాస్పద బౌలింగ్ తీరుపై ఫిర్యాదు అందినట్లు అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) వెల్లడించింది. ఆస్ట్రేలియాతో సిడ్నీ మైదానంలో శనివారం జరిగిన వన్‌డే మ్యాచ్‌లో రాయుడు రెండు ఓవర్లు బౌల్‌చేసి 13 పరుగులు ఇచ్చాడు.' రాయుడి బౌలింగ్ అనుమానాస్పదంగా ఉందని మ్యాచ్ అధికారులు నివేదిక ఇచ్చారు. దానిని భారత క్రికెట్ జట్టు అధికారులకు అందజేశాం. ఐసిసి టెస్టు, వన్‌డే, టి 20లలో అనుమానాస్పద బౌలింగ్‌యాక్షన్ నిబంధనల ప్రకారం అతని బౌలింగ్‌ను పరీక్షించాల్సి ఉంటుంది. రాయుడు 14 రోజుల్లోపు పరీక్షలకు వెళ్లొచ్చు.పరీక్ష ఫలితాలు వచ్చే లోపు అతను మ్యాచ్‌లలో బౌలింగ్‌ను కొనసాగించవచ్చు' అని ఐసిసి తెలిపింది. అంబటి రాయుడు కెరీర్‌లో ఇప్పటివరకు 46 వన్‌డేలు ఆడాడు. కేవలం 20.1 ఓవర్లు మాత్రమే బౌల్ చేశాడు. మూడు వికెట్లు తీశాడు. అయితే అతను ఆడిన ఆరు టి20 మ్యాచ్‌లలో బౌలింగ్ చేయలేదు. సిడ్నీ మ్యాచ్‌లో రాయుడు రెండో బంతికే డకౌట్ అయిన విషయం తెలిసిందే. కాగా పరిమిత ఓవర్ల క్రికెట్ కోసం అతను ఇటీవల ఫస్ట్‌క్లాస్ క్రికెట్ కెరీర్‌కు వీడ్కోలు పలికిన విషయం తెలిసిందే.

పాండ్య, రాహుల్ స్థానంలో శుభ్‌మన్ గిల్, విజయ్ శంకర్





న్యూఢిల్లీ: ఓ టీవీ కార్యక్రమంలో మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసి సస్పెన్షన్‌కు గురైన హార్దిక్ పాండ్య, కెఎల్ రాహుల్‌ల స్థానాలను శుభ్‌మన్ గిల్, విజయ్ శంకర్‌లతో భర్తీ చేయలని భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు(బిసిసిఐ) నిర్ణయించింది. అయితే గిల్ భారత జట్టు న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లే ముందు జట్టులో కలుస్తాడు. విజయ్ శంకర్ మాత్రం అడిలైడ్‌లో మంగళవారం ఆస్ట్రేలియాతో జరిగే రెండో వన్‌డే కోసం జట్టులో కలవనున్నాడు. ఇప్పటికే భారత్ తరఫున విజయ్ శంకర్ ఆడగా గిల్ అరంగేట్రానికి రంగం సిద్ధమైంది. గత ఏడాది జరిగిన అండర్–19వరల్డ్ కప్ టోర్నమెంటులో భారత్ విజేతగా నిలిచిన విషయం తెలిసిందే. ఆ టోర్నమెంటులో శుభమ్ గిల్ ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంటుగా నిలిచాడు. ఇదిలా ఉండగా పాండ్య, రాహుల్‌లపై విచారణను వీలయినంత త్వరగా ముగించాలని బిసిసిఐ పరిపాలన కమిటీ (సిఓఎ) చైర్మన్ వినోద్ రాయ్ భావిస్తున్నారు.అయితే కమిటీ సభ్యురాలు డయానా ఎడుల్జీ మాత్రం అంత తొందరెందుకని మండిపడుతున్నారు. తూతూ మంత్రంగా విచారణను ముగించాలని చూస్తున్నారని కూడా ఆమె ఆరోపించారు.



వారిని తీవ్రంగా శిక్షించవద్దు

కెరీర్‌లు నాశనమవుతాయి : బాబుల్ సుప్రియో

న్యూఢిల్లీ: ఓ టీవీ షోలో భారత క్రికెటర్లు హార్దిక్ పాండ్య, కెఎల్ రాహుల్‌లు చేసిన వ్యాఖ్యలపై ఇంకా వివాదం రగులుతూనే ఉంది. వారి వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలంటూబిసిసిఐ షోకాజ్ నోటీసులు ఇచ్చింది. తన వ్యాఖ్యలపై పాండ్య ఇప్పటికే క్షమాపణలు చెప్పాడు కూడా. అయితే త్వరలో జరగబోయే ఐసిసి ప్రపంచకప్‌లో ఆడకుండా వారిపై వేటు వేయాలంటూ వాదనలు వినిపిస్తున్న తరుణంలో ఈ వివాదంపై కేంద్ర సహాయ మంత్రి బాబుల్ సుప్రియో స్పందించారు. వారిని తీవ్రంగా శిక్షించవద్దంటూ ట్విట్టర్ వేదికగా మంత్రి పాలక కమిటీ సభ్యురాలు డయానా ఎడుల్జీ, ఇతర అధికారులకు విజ్ఞప్తి చేశారు. వారిని తొలగించడం వల్ల భవిష్యత్తులో మిగతా క్రీడాకారులు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తారని కొందరు వాదిస్తున్నారు కానీ అది వారి కెరీర్‌ను నాశనం చేస్తుందని అంటూ ఆ ఆలోచనలను తోసిపుచ్చారు. 'వారు చేసిన వ్యాఖ్యలు ఏ మాత్రంఆమోదయోగ్యం కాదు. అయితే చిన్నవయసు వారిని సరైన దారిలో పెట్టడానికి మీరు ప్రయత్నించాలి. కఠినమైన చర్యల వల్ల వాళ్ల భవిష్యత్తు నాశనమవుతుంది. శిక్షించడానికి, జీవితాన్ని నాశనం చేయడానికి మధ్య చాలా చిన్న గీత ఉంటుంది. సీనియర్లకు నేను చేసే విజ్ఞప్తి ఏమిటంటే .. మీ వయసు రీత్యా నిర్ణయం తీసుకోండి జంటిల్‌మెన్ అండ్ లేడీస్' అని డయానా ఎడుల్జీ బృందానికి సూచించారు. న్యాయ నిపుణుల బృందం తీసుకోబోయే నిర్ణయంపై ఈ ఇద్దరి ఆటగాళ్ల భవిష్యత్తు ఆధారపడి ఉంది.

రాజస్థాన్ రాయల్స్‌కు కొత్త కోచ్

జైపూర్: ఐపిఎల్ తొలి ఎడిషన్ విజేత రాజస్థాన్ రాయల్స్ కొత్త కోచ్‌ను ఎంపిక చేసుకుంది. టీమిండియా మాజీ మెంటల్ కండిషనింగ్ కోచ్ ప్యాడీ ఆప్టన్‌ను తిరిగి తన బృందంలో చేర్చుకుంది. గతంలో ఆయన రాజస్థాన్‌కు నాలుగు సార్లు కోచ్‌గా పని చేశాడు. ఆయన శిక్షణలోనే రాజస్థాన్ 2013లో సెమీస్‌కు చేరింది. అదే ఏడాది శ్రీశాంత్ సహా ముగ్గురు ఆటగాళ్లను పోలీసులు అరెస్టు చేయడంతో జట్టు పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. అప్పుడే జట్టు చాంపియన్స్ లీగ్ టి 20 ఫైనల్ చేరింది. ఆప్టన్‌కు కోచ్‌గా మంచి అనుభవం ఉంది. ఐపిఎల్, బిగ్‌బాష్, పిఎస్‌లాంటి టోర్నమెంట్లలో జట్లకు మార్గనిర్దేశకుడిగా ఉన్నారు. బిగ్‌బాష్‌లో సిడ్నీ థండర్స్‌కు నాలుగేళ్లు కోచ్‌గా ఉండి 2016లో విజేతగా నిలిచాడు. అప్పటి కోచ్ గ్యారీ కిర్‌స్టన్‌తో కలిసి టీమిండియాకు మెంటల్ కండిషనింగ్ కోచ్‌గా ఉన్నాడు. వారి ఆధ్వర్యంలోనే టీమిండియా 2011లోప్రపంచకప్ గెలిచింది. ఐసిసి టెస్ట్ ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్‌గా నిలిచింది.

వన్‌డేల్లో ధోనీ మరో రికార్డు

పదివేల పరుగులు చేసిన అయిదో భారత బ్యాట్స్‌మన్‌గా చరిత్ర



సిడ్నీ: ' ఇక ధోనీ పనైపోయింది' అన్న విమర్శలు వచ్చినప్పుడల్లా ఇదిగో నా స్టామినా అంటూ తన బ్యాట్‌ద్వారా విమర్శకుల నోళ్లు మూయిస్తుంటాడు ఉంటాడు మిస్టర్ కూల్ మహేంద్ర సింగ్ ధోనీ. సిడ్నీ వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన తొలి వన్‌డే మ్యాచ్‌లో భారత్ 36 పరుగుల తేడాతో ఓడిపోయిన విషయం తెలిసిందే రోహిత్ శర్మ(133), ధోనీ (51) రాణించినప్పటికీ కోహ్లీ సేనను విజయం వరించలేదు. అయితే ఈ మ్యాచ్‌లో ధోనీ తనదైన శైలిలో ఆడి వన్‌డేల్లో 68వ అర్ధ శతకాన్ని పూర్తి చేశాడు. అంతేకాదు ఈ క్రమంలో మరో అరుదైన రికార్డును సైతం ధోనీ సొంతం చేసుకున్నాడు. భారత్ తరఫున వన్‌డేలలో పది వేల పరుగులు పూర్తి చేసిన అతి తక్కువ మంది ఆటగాళ్ల జాబితాలో చేరాడు. ఈ మార్కును అందుకున్న అయిదవ భారత బ్యాట్స్‌మన్‌గా నిలిచాడు.2017 ఇంగ్లండ్ టూర్‌లో ఆడిన ధోనీ పదివేల పరుగులకు ఒక్క పరుగు దూరంలోనే నిలిచిపోయాడు. తాజాగా సిడ్నీ వేదికగా జరిగిన మ్యాచ్‌లో51 పరుగులు చేసిన ధోనీ పదివేల పరుగులు సాధించిన సచిన్, సౌరబ్ గంగూలి, రాహుల్ ద్రావిడ్, విరాట్ కోహ్లీల సరసన చేరాడు. మరో ఆసక్తికరమైన అంశం ఏమిటంటే పదివేల పరుగుల క్లబ్‌లో చేరి ఇంకా కొనసాగుతున్న ఆటగాళ్లు కోహ్లీ. ధోనీలు మాత్రమే. ప్రపంచ వన్‌డే క్రికెట్ చరిత్రలో మొత్తం 13 మంది ఆటగాళ్లు పదివేల పరుగుల మార్కును దాటారు. వారిలో సచిన్, కుమార సంగక్కర, రికీ పాంటింగ్, జయసూర్య, జయవర్ధనె, ఇంజమామ్ ఉల్ హక్, జాక్వస్ కల్లిస్, సౌరబ్ గంగూలి, రాహుల్ ద్రావిడ్, బ్రియన్ లారా, తిలకరత్నె దిల్షాన్ ఉన్నారు.



రిచర్డ్స్ రికార్డు బద్దలు కొట్టిన రోహిత్ శర్మ

సిడ్నీ: ఆస్ట్రేలియాతో శనివారం ఇక్కడ జరిగిన తొలి వన్‌డేలో హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ సెంచరీ సాధించినప్పటికీ టీమిండియా విజయానికి 36 పరుగుల దూరంలోనే నిలిచిపోయిన విషయం తెలిసిందే. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో ఆసీస్ 1– 0 ఆధిక్యత సాధించింది. అయితే 110 బంతుల్లో వంద పరుగులు (ఏడు ఫోర్లు. నాలుగు సిక్స్‌లు) సాధించిన రోహిత్ శర్మ తన వన్‌డే కెరీర్‌లో 22వ సెంచరీని నమోదు చేశాడు. అంతేకాదు వెస్టిండీస్ దిగ్గజ బ్యాట్స్‌మన్ వివ్ రిచర్డ్స్ రికార్డును బద్దలు కొట్టాడు. ఆస్ట్రేలియా గడ్డపై ఆడిన వన్‌డేలలో రోహిత్‌కు ఇది నాలుగో సెంచరీ. ఇప్పటివరకు ప్రపంచ క్రికెట్‌లో ఏ ఆటగాడూ ఆస్ట్రేలియాలో అదీ వన్‌డేలలో నాలుగు సెంచరీలు సాధించలేదు. దీంతో వెస్టిండీస్ దిగ్గజ బ్యాట్స్‌మన్ వివ్ రిచర్డ్స్ పేరిట ఉన్న మూడు శతకాల రికార్డును రోహిత్ శర్మ బద్దలు కొట్టాడు. కెప్టెన్ విరాట్ కోహ్లీ ఆస్ట్రేలియాపై ఇప్పటివరకు రెండు సెంచరీలు చేశాడు. మొన్న సిడ్నీలో జరిగిన మ్యాచ్‌లో రాణించి ఉంటే మూడు శతకాలు చేసిన వ్యక్తిగా నిలిచే వాడు. కాగా ఆసీస్‌తో రెండో వన్‌డే అడిలైడ్ వేదికగా ఈ నెల 15న జరగనుంది.



ఏడో టైటిల్‌పై ఫెదరర్, జకోవిచ్ కన్ను

- సవాలు విసురుతున్న యువ సంచలనాలు
- నేటినుంచి ఆస్ట్రేలియా ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్



మెల్‌బోర్న్: ఈ ఏడాది తొలి గ్రాండ్‌శ్లామ్ టెన్నిస్ టోర్నమెంట్ అయిన ఆస్ట్రేలియా ఓపెన్‌కు మెల్‌బోర్న్ సర్వం సిద్ధమైంది. సోమవారంనుంచి ప్రారంభం కానున్న ఈ మెగా ఈవెంట్‌లో ఏడోసారి టైటిల్‌ను గెలుచుకోవడం ద్వారా రికార్డు సృష్టించాలని టైటిల్ ఫేవరేట్ అయిన నొవాక్ జకోవిచ్ ఉవ్విళ్లూరుతుండగా, వెటర్నర్ క్రీడాకారుడు రోజర్ ఫెదరర్ కూడా ఆరో టైటిల్ పోరుకు సిద్ధమవుతున్నాడు. మరో ఆటగాడు, బ్రిటన్‌కు చెందిన ఆండీ ముర్రే మాత్రం తన చివరి ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఆడబోతున్నాడు. 'బిగ్ ఫోర్'గా పిలవబడే వారిలో నాలుగో ఆటగాడయిన నడాల్ కెరీర్ కూడా దాదాపు ముగింపునకు రానున్న తరుణంలో యువ క్రీడాకారులు రాబోయేది తమ శకమేనని నిరూపించుకోవడానికి ఉవ్విళ్లూరుతున్నారు. అయితే నంబర్ వన్ క్రీడాకారుడు జకోవిచ్, మూడో సీడ్ ఫెదరర్‌లకు యువ సంచలనం, నాలుగో సీడ్ అయిన అలెగ్జాండర్ జ్వెరెవ్‌నుంచి సవాలు ఎదురు కానుంది. బలమైన సర్వీస్‌లతో ఇటీవలి కాలంలో అనేక సంచలన విజయాలు సాధించిన జ్వెరెవ్ తన తొలి గ్రాండ్‌శ్లామ్ టైటిల్‌ను అందుకోవాలని తహతహలాడుతున్నాడు. అయితే వరస గాయాల కారణంగా పదే పదే మ్యాచ్‌లకు దూరమవుతూ వస్తున్న ముర్రే వచ్చే వింబుల్డన్ తర్వాత రిటైర్ కానున్నట్లు ఈ టోర్నమెంటు ప్రాంభం కావడానికి ముందే ప్రకటించి అభిమానులను ఆశ్చర్యానికి గురి చేశాడు. అతను అప్పటివరకైనా ఆడతాడా అనేది అనుమానమే! మరోవైపు ప్రపంచ నంబర్ టూ ఆటగాడయిన స్పానిష్ బుల్ రాఫెల్ నడాల్ ఈ టోర్నమెంట్ కోసం మెల్‌బోర్న్ చేరుకున్నప్పటికీ అతను గాయంనుంచి ఎంతమేరకు కోలుకున్నాడో వేచి చూడాల్సి ఉంది. సోమవారం తన ప్రారంభ మ్యాచ్‌లో డెన్నిస్ ఇస్తోమిన్‌ను ఎదుర్కోనున్న ఫెదరర్ 20వ గ్రాండ్‌శ్లామ్ టైటిల్‌ను సాధించడం ద్వారా చరిత్ర సృష్టించాలని అనుకుంటున్నాడు. అతను గనుక ఈ టైటిల్‌ను సాధిస్తే ఆరు సార్లు ఆస్ట్రేలియన్ టైటిల్ గెలుచుకున్న మూడో వ్యక్తిగా జకోవిచ్, రాయ్ ఎమర్సన్‌ల సరసన నిలుస్తాడు. అయితే మరోవైపు 31 ఏళ్ల జకోవిచ్‌కు గత ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్ పీడకలగా నిలిచింది. ఆపరేషన్ కారణంగా సుదీర్ఘ కాలం టెన్నిస్‌కు దూరంగా ఉన్న తర్వాత ఈ టోర్నమెంటులో ఆడిన అతను ప్రారంభ దశలోనే నిష్క్రమించాల్సి వచ్చింది. ఆ తర్వాత కూడా పలు టోర్నమెంట్లలో నిరాశాజనక ప్రదర్శనతో చాలా ఏళ్ల తర్వాత టాప్ 20లో స్థానం కోల్పోవలసి వచ్చింది. అయితే పట్టుదలకు మారుపేరయిన ఈ సెర్బియన్ గత జూలైలో వింబుల్డన్ విజయంతో తిరిగి ఫామ్‌లోకి రావడమే కాకుండా యుఎస్ ఓపెన్ టైటిల్‌ను కూడా గెలుచుకొని 14వ గ్రాండ్‌శ్లామ్ టైటిల్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. వింబుల్డన్ తర్వాత మొత్తంలో జకోవిచ్ కేవలం మూడు మ్యాచ్‌లలో ఓటమి పాలు కాగా, ఎటిపి ఫైనల్‌లో జ్వెరేవ్ చేతిలో పరాజయం వాటిలో ఒకటి. దీంతో మళ్లీ ప్రపంచ నంబర్ వన్ ర్యాంక్ సొంతం చేసుకున్నాడు. మళ్లీ మెల్‌బోర్న్‌లో ఆడుతుండడం తనకు ఎంతో సంతోషంగా ఉందని జకోవిచ్ ఆదివారం మీడియాతో మాట్లాడుతూ అన్నాడు. 2008లో ఇక్కడే తాను తొలి గ్రాండ్ శ్లామ్ టైటిల్‌ను గెలుచుకున్నానని, అది తనపై తనకు నమ్మకం కలిగించేలా చేసిందని అతను చెప్పాడు. కాగా తాను ఇప్పటికీ మంచి టెన్నిస్ ఆడుతున్నానని 37 ఏళ్ల ఫెదరర్ చెప్పడం ద్వారా ప్రత్యర్థులకు తాను ఇప్పటికీ సవాలు విసరగలనని పరోక్షంగా సంకేతాలు ఇస్తున్నాడు. అయితే జర్మనీకి చెందిన జ్వెరేవ్, క్రోయేషియాకు చెందిన బోర్నా కోరిక్, రష్యా యువ ఆటగాడు కరెన్ కచనోవ్, గ్రీస్‌కు చెందిన స్టెఫానో సిట్సిపాస్‌లాంటి ఆటగాళ్లనుంచి తమలాంటి వాళ్లకు ముప్పు పొంచి ఉందని జకోవిచ్ అభిప్రాయపడ్డారు. వీరంతా నిలకడగా రాణించి తమకంటూ గుర్తింపును సాధించకపోయినా భావి తరం తమదేనన్న స్పష్టమైన సంకేతాలనైతే ఇప్పటికే ఇచ్చారు. కాగా, ఈ ఏడాది ఆస్ట్రేలియా ఓపెన్‌లో ప్రైజ్‌మనీని నిర్వాహకులు భారీగా పెంచారు. పురుషులు, మహిళల సింగిల్స్ టైటిల్ విజేతలకిచ్చే ప్రైజ్‌మనీ గత ఏడాదితో పోలిస్తే దాదాపు 14 శాతం పెరిగింది.



ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో ఆదివారం జరిగిన టాటా స్టీల్ హాఫ్ మారథాన్‌లో పాల్గొన్న ఔత్సాహికులు



నాగపూర్‌లో ఆదివారం జరిగిన 'ఖాస్‌దార్ క్రీడా మహోత్సవ్' కార్యక్రమంలో మాజీ క్రికెటర్ సచిన్ తెండూల్కర్‌కు జ్ఞాపికను ప్రదానం చేస్తున్న మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్



సోషల్ ట్రాప్‌లో సోసైటీ!




న్యూఢిల్లీ: సోషల్ మీడియా...ఇది ఇప్పటి మనిషి కోరికోరి మెడకు వేసుకున్న నాగుపాముగా బుసలు కొడుతోంది. ఫేస్‌బుక్, వాట్సాప్‌లు అతి కావడంతో ప్రజలు విద్వేషభరితులవుతున్నారు. దుష్ప్రవర్తనతో మనసు కుదురులేని వారిగా మారిపోయ్యేందుకు దారులు వేస్తోంది. అదేపనిగా సోషల్ మీడియా వాడకానికి దిగుతూ ఉండటంతో అది చివరికి జీవితం పట్ల అసంతృప్తిని, అంతకు మించి విరక్తిని మిగులుస్తుంది. చివరికి మనిషిని తన మనస్సుకు దూరం చేస్తుంది. ఈ నిప్పుల్లాంటి నిజాలన్నింటిని తాజాగా వెలువడ్డ ఒక పుస్తకంలో పొందుపర్చారు. బహుళ స్థాయి అధ్యయనం, నిర్ణీత ఉదంత పరిశీలన అనంతరం ప్రొఫెసర్ అశేష్ ముఖర్జీ తమ పుస్తకం వెలువరించారు. ఇంటర్నెట్ మాయాజాలం , విస్తరించుకుంటూ పోతున్న దాని ఉచ్చును విశ్లేషించుకుంటూ సాగిన ఈ పుస్తకానికి ఆయన ' ది ఇంటర్నెట్ ట్రాప్' అని పేరిడారు. ఇంటర్నెట్ ప్రాతిపదికగా సాగుతోన్న సామాజిక మాధ్యమ దాడిలో తెలియకుండానే పాతుకుపోతున్న బోనులను అందులో చిక్కుపడుతున్న మానవ జీవాలను ఈ ఇంటర్నెట్ ట్రాప్ పుస్తకం ద్వారా ఆయన విశ్లేషించారు. కెనడాలోని మెక్‌గిల్ యూనివర్శిటీలో ముఖర్జీ మార్కెటింగ్ అధ్యయన శాస్త్రంలో అధ్యాపకులుగా ఉన్నారు. ఆన్‌లైన్ సోషల్ నెట్‌వర్క్ ప్రపంచానికి అనుసంధానకర్తగా నిలిచింది. ఈ వ్యవస్థ ద్వారా వాడకందార్లు ప్రపంచంలో ఏ మూల ప్రాంతంలో ఉన్న తమ స్నేహితులతో, ఆప్తులతో ఎప్పటికప్పుడు అనుసంధానం కాగల్గుతున్నారు. కుటుంబ సభ్యులతో తమ అభిప్రాయాలను వినిమయం చేసుకోగలుగుతున్నారు. ఇదంతా నాణేనికి ఒక వైపు. అయితే దీనికి మరో వైపున ఆద్యంతం కలుక్కుమనే రీతిలో అంతా జరిగిపోతోందని ఈ బుక్‌లో పేర్కొన్నారు.

సర్వదా టచ్– సెర్చ్ అండ్ షేర్ పద్ధతితో చివరికి ఈ మనుష్యులు వారంతట వారే వారికి తెలియకుండానే తారతమ్యాల బేరీజుల బిలంలో చిక్కుపడుతున్నారు. వారు ఆ స్థాయిలో ఉన్నారు. తాము ఈ దిగువన ఉన్నాం. ఒకరు దిగజారారు. వేరొకరు ఎగబాకారు..అనే అస్తిత్వ విశ్లేషణల బాటలో పడి కొట్టుకుపోతున్నారని ఈ పుస్తకంలో తెలిపారు. తారతమ్యాల బేరీజుకు దిగే మనిషి మౌలిక లక్షణాన్ని సోషల్ మీడియా ద్విగుణీకృత దర్పణంగా గోరంతలు కొండంతలు చేస్తోంది. వెరశీ ఈ క్రమంలో మనసుల నిండా ఒక విధమైన ఉసూరుమనే భావనకు దారితీస్తోంది. ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఫేస్‌బుక్‌లు, ట్విట్టర్‌లు, ఇన్‌స్టాగ్రాంలు, యూ ట్యూబ్‌లు వంటివి విరివిగా వాడుతున్నారు. మనిషి ముఖాముఖి కలుసుకున్నప్పుడు మాట్లాడుకునే విధానం ఒక విధంగా ఉంటుంది. అదే ఈ సోషల్ మీడియా ప్రక్రియ ద్వారా దూరతీరాల వారి మధ్య సాటే ముచ్చట్ల సంవిధానం మరో విధంగా ఉంటుంది. సోషల్ మీడియా చాటింగ్‌లు ఇతరత్రా విధానాలతో ఇరువురి మధ్య అవాస్తవికతలు, అతిశయాలు ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయి. అసాధారణ అంశాలు ప్రస్తావనకు , తాము కోరుకుంటున్న వాటికి ప్రాధాన్యతను ఇస్తున్నారు. మనసు పొరలకు అతీతంగా ఉండే అంశాలు కూడా ఈ సందర్భంగా వ్యక్తీకరణం అవుతున్నాయి. దీనితో ఇదో కృత్రిమతకు దారితీస్తోందని, ఈ ఉచ్చులో పడి మనిషి గిలగిలలాడుతున్నాడని ఇంటర్నెట్ ట్రాప్ పుస్తకంలో విశ్లేషించారు.

భావోద్వేగాల వ్యక్తికరణకే శక్తి వినియోగం

ద్వేషభావనలతో ఉండే వారు తరచూ అభిప్రాయాలను అత్యంత కసిగా సోషల్ మీడియా ద్వారా తెలియజేస్తున్నారు. దీనితో వారి మానసిక శక్తి అంతా ఈ ప్రక్రియకే ఆవిరి అయిపోతోంది, మేధోశక్తిని అసమతుల్యంగా విస్తరించుకుని పొయే దశలోనే స్వయం నియంత్రణ కొరవడుతుంది. మనసు అదుపుతప్పుతుందని విశ్లేషించారు. మనిషి తనపై అదుపులేని స్థితికి వస్తాడో అప్పుడు అది తరువాత చింతించాల్సిన స్థాయికి దిగాల్సిన నిర్ణయాలకు దారి తీస్తుంది.





సోషల్ మీడియాతో మునిగితేలే వారు చివరికి తమకు తాము అపరిచితులు అయి, ఇది పరాకాష్టకు చేరిన దశలో సెల్ఫీ మరణాలకు పాల్పడుతున్నారు. అత్యధిక సంఖ్యలో యువతనే కొండ అంచులలోకి వెళ్లి, లేదా స్పీడ్ డ్రైవింగ్ దశలో సెల్ఫీలు దిగుతూ, రన్నింగ్ ట్రైన్‌ల ముందుకు దూకుతూ స్వీయచిత్రణకు దిగడం వంటివి విషాదాంతాలకు దారితీస్తున్నాయి. చివరికి యువతకు ఇంటర్నెట్ విషపు వీలునామాను మిగులుస్తున్నాయి. సోషల్ మీడియాలో వచ్చే ఫోటో తమదే గొప్పది కావాలని, దీని గురించే అంతా ముచ్చటించుకుని, తమ గురించి అనుకోవాలనే తపన చివరికి సెల్ఫీ మరణాలకు దారితీస్తోంది. ఇండియాలో మూడేళ్లుగా చూస్తే ఈ విధంగా సెల్ఫీలకు పాల్పడి మరణించిన వారి సంఖ్య 57 వరకూ ఉందని అధ్యయనంలో వెల్లడైంది. బిల్డింగ్‌ల టెర్రస్‌ల నుంచి, రైలు పట్టాల మీదుగా సా గుతూ, బీచ్‌లలో పరుగులు తీస్తూ ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ప్రొఫెసర్ తీసుకువచ్చిన ఈ పుస్తకంలో కేవలం ఇంటర్నెట్ అవలక్షణాలను విశ్లేషించడమే కాదు. సోషల్ మీ డియా బందీ అయిన మనిషి జీవనశైలితో కలిసి ఉండే సాధకబాధకాలు, తప్పులు విశ్లేషించారు. అం తే కాకుండా గోప్యత వంటి పలు ఆన్‌లైన్ అంశాలకు తగు విధమైన పరిష్కార మార్గాలను సూచించారు.

2014లో సమగ్ర అధ్యయనం

ఈ పుస్తకం రాసేందుకు తాను సమగ్ర అధ్యయనం జరిపినట్లు ఈ రచయిత తెలిపారు. సామాజికంగా సరిపోల్చుకోవడానికి దిగే మానవ మానసిక నైజాన్ని గురించి తాను అధ్యయనం చేశారని చెప్పారు. ఫేస్‌బుక్‌లు, ఇతర వెబ్‌సైట్లు, సిఎన్‌ఎన్ వంటి వాటిని బ్రౌస్ చేస్తూ తాము వెలువరించే ప్రశ్నలలో గొప్పతనం, ఈర్ష్యాద్వేషాలు, చివరికి శత్రుత్వపు వైఖరిని ప్రదర్శిస్తున్నట్లు ఈ అధ్యయనంలో వెల్లడైంది. అన్ని రకాల ఉద్వేగాలను పరిశీలిస్తే తాను గమనించింది అత్యధికంగా ఇతరుల పట్ల స్పర్థను పెంచుకునేతత్వం కన్పించిందని, ఈ ప్రమాదకర పరిణామాన్ని తెలియచేసేందుకే తాను ఈ పుస్తకాన్ని వెలుగులోకి తెచ్చినట్లు వివరించారు. రూపా ప్రచురరణ సంస్థ వారు ఇప్పటి తరానికి అత్యంత ఉపయుక్తపు ఈ పుస్తకాన్ని వెలుగులోకి తెచ్చారు. ఇతరులపై ఈర్షను పెంచుకోవడం, స్పర్థను చాటుకోవడం అనే తత్వానికి మంచి చెడులు రెండూ ఉంటాయని, సముచిత కోణంలో చూస్తే ఇతరులతో పోల్చుకుని వ్యక్తులు తమ సామాజిక అభ్యున్నతికి కృషి చేయడం. ఇదే మంచికే దారితీస్తుంది. ఇక ప్రతికూలత కోణంలో చూస్తే సమున్నత స్థాయి ఇతరుల పతనానికి ఆలోచించే స్థితికి రావడం. ఇది మొదటికే మోసంగా మారుతుందని హెచ్చరించారు.

నవయువకులు అత్యధిక శాతం స్మార్ట్ ఫోన్ల వ్యసనంలో పడిపోతున్నారు. మహారాష్ట్రకు చెందిన హర్షల్ (పేరు మార్చారు) గంటల తరబడి స్మార్ట్‌ఫోన్ వాడుతూ వచ్చాడు. అదే లోకం అనుకుంటూ దాదాపుగా 30 వాట్సాప్ గ్రూప్‌లతో టచ్‌లో ఉండేవాడు. ఇతరత్రా సైట్లలోనూ సర్ఫింగ్ చేసేవాడు. ఈ 27 ఏండ్ల పుణే యువకుడు వృత్తిరీత్యా పెయింటింగ్ కాంట్రాక్టరు. చివరికి ఆయనకు చాలా కాలం వరకూ కానీ తనకు ఈ తెర వ్యవసం సోకిందని తెలిసిరాలేదు. ఎప్పుడు అయితే ఆయన మానసిక శారీరక ఆరోగ్యం దెబ్బతిని, వృత్తిపరంగా అవకాశాలు పతనం చెందుతూ వచ్చాయో అప్పుడు తనకు ఏదో జరిగిందనే విషయం తెలిసి వచ్చింది. ఇప్పుడు ఆయన ఈ బ్రౌజింగ్ అలవాటు మానుకునే చికిత్స పొందాడు. చివరికి మామూలు మనిషి అయి డిజిటల్ వ్యవసనం నుంచి విముక్తి పొంది సంతోషంగా ఉన్నాడు. పుణేలో ఇటువంటి విపరీత లక్షణాలకు గురయిన వారికి చికిత్స జరిపేందుకు ప్రత్యేకంగా మనో వికాస్ స్క్రీన్ డీ అడిక్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. స్మార్ట్‌ఫోన్ వాడకం, ఇ మొయిల్ వినియోగం గురించి ఈ కేంద్రం ఇచ్చే మెళకువలను హర్షల్ వంటి ఎందరో యువకులు పాటిస్తూ వస్తున్నారు. తమదైన జీవితాన్ని పొందుతున్నారు. ఇక్కడ మానసిక చికిత్స పొందిన వారిలో అత్యధికులు తమ స్మార్ట్‌ఫోన్ల నుంచి పలు రకాల సోషల్ మీడియా యాప్‌లను తొలిగించి వేశారు. వాట్సాప్ గ్రూప్‌లను పరిమితం చేసుకున్నారు. దీనికి బదులుగా పుస్తకాలు చదవడం, ధ్యానంతో ఏకాగ్రత సాధనకు దిగడం చేస్తున్నారు. గత రెండు నెలల్లోనే ఈ సెంటర్‌కు దాదాపు 95 కేసులు వచ్చాయని సంస్థ డి అడిక్షన్ , పునరావాస కేంద్రం ఛైర్మన్ డాక్టర్ అజయ్ దుధానే తెలిపారు. ఈ కేంద్రం పరిధిలోనే ప్రత్యేకంగా స్మార్ట్‌ఫోన్ల డి అడిక్షన్ సెంటర్ నిర్వహణ జరుగుతోంది. స్మార్ట్‌ఫోన్ల వ్యసనానికి గురి అవుతున్న వారిలో అత్యధికులు 18 నుంచి 25 ఏళ్ల లోపు వారే ఉంటున్నారు. వీరికి స్వస్థత చేకూర్చేందుకు ఇప్పుడు పూర్తి స్థాయిలో యత్నిస్తున్నారు. గత కొంత కాలం క్రితం వరకూ అత్యధికంగా యువకులు డ్రగ్స్, ఆల్కహాల్ ఇతర వ్యవసనాల నుంచి బయటపడేందుకు ఈ కేంద్రానికి వచ్చేవారు. అయితే ఇటీవలి కాలంలో ఎక్కువగా స్మార్ట్‌ఫోన్ల వ్యసనానికి గురి అయిన వారు చికిత్సకు అధికంగా తరలివస్తున్నారు. డి అడిక్షన్ సెంటర్‌లో అత్యధికంగా ధ్యానం నేర్పిస్తారు. సైకలాజికల్, ప్రవర్తనా పరీక్షలకు గురవుతారు. తరువాత వారిని కేంద్రంలో కొంత కాలం చేర్చుకుని నయం చేస్తారని ఇక్కడి సైకియాట్రిస్టు డాక్టర్ అమోద్ బోర్కర్ చెప్పారు.





బొగ్గుగనిలో ప్రమాదం, 21మంది మృతి

బీజింగ్ : చైనా బొగ్గు గనిలో శనివారం సాయంత్రం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. వాయవ్య చైనా ప్రాంతంలోని ఓ గని పైకప్పు కూలిపోవడంతో 21 మంది కూలీలు మరణించారు. షాంగ్జి ప్రావిన్సులో లిజియాగావ్ బొగ్గు గనిలో భూగర్భ ప్రాంతంలో 87 మంది కూలీలు పని చేస్తున్న సమయంలో ఒక్కసారిగా పైకప్పు కూలిపోయింది. 19 మంది కూలీలు అక్కడికక్కడే మరణించారు. 66 మంది ప్రాణాలతో బయటపడ్డారు. వారిని సురక్షితంగా గని నుంచి బయటకు తీసుకొచ్చారు. ప్రమాదం అనంతరం గనిలో సహాయక చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో గనిలో మరో రెండు మృత దేహాలను వెలికి తీశారు. ప్రపంచంలోనే బొగ్గు ఉత్పత్తిలో మొదటిస్థానంలో ఉన్న చైనాలో ఇటువంటి ప్రమాదాలు తరచూ జరుగుతుంటాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారిస్తున్నామని చైనా పోలీసులు తెలిపారు.

శ్రీశైలం ఘాట్‌లో తప్పిన పెను ప్రమాదం

లోయలోకి దూసుకెళ్లిన బస్సు, భక్తులు సురక్షితం



శ్రీశైలం: కర్నూలు జిల్లాలోని శ్రీశైలం పుణ్యక్షేత్రానికి దైవ దర్శనానికి వస్తున్న భక్తులకు పెను ప్రమాదం తప్పింది. బస్సు బ్రేకులు ఫెయిల్ కావడంతో లోయలోకి దూసుకెళ్లింది. ఈ సంఘటన శ్రీశైలం ఘాట్ రోడ్డులోని చిన్నారుట్ల మలుపు వద్ద ఆదివారం చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్రలోని బీడు జిల్లా పెరళికి చెందిన 36మంది ప్రయాణికులు టూరిస్టు బస్సులో శ్రీశైలం యాత్రకు వస్తున్నారు. ఆదివారం ఉదయం 6గంటలకు దొర్నాల అటవీశాఖ టోల్ గేట్ దాటిన బస్సు శ్రీశైలానికి 15కిమీ దూరంలోని చిన్నారుట్ల మలుపు వద్దకు రాగానే ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదం నుంచి బస్సులోని ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. సమాచారం అందుకున్న శ్రీశైలం, దొర్నాల పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను బాధితులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదం నుంచి బయటపడడంతో భక్తులు ఊపిరి పీల్చుకున్నారు.

రాజ్యాంగ సవరణ హానికరం: పవార్

కొల్హా పూర్: రిజర్వేషన్ల పరిమితిని పెంచేందుకు రాజ్యాంగ సవరణ చేయడం మౌలిక సూత్రాలకు హానికరమని నిపుణులు అభిప్రాయమని ఆదివారం ఎన్‌సిపి అధ్యక్షుడు శరద్ పవార్ ఆదివారం పేర్కొన్నారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు జనరల్ కేటగిరిలో 10 శాతం కోటా కల్పించే బిల్లును పార్లమెంట్ ఆమోదించిన తర్వాత రోజు ఆయన వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఓటర్లను ప్రభావితం చేసేందుకు ప్రధానినరేంద్ర మోడీ చివరి నిమిషంలో నిర్ణయాలు తీసుకున్నారన్నారు. అవి ఆయనకు సహాయం చేయలేవని పవార్ పేర్కొన్నారు. 'యాక్సిండెంటర్ ప్రైమ్ మినిస్టర్' థాకరే బయోపిక్ వంటివి ఓటర్లపై ప్రభావం చూపబోవన్నారు.

'హనీట్రాప్'లో 50 మంది భారత జవాన్లు

ఒకరి అరెస్ట్, మిగతావారిపై విచారణ

యువతికి విలువైన సమాచారం?



జైపూర్: ఇండియన్ ఆర్మీలో మరోసారి హనీట్రాప్ ఆధారాలు లభించడం కలకలం సృష్టిస్తోంది. దాయాది పాకిస్థాన్ నిఘా సంస్థకు చెందిన యువతులతో భారత ఆర్మీ జవాన్లకు వివిధ మార్గాల్లో వలవేసి, వారి ద్వారా భద్రతావ్యవస్థకు సంబంధించిన విషయాలను సేకరించడమే 'హనీట్రాప్'. తాజాగా రాజస్థాన్ లో పనిచేసే ఓ జవాన్ ను అదుపులోకి తీసుకున్న అధికారులు మరో 50 మందిని విచారిస్తున్నారు. అనికా చోప్రా అనే మాయలేడీ ఫేస్ బుక్ ద్వారా భారత ఆర్మీ జవాన్లనే లక్ష్యంగా చేసుకుని గత కొంతకాలంగా ఫ్రెండ్ రిక్వెస్ట్ పెడుతోంది. అందమైన అమ్మాయి ఫొటో ప్రొఫైల్ పిక్‌గా ఉండడంతో పాటు, ప్రొఫైల్‌లో ఆర్మీ కెప్టెన్ అని కూడా ఉండడంతో ఏ మాత్రం అనుమానం లేకుండా ఆమె ఫ్రెండ్ రిక్వెస్ట్‌ను అంగీకరించారు దాదాపు 50 మంది భారత జవాన్లు. వీరిలో రాజస్థాన్‌లోని జైసల్మీర్ ఆర్మ్‌డ్ యూనిట్‌లో సైనికుడిగా పనిచేస్తున్న సిపాయి సోమ్‌వీర్ సింగ్, అనికా అందానికి పడిపోయాడు. ఆమె అడగగానే ఏ మాత్రం ఆలోచించకుండా ఇండియన్ ఆర్మీకి సంబంధించిన సున్నితమైన, కీలకమైన సమాచారాన్ని షేర్ చేసినట్లు తెలుస్తోంది. సోమ్‌వీర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు దేశద్రోహంతో పాటు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. శనివారంనాడే అతన్ని ఇక్కడి కోర్టులో హాజరుపరిచారు. ఆయుధాలకు సంబంధించిన చిత్రాలను సోమ్‌వీర్ ఆ యువతికి పంపించినట్లు రుజువైందని పోలీసులు వెల్లడించారు. అనికా చోప్రా పాకిస్థానీ ఏజెంట్ అని భారత ఆర్మీ అధికారులు తేల్చారు.

80స్థానాల్లో ఒంటరిగా పోటీ



లౌకిక శక్తులతో పొత్తుకు రెడీ

యుపి కాంగ్రెస్ ఇంచార్జి ఆజాద్

లక్నో : రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లో ఒంటరిగానే 80స్థానాల్లో బరిలోకి దిగుతామని కాంగ్రెస్ ప్రకటించింది. అదే విధంగా బిజెపిని ఓడించేందుకు ఏదైనా లౌకిక పార్టీలు ముందుకు వస్తే వారితో పొత్తుకు సిద్ధమని వెల్లడించింది. బిఎస్‌పి, ఎస్‌పి పొత్తు ఖరారు చేసుకున్న ఒక రోజు తర్వాత ఆదివారంనాడిక్కడ కాంగ్రెస్ అగ్రనేతలు సమావేశమయ్యారు. అనంతరం కాంగ్రెస్ యుపి ఇంచార్జి గులాంనబీ ఆజాద్ మీడియాకు వివరాలు వెల్లడించారు. 'లోక్‌సభ ఎన్నికల్లో ఇక్కడ 80స్థానాల్లోనూ పోటీ చేస్తాం. బిజెపిని ఓడిస్తాం' అని వ్యాఖ్యానించారు. 2009లో యుపిలో సాధించిన సీట్ల కన్నా ఈ సారి రెండింతలు సాధిస్తామని ఆజాద్ ఆశాభావం వ్యక్తం చేశారు. అప్పుడు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ 21సీట్లు సాధించింది. బిజెపికి వ్యతిరేకంగా మహాకూటమిలో భాగస్వామి ఉండాలని కాంగ్రెస్ భావించిందని, అయితే కొందరు తమతో కలిసి నడవాలని ఇష్టపడకపోయినప్పుడు ఏం చేయగలమని ఎస్‌పి, బిఎస్‌పి పొత్తును ఉద్దేశించి అన్నారు. రాష్ట్రాల్లో మిన హాయిస్తే జాతీయ స్థాయిలో మాత్రం బిజెపిని వ్యతిరేకించే అన్ని లౌకిక శక్తులతో కలిసి వెళ్లాలని కాంగ్రెస్ కోరుకుంటుందన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని మాయావతి, అఖిలేష్ కూటమిలో కాంగ్రెస్ లేనందుకు పార్టీ శ్రేణులెవరూ నిరాశ చెందవద్దని ఆజాద్ పిలుపునిచ్చారు. రాష్ట్రీయ లోక్‌దళ్‌తో పొత్తు విషయం ఆ పార్టీయే తేల్చుకోవాల్సి ఉందన్నారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ఎస్ పి అధినేత అఖిలేష్, బిఎస్ పి చీఫ్ మాయావతిలు శనివారం కూటమిపై ప్రకటన చేసిన విషయం విదితమే. ఎస్‌పి, బిఎస్ పిలు చెరో 38 స్థానాల్లో పోటీ చేస్తాయని వారు వెల్లడించారు. దీంతో కాంగ్రెస్ అప్రమత్తమైంది. పార్టీ శ్రేణులను సమాయత్తం పరిచేందుకు కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు రాహుల్ గాంధీతో ఫిబ్రవరిలో 15 ప్రచార ర్యాలీలను నిర్వహించేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నారు.

లేడీ కాదు పులి

సమయమొస్తే కానీ స్త్రీ సామర్థ్యమేంటో తెలియజేసే ఓ సందర్భం, సంఘటన ఇది. ఇద్దరు మగాళ్ల మెదళ్లు మొద్దుబారిపోయి దిక్కుతో చని టైంలో ఆమె మెదడు పాదరసంలా పనిచేసింది. ధైర్యముంటే దేన్నయినా ఎదిరించవచ్చని నిరూపించింది.పెద్దపులిని సైతం సమయస్ఫూర్తితో ఎదుర్కొని తనతోపాటు ఇద్దరి ప్రాణాలను కాపాడింది మధ్యప్రదేశ్‌కు చెందిన అటవీశాఖ మహిళా గార్డు సుధ.



ఇద్దరు పురుష గార్డులతో కలిసి మహిళా గార్డు సుధా ధుర్వే చేసిన సాహసం ఇప్పుడు ఇంటర్‌నెట్‌లో వైరల్‌గా మారింది. మధ్యప్రదేశ్‌లోని హోషంగాబాద్‌లో ఉన్న సాత్పురా పులుల అభయారణ్యంలో చోటుచేసుకున్న సంఘటన ఇది. ప్రాణాలకు తెగించి పులిబారి నుంచి బయటపడిన విధానాన్ని సుధా మాటల్లోనే తెలుసుకుందాం...''అటవీ శాఖలో ఉద్యోగం చాలా ఆహ్లాదకరంగా, ఉత్సాహంగా ఉంటుంది. అదే సమయంలో చాలా ప్రమాదరమైనది కూడా. అడవిలోని ప్రతి జంతువు కదలికలు, వాటి భాష హోం గార్డుగా మాకు సుపరిచితమే. వాటితో ఎలా మెలగాలో, క్రూర జంతువులు ఎదురుపడితే ఎలా తప్పించుకోవాలో మాకు శిక్షణ ఇస్తారు. ఎప్పటిలాగే ఆ రోజు కూడా పులులను లెక్కించే పనిలో పడ్డాం. మా దారిలో పులి అడుగులు కనిపించాయి. అవి అప్పుడే అటువైపుగా వెళ్లిన పెద్దపులి జాడలుగా గుర్తించాం. మరింత ముందుకు సాగాం. ఇంకే ముందు మాకు పది మీటర్ల దూరంలో పెద్దపులి ప్రత్యక్షమైంది. మాకు పై ప్రాణాలు పైనే పోయాయి. ఊహించని ఈ పరిణామానికి ఒక్కసారిగా బిగుసుకుపోయాం. ముందు నేను, నావెనుక ఇద్దరు గార్డులైన అర్జున్, విష్ణులు న్నారు. ఎదురుగ్గా ఉన్న పులిని చూడగానే నేను ఎక్కువగా ఆందోళన పడింది, ఆ సమయంలో నా వెంట ఉన్న వారి గురించే. వెంటనే శిక్షణలోని విషయాలు గుర్తుకొచ్చాయి. ప్రమాదవశాత్తు మన దగ్గరకు క్రూర జంతువులైన పులి, చిరుతపులి, ఎలుగుబంట్లు లాంటివి ఎదురైనప్పుడు, వాటి కళ్లల్లోకి కళ్లు పెట్టి కదలకుండా ఉండి పోవాలి. ఎప్పుడైతే వాటిని చూసి మనం భయపడుతున్నట్లు అవి గ్రహించాయో వెంటనే అవి మనల్ని చంపేయడం ఖాయం. దాన్ని చూసిన వెంటనే నా వెంట ఉన్న ఇద్దరూ పారిపోయేందుకు సిద్ధమయ్యారు. వారిని వారించాను. కదలకుండా ఉండమని సలహా ఇచ్చాను. దేవుడి దయ వల్ల వారు నాపై నమ్మకం ఉంచి నేను చెప్పినట్లే చేశారు. లేకుంటే కొద్ది సెకన్లలోనే మేం ముగ్గురం పెద్దపులికి ఆహారమయ్యే వాళ్లం. నేను వెంటనే ఆ ఇద్దరికీ జాగ్రత్తలు చెప్పాను. మేం కొంచెం కదిలినా అది మా మీదకు పడేందుకు సిద్ధంగా ఉంది. మమ్మల్ని చాలా కోపంగా చూస్తూ, గాండ్రించింది. మేం గంటన్నరపాటు అణువంతైనా కదలకుండా శవాలకు మల్లే నిలబడిపోయాం.

అదికూడా చూసీ చూసీ విసుగెత్తి అడవి లోపలికి చక్కాపోయింది. అపుడు గానీ మేం ఊపిరిపీల్చుకోలేదు. వెంటనే జరిగిన విషయాన్ని మా పై అధికారులకు వివరించాం. ఇప్పుడు ఆ మిగతా ఇద్దరు తీవ్ర జ్వరంతో బాధపడుతున్నారు. మొత్తానికి వారి ప్రాణాలను కాపాడినందుకు నాకు సంతోషంగా ఉంది. అడవులను సందర్శించడం, అధ్యయనం చేయడం ప్రాణాలతో చెలగాటమే'' అంటోంది సుధా.

Printed and Published by **Tumu Mohan Rao** on behalf of Moveon Media Private Limited, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037 Medchel-Malkajgiri District, TELANGANA and Published from H.No.1-1-60/7A, 4th floor Beacon towers, street no.13, Jawaharnagar, near RTC X Roads Hyderabad-500020 Telangana state, Editor : **Anjaiah Polisetty**, RNI No. TELTEL/2012/42234. Email Id. editor@manatelangana.org. Phone No.040-27655666